భవిష్యద్భారత రాజ్యాంగనిర్ణయ పరిషత్తును నెలకొల్పుటకై సంకల్పించి బ్రిటిష్ రాయబారమంత్రులిప్పుడు విచ్చేసిరి. ఈ రాజ్యాంగపరిషత్తు చర్చింపవలసిన వ్యవహారకాండ బ్రహ్మాండమైనది. భారతదేశ సమాఖ్యప్రభుత్వ స్వరూపమును నిర్ణయించునప్పుడు, సమాఖ్యలో చేరవలసిన వివిధరాష్ట్రములను సక్రమముగా విభజింప బూనుకొనవలెను. భాషాప్రయుక్త రాష్ట్ర విభజన సూత్రము ననుసరించి ఏర్పడవలసిన ఆంధ్రరాష్ట్రమును నిరూపించుటకీ పరిషత్తు పూనుకొనవలెను. అట్టి ఆంధ్రరాష్ట్రము అనతికాలములో చేకూరెడి సూచనలు కన్పించుచున్నవి. రాష్ట్రవిభజన సమస్యను రాజధానీనగరనిర్ణయసమస్యతో ముడిపెట్టవలసిన అగత్యములేదు. ఆంధ్రమండలముల ఆర్థిక స్వయంసమృద్ధత నిర్వివాదాంశము.

బహువిధ శుభప్రదము కావలసిన ఈ బ్రిటిష్ మంత్రివర్గ ప్రయత్నము ఈ తరుణములో వ్యర్థమగుట మహానర్థహేతువగును. ఘోరదుర్భిక్షము దేశము నావరించినది. కాంగ్రెసు మంత్రివర్గము లేర్పడి యీ దుర్భిక్షమును తొలగింప దృఢదీక్షాప్రతిజ్ఞ గైకొనినవి. కుడువ కూడును, కట్ట బట్టయు లేక అల్లాడు కోట్లకొలది ప్రజలకు కలిగెడి ఆశాభంగము అశాంతి హేతువు కాగలదు. వ్యయసంవత్సరము భయహేతువు కానోవు.

ఇట్టి విషమ పరిస్థితులతో ప్రారంభమైన యీ నూత్నసంవత్సరమున ధైర్యము వీడవలదని మహాత్ముడు హెచ్చరించి గోవర్ధనోద్ధారకునివలె నిలువబడియున్నాడు. తమ సర్వశక్తులను మాతృభూమికై ధారవోయుటకు కాంగ్రెసు నాయకులు సర్వసంసిద్ధులై యున్నారు. కష్టముల కోర్చిన సుఖముల బడయ నేర్తురనుట భగవన్నియమము. సత్యము, అహింస జయముగాంచుట ధ్రువము. అధర్మ మడుగంటి ధర్మసంస్థాపన జరుగవలసిన యుగసంధి ఇది.

"ధర్మసంస్థాపనార్థాయసంభవామి యుగేయుగే"
— ఇది భగవంతుని అభయ హస్తము.

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయన్తాం
న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః
గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం
లోకాస్సమస్తా స్సుఖినోభవంతు.

నే డే శాం పి ల్ చూ డం డి.

మీ శిరోజములకు గొప్ప వరప్రసాదము

కామినియా ఆయిల్ (రిజిష్టర్డు)

కేశపోషణకు కావలసిన ప్రకృతి సిద్ధమైన దినుసులు కలిగిన తలనూనెను శ్రద్ధగా ఎంచుకొనటంలోనే ముఖ్యంగా మీ కేశసౌందర్య మాధారపడియుంటుంది. వెంట్రుకల ముస్తాబుకు సొంపైన **కామినియా ఆయిల్** సాటిలేనిది. వెంట్రుకలు రాలిపోవటం, నెరవటం, చీరుపెక్కటం, చుండు మొదలైన తలచర్మము, కేశముల సంబంధమైన అన్ని అనారోగ్యములను నివారించును. మెదడును చల్లబరిచి ఆరోగ్యవంతమైన నల్లని కేశముల వృద్ధిపొందించుటకు తోడ్పడును. దీని మనోహర పరిమళము ఈ రోజున కూడా అపూర్వమైనది.



పోస్టేజికి ఒకటిన్నర అణాబిళ్ల పంపి ఒక శాంపిల్ ఉచితముగ వాడిచూడండి

పరిమళముల రాజు అటో దిల్బహార్

(రిజిష్టర్డు నం. 777)

మజాగా ఉండే ఈ ప్రాచ్యదేశపు అత్తరుయొక్క ముగ్ధ పరిమళం జగత్ప్రసిద్ధము. ఇది ప్రశస్తమైన జాజి మల్లెపూలసారము. "అత్తరులరాజు"గా ప్రజానీకంలో ప్రసిద్ధమైనది. ప్రతివారికి అందుబాటులో నుండు ధరలకు అనేక సైజులలో దొరకును. అన్నిచోట్లను అమ్మబడుచున్నది.

పోస్టేజికి నాల్గణాల బిళ్లలు పంపి శాంపిలు ఉచితముగ వాడి చూడండి.



కేటి వైట్ రోజ్ ఆయిల్

(రిజిష్టర్డు నం. 777)

ఇది లావణ్యమగు (తాజా) గులాబిపూల అద్భుత పరిమళము కలది. మెదడుకు చలవచేయును. కేశపోషణకు ఆదర్శప్రాయమైన నూనె.

మీరుఅంగడికి వెళ్లినప్పుడు **కేటి వైట్‌రోజ్ హెయిరాయిల్ నం. 777** ను మాత్రమే కోరండి. ప్రత్యామ్నాయమేదీ అంగీకరించకండి.

కేటి అటో రోజ్ (రిజిష్టర్డు నం. 777)

మనోహరమైన నవ గులాబిపూల కమ్మటి సువాసనను స్వచ్ఛముగా నిరూపించును. మిక్కిలి నిగ్గుదేర్చినది గనుక విశేషకాలము నిలుచును. అత్తరుల ప్రేమించేవారి కతి ప్రియమైన యీ సెంటు ఒక్కమారు వాడితే చాలు, మిమ్ములను ముగ్ధపరచును.

పోస్టేజి మొదలగువాటికి నాలుగణాల బిళ్లలు పంపి ఉచితముగ శాంపిలుకు వ్రాయండి.



Sole Agents;

ANGLO INDIAN DRUG & CHEMICAL CO.,
BOMBAY, 2.

దేవుడిచ్చిన ప్రకృతి సంపద-మన కర్తవ్యము

తుపానుల నరికట్టుటకు చక్కని ఉపాయాలు

= శ్రీ భాగవతుల విశ్వనాథం =

ఆయిదారు సంవత్సరాలుగా జరుగుచున్న దేశదేశాలవారి యుద్ధాలు ఆగిపోయినాయి. మన దేశంలో ప్రజకు, ప్రభుత్వానికి జరుగుచున్న స్వాతంత్ర్య సమరము జయప్రదముగా ముగియనున్నది. స్వరాజ్యము కనుచూపుమేరలో ఉన్నది. ఈ వ్యాసము చదువరుల చేతులలో పడేసరికి జాతీయప్రజాప్రతినిధిప్రభుత్వము అమలులోనికి వచ్చిఉంటుంది. దేశాభ్యుదయముతో సంబంధించిన అనేక సమస్యలు పరిష్కరించవలసి ఉంటుంది. ఏది ముందు, ఏది వెనుక అనే సమస్య అన్నిసమస్యలకన్న గొప్పదవుతుంది. ఆ తీర్మానము చేయటంలోను, ఆ తీర్మానప్రకారము ఆచరణలో పెట్టటములోను సమస్యాపరిష్కారం ఉంటుంది. ఈ పరిష్కారములో శాంతియుత అభివృద్ధికూడా ఉంది.

—ఇదంతా భగవంతుని దయే—

దైవసంకల్పము మానవాతీతం. ఈ అయిదారు సంవత్సరాలుగా జరిగిన విషయాలు చూస్తే, కథ అంతా దైవము నడిపిస్తున్నట్లు కనిపిస్తుంది. ఇంతేకాక మన దేశముమీద దయగలిగి దైవము ప్రపంచనాటకము ఆడిస్తున్నట్లు తోస్తోంది. లేకపోతే ప్రపంచకమంతటాయుద్ధబీభత్సమేమి, మన దేశంయుద్ధరంగం కాకుండా ఉండుట యేమి? యుద్ధమువల్ల మనము మనకు కావలసిన తిండిగింజలుకూడా పండించలేకుండా ఉన్నామని బోధపడింది. ఈ విషయాలు తెలిసినవారు ఇంతకుముందు యీలోపములనుగురించి చెప్తున్నా ప్రభుత్వము గమనించలేదు. యుద్ధము రావటమువల్ల ప్రభుత్వముకూడా ఈవిషయమును గమనించవలసివచ్చింది. బెంగాలు క్షామము, లక్షలకొలది ప్రజలు చావడం చూచి, మనకు తిండిగింజలు లోపమేనని, అధికాహారోత్పత్తి అన్నిటికంటె ముఖ్యావసరమని ప్రజలకు తెలిసింది. ప్రభుత్వానికికూడా ఈవిషయం మనస్సుకు బాగా నాటింది. ప్రస్తుత అనావృష్టి, అందువల్ల రాబోవుచున్న కరువు, తిండిగింజలకోసం పరదేశాలకు భిక్షకుపోవడం, అక్కడ భిక్ష సరిగా దొరకకపోవడం-ఇది ప్రభుత్వముయొక్కయు, ప్రజలయొక్కయు కళ్లు తెరిచింది. వ్యవసాయకృషి లేనిదే లోకజీవనం దుర్లభమని ఆబాలగోపాలానికి స్పష్టంగా బోధపడింది.

—ఇప్పుడిప్పుడే కండ్లు తెరిచాము—

ఈ రెండు, మూడు సంవత్సరములుగా దేశపరిస్థితులను పరిశీలించి మన పంటల ఉత్పత్తి ఎక్కువచేయటానికి మనకు కావలసిన వసతు లున్నాయని తెలుసుకొన్నాము. ఆదికాలమునుంచీ అనగా వేదకాలముమొదలు మన దేశంలో వ్యవసాయము ఒక గొప్ప కళగా పరిగణింపబడుచుండెడిది. దానికి సంబంధించిన శాస్త్రజ్ఞానముకూడా ఉండుటచేత అది ఈ కళాభివృద్ధికి తోడ్పడేది. ప్రస్తుతయుగములో శాస్త్రజ్ఞానము ఎక్కువయినప్పటికీ దాని ఫలితము పూర్తిగా అనుభవించటానికి వీలులేకుండాపోయింది. క్రొత్త భూములు సాగులోకి తేవడం ఉందికాని అట్టి భూములు అంతగా లేకపోవడం, ఉన్నవి నాదారుభూములుగా ఉండటంవల్ల ప్రస్తుతంలో క్రొత్తభూములు సాగులోనికి తెచ్చే అవకాశములు అంతగా కనుపించుట లేదు. ప్రస్తుతం సాగగుచున్న భూముల సారము తగ్గుటవల్ల పంటల దిగుబడులు తగ్గుచున్నవి. ఈ భూముల సారము హెచ్చించి పంటల దిగుబడులు హెచ్చుచేయగల మార్గములు ముఖ్యావసరములుగా కనుపించుచున్నవి. అందుచేతనే అధికాహారోత్పత్తికి ప్రయత్నములు జరుగుచున్నవి. అమలులో ఉన్న సాగుపద్ధతులు కొంచెము మార్చడంవల్లా, క్రొత్తవిధానములు ఆచరణలో పెట్టటంవల్లా, నీటివసతులు వీలైనంతవరకు అనుగుణ్యంగా మార్చడమువల్లా, ఆయాప్రదేశాలకు తగిన విత్తనాలు, అవసరమైన ఎరువులు సరఫరా చేయడమువల్లా కొంతవరకు అధికాహారోత్పత్తి జరుగుతోంది.

1942-43 సంవత్సరములో 68,86,000 టన్నుల వరి పండించగలిగితే, 1944-45 లో 75,43,000 టన్నుల వరి పండించగలిగాము.

—కాని, పాపిష్ఠితుపాను వచ్చిపడింది—

ఈ ప్రయత్నములవల్ల అధికాహారోత్పత్తి ముఖ్యసాధనమైన వ్యవసాయాభివృద్ధికి అగ్రస్థానము ఇవ్వాలని స్పష్టముగా తెలిసింది. అయితే 1945-46 సం. అక్టోబరుమాసములో గలిగిన తుపానువల్ల ఈ ప్రయత్నములన్నీ ఎట్లు విఫలమైనవో బోధపడింది. మన కున్న ప్రకృతిసంపదల నన్నింటిని పరీక్షించి వాటిని సద్వినియోగం చేసుకొనవలెనని స్పష్టంగా తెలిసినది. గత 40 సంవత్సరములలోను సుమారు 70 తుపానులు సంభవించినవి. అందులో 40 తుపానులు చెన్నపట్టణమునకు ఉత్తరముగా ఉండే జిల్లాలలోను, 20 తుపానులు చెన్నపట్టణమునకు దక్షిణముగా ఉండే జిల్లాలలోను, 10 తుపానులు పశ్చిమసముద్రతీరమునందును సంభవించినవి. ప్రతితుపాను ఎక్కడో ఒకచోట గ్రామములకు కొంత నష్టం కలిగిస్తూనేఉంది. మొన్నటి

అక్టోబరు తుపానువంటిది అనేక గ్రామములకు అపారనష్టమును కలిగించినది. గాలివానలవలన, అతివృష్టి అనావృష్టులవలన, చెరువులు పేటువేయటంవలనా ఒకచోట వరదలు, ఒకచోట నీరులేకపోవడం జరుగుతున్నాయి. ఇట్టి పరిస్థితులలో గ్రామములు, అందలి రైతులు ఎలాగు ఏవిధినాభివృద్ధి పొందగలరు? ఒక్క తుపానులవల్ల వచ్చే నష్టాన్ని భర్తీచేసుకోడంతోనే సరిపోతూఉంటే, ఆర్థికపరిస్థితులు బాగుపడటానికి ఏలెక్కడఉంది? అందుచేతనే వీలైనంతవరకు ప్రకృతిసంపదలను సద్వినియోగము చేసుకోటానికి ప్రయత్నాలు చేయాలి. అది అంత కష్టమైన పని కాదు. కావలసిందల్లా క్రమవిధానం.

—మన పంటలసంపద, పశుసంపద—

మన ఆంధ్రదేశంలో ప్రతిసాలీనా ఒకటిన్నరకోట్ల ఎకరములు సాగవుతున్నాయి. ఆ సాగువల్ల 130 కోట్ల రూపాయల విలువగలపంట పండుతోంది. ఇది మన పంటల సంపద. సుమారు నాలుగున్నరకోట్ల పశుసంపద మనకున్నది. ఇంత సంపద ఉన్నప్పటికీకూడా 190 లక్షలు గల మన జనసంఖ్యకు అత్యంతప్రయోజనకారిగా ఉండుటలేదు. ఇందులకు అనేకమంది అనేక కారణాలు చెబుతారు. ముఖ్యకారణం నాకు తెలిసినంతవరకు ఏమిటంటే, మన ప్రకృతిసంపదలను మనము పూర్తిగా వినియోగించుకోనక పోవటమే. మన దేశంనిండా మహానదులు ప్రవహిస్తున్నాయి. వాటి నీరు నూటికి 90 వంతులకు పైగా సముద్రానికి పోతోంది. ఆనీరే గాలితో గాలివానలవలె కలిసి వచ్చి వరదలు కలిగించడం, పంటలు నష్టముచేయటం జరుగుతోంది. మనకున్న భూరిసంపదలను మనము సరిగా ఉపయోగించుకుంటే మన ప్రస్తుతజనాభాకు నాల్గురెట్ల జనాభాను మన భూమి పోషించగలదు.

—దీక్షపట్టితే తుపానులనుకూడా అడ్డవచ్చు—

నీటివసతులకు కాలువలు తవ్వించవచ్చునుగాని, ప్రకృతి విజృంభణవలన కలిగే తుపానులు, వరదల నష్టాన్ని ఎలాగు ఆపగలమనే సందేహము కలుగవచ్చు. ప్రభుత్వము ముందంజవేసి కార్యక్రమాన్ని తీర్మానిస్తే, దానిని ప్రజలు ఆమోదించి సహాయపడితే ఇదొక కష్టమైన పనికాదు. సముద్రపు ఒడ్డున ఉన్న భూములు కౌలుకిచ్చుట మానివేసి, సుమారు 4, 5 మైళ్లలోపువరకు మొదట వరుసలువరుసలుగా సరుగుడుచెట్లు, మధ్యమధ్య రబ్బరుతీగె వరుసలు నాటినట్లయితే తుపానుగాలికిని, ఉప్పెననీటికిని ఆటంకము కలిగించి వాటి బలమును తగ్గించును. అందువల్ల లోపలిప్రదేశములలోని పైరులు అంతగా దెబ్బతినవు. వచ్చిన నీటిపోటు కొంత తగ్గుతుంది. ఈ కారణాలవల్ల తుపానులవలన కలిగే నష్టాన్ని చాలవరకు తగ్గించవచ్చును. డెన్మార్కు దేశములో ఇలాగే చేసి నష్టమును తగ్గించుకున్నారు. మొన్నటి గాలివానలవల్ల నష్టపడ్డ ప్రదేశములలో ఇటువంటి చెట్లచాటున, పెండెలచాటున ఉన్న పైరులు అంతగా దెబ్బతినలేదు.

ఇంతేకాక సరుగుడుచెట్లు వేయడంచేత కావలసినంత వంటచెరకు దొరకడమే కాకుండా పెద్ద కలపపరిశ్రమ (**Wood Industry**)కు వీలుకలుగచేసినట్లగును. రబ్బరుతీగె వేయడముచేత మాగాణిభూములకు కావలసిన ఆకుఎరువు దొరుకును. వ్యవసాయాభివృద్ధితోపాటు పారిశ్రామికాభివృద్ధికూడా జరుగుతుంది.

—గ్రామోద్ధరణమే దేశోద్ధరణ—

ఒకవైపు ప్రకృతితోను, రెండవవైపు సంఘంతోనూకూడా రైతుకు సంబంధాలున్నాయి. ఈ రెండు సంబంధాలూ సరిగా ఉండేటట్టు చూడాలి. అంటే ప్రస్తుతము జరుగుచున్న ఎరువు, విత్తనముల సరఫరా బాగుగా జరగాలి. వాటితోపాటు గ్రామాలలో కూడా వసతులు వృద్ధిచెందాలి. గ్రామాలు వృద్ధిపొందితేనే గాని రైతు వృద్ధిపొందడు. రైతు వృద్ధిపొందితేనేగాని దేశము వృద్ధిపొందదు. గ్రామాభివృద్ధి అంటే అందలి కుటుంబముల అభివృద్ధే. దేశము గ్రామముల సమూహం. మొదట గ్రామము పుట్టింది. ఆతరువాత పట్టణాలు పుట్టాయి. పట్టణాల పురోభివృద్ధికి గ్రామాలు మూలకారణం. పట్టణాలు వృద్ధిఅయినకొద్దీ వాటికి ఆధారభూతమైన గ్రామాలు క్షీణిస్తున్నాయి. అందుచే వ్యవసాయము, దానితో దేశము క్షీణిస్తున్నాయి. అందుకోసమనేకాబోలు దయామయుడైన దైవం ఈ యుద్ధాలు, ఈ కరువులు తెచ్చిపెట్టి దేశానికి వ్యవసాయము వెన్నెముక అని, రైతుఅభ్యుదయమే దేశాభ్యుదయమని, తగుసమయంలో రాబోయే ప్రజాప్రభుత్వానికి చెప్పుచున్నట్లు కనిపిస్తోంది. లేకపోతే ఒకవైపు స్వాతంత్ర్యసమరవిజయము చూపిస్తూ, రెండవవైపు ప్రజలకు కలుగుచున్న, కలుగనున్న మానప్రాణనష్టాలను చూపించటానికి హేతువు కనుపించదు.

—'సాహసే లక్ష్మీః'—

వ్యవసాయసంస్కరణ, గ్రామసంస్కరణ ప్రభుత్వం సాహసంతో సాగించాలి. మన దేశంలో జాతీయపునర్నిర్మాణమన్నా, జాతీయసంస్కరణఅన్నా వ్యవసాయసంస్కరణమే. గ్రామపునర్నిర్మాణమునకై ఏ కార్యక్రమము సాగింపదలచినా, వ్యవసాయసంస్కరణకు అగ్రస్థానము ఇస్తేనే ప్రభుత్వము తన విధ్యుక్తధర్మాన్ని నిర్వహించుకున్నట్లు కాగలదు. గ్రామములలో జీవశక్తి ఇంకా ఉంది. ఇంతవరకు మనలను నిలబెట్టినవి, ఇకముందు మనలను నిలబెట్టబోయేవీ గ్రామాలే, అందలి వ్యవసాయమే, అందలి పశుసంపదయే. మంటికంటె మనిషి ముఖ్యమని తెలుసుకోవాలి. దృఢనిశ్చయం, కార్యదీక్ష కావాలి. పరిశీలనలవల్ల ప్రకృతిరహస్యములను తెలుసుకోవాలి. తెలుసుకొనిన రహస్యాలను అమలులో పెట్టటానికి తగిన వసతులు ఏర్పరచాలి. ఇదే ఇకముందు దృఢనిశ్చయంతో చేయాలి.


TORCH BEARER OF
TO-MORROW
Dasett's—
RED-CROSS
BARLEY

ఉగాది

శ్రీ వారణాసి కోటీశ్వరరావు

ఏమిసెప్పు దేమి సెప్పు దయ్యల్లారా! ఉగాది మాహాత్యమంటే ఉగాది మాహాత్యం కాదుగదా!

తెల్లారితే ఉగాదనంగా రాత్రికి రాత్రే సీకటి ఎన్నాలైపోతది. రాతిర్ని పగలే అనుకొని, చిత్తావత్తుగా కోమటోళ్ల యిల్లంతా గుల్లచేసి సరంజాము తెచ్చి, "ఏమిసేయా" అంటే "ఏమిసేసేది" అని తర్జాభర్జాలయి "అప్పా" లని మొగుడంటే, "కాదు, మసాలా గారె" లని పెండ్లాము తకరారేసుకునేసరికి, సివరకు అదీ యిదీ చేద్దామనుకొని దాన్ని నరిపిత్తారు.

"యేమసేయ్! రేపు ఉగాది. తెల్సా? రేపు కాస్త కల్లుసురాపాయంసేసి నానే మన్నా అంటుగింటే యేమీ అనాక. రేపుకాసేపు కళ్ళుసుకున్నావంటే మళ్లీ వచ్చేఉగాద్దాకా ఏ రభసా, రట్టూ వుండదు." అని వాడంటే, "మరయితే, నాకూ కాసిని కల్లుదెత్తావా" అంటుంది అది. "సీసీ! సెంపలేసుకో. 'కల్లు సురాపాయం సేయించవా' అనాలి. యెందుకంటే, దేవతల్లాంటివాళ్లే కల్లు సురాపాయం సేస్తారు. అందుకే దాని కాపేరు. సుక్కల్లో చంద్రుడు నల్లగావున్నా డెందుకనుకున్నావు మరి? సురాపాయం సేయబట్టే." అంటాడు వాడు. అందుమీాదట "సరేలే. రేపు పొద్దొక్కటుగా, రేపు మళ్లీ కాంగిరేసు వాళ్లొస్తె దీని పూసు ఎత్తేదానికే ఉంటుందో, ఉండదో" అనుకుంటారు.

ఇంక, మావూరి పౌరోయితుడి సంబరమయితే సెప్పనే అక్కర్లేదు. ఆ ముందు రోజున యేయాలబోయినా సాలా సీకటడేటప్పటికి బజాన యింతమూట యేసుకొని వత్తాడు. తెల్లారగట్ల కప్పెర కప్పెర సీకటుందనంగానే, పుల్లులు గిల్లలతోనే యింత పసాదం నత్తప్పేల్లో వుంచుకొని బయలుదేరతాడు. ఆయన వచ్చేయేలకే మొగం కడుక్కొని యెదురు సూత్తుంటారు అందరూ. అది నోట్లో యేసుకునేదాకా యేదీ నోట్లో యేసుకో కూడకుగా!

మావూళ్ళో యింగిలీసు నేరిచినోళ్లు ముగ్గురంటే ముగ్గురే వుండారు. వాళ్ల యిళ్లు గూడా వొకదాని పక్క వకటి వరసగా వుండాయి. ఆరోజు గనక యింగిలీసు మాట్టాడితే మళ్లా వచ్చే వుగాద్దాకా యింగిలీసే మాట్టాడి పెద్దదొరల్లా అవుదామని కావోసు యింగిలీసే మాట్టాడుకుంటారు పుల్ల నోట్టో యేసుకొని.

ఇంతలోకే పౌరోయితుడుగా రొచ్చి "యీా యాల సంవచ్చరాది. యీా రోజు సేసిన పున్నెం బమ్మకైనా తరంగాదు." అంటూా యేదేదో సదివి, "పిల్లగాళ్లూ! దొప్పలో,

సేతులో పట్టండ్రా” అని, యింతపసాదం పోస్తాడు. పోసి, కూసిని గింజలు పెడితే తీసుకొని సక్కా యింకోయింటికి పోతాడు.

యీప్రకారంగా వూరంతా తిరిగి, నలభయి యాభయి మానికెల గింజలు పోగు సేసుకొని, పసాదం ఇంకా కాస్తో కూస్తో మిగిలివుంటే, కూసిన్ని ళ్లోసి, యే సాకలాయన సేతో, యే వడ్లోని సేతో మాకాస్త పోయిస్తాడు.

యిక, ఆపూట పొద్దొకేయేల రాంలోరి గుళ్లో కూకొని, పంచాంగంకట్ట దీసుకొని సదువుతుంటారు పురోయితులుగారు. అక్కడ కూకొనివున్నోరంతా ‘అదా’, ‘ఇదా’ అని ఆలకిస్తూ, గోలీలాడ్తున్న పిల్లోళ్లను కూకలేస్తుంటారు. పురోయితులుగారు పేర్లు సెప్పి, యయం లాబం సెప్తతూ “బావా, నీకు సున్నాలు రెండూ. అయితేంలే, ఆదాయం పదామె.” అని అనేసరికి ఆ బావ్వరసాయన “బావా, యయమెక్కువాయేంటి” అని మీసాలు మెలేస్తూ కప్పలా నోరిప్పి నవ్వతూంటే “అబ్బెబ్బే! అయితే ముందే సెప్పనూ? యయం రెండుకు రెండే.” అని పురోయితులుగారు సెప్పేసరికి పావులో, బేడో సేతులో బెట్టి నవ్వతాడు.

మరిశాను. మా పురోయితుడుగా రబ్బాయుండాడు. ఆయనే, రోజూ సదవసే సదవడు. కాని, ఆయాలమటుకు........అయి మాకు నోశేతిరగవ్, అయ్యమటుకు సదువుతుంటాడు.

రాత్రేల దేముడు ఊరేగుకొంటూ వొస్తూంటే, అప్పుడుంటుంది నారంగా! ఆ సంబరం యేమిసెప్పను! దేవుడి ముందు దివిటీలు బట్టుకొని కొందరు నడుస్తూంటే, ఆపిమ్మట ఆడుతూ పాడుతూ కొందరొస్తూంటే, ఆడోరు ఆ యిగ్రహంకిందనుంచి పోవాలని పిల్లోళ్లను సంకలేసుకొని ఆదరినుంచి ఈదరికి దూరుతూ వుంటే, కుర్రకుంకలు నానా అల్లరీ చేస్తూ గోలచేస్తూవుంటే—ఆసంబరమే సంబరంకదా!

ఇలా గిలాగు ఆరోజంతా సందడీ, సంబరాలే! యెన్నని నాను సెప్పగల్ను!

ఉగాదిమాహాత్యమంటే ఉగాదిమాహాత్యం కాదుగదా!

ఆశియాఖండ దేశముల సమాఖ్య

(Asiatic Federation)

శ్రీ మామిడిపూడి వేంకటరంగయ్య

ప్రపంచములోని ఖండము లన్నిటిలో ఆశియాఖండము గొప్పది. అందులోని ప్రజలు బహు ప్రాచీనకాలము నుండి గొప్ప నాగరికత గాంచినవారు. ఇంతేగాక నాగరికతకు, మతములకు అది పుట్టినిల్లనికూడ చెప్పదగియున్నది. ఆశియాఖండ ములో పుట్టిపెరిగిన బ్రాహ్మణ బౌద్ధ క్రైస్తవ మహమ్మదీయాదిమతములే ఇప్పటికికూడ ప్రపంచమందు వృద్ధిగాంచియున్నవి. అందు పుట్టిపెరిగిన నాగరికతలనుండియే ఐరోపాఖండవాసులు వారి నాగరికతను వృద్ధిజేసికొనిరి. ఆర్థికముగకూడ ప్రాచీనమధ్యయుగములందు ఆశియాఖండవాసులు వ్యవసాయమందును, పరిశ్రమలయందును, వర్తక వ్యాపారములందును కడు సమర్థులై సమస్త ఐశ్వర్యములతో తులతూగు చుండిరి. రాజకీయముగకూడ వారిదే మధ్యయుగాంతమువరకు పైచేయిగ నుండెను. ఆశియాఖండవాసులగు మహమ్మదీయులు, తార్తారులు, మంగోలులు, తురకజాతివారు ఐరోపాఖండముపై దండెత్తి, అందులోని దేశము లనేకములను జయించి వందలకొలది సంవత్సరములు పాలింపగలిగిరి. స్పెయిన్, పోర్చుగల్, సిసిలీ, బాల్కన్ ద్వీపకల్పములోని దేశములు, రష్యాలో చాలభాగము ఒకప్పుడు ఆశియాఖండవాసుల పరిపాలనకు లోబడియుండెను.

ఆధునికకాలమందు—అనగా క్రీ. శ. ౧౫౦౦ తర్వాత—క్రమక్రమముగ ఆశియాఖండవాసులు ఈ ఆధిక్యమునంతను కోల్పోయిరి. ఐరోపాఖండవాసులు వర్తకవ్యాపారములందును, నౌకానిర్మాణమందును, సముద్రయానమందును, క్రొత్తక్రొత్త యుద్ధసాధనములను తయారుచేయుటయందును, సైన్యసన్నాహములందును, ప్రకృతిశాస్త్రపరిజ్ఞానమందును ఆశియాఖండవాసులకంటె అత్యధికమైన నేర్పును, కౌశలమును, శక్తిసామర్థ్యములను సంపాదింపగలవారైరి. ఆశియాఖండవాసులు వృద్ధాప్యము చెందినవారివలె ప్రవర్తింపసాగిరి. ఐరోపాఖండవాసు లట్లుగాక నవయవ్వనులవలె సంచరించువారైరి. వారి పట్టుదల, సాహసము, ఉత్సాహము, వారు సంపాదించిన పరికరములు-వీనిమూలమున వారు క్రమక్రమముగ ఆశియాఖండములోని దేశము లనేకములను జయించి వశపరచుకొనిరి. ౧౯౦౦ నాటికి జపాన్‌దేశ మొకటితప్ప ఆశియాఖండములోని తక్కిన దేశము లన్నియు పాశ్చాత్యుల పరిపాలనలోనికిగాని, లేక వారి ప్రాబల్యము నెదిరింప సమర్థత లేని స్థితిలోనికిగాని రావలసివచ్చెను. ఇండియా, సింహళము, బర్మా, మలయా, ఇండోచైనా, ఇండొనీషియా మొదలగునవి వారి పరిపాలనలోనికి రావలసివచ్చెను. మధ్య ప్రాచ్యమండలి మహమ్మదీయదేశములగు పర్షియా, అరేబియా, టర్కీ మొదలైనవి పాశ్చాత్యుల నెదిరింప సామర్థ్యములేనివై క్రమక్రమముగ పాశ్చాత్యుల ననుసరింపవలసిన స్థితిలోనికి వచ్చెను. చైనాదేశము పేరునకు స్వాతంత్ర్యము కలదిగ నుండినను, అందులోకూడ ఐరోపీయనులు ప్రవేశించి కొన్ని రాష్ట్రములను వశపరచుకొనిరి. రష్యావారు మధ్య ఆశియాలోని దేశములను, సైబీరియాను స్వాధీనపరచుకొనిరి. జపాన్‌దేశ మొక్కటిమాత్రమే స్వాతంత్ర్య మనుభవింపగల స్థితిలో నుండెను.

౧౯౩౯ మొదలు ౧౯౪౫ వరకు జరిగిన రెండవ ప్రపంచ యుద్ధమునకు ఫలితముగ జపానువారుకూడ వారి స్వాతంత్ర్యమును కోల్పోయిరి. వారి దేశము ప్రస్తుతము అమెరికావారి ఆక్రమణలో నున్నది. చైనాలో కొంతభాగమును రష్యావారు వశపరచుకొనగలిగిరి. తక్కిన భాగములు చియాంగ్‌కైషేక్ పరిపాలనలో నున్నను, అతని అధికారము ఎంతవరకు నిజమైన అధికారమో చెప్పుటకు వీలులేదు. అమెరికావారియొక్క సహాయము లేక అత డతని రాజ్యమును నిలబెట్టుకొనలేడేమో యని చెప్పవలసియున్నది. అనగా అమెరికావారి ప్రాబల్యము చైనాయందు వ్యాపించు చిహ్నములు కనబడుచున్నవి.

డచ్చివారి పరిపాలనమం దుండిన జావాలోని ప్రజలు వారిపై తిరుగబడి స్వాతంత్ర్యమును ప్రకటించి స్వరాజ్యమును స్థాపింప సమకట్టియున్నారు. కాని బ్రిటిషువారు డచ్చివారికి సహాయముచేసి జావాలోని జాతీయోద్యమమును వినాశముగావించి, డచ్చివారి సామ్రాజ్యాధిపత్యమును పునరుద్ధరింపజూచుచున్నారు. ఇదే విధముగ ఇండోచైనాలోని ఫ్రెంచివారి అధికారమును పునఃప్రతిష్ఠాపన చేయుటకుకూడ ఇంగ్లీషువారు నిశ్చయించుకొనియున్నారు. ఇదివరకు స్వాతంత్ర్యము ననుభవించుచుండిన సయాందేశ మిప్పుడు బ్రిటిషువారి ప్రాబల్యమునకు లొంగవలసివచ్చెను. అది బ్రిటిషువారి

సామంతరాష్ట్రములలో నొక్కటి అయ్యెనని చెప్పవచ్చును. రషియావారు వారికి గల అఖండ సామ్రాజ్యములో తృప్తిపొందక పర్షియా దేశమును మ్రింగజూచుచున్నారు. బహుశః ఉత్తరపర్షియా వారి స్వాధీనములోనికి వచ్చినదనియే చెప్పవలసియున్నది. పాలెస్టైయిన్, సిరియా, అరేబియాలలో బ్రిటిషువారియు, ఫ్రెంచివారియు అధికారము సాగుచునేయున్నది. గనుక ప్రస్తుతము ఆశియాఖండము లోని దేశములన్నియు ఐరోపియనుల వశమందే యున్నవనుటలో అతిశయోక్తి ఏమియు లేదు. టర్కీరాజ్యము స్వాతంత్ర్యము కలదియైనను ఏనిమిషమున రషియా దేశము దానిపై బడునో అన్న భయము కలదు. బ్రిటిషువారి సహాయము లేక టర్కీ దేశము రషియా వలన కలుగనున్న ప్రమాదమునుండి తప్పించుకొనుట సాధ్యముకాని పని. అనగా టర్కీదేశముకూడ ఐరోపియనులలో నొకరగు బ్రిటిషు వారి ప్రాబల్యమునకు లోబడవలసిన స్థితిలోకి వచ్చియున్నది.

ప్రస్తుతకాలమున ఆశియాఖండములోని దేశములందలి ప్రజలలో చాలభాగము ఆర్థికముగ మిక్కిలి వెనుకబడియున్నారు. ఇండియా, బర్మా, ఇండోనీషియా మొదలగు ప్రదేశములను గత రెండువందల సంవత్సరములనుండి పాశ్చాత్యులు పాలించి, అందులోని ప్రజలను పీల్చి పిప్పిచేసి వేసిరి. పాశ్చాత్యుల పాలననుండి విముక్తి కలిగినగాని వీరు ఐహికసౌఖ్యమునకు కావలసిన ఆర్థికసౌకర్యములను గాని, ఇతర సౌకర్యములనుగాని సంపాదించుట సాధ్యముకాని పని. డచ్చివారు ఇండోనీషియాను మూడువందల సంవత్సరములనుండి పాలించుచు స్వదేశమగు హాలెండుయొక్క సిరిసంపదలకు దీని నొక సాధనముగ నుపయోగించుచున్నారు. ఇండియాను, బర్మాను, సింహళమును పాలించుటలో బ్రిటిషువారి ఉద్దేశము ఇట్టిదే యన్నమాట అందరికీ తెలిసినదే.

పాశ్చాత్యుల సామ్రాజ్యాధికారము ఆశియాఖండవాసుల ఆర్థికదౌర్బల్యమునకును, దారిద్ర్యమునకును ప్రధానహేతు వగుటయే గాక జనక్షయమునకును కారణభూత మగుచున్నది. వారివారి సామ్రాజ్యములను రక్షించుకొనుటకును, వృద్ధిచేసికొనుటకును పాశ్చాత్యులు తలపెట్టిన ప్రతియుద్ధమందును ఆశియాఖండవాసులు పాల్గొనవలసిన స్థితిలోనికివచ్చియున్నారు. గత రెండు ప్రపంచయుద్ధము లిట్టివే. జర్మనుల సామ్రాజ్యము వృద్ధిగాంచవలెనా, లేక ఇతర పాశ్చాత్యుల సామ్రాజ్యములు వృద్ధిగాంచవలెనా అను విషయమును నిర్ణయించుటకొరకేగదా ఈ యుద్ధములు సంభవించినది? కాని వీనియందు లక్షలకొలది ఆశియాఖండవాసులు వారి ప్రాణములను కోల్పోయిరి; వారి ధన మెంతో నష్టపడెను; క్షామముల మూలమునను, రోగముల మూలమునను వారు పడిన బాధలకు మితి మేరలు లేవు. ఇన్ని కష్టము లనుభవించుట పాశ్చాత్యుల సామ్రాజ్యాధిపత్యమును నిలబెట్టుటకేగదా? ఆశియాఖండవాసుల నందరిని తమ సౌఖ్యమును, ఐశ్వర్యమును, అధికారమును నిలబెట్టుకొనుటకు పాశ్చాత్యు లుపయోగించుట సర్వసాధారణమయ్యెను. ఆధునిక యుగచరిత్ర కిదియే ప్రధానలక్షణము. భోగించువారు ఐరోపియనులు; భోగ్యపదార్థము ఆశియాఖండవాసులు.

కలుగుచుండు ప్రమాద మొక్కటే అగునప్పుడు, దాని మూలమున బాధపడుచుండువా రందరు కలసి దాని నెదుర్కొనినయెడల దానినుండి రక్షించుకొనుటకు వారందరికి సులభము కాగలదు. ఒక్కొక్కరు ప్రత్యేకముగ దాని నెదుర్కొనుట సులభము కాక పోవచ్చును. ఇదిగాక ప్రమాదము మహత్తరమైనప్పుడు కలిసి యెదుర్కొనుటయే ఉత్తమమార్గము. లేనిచో ప్రమాదమునుండి తప్పించుకొనుట ఎవరికికూడ సాధ్యముకాని పని.

ప్రస్తుతసందర్భములో ఎదుర్కొనవలసిన ప్రమాదము పాశ్చాత్యుల సామ్రాజ్యప్రాబల్యము. దానిమూలమున బాధపడుచుండువారు ఆశియాఖండవాసు లందరు. ఒకరుమాత్రము బాధపడుటయు, తక్కినవారి కీలాటి బాధ లేకుండుటయు కాదు. బాధ అందరికీ సమానముగానే యున్నది. ఇప్పుడు విస్తారము ఆబాధకు లోనుగానట్టి చైనా, టర్కీ మొదలగు దేశములవారికికూడ క్రమక్రమముగ అట్టి బాధ కలుగు సూచనలు కనబడుచున్నవి. గొప్పబలము కలది యని ప్రఖ్యాతిగాంచిన జపాను దేశముకూడ ఆ ప్రమాదమును తప్పించుకొనలేకపోయెను. ఇట్టి పరిస్థితులలో ఆశియాఖండవాసులందరు కలిసి, ఆప్రమాదమును ఎదుర్కొనుట ఉత్తమమార్గము కదా? అట్లు కలియుటయే సమాఖ్య—ఫెడరేషన్ అని కొందరు చెప్పెదరు. అట్టి సమాఖ్య కోరదగినదా? సాధ్యమా? అన్న విషయములు చర్చింపదగినవే.

కాని ఈ సందర్భములో సమాఖ్య (ఫెడరేషన్) అను మాటను వాడుట సమంజసము కాకపోవచ్చును. శాస్త్రదృష్ట్యా సమాఖ్య అను మాట కొక లాక్షణికమైన అర్థమున్నది. ఒకవిధమైన కలయికకే సమాఖ్య అను మాట సార్థకమగునుగాని, అన్నివిధములగు కలయికలకు ఆమాట వర్తించదు. కలయిక స్థిరముగ నుండవలెనుగాని తాత్కాలికముగ నుండరాదు; కలయిక ఏదో ఒకటిరెండు ఉద్దేశములను నెరవేర్చుకొనుటకేగాక అనేక ఉద్దేశములను నెరవేర్చుకొనుటకును, రాజకీయవ్యవహారము లనేకములను జరుపుకొనుటకును సాధనముగ నుండవలెను; సమాఖ్యగ నేర్పడిన రాష్ట్రముల సమ్మేళనమునకు ప్రత్యేక రాజ్యాంగ మొకటి యుండవలెను; ఈ రాజ్యాంగమునకు పరిపాలనాధికార ముండవలెను; సమ్మిళితమైన రాష్ట్రములలోని ప్రజలందరు సమాఖ్యకు చెందిన వ్యవహారములన్నిటిలో రాష్ట్రప్రభుత్వములకు లోబడక సమాఖ్యప్రభుత్వమునకు లోబడి నడుచుకొనవలెను. ఇన్ని లక్షణములతో కూడిన రాష్ట్రముల కలయికకు సమాఖ్య అని పేరు. భిన్నములుగ నుండు రాష్ట్రము లనేకము లివిధముగ కలిసినయెడల సమాఖ్య యొకటి యేర్పడినదని చెప్పవచ్చును. తాత్కాలికముగ ఏదో ఒక ఉద్దేశమును నెరవేర్చుకొనుటకు కొన్ని రాష్ట్రములు కలిసిన యెడల, దానికి సమాఖ్య అను పేరు చెల్లదు. గతయుద్ధములో మిత్ర

మండలీరాజ్యములు—ఇంగ్లండు, రషియా, అమెరికా, చైనాలు-కలసి జర్మనీ, జపాన్, ఇటలీలను ఓడించేయుద్దేశమును నెరవేర్చుకొనుటకు అయిదుసంవత్సరములకాలము కలసియుండెను. కాని ఇది తాత్కాలికమైన కలయిక; ఆయుద్దేశము నెరవేరగనే వానిమధ్య పరస్పర భేదములు పుట్టి, ఒక్కొక్క దేశమువారు ఒక్కొక్క మార్గము ననుసరించుచున్నారు. గనుక ఈకలయిక సమాఖ్యకాదు. ఇదిగాక ఈకలయికకు ఫలితముగ క్రొత్తరాజ్యాంగ మేదియు నిర్మాణము కాలేదు. ఈ దేశములలోని ప్రజలు అందులోని ప్రభుత్వములకు లోబడియుండిరే గాని, ప్రత్యేకముగ దీనిపై నిర్మింపబడిన రాజ్యాంగమునకు లోబడియుండలేదు.

ఇట్లుగాక అమెరికా దేశములోని ప్రభుత్వవిధానమునకు 'సమాఖ్య' అను పేరు చెల్లియున్నది. ఆదేశములో నలుబది ఎనిమిదిరాష్ట్రము లున్నవి. ఈ రాష్ట్రము లన్నియు శాశ్వతముగ కలసిపోయినవి. సమాఖ్యనుండి విడిపోవుటకు వానిలో దేనికిని హక్కులేదు. ఒక్కొక్క రాష్ట్రమున కొక ప్రభుత్వమున్నట్లే సమాఖ్యకంతకు ఒక ప్రభుత్వ మున్నది. ఒక అధ్యక్షుడు, అతని కొక కార్యనిర్వాహకసభ, సమాఖ్యకు కావలసిన చట్టములు చేయుటకు 'కాంగ్రెసు' అనుపేర ఒక శాసనసభ, ఈచట్టముల నమలులో పెట్టుటకు ప్రత్యేకన్యాయస్థానములు నున్నవి. ఒక్కొక్క రాష్ట్రమందలి ప్రజలు వారి రాష్ట్రప్రభుత్వమునకేగాక ఈసమాఖ్య ప్రభుత్వమునకుకూడ లోబడవలసియున్నది.

ప్రత్యేకముగ తాము సాధింపలేనట్టి వ్యవహారము లనేకము లున్నప్పుడు వానినన్నిటిని కలసి సాధించుకొను ఉద్దేశముతో సాధారణముగ రాష్ట్రములు సమాఖ్యగ నేర్పడుట వాడుకలు. శత్రుబాధ నుండి రక్షించుకొనుట, విదేశములతో వ్యాపారముచేయుట, చెలామణి బ్యాంకీలు మొదలగువానిని నిర్మించుకొనుట, అన్ని రాష్ట్రములకు అవసరములను ప్రయాణ సౌకర్యములను కుదుర్చుకొనుట మొదలైన వ్యవహారము లనేకములు సమష్టిమీద జరుగుట లాభకరము. అట్టి అభిప్రాయము రాష్ట్రములలో కలిగినప్పుడే సమాఖ్య ఏర్పడుట కవకాశముకలదు. కాని లాభమున్నంతమాత్రముచేత ఇది జరుగునని అనుకొనుటకు వీలులేదు. భిన్నరాష్ట్రములలోని ప్రజలందరును పరస్పరాభిమానము కలవారుగ నుండవలెను; అధమపక్షము పరస్పర ద్వేషము లేనివారుగ నుండవలెను. ఏకమతము ననుసరించినందునగాని, ఏకభాషను మాటలాడుటచేతగాని, ఏకసాంప్రదాయము గలవారగుటచేతగాని ఈ అభిమాన మేర్పడవచ్చును. అభిమాన దురభిమానములకు ఆధారము లిట్టివని నిర్ణయించుటకు వీలులేదు.

ఆశియాఖండమునం దనేక దేశము లున్నవి. ఇవన్నియు కలసి ఒక సమాఖ్యగ ఏర్పడుట వాంఛనీయమా? ఇది సాధ్యమగుపక్షమున ఇట్లు జరుగుట ప్రస్తుతము మంచిదేమో. ఆశియాఖండవాసు లందరు కలసి పనిచేసినయెడల అనతికాలముననే పాశ్చాత్యుల యాజమాన్యము తొలగి ఆశియావారికి స్వాతంత్ర్యము లభింపగలదు. స్వాతంత్ర్యముతోపాటు వారి ఐశ్వర్యము వృద్ధియగుట కవకాశ మేర్పడును.

కాని ఇట్టిది జరుగుట సులభముకాదు. ఇది జరుగకపోయినను పాశ్చాత్యుల ఆధిక్యమును నాశముచేయుట కష్టసాధ్యముకాదు. ఇది జరుగునంతవరకు వేచియుండుటకూడ సమంజసము కాదు. ఆశియాఖండములోని ఒక్కొక్క దేశమందుండు ప్రజలలో గాఢమైన దేశాభిమానమును, నిర్మాణశక్తియు లేనందుననే పాశ్చాత్యుల సామ్రాజ్యములు నిలబడియున్నవికాని ఈలోపములు తీరినవెంటనే అవికూడ పడిపోవుట తప్పదు. గనుక మన ప్రయత్నమంతయు దేశాంతరములతో సంయోగము సంపాదించుటకై వినియోగమగుటకు బదులు మన ప్రజలందరిలో దేశాభిమానము రగుల్కొనునట్లు చేయుటకును, రగుల్కొనిన దేశాభిమానము నిర్మాణకార్యరూపమును ధరించునట్లు చేయుటయందును వినియోగపడవలెను. ఇదియే కర్తవ్యము. ఇదిగాక సామ్రాజ్యాధిపత్యము నీకాలమున వహించిన వారు పాశ్చాత్యులైనను వారిలో వారికి పూర్తియైన ఐకమత్యము లేదు. అందుచేత వారిలో కొందరు ఒక్కొక ఆశియాదేశమునకు మిత్రులుగను, కొందరు శత్రువులుగను ఉన్నారు. పర్షియాలో బ్రిటిషు వారు మిత్రులుగను, రషియావారు శత్రువులుగను ఉన్నారు. పాలెస్తయినులో బ్రిటిషువారు శత్రువులు; రషియావారు ప్రజలకు సహాయము చేయువారివలె కనుపించుచున్నారు. ఇండోనేషియాలో బ్రిటిషువారు శత్రువులుగాను, అమెరికావారు తటస్థులుగను ఉన్నారు గనుక ఒక్కొక్క దేశములో ఒక్కొక్కప్పుడు పాశ్చాత్యులలో కొందరి సహాయము కోరవలసియున్నది. సహాయము లభించుటకుకూడ అవకాశమున్నది. ఇట్టి సందర్భములో పాశ్చాత్యులందరు శత్రువులని భావించి, వారందరిపై తిరుగబడుట కొక సమాఖ్యను నెలకొల్పబూనుట సాధ్యమగుపని కాజాలదు. వాంఛనీయముకూడ కాదు. మరొక విషయముకూడ ఈసందర్భములో గమనింపదగి యున్నది. ప్రపంచమంతయు నొక్కటియై ప్రపంచములోని ప్రజలందరు పాశ్చాత్యులు, ప్రాచ్యులు అను భేదము లేక సోదరులవలె కలసిమెలసి ప్రవర్తింపవలసిన ఈరోజులలో ప్రాచ్యప్రపంచమంతయు వేరై ప్రత్యేకసమాఖ్యగ నేర్పడుట శ్రేయోదాయకము కాదు. ఇప్పుడు మనము వాంఛింపతగ్గది ప్రపంచసమాఖ్యగాని ప్రత్యేకముగ ఆశియాఖండసమాఖ్య కాదు.

ఇంకొక విషయముకూడ మనము మరువకూడదు. సమాఖ్య ఏర్పడుటకు వివిధదేశములలోని ప్రజలలో పరస్పరాభిమానము గాఢముగ నుండవలెను. వారిని ఒక్కటిగ చేయుగల సంబంధములు కొన్ని యుండవలెను. కాని అట్టి సంబంధములు గాఢమైనవి ఆశియాఖండపు దేశము లన్నిటికి ప్రస్తుతము లేవు. మధ్యప్రాచ్యములోని సిరియా, టర్కీ, ఇరాక్, పర్షియా మొదలగు దేశములకును, ఇండియాకును పరస్పరాభిమానమును పుట్టించు అనుబంధము లేవి కలవు? అట్లే

చైనాకును, ఇండొనీషియాకును అనుబంధములు లేవనియే చెప్పవలెను. అనుబంధము లిదివరకు లేనప్పుడు ఈ దేశములన్నియు ఒక సమాఖ్యగ చేర్పడుట సాధ్యముకాని పని. అచ్చటచ్చట స్వల్ప విస్తీర్ణముగల ప్రదేశములలో వివిధరాష్ట్రముల సమ్మేళనము సాధ్యము కావచ్చునేమోగాని చైనా, ఇండియా మొదలగు దేశములన్నియు కలిసి, ఒక ప్రభుత్వమునకు లోబడగలవని యనుకొనుట ఆకాశమున భవనములను నిర్మింపదలచుటయే. తాత్కాలికముగ కలయిక ఏదైన వీలగునేమోగాని శాశ్వతమై వివిధవ్యవహారములను పరిష్కరించుటకు కావలసిన సమాఖ్య ఏర్పడజాలదు.

అన్ని దేశములవారు సోదరభావముతో మెలగుచు, వివాదాంశములను యుద్ధములమూలమున గాక శాంతియుతముగ మధ్యవర్తుల ద్వారా పరిష్కరించుకొనుట ఉత్తమమార్గ మను విషయమున అభిప్రాయభేద ముండదు. కాని అన్ని దేశములవారు ఒక రాజకీయ సమాఖ్యగ చేర్పడి, ఒక రాజ్యాంగమును నిర్మించుకొని, అందుకు లోబడి ప్రవర్తింపవలయునని చెప్పుట తగదు.

గనుక ఆశియాఖండములోని దేశములన్నియు ఒక సమాఖ్యగ చేర్పడవలయునను వాదమును విరమించుకొనుటయే మంచిది. అది అంత వాంఛనీయము కాకపోవుటయేగాక సాధ్యమగునదికూడ కాదు. అందుకై చేయబడు ప్రయత్నములు సఫలములు కాజాలవు. దానికి బదులు ఒక్కొక్క దేశములోనివారు వారి దేశాభిమానమును గాఢతరముగ జేసికొని సామ్రాజ్యబంధములను త్రెంచుకొనుట మంచిది. ఇదియే సులభమార్గము. సమాఖ్యయే కావలయు ననిన ప్రపంచసమాఖ్య నిర్మాణమునకు కాలము అనుకూలించినపుడు ప్రయత్నముచేయవలసినదేకాని, ఒక ఖండములోని దేశములకుమాత్రమే అట్టి సమాఖ్యను కుదుర్చుటకు ప్రయత్నముచేయరాదు. దానిమూలమున ఖండమునకు, ఖండమునకు గల విరోధము మరింత ముదిరి ప్రపంచశాంతికి మరింత ప్రమాదము సంభవించును.



ధిక్ స్పర్ధా!

శ్రీ చక్రవర్తుల రాజగోపాలాచారి ★ ★

పోటీపద్ధతితోను, స్వార్థప్రసక్తులతోనే ప్రజాజీవితము ప్రస్తుతము నడచుచున్నది. సమష్టిసంఘశ్రేయమున కవసరమైన పనులు వ్యష్టిలాభములకని వృత్తిగాను, వ్యాపారముగాను జరుగుచు, ప్రజాజీవిత మదొక పోటీపందెముగా సాగుచున్నది. మనమైనను ఇట్లుగా ప్రవర్తించుచు, వేదాంతము, ధర్మశాస్త్రములును లోకమున కెందుకును ఉపయోగపడవనియు, గ్రంథస్థమునకే అవి సరియనియు చెప్పుకొనివచ్చుచున్నాము. తప్పుడుజీవితములో తన లొక్కని, ధర్మమునకే వంకలు పెట్టుచున్నాము. పోటీలకును, స్వార్థములకును బదులుగా మనము ప్రజాహితమును, విధివిధానమును అలవరచుకొని, జీవితక్రమమును సరిదిద్దుకొని నడచుకొంటిమేని వేదాంతముకూడ వాస్తవమైన దయితీరును; లోకమునకును ఉపకరించును.

పాతవ్యవస్థను పారదోలి, క్రొత్తవ్యవస్థను స్థాపించుటకు వేదాంతబోధయు, ధార్మికజీవితాభిలాషయు ప్రజలలో ప్రచారము కావలెను. కాని పోటీలు, స్వలాభములు, స్వార్థచింతనలతో నిండియున్న జీవితము లట్లే యున్నంతకాలము ధర్మచింతన వ్యాపించుట సాధ్యముకాని పని. సంఘశ్రేయోభిలాష గల జీవితములు నెలకొన్నప్పుడే వేదాంతబోధలును, ధార్మికవిచక్షణలును ప్రబలును. ఇది ఒక పెద్ద విడరానిసమస్య. రెండుతప్పులు ఒకదానితో నొకటి ఢీకొనుచు నిలిచినవి. వ్యాధి నిమ్మళించినచో మందు ఒంటపట్టును; మందు ఒంటపట్టినచో వ్యాధి నిమ్మళించును. పిచ్చికుదిరినచో పెండ్లి; పెండ్లి అయినచో పిచ్చికుదురుట! ఇటువంటి సమస్యలు ఈ లోపభూయిష్ఠలోకములో కొల్లలుకొల్లలుగా నున్నవి. వానిని చూచి జడియక మనమెంత పాటుపడితిమేని అవి కొంత సందిచ్చును. కొంత సందిచ్చి అవి కొంచెము సర్దుకొన్నవా, ఇక మనపని సులభసాధ్యమైపోవును.

౨

దేశములోని పారిశ్రామికప్రాబల్యమే ఆ దేశముయొక్క ఆస్తిసంపత్తి. ప్రజల దేహదార్ఢ్యము, పరిశ్రమానుభవము, అభ్యాసము, సామర్థ్యము, చదువు, జనసంఖ్య, నివాసప్రాంతము ఇత్యాదుల నన్నిటిని కలిపిచూచుకొని దేశముయొక్క అంగబలమును ఆరాతీయవలసియుండును. అటుపిమ్మట దేశములోని ఆ జనాంగమునకు ఆహారవస్తువు లెంతెంత కావలెనో, బట్టపాత లెన్ని కావలెనో, ఇంకను ఇటువంటి తప్పనిసరి సామగ్రి ఎంతెంత సమకూర్పవలసియుండునో, ఆ సమకూర్పు, లేదా ఉత్పత్తిచేయు పని ఏయే ప్రదేశములో ఎంతెంత పరిమాణమున నడిపించిన సౌకర్యమో మొదలయిన విషయములను గట్టిగా నిశ్చయించుకొని, ఆ వ్యవహారమంతయు సంఘమునకు విడిచిపెట్టవలెను. తిండిబట్టలు వ్యష్టిలాభములకును, వ్యక్తుల స్వార్థమునకును లోనుగాకుండ దేశమునకంతకు నని ఒక సమష్టి ప్రణాళిక ఏర్పరచవలెను. ఇది మొట్టమొదట చేసితీరవలసినపని.

తిండి, బట్ట మొదలైన తప్పనిసరివస్తువుల ఉత్పత్తికిని, వినియోగమునకును కావలసిన మనుష్యబలము పోగా దేశములో ఆయా ప్రదేశములందు ఎంతెంత మనుష్యబలము హెచ్చుగా నున్నదో సరిగా కనిపెట్టి, ఆ అంగబలమును ప్రజాశ్రేయస్సుకు ఏ విధముగా ఉపయోగించుకొనవచ్చునో గమనించి, స్థానములవారీగాను, సమష్టిగాను ఒక పథకమును వేసుకొనవలెను. తప్పనిసరిసరుకుల ఉత్పత్తి వినియోగములకు కావలసినది పోగా మిగిలిన మనుష్యబలమును దేశీయప్రజల సుఖసంతోషములకై ఉపయోగించుకొనవలెను.

విదేశములలో తయారగు సరుకులు మన కెంతమట్టు కవసరము, వానికి బదులుగా మన మేవస్తువుల నుత్పత్తిచేసి పంపగలము అను విషయముల నన్నిటిని జాగ్రత్తగా యోచించి, విదేశీవస్తువుల దిగుమతిని గురించిన ప్రణాళికకూడ ఒకటి మనము సిద్ధపరచుకొనవలయును.

వీని నన్నిటిని మనము సర్వసామాన్యవ్యవహారముగా నడిపింపవలెను. అట్లు చేయక ప్రత్యేకవ్యక్తుల హక్కుభుక్తముగా చేసి, ప్రత్యేకవ్యక్తుల స్వార్థలాభాలు, ఆశలు, పోటీసామర్థ్యము మొదలయిన సాధనములను చేపట్టి నడిపించుకొనివచ్చిన పాతపద్ధతి తప్పుపద్ధతి, అందులో కష్టము, నష్టము తప్ప వేరేమియు లేదని ఇప్పుడు లోకము చక్కగా గ్రహించినది. ఈ తప్పుడు పద్ధతినే ఇంకను పట్టుకొని ప్రాకులాడక, సమష్టిచింతన, పోటీలులేని పోటీమిరైన పరిశ్రమపద్ధతులతో నొప్పునట్టి సాముదాయిక జీవితములు నడపవలెను. అందరును తమతమ శక్తికి తగినట్లు సమాజశ్రేయస్సునకై పరిశ్రమ చేయవలెను. అందరును తమతమ అవసరములకు తగినట్లు సాముదాయిక వస్తుసంపత్తినుండి భాగములు పొందవలెను. కృషి పరిశ్రమలు చేయకుండ ఊరకొనుట దేశద్రోహము. తన అవసరము

లకు మించి వస్తుసంగ్రహము చేయజాలకుండుట వొంగరతనము. ఇదియే సాముదాయికము, అథవా సామ్యవాదము. దీనినే ఆంగ్లములో 'సోషలిజం' అందురు.

3

దేశకాలములకు తగినట్లు సాముదాయిక ప్రణాళిక మారవచ్చును.

ఎటువంటి సాముదాయిక ప్రణాళిక భారతదేశమునందిప్పుడు నెలకొల్పవలెను, ఏరీతిగా దానికై కృషిచేయవలెను అన్న విషయముల నిప్పుడు తీర్చుటకు వీలులేదు. కాని ఒక్కటి మాత్రము నిశ్చయము. ప్రభుత్వాదరము లేకుండ, శాసనముల ముగా గాకుండ ధనవంతులను నమ్ముకొని సాముదాయిక సమత్వము నేర్పరచవచ్చునని కొందరనుచున్నది వెరవేరునది కాదు. ప్రభుత్వనిర్బంధనములు లేకుండ ధనవంతులు తమ ఆస్తిపాస్తులను ధర్మసొత్తుకింద మార్చివేసి, బీదసాదలను సాదరదృష్టితో చూడగలరని వర్తమానకాలములో మన మెరుగుదుమా వీలులేదు.

ఇప్పుడు పదవులను, అధికారమును అధిష్ఠించియున్నవారిని క్రిందికి దిగలాగి, తోసివేసి, ఆ అధికారపదవులను బీదలైన తరితరులు చేపట్టుట సంఘస్వామ్య మనిపించుకోనేరదు. సాముదాయిక సిద్ధాంతమును లోకమంతటను ఏకకాలావచ్ఛేదముగా ఏర్పరచుట కూడ సాధ్యముకాని పనియే. ఒక దేశములో దానిని స్థాపించినను దాని పొరుగుదేశములో పెట్టుబడిదారు పెత్తనమును, పోటీపోరాటములును సాగుచుండినయెడల సర్వస్వామ్యమును, వృథాజీవిత విధానమును నెలకొన్న దేశములో గూడ ప్రజలు సాముదాయిక సిద్ధాంతముయొక్క పూర్ణప్రయోజనమును పొందజాలరు. దీనిని పట్టుకొని అసలు సాముదాయికవాదమే నిష్ప్రయోజనమనుట తప్పు. ఒకడు తన యింటిని పరిశుభ్రముగా పెట్టుకొనియుండవచ్చును. కాని అతని పొరుగింటిమనిషి తన యింటిని పరిశుభ్రముగా పెట్టుకొనియుండక పోవచ్చును. అందువల్ల వీథివసారాలు చెడుగాలికి ఆకరములై వ్యాధులు వ్యాపించుటకు అవకాశమేర్పడవచ్చును. దానిని పట్టుకొని అసలు ఇల్లువాకిండ్లను పరిశుభ్రముగా పెట్టుకొని ప్రయోజనములేదని తలచకూడదుకదా! ఇరుగుపొరుగు ప్రజలందరిలోను సరియైన విజ్ఞానము వ్యాపించువరకు విధిగా పాటుపడుచు ఉండి తీరవలసినదే. ఇదేవిధముగానే సక్రమసాముదాయికజీవితమును, స్వార్థరహిత ధర్మచింతనయు దేశములోను, ప్రపంచమునందును సరిగా వ్యాపించువరకు గట్టిమనస్సుతో పాటుపడుచు ఉండవలసినదే.

౪

సాముదాయిక ప్రణాళికనుగురించి చెప్పునప్పుడు ఒక ప్రశ్న ఉదయించును. "ప్రత్యేకవ్యక్తులకు ఆస్తిహక్కు లున్నందువల్లకదా వారు చేపట్టిన పరిశ్రమలను చక్కగా నిర్వహించుకొని వచ్చుచున్నారు? సంఘస్వామ్యము చేసిపెట్టినచో ఇదేవిధముగా నిర్వహింతురా? మన కెందుకని ఉపేక్షించి ఊరకుందురుగదా!" అను సందేహము జనించును. సంఘస్వామ్యము మనకు అనుభవము లేనందువల్ల ఈ సందేహము కలుగుట సహజమే. ఇప్పుడుగూడ కొన్ని సంస్థలు సమష్టిమీద నడచుచున్నవి. కాని, ప్రత్యేకవ్యక్తుల ఆస్తిహక్కులకును, పోటీజీవితమునకును నడుమ అవి నడచుచున్నవి. అందువల్లనే వానిలో చిక్కులెన్నో ఏర్పడుచున్నవి. మనచుట్టు ఆవరించియుండు బలమైన స్వార్థవేగము ఆసమష్టిసంస్థలనుగూడ తాకుచున్నది. దీనిని పట్టుకొని సమష్టిసంఘస్వామ్యపద్ధతిలో వ్యవహారమంతయు నిక్కలోట్లతో నడుచునని యెంచగూడదు. సాముదాయికవ్యవస్థాజీవితములో ప్రత్యేకఆస్తిహక్కన్నది మిక్కిలి కుంచించుకొనిపోవును. పారంపర్యహక్కన్నదికూడ పూర్తిగా మరుగుపడిపోవును. చేర్చిపెట్టు సొత్తంతయు తమబిడ్డలకు చెందిపోవునన్న ఆశయేకదా ప్రజల జీవితములో ఇప్పుడు ప్రధానముగా పనిచేయుచున్నది? సాముదాయికవ్యవస్థలో తండ్రి సంపాదించిపెట్టకపోయినచో బిడ్డలు కష్టపడవలెనన్న మాట లేదు. సాముదాయికజీవితము వలన మన లక్ష్యములు, మన మనోభావములు పూర్తిగా మారిపోవును. సొత్తులను రహస్యముగా దాచిపెట్టుకొని అనుభవించుట యన్నది అసాధ్యమైన పని. పాతవాసనతో కొన్నికొన్ని ఇచ్ఛలు ఆరంభమునందంతో ఇంతో ఉండుచుండవచ్చును. కాలక్రమమున నవి అణగిఅణగి చివరకు పూర్తిగా మరుగుపడిపోవును. సాముదాయికజీవితములో సంఘశ్రేయస్సే పరిశ్రమల పరమార్థమైపోవును.

౫

మనిషి అన్నవానికి రెండువిధములైన ఆశ లుండును. జనసామాన్యమునకు సేవచేయవలెను. నలుగురి ఉపయోగమునకును అక్కరకువచ్చు అందమయిన వస్తువులను తయారుచేసి పేరుపెంపులు సంపాదింపవలెనన్న ఆశ ఒకటి. తన సొంత ఉపయోగమునకును, తన సొంత సుఖమునకును వస్తువులను చేర్చిచేర్చి పెట్టవలెనన్న ఆశ రెండవది. ఈ రెండును జన్మతఃపుట్టిన ఆశలు. రెండవదిగా చెప్పబడిన ఆశవలెనే మొదటిదిగూడ ప్రబలమైనదే. సొంతమునకు కట్టుకొను ఇల్లు, నలుగురి ఉపయోగమునకై కట్టు ఆలయము ఈ రెంటి సంపర్కములను పరిశీలించిచూచినచో కట్టునటువంటి శిల్పులును, పనివాండ్రునుగూడ ఆలయమును కట్టుటయందే ఎక్కువ శ్రద్ధాసక్తులు పెట్టి కట్టుదురన్న సంగతి చూడగలము. ఈతత్త్వమును ఇంకను అనేక విషయములలో చూడవగును. పాటలు పాడుట, గ్రంథరచన చేయుట మొదలైన కళాశిల్పవ్యాపారములన్నింటను ప్రజలు సొంత వ్యాపారములందుకంటె ఎక్కువ శ్రద్ధను చూపుట గాంతుము. సంఘస్వామ్యముగా చేసివేసి, స్వలాభము లేకపోయినయెడల ఆ శ్రద్ధ తగ్గిపోవునని చెప్ప వీలులేదు. వస్తుసంగ్రహణమునందు ఆశచూపునట్లుగానే కీర్తిప్రతిష్ఠలు సంపాదించుటకుగూడ ప్రజలు ఆశ కనబరచుచుందురు.

ఇప్పటికే తపాలా,తాకపోకల వ్యవహారమంతయు పూర్తిగా సమూహమంతకును సమష్టిగా నడచుచున్నది. పూర్వకాలమునందు ప్రతిమనుష్యుడును తన జాబులను గ్రామాంతరములకు పంపుటకు వేరు వేరుగా మనుష్యులను పట్టుకొని పంపుట ఆచారముగా నుండెను. ఇప్పుడు జనసమూహమంతకును సమష్టిగా నడచుచున్న తపాలావ్యవహారము దివ్యముగానే జరుగుచున్నది. ఈవిధముగానే ప్రజల యావదవసరములను సమష్టిశాశ్వతతోనే పూర్తిచేసికొన వీలగును.

బట్టపాతల ఉత్పత్తిపరిశ్రమలో పెద్దపెద్ద యంత్రశాలలు వాని భాగస్వాముల ఆస్తిపాస్తులుగా ఉంటున్నవి. నిజమునకు ఈ భాగస్వాము లేమియు ఆ యంత్రశాలలను నిర్వహించుకొనవచ్చుటలేదు. అందుకని నియమింపబడియున్న కొంతమంది ఉద్యోగస్థులే వానిని నడిపించుచున్నారు. భాగస్వాములు తమ వాటావ్యవహారములను జప్తిచేయనిచ్చిపెట్టి, కోర్టువారిచే నియమింపబడిన రిసీవర్లు నిర్వహించుకొనివచ్చినను వస్త్రోత్పత్తి కొదవలేకుండ సాగిపోవును. వాటావ్యవహారములను సర్కారుపరముచేసినప్పటికిని తనిఖీదార్లును, పారిశ్రామికులును కలిసి యంత్రశాలనిర్వాహకులందరును తమతమ పనులను పూర్వమువలెనే చేసికొనిపోవుచుందురు. వాటాదార్ల సేవకులుగా ఉండుట పోయి, రాజ్యాంగమునకు సేవకులయిపోవుదురు. అందువల్ల వస్త్రోత్పత్తికి ఏలాటి ఆటంకమును ఉండదు.

ఇదేరీతిగానే ఒక జనాంగజీవితమునకు కావలసిన యావత్తు ఉత్పత్తులను సంఘమంతటికిని సేవచేయునట్టి ఉద్యోగులమూలముగా నడిపింపవచ్చును. పోటీవ్యాపారములో తగులుకొనియుండవలెనన్న అవసరము లేనే లేదు.

తపాలాశాఖ, వీధిదీపములు, నగరపరిశుభ్రత, ప్రజారోగ్యము, రైలుబండ్ల నిర్వాహము, త్రాగునీటి సంపాదము, విద్యుచ్ఛక్తి మొదలయిన కార్యకలాపములు సమాజపద్ధతిలో ప్రస్తుతము నడచుచుండుటయే సాముదాయికసిద్ధాంతము సుసాధ్యమనుటకు ప్రత్యక్ష నిదర్శనము.

౬

ఒక జనసమూహము సుఖముగాను, సంతోషముగాను, స్వతంత్రముగాను ఉండవలెనన్నయెడల ఒక సవ్యమయిన జీవితవ్యవస్థ ఉండవలెను. ఆ వ్యవస్థ సరిగా నెరవేరవలెనన్నయెడల ప్రజలకు వాస్తవిక పరిజ్ఞాన ముండవలెను. వారి మతసంప్రదాయము, నిత్యకృత్యములు, సంస్కృతి అన్నియు తోడ్పడవలెను. మతసంప్రదాయము, సంస్కృతి, నిత్యకృత్యపద్ధతి, వస్తువినియోగము, ప్రభుత్వక్రమము, చదువుసంస్థలు—ఇవియన్నియు పరస్పరాటంకము లేకుండ అమరియున్నయెడల దేశము సుఖపడును. అరమరికలు ఉన్నచో, ఆ దేశపు ప్రజలు గగ్గోలుపడుదురు. దేహములో నరముల వేగములు ఒకదానికొకటి అతికిపోయి సమానస్థితిలో లేకపోయినయెడల వెంటనే జెడ్డ వ్యాధు లంకురించును. అట్లే వర్తమాన ప్రాపంచిక జీవితములో కనబడుచున్న లోటుపాట్లకు కారణము మత, రాజకీయ, విజ్ఞాన అవ్యవస్థయే నని చెప్పవచ్చును. ప్రజలు అనుసరించు మతము, దేశములో అమలునందున్న వస్తువినిమయపద్ధతి, జనులు నేర్చిన విజ్ఞానము—ఈమూడును పరస్పరము విరుద్ధములుగాక ఒకదాని కొకటి బలము కూర్చవలెను. అప్పుడే ప్రజలు సుఖజీవితము ననుభవింపగలరు. అట్లు కానినాడు వారు తీరనిదుఃఖములలో మునిగి కష్టపడిపోదురు. భౌతిక పరిశీలనలో కన్న సత్యములను అనుసరించియు, వానితో వ్యతిరేకించని పద్ధతిలోనే మతము, నిత్యాచారము ఉండవలెను. సత్యమనునది విషయమునకును, సందర్భమునకును అనుకూలముగా మార వీలులేదు. కంటికి కనబడుచున్న వస్తువులను చూచి గ్రహించిన సత్యములను త్రోసిరాజనిచేసి కానరాని వస్తువులను గురించిన సత్యములను ఊహించుట పనికిమాలిన పని.

ఇప్పుడు భౌతికపరిశోధనాఫలితములును, పెక్కు మతగ్రంథములలో బోధింపబడుచుండు విషయములును పూర్తిగా ఒకటికొకటి పొత్తుకలియక వ్యతిరేకించుచున్నవి. ఈవిషయములో ఈకాలపు విజ్ఞానమే గెలిచినది. అన్నిమతములు బాగుగా ఓడిపోయినవి. భౌతికశాస్త్రవేత్తల సిద్ధాంతమే సత్యమని నమ్మి సకలలౌకికకార్యములును నడచుచున్నవి. ఆత్మార్థ మొక మతమును, లౌకికవ్యాపారమునకు మరియొక మతమును రెండుగా చేసుకొని ప్రవర్తించుచున్నాము.

"ఇందువల్ల ఒక్క కష్టముకూడ లేదే" యని అనుకొనవచ్చును అలవాటయినచోసరి, ఏ అసంభావితమయినను సరిపడిపోవును. కాని ఇట్లే చేసికొనుచుపోయినయెడల నిశ్చయముగ ప్రజలు వ్యతిరేకప్రవృత్తియొక్క ఫలితమును పొందియేతీరుదురు. అబద్ధముయొక్క ఫలితము దుఃఖము. దానిని తప్పించుకొనుటకు వీలులేదు. మతమన్నది బాహ్యవేషముతో ముందుకుపడి నిలిచినయెడల అంతరంగమునందు అబద్ధమును, మలినమును కరడుగట్టి, సంఘాభ్యుదయము వెనుకపట్టును. ఇటువంటి వైరస్యప్రవృత్తివలన ప్రత్యేకవ్యక్తియొక్క సుఖజీవితముకూడ తప్పక చెడిపోవును.

పూర్వకాలమునందు భౌతికపరిశోధన యన్నది ఒక పరిమితిలో నిలిచియుండినది. ఇప్పుడో? కాలమహిమవల్లను, పరిశోధనసామగ్రి సంపత్తిచేతను, భౌతికశాస్త్రవేత్తలు కనిపెట్టుచున్న సిద్ధాంతములు మహోన్నతపరిమాణము నందుకొనుచున్నవి. మతతత్త్వములు ఆ భౌతికపరిశోధనలకు ఎదురొడ్డినిలిచినచో ఈశ్వరపూజయే అబద్ధమయిపోయి, దైవభక్తి పరిహాసపాత్రమగును. విజ్ఞానపరిశోధనలు నడచుచుండు దారి సత్యమను రాజమార్గము. సత్యమును వదలిపెట్టినచో విజ్ఞానపరిశోధనయే లేదు. కాబట్టి ఏకారణముచేతగాని విజ్ఞానశాస్త్రము సత్యమును విడిచి ప్రవర్తింపదు. మతముకూడ ఈ సత్యమార్గములోనే నడువవలయును. దైవమునుగురించిన మతజ్ఞానములు విజ్ఞానసత్యములకు వ్యతిరేకించియుండగూడదు. భగవద్విచారమార్గము

గూడ సత్యములతో కూడిన ఒక కృషిగానే యుండవలెను. మనము నిష్కర్షగా కనిపెట్టిన సత్యములకు వ్యతిరేకించిన శుష్కసంబర ముగా మతాచారమును తోసివేయరాదు.

విజ్ఞానపరిశోధనసిద్ధాంతములతో వ్యతిరేకించని మతమునకై మనము మరెక్కడికిని వెదకుకొనిపోనక్కరలేదు. అటువంటి మతము మన దేశములో పుట్టి ఎన్నినాళ్లుగానో నెలకొనియున్నది. అదియే భారతదేశముయొక్క విశిష్టవిఖ్యాతికి కారణమైన వేదాంతము. లోకములో పెక్కుమతములు, పెక్కు ఆచారములు నున్నవికాని భారతదేశపు పూర్వీకులు కనిపెట్టిన వేదాంతము, ఉపదేశించిన భగవద్విచారమార్గము, తెలియజెప్పిన జీవితవ్యవస్థ అనునవి ఆ అన్నిమతాచారములలోను మహితమైన మతాచారములనుట రూఢి. సత్యమను ఒరగల్లులో శోధించిచూచినసరి, సముదాయసుఖ మను లక్ష్యశుద్ధితో పోల్చి చూచినసరి ఈసిద్ధాంతము ఇంకను రూఢిపడును. అటువంటి మహోన్నతమతాచారమును మనము సరిగా ఉపయోగించుకొనక, వ్యర్థముగా చెత్తలో పడవేసియున్నాము.

"సత్యమే ఎల్లప్పుడును జయించును. సత్యమునకు భిన్నమయినది ఒకనాటికిని జయింపదు. భగవంతుని చేరు మార్గము సత్యమనెడి చక్కని దళవరుసతో పరచబడిన రాచబాట" అని ఉపనిషద్వాక్యము.

న్యూటన్, డార్విన్, అయిన్‌స్టీన్, స్పెన్సర్, రథర్‌ఫోర్డు మొదలయిన మహాభౌతికశాస్త్రవేత్తలు ప్రాణులను, ప్రాణములేని వస్తువులను, జ్యోతిర్మండలములో వెలుగు జ్యోతిస్సులను సూక్ష్మదర్శినులతోను, దూరదర్శినులతోను పరిశోధించిచూచి తాము కన్న పరమసత్యములను లోకమునకు చాటి చూపియున్నారు. ఆ సత్యములకును, విజ్ఞానసిద్ధాంతములకును వ్యతిరేకించని మతము లోకములో ఒకటి ఉన్నదన్నచో అది భారతఋషులు కన్న వేదాంతమే. అంతటను వ్యాపించి, అన్నింటను మిళితమై పరాశక్తి నిండియున్నది. నియతి యన్నదే దాని లక్షణము. సన్నని ఒక విత్తనములో ఒక మహావటవృక్షముయొక్క అభివృద్ధియంతయు ఇమిడియున్నవిధముగానే ఈలోకమంతయు ఒక 'సత్' నుండి పుట్టి పరిణమించినదన్నది వేదాంతము. విజ్ఞానపరిశోధనలలో పాల్గొని, తపస్సుచేసి, పరమ సత్యములను గాంచి ఆనందమును పొందు మహాశాస్త్రవేత్తలకు కావలసిన సామయికజ్ఞానము ఇదే. ఖండాంతరశాస్త్రవేత్తలు పరిశోధనలు చేసిచేసి ఒప్పుకొన్న 'ఎవల్యూషన్' అను పరిణామసిద్ధాంతమునకు వ్యతిరేకించని మతము వేదాంత మొక్కటే. వేదాంతోపదేశములను సరిగా తెలిసికొనక దానికి వంకలుపెట్టుట పొరపాటు.

౨

భారతదేశ సామరస్యమునకు మూలవేరు వేదాంతము. పూర్వకాలములోను, ఇప్పటికిని కూడ ఈ దేశచరిత్రలో కనవచ్చిన, కనవచ్చుచున్న ధైర్యము, పరాక్రమము, త్యాగము, మహత్వము మొదలయిన కల్యాణగుణముల కన్నిటికిని మూలశక్తి వేదాంతమే. భారతదేశములో ఒక్కొక్కని హృదయమందును వేదాంతము ఇప్పటికి వేళ్లూరియున్నది. నవనాగరికత, నూతన సంస్కృతి, నవ్యసంప్రదాయములు మన జీవితములందు ఎంత గాఢముగా హత్తుకొనియున్నను వేదాంతముయొక్క మూలవేరుమాత్రము రూపుమాసిపోలేదు. నగరజీవితము—గ్రామజీవితము, ధనవంతులు—నిరుపేదలు, చదువుకొన్నవారు—మూఢులు, యోగ్యులు—అయోగ్యులు అందరి జీవితములందును వేదాంతము ఊరిపోయియున్నది. ఈదేశములో జొరబడిన పరమతములుకూడ ఈ వేదాంతమునుండి తప్పించుకొనలేదు. వేదాంతమనునది భారతదేశపు మంటితో మన్నుగా కలిసిపోయియున్నది. ఈ దేశములో క్రొత్తగా వచ్చి వేరూనిన పరమతములే అన్నియు మన వేదాంతసారమును పరిగ్రహించి తన్మయమైపోవుచున్నవి. వేదాంతమే ఈదేశపు ప్రజలయొక్క సామాన్య సంస్కృతి యని చెప్పవచ్చును. ఏ మతస్థుడయినను సరే, ఇది యథార్థము.

౩

వేదాంతమునుండి ఉదయించిన జీవితక్రమము భగవద్గీతలోను, తదితర గ్రంథములందును వివరింపబడియున్నది. "అన్నిపనులను సంఘమునకు ఉపయోగించునట్లుగా చేయుము; ఏది చేసినను స్వార్థమును చూచుకొనక, సమష్టిదృష్టితో పరార్థమునకై చేయుము; అన్ని వృత్తులును సమానగౌరవము గలవే; హీనవృత్తి యనియు, ఉత్తమ వృత్తి యనియు భేదములు లేవు. సమాజశ్రేయస్సుకై చేయబడు అన్నిపనులను భగవత్కైంకర్యమే యని నమ్మి, వానిని భక్తిశ్రద్ధలతో ఆచరింపుము; సమాజములో నీకై యేర్పడ్డ పనిని ఆదరాసక్తులతో చేసి ముగించుటయే భగవత్కైంకర్యము; అపజయములు, ఆటంకములు, లాభములు, నష్టములు మొదలైనవానినిగురించి యోచనయే పెట్టుకోవద్దు; సంఘసేవ చేయుటయే నీవిధి." ఇదియే హిందూధర్మపద్ధతి.

"యతః ప్రవృత్తి ర్భూతానాం
యేన సర్వ మిదం తతం,
స్వకర్మణా త మభ్యర్చ్య
సిద్ధిం విందతి మానవః." (భగవద్గీత)

సాముదాయిక సంఘస్వామ్యమును జీవితపద్ధతిగా పెట్టుకొన్న ఒక రాజ్యాంగమునకు మతపు ప్రాపు ఒకటి కావలెనన్నయెడల ఇంతకంటె ఉత్తమమైనది వేరొక్కటి ఉండబోదు.

పూర్వకాలమునందు రాజ్యాంగవ్యవస్థ లేకుండ, ప్రత్యేక వ్యక్తులు తమ జీవితమును పైనజెప్పిన వేదాంతపద్ధతిలో సాగింప సాధ్యమైయుండవచ్చును. ప్రస్తుత మేర్పడియుండు కల్లోలపరిస్థితిలో

రాజ్యాంగవ్యవస్థ చాల అవసరము. అందరును తమతమ శక్తికి తగినట్లు కష్టించి, అందరును సాముదాయికజీవితముతో సమసుఖము పొందుటకు తగిన ఒక వస్తువినియోగప్రణాళికయు, పారిశ్రామిక ప్రణాళికయు రాజ్యాంగసంరక్షణతో ఏర్పడి, కొనసాగింపబడవలెను. అదే సాముదాయికసంఘస్వామ్యమనియు, సోషలిజం అనియు చెప్పబడు ప్రణాళిక. సాముదాయికవస్తువినియోగపద్ధతిని ఒప్పుకొని నెరవేర్చు దేశమునకు వేదాంతమునందు బోధింపబడు పరమార్థమును, గీతలో ఉపదేశింపబడు జీవితపద్ధతియునే మిక్కిలి తగినటువంటి సామయికజ్ఞాన, ఆచారములగును.

అందరును తమతమ శక్తికి తగినట్లు, వంచనలేకుండ సంఘశ్రేయస్సుకై కష్టపడి, అందరును తమతమ అవసరములకు తగినట్లు సాముదాయికనిధినుండి వస్తువులను, సౌకర్యములను పరిగ్రహించవలెను. విజ్ఞానభూయిష్ఠమయిన ఈకాలములో ఒక మనిషికి చాలినంత తిండి, బట్ట లేకపోయినచో ఆసంఘమునకే సిగ్గగును. తిండి బట్టలను సరిగా పొందుటలోనేకాదు, సముదాయసంతోషమును పొందుటలోగూడ అందరును సమానవాటా పొందవలెను. దీనికి మూలాధారము అందరును బాగుగా కష్టపడవలెను. పరాయికాపుదల నిర్బంధము లేకుండ, మాయమోసములులేకుండ, సాముదాయికవ్యవహారములు నడవవలెను. దానికి తగిన సంస్కృతి, మతము జనసామాన్యమునకు కావలెను. భారతదేశములో పుట్టిపెరిగిన వేదాంతము దీనికి మిక్కిలి అనుకూలమైన మతము.

సంఘమునకు అన్నివిధములైన సేవలును కావలెను, కాబట్టి అన్ని సేవలును గౌరవము కలిగియుండవలెను. కొంతమంది కష్టపడుటయు, కొంతమంది కష్టపడకనే సుఖముగా ఉండుటయు అక్రమము. సేవయన్నది పలువిధములుగా నుండును. శరీరకష్టము, విజ్ఞానకృషి, వ్రాతపని, పర్యవేక్షణ, గీతనృత్యాలు మొదలయిన వన్నియు సంఘసేవలే. కఠినమయిన పనులకును, సాధనాభ్యాసములతో చేయదగిన సేవలకును గౌరవము ఎక్కువగా ఉండవలెను. ప్రస్తుతము అనుష్ఠానములోనుండు గౌరవపద్ధతి సవ్యతప్పు. అపరిశుభ్రమైనట్టియు, సంఘమునకు తప్పనిసరి అయినట్టియు పనులు చేసి బ్రతుకువారిని తక్కువచూపులు చూచుచున్నాము. సుఖసంతోషములతో నోలలాడుచుండు పనులకు గౌరవ మధికము. ఈ తలక్రిందుపద్ధతి రూపుమాసిపోవలెను. పోటీలు, వేటలు, పెట్టుబళ్లు, స్వార్థములు ఆధారముగా నున్నట్టి ప్రస్తుత జీవితపద్ధతిని కుదుమట్టించి దృఢమయిన సాముదాయిక ప్రవృత్తి నాటవలెను. వేదాంతతత్వమునకు సరిపోగల రాజ్యాంగము సంఘసమత్వమని చెప్పబడు సాముదాయికవ్యవస్థయే. సంఘస్వామ్యమును కోరు రాజ్యాంగమునకు వేదాంతమే సరియైన శాస్త్రము.

అనుకూలమైన మతమును, సంస్కృతియు లేని సంఘస్వామ్యవ్యవస్థ మోసముక్రిందికిని, దొంగతనముక్రిందికిని పరిణమించును. రాజ్యాంగము, మతసంప్రదాయపరిజ్ఞానము రెండును పరస్పరము కలసిమెలసియున్నచో సాముదాయికవ్యవస్థ మాయమోసములు లేకుండ చిరకాలము నెరవేరును. మతపరిజ్ఞానమన్నది ప్రజల హృదయములను చొచ్చుకొనిపోగల ఒక శాసనము. పర్యవేక్షణతో నిమిత్తములేని రక్షణ. మతము, దానిమూలమున కలుగు సంస్కృతి— ఈ రెండును లేకుండ, ఒక రాజ్యశాసనమునే నమ్ముకొని నడచు సంఘస్వామ్యవ్యవస్థ బలాత్కారముగాను, దుఃఖముగాను పరిణమించి రూపుమాసిపోవును. పోటీలులేని జీవితమును, సంఘస్వామ్యవ్యవస్థయు సవ్యముగా నడువవలెనన్న వేదాంతములో ఆరితేరిన ప్రజలయొక్క స్వార్థరహిత పరిశ్రమయే అందుకు మహోత్తమమైన సాధనము.

౬

ప్రపంచ—వేదాంతము, సంఘస్వామ్యము, విజ్ఞానశాస్త్ర పరిశోధన సిద్ధాంతములు ఈ మూడును ప్రస్తుతప్రాపంచిక జీవితమునకు కావలసిన మూడు ముఖ్యమైన అంశములు. ఈ నవీనప్రస్థానత్రయమును భారతప్రజలు తమ జీవితములలో ఒప్పుకొని నూత్నచైతన్యమును సంపాదింపగలిగిరేని భారతదేశము ఆసియాఖండములో కెల్ల ప్రథమస్థానమును నిస్సందేహముగా పొంది ప్రపంచమునకుగూడ దారి చూపగల స్థితికి వచ్చును.

క్రైస్తవ ధర్మమునకును, ఆమార్గమునకు చేరినవారుగా లెక్కింపబడు పడమటిసీమలందలి జనసముదాయముల రాజనీతికిని పరస్పరము విరోధమున్న సంగతి అందరికిని తెలిసిన విషయమే. విరోధప్రవృత్తిని దాచక ఒప్పుకొని, ధర్మము, మతము అనునవి వేరు, లౌకికమే వేరు; వానికిని దీనికిని సంబంధము లేదు; భగవద్విచారమన్నది ఒక ప్రత్యేకకర్మ అని యారీతిగా విభజించిపెట్టుకొని, జీవితము, రాజ్యాంగ వ్యవహారములును పడమటిసీమలో నడచుచున్నవి. దానిని మనముకూడ అనుసరింపరాదు.

పూర్ణస్వరాజ్యమన్నది లోకధర్మమును నెరవేర్చుటకు మనము పొందవలసిన ఒక పరిస్థితి. అంతేకాని, తక్కినవారివలె తప్పుడు బ్రతుకులు సాగించుటకు కాదు. "పుట్టితివా కీర్తిప్రతిష్ఠల నార్జింపుము; లేదా పుట్టుటకంటె పుట్టకపోవుటయే మంచిది" అన్న ఉపదేశము ప్రత్యేకవ్యక్తులకు మాత్రము చెప్పినది కాదు. జనసముదాయమునకును అదియే నిజమయిన ధర్మము. పేరుప్రతిష్ఠలు పొందని స్వరాజ్యమువల్ల ప్రయోజనమేమియు లేదు. అది వృథాకలతలను, సంక్షోభమును వెలయిచ్చి కొనితెచ్చుకొన్నట్లగును. అంతయు ఒక పరమాత్మయొక్క పరిణామమే అనెడి వేదాంతతత్వము గల ప్రజలు దేశములో జరుగవలసిన లాభసాటి వ్యాపారములలో పాల్గొని, అందరును కలసికట్టుగా కష్టించి, సంఘశ్రేయస్సును పెంపొందించి, పండించిన పంటలను, ఆర్జించిన సుఖసంతోషములను అందరును


సమానముగా అనుభవించుకొనుచు స్వతంత్రముగా సాగించు రాజ్యాంగమే లోకములో రాణకెక్కగల రాజ్యాంగము. అదే భారత దేశపు వాంఛ; అదే భారత దేశపు లక్ష్యము.

౧౦

కనుక, ఆగామికాలములో ప్రజలు సుఖముగా బ్రతుకవలెనన్న యెడల స్వార్థాలు, స్పర్థలు పోయి సాముదాయికవ్యవస్థ రావలెను. ఆ సాముదాయిక వ్యవస్థ సవ్యముగా సాగవలెనన్న యెడల పోటీజీవితపద్ధతిలో ఏర్పడ్డ సంస్కృతి పనికిరాదు. సాముదాయిక పద్ధతికి తగిన సంస్కృతి ఏర్పడవలెను. ఒక కొత్త వ్యవస్థ సవ్యముగా నడువవలెనన్న యెడల రాజ్యాంగ శాసనములచే నమ్ముకొని ప్రయోజనము లేదు. మాయ, మోసము, దొంగతనములు లేకుండ శాసనములు సంతృప్తిగా కొనసాగవలెనన్న ప్రజలలో వ్యాపించియుండు మత సంస్కృతులు ఆచట్టములకు తోడుగా ఉండవలెను.

ప్రత్యేకవ్యక్తుల సుఖము, లాభము, పోటీలు సాధనములుగా గల జీవితపద్ధతి పోయి, సంఘసామ్యమును, స్పర్థలు లేని సముదాయ నిర్వాకము సాధింపబడి నెరవేరవలెనన్న ప్రజాహృదయములలో స్వార్థచింతన అంతరించిపోయి ధర్మచింతన పనిచేయవలెను. అసంగ మనోభావముతో విధివిధాయకములను నెరవేర్చునట్టి కర్మయోగము, వేదాంతము ఈ రెండే సాముదాయికవ్యవస్థకు తగ్గవి.

స్పర్థాజీవితము, పోటాపోటీపద్ధతి నశించిపోయి, సాముదాయికవ్యవస్థ యేర్పడవలెనని కోరువారందరును కర్మయోగ ప్రచారమును ఒక నిర్మాణకార్యక్రమముగానే ఎంచుకొని వేదాంతము నందును, భగవద్గీతలోను నూతనోత్సాహమును కనబరచవలెను.





అతిత్వరలో వచ్చుచున్నది! రేణుకావారి మహత్తర చిత్రరాజము!
నిధి చాల సుఖమా రాముని సన్నిధి సేవ సుఖమా?
భక్తిమార్గముచే ముక్తి గాంచిన సంగీత యోగ నేత్త పవిత్రగాథ.
త్యాగయ్య
SRI RENUKA FILMS MADRAS
డైరక్షన్: నాగయ్య
తారాగణము:
జయమ్మ, సరిత, హేమలత, లింగమూర్తి, రాయప్రోలు, దొరసామి, రాఘవన్.
ఆంధ్ర, పశ్చిమమండలములకు డిస్ట్రిబ్యూటర్స్:
పూర్ణ పిక్చర్స్
బెజవాడ.
నిర్మాతలు:
శ్రీ రేణుకా ఫిలింస్ లిమిటెడ్.
10, డాక్టరు నాయర్ రోడ్, మద్రాసు.

జీ వి త భీ మా

ఆర్థికరక్షణగల ప్రతికుటుంబమును సంసార సౌఖ్యమును పెంపొందించును. జీవితమున తథ్యముగ కలుగగలుగు ప్రతి ఆదాయమును మన శ్శాంతికి దోహదమగును, విచారమును పార ద్రోలును. వ్యర్థవ్యయముగాకుండ కాపాడ బడిన ప్రతి ఆదాయమును వ్యాపారము బలపరచు టకును, పెట్టుబడికిని తోడ్పడును. భవిష్య శ్రేయమే జీవిత భీమాయొక్క సందేశము. ప్రతి యొకరికిని, ఆర్థికరక్షణ మేర్పరచుటే దీని లక్ష్యము.

'హిందూస్తాన్' పట్టానొకటి తీసుకొని ఈ రక్షణము పొందండి.

1945 వ సం. కొత్త వ్యాపారము

12 కోట్లు దాటినది

హిం దూ స్థా న్

కో-ఆపరేటివ్ ఇన్సురెన్సు

సొసైటీ లిమిటెడ్.

హెడ్డాఫీసు:
"హిందుస్థాన్ బిల్డింగ్సు"
కలకత్తా.

డివిజనల్ ఆఫీసు:
"హిందుస్థాన్ బిల్డింగ్సు"
107, ఆర్మీనియన్ వీధి,
జి. టి. మదరాసు.

చర్మసౌందర్యమును చేకూర్చు సబ్బులు



చర్మ సౌందర్యం అకస్మాత్తుగా సంఘటించేది కాదు. పట్టువంటిచర్మముగల సుందరాంగులందరును చర్మపోషణ విషయమున అపారమైన శ్రద్ధతీసికొనేవారే.

అందమైన చర్మాన్ని కోరేవారందరికీ "కామినియా సబ్బులు" అమూల్యమైనవి. అవి చర్మరంధ్రాలలో ఉండే మాలిన్యాలను కడిగివేయటమే గాక చర్మాని నున్నితంగా, మృదువుగా చేస్తవి. శీతమైన పరిమళముకలవి. వివిధ పరిమళములలో దొరకుతవి.

"కామినియా" సబ్బులు

స్నానం చెయ్యటంలో నూతనానందం కల్పిస్తవి. వైట్‌రోజ్, దిల్బహార్, చందనం, లవెండరు మొదలైన వివిధ రకాలవి దొరకుతవి.

ప్రశస్తమైన ఈ టాయిలెట్ సబ్బులను నేడే వాడిచూడండి.

అందమైన వర్చస్సు

చర్మపోషణకు తగు శ్రద్ధతీసికోవటంవల్ల వస్తుంది

కామినియా స్నో

(రిజిష్టర్డు)

తీక్ష్ణమైన ఎండ, దుమారంతో నిండిన వేడిగాడ్పులు, పొడిగాలి - వీటికిలోనైన వదనముఖం సాధారణంగా ఎండదెబ్బ తినకుండా గాని, కమిలిపోకుండాగాని, బొబ్బలు లేకుండా గానిఉండటం కష్టం. అయితే కామినియా స్నో ఉపయోగించండి. అది మీ వర్చస్సును పూర్తిగా కాపాడుతుంది.

లావణ్యమైన ఈ స్నోను నిత్యం వాడితే మీ చర్మం బిడ్డల చర్మంలాగు నున్నితంగా ఉంటుంది.

సోల్ ఏజంట్లు:

ఆంగ్లో - ఇండియన్‌డ్రగ్ & కెమికల్ కం.,

285, జుమ్మామసీదు, బొంబాయి 2.



ELA
EXTRA FINE
1
ELA
EXTRA FINE
2
Make Sure
OF YOUR FAVOURITE
ELA
ELA
ELA ELA
10 CIGARETTES
10 Cigarettes
ఎక్స్ట్రా ఫైన్ ఎలా సిగరెట్లను ప్రజలు అంత
కంతకు విశేషముగా వాడుచుండుటవల్ల, ఇతర
రకములు ఎలా సిగరెట్లకు బదులుగా చలామణీ
చేయబడుచున్నవి. అందువల్ల దానిని నివారించి,
ఎలా సిగరెట్లను త్రాగు లక్షలకొలది ప్రజలు
వాటిని సులభముగా చూచుటతోడనే గుర్తించు
టకు గాను, సిగరెట్టుమీది రకము పేరు పెద్ద
అక్షరములతో నల్లరంగులో వ్రాయబడియున్నది.
నెం. 1 దు. చిత్రములో క్రొత్తదానిని చూపబడినది.
నెం. 2 దులో పాతపద్ధతి చూపబడినది. దానిని
బాగుగా గమనింపుడు.
అవి 50 సిగరెట్ల టిన్నులలో గూడ దొరకును.
Greens' Advtg. Ser. (G T 300)
Golden Tobacco Co. Bombay 24

ANAND BROTHERS

ఆనంద్ బ్రదర్సు

మాన్యుఫాక్చరర్ల ఏజంట్లు, డిస్ట్రిబ్యూటర్లు

దక్షిణభారతదేశము బొంబాయిరాష్ట్రములం దంతటను వ్యాపారవిస్తరణకుగాను ఆనంద్ బ్రదర్సువారి సేల్సు ఆర్గనైజేషనులు అల్లుకొనియున్నవి. గనుక వీరు ప్రతినిధులుగా ఉన్న మాన్యుఫాక్చర్లందరకును వీరు పూర్తిరక్షణ నివ్వగలిగిన స్థితిలో నున్నారు.

వీరు ప్రతినిధులుగా ఉన్న సంస్థలు:

ఆంధ్రపేపరు మిల్సు కంపెని, లిమిటెడ్.	రాజమండ్రి
ఆనంద్ బీటల్ నట్ వర్క్సు అండ్ ప్లాంటేషన్సు,	షిమోగా
అచ్ సన్ బాబిన్ మాన్యుఫాక్చరింగు కంపెని,	బెంగుళూరు
ఆచార్య & ఆచార్యాస్ లిమిటెడ్.	బెంగుళూరు
బెంగాల్ బెల్టింగువర్క్సు లిమిటెడ్.	కలకత్తా
కనరాషల్సు & పేపర్ మిల్సు కంపెని, లిమిటెడ్.	బొంబాయి
డక్కన్ పేపర్ మిల్సు కంపెని, లిమిటెడ్.	పూనా
డ్రగ్ హౌస్ (ఇండియా) లిమిటెడ్.	కలకత్తా
మాయా ఇంజనీరింగు వర్క్సు లిమిటెడ్	కలకత్తా
రిలయన్సు అస్యూరెన్సు కంపెని లిమిటెడ్	బెంగుళూరుసిటీ
రతన్స్ & ఆచార్యాస్ లిమిటెడ్	మదరాసు
యునైటెడ్ ఇంజనీర్స్ లిమిటెడ్	బెంగుళూరు

ఆఫీసు లున్న చోట్లు

మదరాసు - బొంబాయి - షోలాపూర్ - బెజవాడ
బెంగుళూరు-షిమోగా-కోయంబత్తూరు-సికిందరాబాదు

FAS-151

సాహిత్యము

రచయిత :

శ్రీ పద్మరాజు



అభ్యుదయ సాహిత్యము

సాహిత్య ప్రయోజనాన్ని గురించి కొంచెం వాదోపవాదాలు ఈనాడు చెలరేగుతున్నాయి. "అభ్యుదయ సాహిత్యం కావాలి" అనే నినాదం ఒకటి వినబడుతోంది. ఆ నినాదాన్ని ఎవరు శేకెత్తించినా, అందులో కొంత బలం ఉందన్న సంగతి నిర్వివాదం. అయితే ఏది అభ్యుదయ కవిత్వమో, ఏది కాదో తేలడం చాలా కష్టంగా ఉంది. వీరేశలింగంగారు అభ్యుదయ రచయిత, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి రచనలు అభ్యుదయరచనలు. టాగూరు మహాకవీ అంతే!! ఇంకో చిత్రం. మొన్నటిదాకా అభ్యుదయ రచయితల సంఘంవారు భావకవిత్వాన్ని —ప్రేమకవిత్వాన్ని ముఖ్యంగా—నిశితంగా విమర్శిస్తూ ఉండేవారు. మొన్న జరిగిన అభ్యుదయ రచయితల వార్షికోత్సవంలో ఇదివరకు వీరి విమర్శకు పాత్రులయిన నవకవులలో చాలామంది పాల్గొన్నారు. ఆ సంఘంలో వీరంతా చేరి కొన్ని ప్రధానస్థానాలు ఆక్రమించినట్టుగా తెలుస్తోంది. వీరందరి ఉపన్యాసాలలోనూ తాము ఇదివరకు రచించిన రచనలను సమర్థించుకోడం ఒక పక్కనీ, ప్రజల శ్రేయస్సును కవికూడా గుర్తించవలిసిన ఆవశ్యకతను నొక్కిచెప్పడం రెండో పక్కనీ కనబడతాయి. ఈ కలయిక ఫలితంగా ఏం జరుగుతుంది అనేది చూసి చెప్పవలసిన విషయం.

సాహిత్య రసానుభూతి ఈనాటివరకూ ఒక సంప్రదాయానికి వ్యక్తంగానో, అవ్యక్తంగానో కట్టుబడిఉంది. ఈ విషయాన్ని ప్రఖ్యాత ఆంగ్లవిమర్శకుడు ఎలియట్ (T. S. Eliot) చాలాచోట్ల అన్నాడు. ఒక కవిరచనలను చదివి ఆనందించడానికి ఆ కవియొక్క నమ్మకాలతో తనకు సానుభూతి ఉండనక్కరలేదని అతని వాదం. నిజానికి మనం సాహిత్యాన్ని ఎన్నికచేసే సందర్భంలో ఆ కవియొక్క నమ్మకాలు మన దృష్టిలో సవ్యమయినవా, కావా అనే ప్రశ్నకు ప్రాధాన్యం ఇవ్వము. దేవుణ్ణిగురించి వ్రాసిన పద్యాలు దేవుడు అసలు లేడని నిర్ధారణగా నమ్మేవాడుకూడా చదివి ఆనందించగలుగుతున్నాడు. "విశ్వశ్రేయః కావ్యం" అని ఎంత అన్నా, చివరకి సాహిత్యాన్ని గురించిన అన్ని వాదాలలోనూ మొత్తంమీద శబ్దం మొదలు భావంవరకూ కవి ఉపయోగించగల శిల్పాన్ని గురించిన దృష్టే ప్రధానమవుతూంది. చెప్పబడిన విషయానికి ప్రాధాన్యంలేదు. ఎల్లా చెప్పాడు అనేదే ప్రధాన ప్రశ్న. లౌకికంగా అవినీతికర మనుకునే ఊహాలు సాహిత్యంలో అంగీకృత మవుతున్నాయి. నగ్నస్త్రీ వర్ణన, సంభోగవర్ణన మొదలయినవి మామూలుగా అసభ్యాలు, అశ్లీలమయిన విషయాలు. కాని సాహిత్యంలో వాటిని అశ్లీలాలుగా పరిగణించరు. సాహితీపరులందరూ కళకు లౌకికనీతి వర్తించదనీ, కళయొక్క నీతి విశిష్టమయిన దనీ అంటారు. సాహిత్యలోకంలో పరస్త్రీమీద పద్యాలు వ్రాయవచ్చు. ఆమెను ప్రేమించవచ్చు. పేరుపొందిన ప్రతికవీ, ఏ దేశా

నికి చెందినవాడయినా, తనకళ్లకి అందంగా కనిపించిన వాళ్లమీదా, తను ప్రేమించా ననుకున్న వాళ్లమీదా పద్యాలు వ్రాశాడు. అది అసభ్యమనిగాని, అవినీతి అనిగాని మనం అనం. ఆ పద్యాలను మనంకూడా చదివి ఆనందిస్తాం. సాధారణంగా లౌకికనీతికంటే కళకు సంబంధించిన నీతి భిన్నంగా ఉంటుంది. కేవలమూ వ్యతిరేకంగా ఉండకపోయినా, ఈ హద్దులకు అవతలమాత్రం ఉంటుంది. దీనికి కారణం తాత్త్విక మయినది. మానసిక మయినదిన్నీ. సాహిత్యం ఉత్తమ మయిన మానవకృషులలో ఒకటి. నాగరకతలో సాహిత్యానికి ఎంతో ఉన్నతమయిన స్థానం ఉంది. ఏకాలానిదయినా నాగరకతనుగురించి తెలుసుకో వాలంటే ఆనాటి సాహిత్యం ఎక్కువగా ఉపకరిస్తోంది. సాహిత్యంలో ఆనాటి అలవాట్లు, చరిత్ర వాస్తవికంగా చిత్రించబడతాయని కాదు. కాని భావాలను, పదాలను సమన్వయపరిచి కవితాశిల్పంలో ఆనాటి కవులు చూపిన నాజూకునుబట్టి ఆనాటి మానసికపరిణామస్థితి వ్యక్తమవుతుంది. నాగరకత చివరకి ఈ మానసిక పరిణామంమీద ఆధారపడిఉంటుందిగనక నాగరకతకూ, కవితాశిల్పానికీ చాలా సన్నిహితమయిన సంబంధం ఉంది. ఈ శిల్పం అనే పదాన్ని చాలా విశాలమయిన అర్థంలో ఉపయోగిస్తున్నాను. కేవలమూ పదాలను పొదగడమేకాక భావాలను చిత్రవిచిత్రంగా పోహళించడంకూడా శిల్పంలోదే.

సాహిత్యానికి ఈ స్థానం రావడానికి దాని ప్రత్యేక ప్రయోజనమే కారణం. మనిషి మూలస్వభావంలో అనేక ప్రాకృతిక చిత్తవృత్తు లుంటాయి. అనేకమయిన కోరికలు అతని మనసులో అజ్ఞాతంగా ఇమిడి ఉంటాయి. జ్ఞాతంగా పనిచేసే అతని మనోభాగంలో సంఘనీతియొక్క సారం అంతా ఇమిడిఉంటుంది. ఆ కారణంచేత అనేకమయిన కోరికలు అతని మనస్సులో అతనికి తెలియకుండానే అణగిపోయిఉంటాయి. వాటి ఒత్తిడి మనస్సుమీద చాలా ఉంటుంది. సంఘజీవి అయిన ప్రతీమనిషికీ మనస్సులో ఈ ఒత్తిడి తప్పదు. నాగరకత ప్రబలినకొద్దీ ఈ అతృప్తవాంఛల బలం ఎక్కువవుతుంది. వీటికి సహజమయిన సంతృప్తి సామాజిక జీవితంలో లభించడం అసంభవం. అంచేత ఊహాప్రపంచకంలోకి ఈ వాంఛలను ఔదాత్త్యంచేసి మనిషి ఈ ఒత్తిడిని తగ్గించుకుంటాడు. ఈ విధానాన్ని ఆధునిక మనశ్శాస్త్రజ్ఞులు Sublimation అంటారు. మన ఆదర్శాలన్నీ ఈ రకంగా ఏర్పడ్డవే. ఫ్రాయిడ్ తన మనఃపరిశీలనా సూత్రాలలో మాతృప్రేమ, పితృప్రేమ, దైవభక్తి మొదలయిన మానసికమయిన ఆదర్శాలన్నిటికీ కొన్ని ప్రాథమిక శారీరక వాంఛలు మూలంగా ఉంటాయనీ, అవి అజ్ఞాతంగా మనస్సులో అణగిఉన్న కారణంచేత అవి ఉన్నట్టుగా మనిషి గుర్తించనేలేడనీ, వాటి ఒత్తిడిని తీర్చుకోడానికి ఊహాలోకంలో కొన్ని ఉద్వేగప్రాధాన్యం గల ఆదర్శాలను నిర్మించుకుంటాడనీ నిర్ధారణచేస్తాడు. సాహిత్యం ఈ ఒత్తిడిని చాలావరకు తగ్గిస్తుంది. లౌకికమయిన నీతివల్ల ఏవాంఛలయితే అణగిపోతున్నాయో, వాటికి కళలో —ముఖ్యంగా సాహిత్యంలో వ్యక్తీకరణం జరుగుతుంది. తద్వారా చదువరికి ఉద్వేగం ప్రవహించి మనస్సులోని ఒత్తిడి తగ్గుతుంది. మనస్సుయొక్క ఆరోగ్యం కాపాడడానికి, అజ్ఞాతవాంఛలకు అనుబంధించి మనస్సులో పెరిగే ఉద్వేగపు ఒత్తిడి ఇంకోరకంగా తగ్గవలసిన అవసరం ఉంది. ఆ గొప్ప అవసరాన్ని సాహిత్యం తీరుస్తోంది. అంచేత మనిషి సాహిత్యం ప్రధానకృషిగా అంగీకరించి గౌరవిస్తున్నాడు.

ఒక్కొక్క యుగంలో సంఘవ్యవస్థలో ఏర్పడ్డ పరస్పర సంఘర్షణలవల్ల సర్వసామాన్యమయిన అశాంతి పుడుతుంది. సంఘవ్యవస్థ పాత నీతిశాస్త్రంతో సహా మారిపోతేగాని ఈ అశాంతి తగ్గని పరిస్థితి ఒకటి ఏర్పడుతుంది. అల్లాంటి సమయాల్లో ఈ అశాంతి కేవలమూ అజ్ఞాతంగా ఉండదు. అందులో నవ్యనాగరకతతో పెరిగిన విచక్షణకు నిజంగా ఏ విషయమూ కూడా చిరకాలం అజ్ఞాతంగా ఉండలేదు. అంచేత కొంతమందిలో ఈ అశాంతియొక్క నిజస్వరూపం కొంతవరకూ వ్యక్తమయితీరుతుంది. అప్పుడు మానవకృషులన్నీ ఏకముఖంగా పనిచేసి ఈ సర్వ సామాన్యమయిన అశాంతిని తీర్చడానికి ప్రయత్నించాలని మేధావులు గ్రహిస్తారు. ఇది అల్లాంటి యుగం అనడానికి ఏమీ సందేహం లేదు. ప్రస్తుతం సాహిత్యం ఈ అవసరాన్ని తీర్చడానికి వినియోగపడాలని కొంచెం ఇంచుమించుగా విద్యావంతులందరూ కోరుతున్నారు. సాహిత్యంయొక్క ప్రథమప్రయోజనం ఇది అంటున్నారు.

ఈ ప్రయోజనాన్ని నెరవేర్చే సాహిత్యమే అభ్యుదయ సాహిత్యం అవుతుంది. అభ్యుదయ సాహిత్యానికి ఎవరు ఏ నిర్వచనాన్ని ఇచ్చినా, అది నెరవేర్చవలసిన ప్రయోజనాన్ని గురించి అట్టే భేదాభిప్రాయాలు లేవు.

ఈనాడు మనం ప్రాచీన సాహిత్యాన్ని ఈ దృష్టితో పరీక్షచేస్తున్నాం. దానితో కొంత వివాదాస్పదమయిన రంగంలోకి దిగుతున్నాం. మనకి నిజంగా కావలసింది వర్తమానంలోనూ, అద్యతనభావిలోనూ సాహిత్యం నెరవేర్చవలసిన ప్రయోజనం. వెనుకటి కాలంలో సాహిత్యాన్ని ఈనాడు మన కొలబద్దలతో కొలవడం అప్రస్తుతం, నిష్ప్రయోజనమున్నూ. ఇంకో విషయం. ఈ నాడుకూడా ఈ ప్రథమ కర్తవ్యాన్ని మరిచిపోయి తన వ్యక్తిగతమయిన అశాంతిని వ్యక్తీకరించే కవిని విమర్శించీ లాభంలేదు. ప్రయోజనంమాట అటుంచి కవితాశిల్పం విశిష్టంగా గనక ఉన్నట్టయితే ఆరచన సాహిత్యంలో చేరితీరుతుంది. పాశ్చాత్య వాఙ్మయాలలో ముఖ్యంగా ఈ శతాబ్దంలో బయలుదేరిన రకరకాల కవితారీతులు—జార్జిజమ్, ఇంప్రెషనిజమ్ మొదలుకొని అధివాస్తవికతవరకూ అన్నీ కూడా శిల్పవిశిష్టతవల్ల సాహిత్యంలో స్థానాన్ని సంపాదించుకొని తీరాయి.

వైజ్ఞానికకృషి, కళ భిన్నభిన్న పథాలనుబట్టి సామాజిక పరిణామం అభివృద్ధిచెందినకొద్దీ దూరంగా విడిపోతూ వచ్చాయి. పూర్వకాలంలో కవి ఆనాటికి గొప్ప మేధావికూడాను. ఆనాటి విజ్ఞానం అతనిలో మూర్తీభవించి ఉండేది. కాని కాలక్రమేణ కళ కొన్ని సాంప్రదాయాలమధ్య పెరుగుతూవచ్చింది. రెండో పక్కని విజ్ఞానం అనంతంగా పెరిగిపోతూ వచ్చింది. కాని మొన్నమొన్నటివరకూ కవి సమాజాన్నించి విడిపోయి తన లోపలి లోపలికి ముడుచుకుపోలేదు. కాల్పనిక జగత్తని ఒకదాన్ని నిర్మించుకుని అందులోనే నిత్యమూ మానసికంగా విహరించిన షెల్లీకూడా కవులను Unacknowledged Legislators of the World గా జమకట్టాడు. ఆనాటికి ఇంకా కవికి తనలోనూ, మానవ సమాజంలోనూ నమ్మకం పూర్తిగా పోలేదు.

విజ్ఞానం అనంతంగా పెరిగి, భయపెట్టేటన్ని సమస్యలను సమాజంలోకి తెచ్చింది. నవ్యనాగరకతలో పరస్పరమూ నాశనంచేసుకునే శక్తులు పుట్టుకుని వచ్చాయి. పాత సంఘవ్యవస్థ వైజ్ఞానిక పరిశోధనా ఫలితాలను సవ్యంగా ఇముడ్చుకోలేకపోయింది. ఈ కల్లోలంలో పడిన కవులకు ఏది మంచో, ఏది చెడ్డో తేల్చుకోడానికి సావకాశం లేకపోయింది. రెండో పక్కని వైదాంతికంగానూ, సామాజికంగానూ వాస్తవిక జ్ఞానాన్ని సంపాదించుకుని ఈ క్లిష్టపరిస్థితిలోనించి సమాజాన్ని ఉద్ధరించడానికి బాధ్యత వహించిన చదువుకున్న మేధావులు ప్రబలమైన భావోద్యమాన్ని లేవదీశారు. వారి నిశితపరీక్షకు అన్ని విషయాలూ గురికాక తప్పిందికాదు. ఆసందర్భంలో విలువలనుగురించీ, ప్రతీకృషియొక్క ప్రయోజనాన్ని గురించీ విచక్షణ వచ్చింది. అభ్యుదయ సాహిత్యము అనే నినాదం అసలు అక్కడ పుట్టింది.

ప్రొఫెసర్ లాస్కీ Faith, Reason and Civilization అనే పుస్తకంలో ఆంగ్లంలోని నవ్యకవిత్వరీతుల్ని చాలా నిశితంగా విమర్శించాడు. Neoclasicism అనీ, అధివాస్తవికత అనీ రకరకాల పేర్లతో వెలువడుతున్న సాహిత్యాన్ని గురించి అతను అవన్నీ మేధస్సును దుర్వినియోగపరచడమని అంటాడు. అతని వాదం చాలా బలమయినది. రాజకీయంగానూ, ఆర్థికంగానూ లోకం అల్లకల్లోలంలో పడి ఉన్న సమయంలో ఒక సాంకేతికమయిన భాషలో తమబోటి కొద్దిమందికే బోధపడే రచనలు రాసుకుంటూ ఆనందిస్తున్నా మనుకోడం ద్రోహమని అతను అంటాడు. నిజానికి రచయితలు కొంచెం సుఖంమరిగిన వారు వారికి ఆస్తిపాస్తులు లేకపోయినా, వ్యక్తిపరంగా చాలా సంకుచితమయిన స్వార్థం వారికి ఉంటుంది. డబ్బున్నవాళ్లు వారిని చేరదీసిన ట్టయితే వారికి ఇంక సంఘంగొడవ అక్కర్లేదు. ఆ చేరదీసినవారికి కృతజ్ఞులై తమ లోకంలో తాము మునిగిపోయిఉంటారు. వారికి తమ ప్రాధాన్యమును గురించిన అహంకారం ఒకటి ఉంటుంది. వారు 'సున్నితమయిన' వారని వారి అభిప్రాయం. సమాజం వారిని ఆదరించాలి. కాని ఈ శతాబ్దంలో ఈ రెండు యుద్ధాల కీమధ్య, పాపం, సమాజానికి వారిని తగినంతగా ఆదరించడానికి తగిన తీరిక లేకపోయింది. అంచేత సమాజంమీాద కసితీర్చుకోడానికిలాగ వారు చిత్రచిత్రమయిన ధోరణులు

ప్రారంభించారు. తాముకూడా సమాజంలో భాగాలుగా వారు దానితో ముందుకి నడవలేదు. మానవత్వంలోని విశ్వాసాన్ని వారు నిలుపుకోలేక పోయారు.

కాని ఈ రెండు యుద్ధాలకూ మధ్య నవలలు, కథలు, నాటకాలు యీరకపులో చాలా తయారు అయాయి. వాటిలోనూ అక్కడక్కడ ఈ పైనిచెప్పిన పోకడలున్నా వారు వాస్తవికలోకాన్ని సానుభూతితో చిత్రించడమే ప్రథమకర్తవ్యంగా పెట్టుకున్నారు. వాస్తవిక లోకపు సమస్యలతో అంతరంగికమయిన జోక్యం కల్పించుకుని కొంతమంది హృదయపూర్వకంగా లోకంలోకి దిగి దానితో సాహచర్యాన్ని సంపాదించుకున్నారు. సమాజంయొక్క భావిని గురించి వారికి సందేహాలేమీ లేవు. మానవత్వం చివరకి నెగ్గి తీరుతుందనే నమ్మకం వారికి ఉంది. అంచేత వారి రచనలలో ఏరకమయిన సాంకేతికములూ ఉండవు. విశాలమయిన లోకరంగం వారి కథావస్తువు. ఈ రకపు సాహిత్యాన్ని ఇప్పుడు అభ్యుదయ సాహిత్యమని అంటున్నారు.

అసలయిన మార్క్సు దృక్పథంతో చూస్తే ఆధ్యాత్మికదృష్టితో వ్రాసిన సాహిత్యమంతా అభ్యుదయనిరోధక మనే అనాలి. ఆ లెక్కని టాగూరు రచనలు అభ్యుదయనిరోధకాలు. అల్లాంటి కవిత్వాన్ని మార్క్సు చాలా తీవ్రంగా విమర్శించాడు. లెనిన్ అంతకంటే కఠినంగానూ, సూటిగానూ చెప్పాడు. అయినా సాహిత్యవిమర్శలో పూర్తిగా ఈరకంగా విలువకట్టడం సరియయినది కాదు. కారణ మేమంటే, సాహిత్యం మనిషియొక్క తార్కికదృష్టినించి జనించినది కాదు. అంచేత దానిలో నొక్కిచెప్పబడిన విషయాలు చదివినవాళ్లంతా నమ్ముతారనే నమ్మకం లేదు. ఈమధ్య ఒక రష్యన్ విమర్శకుడు టాల్‌స్టాయి రచనలు నిజంగా ప్రజాభ్యుదయానికి తోడ్పడ్డాయని అన్నాడు. అతడు చెప్పిన కారణం ఏమంటే - సంఘం అతని నమ్మకాలకూ, ఆశయాలకూ అనుగుణంగా మారలేదు. అతను ఏ వేదాంతాన్నయితే బోధించాడో దాన్ని పూర్తిగా రష్యాలో మరిచిపోయారు. అయినా అతని రచనలు ఈనాడు మళ్లీ కుతూహలంతో ప్రజలు చదివి ఆనందిస్తున్నారు. వాటిల్లో సాహిత్యదృష్టినించి ప్రధానమయిన ఆకర్షణ ఉండితీరింది. వాటిలో ఆనాటి సంఘాన్నంతటినీ కలవరపరిచిన అశాంతిస్పష్టంగా చిత్రించబడింది. అదే వాటి ఉత్కృష్టత.

అభ్యుదయసాహిత్యానికి ఏది ప్రయోజనంగా ఉండాలో కొంచెం ఇంచుమించుగా తేలినా, ఎల్లాంటి సాహిత్యం ఆ ప్రయోజనాన్ని నెరవేరుస్తుందో చెప్పడం సాధ్యంకాదు. కూలివాడి మీద, కర్షకుడి మీద ఈమధ్య వ్రాయబడుతున్న రకరకాల పద్యాలూ, పాటలూ వాళ్లమీద సానుభూతి పుట్టించడం లేదు సరిగదా, సాహిత్యంమీద వెగటు పుట్టిస్తున్నాయి. వాటిలో సాహిత్యానికి అవసరమయిన శిల్పం పూర్తిగా లోపించడం జరుగుతోంది. అంచేత సాహిత్యం కావాలంటే ప్రధానంగా ఉండవలిసింది శిల్పం. ఆ శిల్పం ద్వారా నేటి యుగానికి సామాన్యమయిన అశాంతిని వ్యక్తీకరించేది అభ్యుదయసాహిత్యం అయితీరుతుంది. కాని శిల్పం ఒక్కటే కరడుగట్టి, తమకే తెలియని 'అనుభూతులను' మేధావులయినవారికే అర్థంకానట్టు వ్రాసే కవులు మాత్రం బూజుకట్టిపోతారు. ఎందుకంటే చదువుకున్నవారే వారివేపు చూడరు.

కవి అనబడేఅతని తత్వానికి చెందిన విషయం ఒకటుంది. ఇందాకా చెప్పినట్టు అతనికి కాస్త సుఖం అలవాటు. పద్యాలలో విప్లవాన్ని గురించి అద్భుతంగా వ్రాసినా, వాస్తవికమయిన విప్లవం అంటే అతనికి భయం. మామూలు జనాభాని చూస్తే అతనికి అసహ్యం, భయం. ఈ జనాభా అనేది ఇప్పుడొక పెద్ద శక్తిగా తయారవుతోంది. దాన్ని చూసి బెదిరిపోకుండా దానితో సాహచర్యం నిర్మించుకున్న రచయిత ఏది వ్రాసినా అది అభ్యుదయరచనే అవుతుంది. అటువంటి రచనలు విరివిగా ఇంకా ఈ దేశంలో రావడం లేదు. ఇప్పుడు అమలులో ఉన్న 'వాస్తవికరచనలు' నిజంగా వాస్తవికాలు కావు. అవి రచయితల అభిమానాలని పురస్కరించుకుని ఊహలలో పుట్టినవి. కూలివాళ్లయెడల, రైతులయెడల అనురాగాన్ని ప్రదర్శించడంతోటే, వాళ్లని దేవతల్లాగ వర్ణించడంతోటే అవి ఆఖరు అవుతున్నాయి. నిజంగా కూలివాడికి ఆ చిత్రణ అసలు బోధపడదు. నాగరకులకు అవి నచ్చవు. అంచేత అభ్యుదయకరమయిన ఊహలకు అవి ప్రచారాన్నికూడా చెయ్యలేవు.

అంచేత అభ్యుదయకరమనుకున్న కొన్ని సూత్రాలను ప్రతిపాదించినంతమాత్రాన్ని అది అభ్యుదయ సాహిత్యం అవదు. ప్రచారానికి ఉపయోగించే రచనలు కొన్ని వేరే ఉంటాయనీ, సాహిత్యం వేరనీ, రెంటికీ స్వరూపంలోనే భేదం ఉంటుందనీ కొందరు రచయితలు అంటున్నారు. ఇందులో కొంత సత్యం లేకపోలేదుగాని, కేవలతార్కికంగా ఈ విషయాన్ని ఒప్పుకోడానికి వీలులేదు. ప్రచారంకోసం వ్రాసినా, ఇంకెందుకు వ్రాసినా, చివరకి ఉపన్యాసాల కోసం వ్రాసినా, అందులో శిల్పవైశిష్ట్యం ఉంటే అదిసాహిత్యంలో చేరితీరుతుంది. బర్క్ ఉపన్యాసాలను ఈనాడు ఉత్తమ సాహిత్యశ్రేణిలో చేర్చి చదువుతున్నారు. అంచేత ఇన్నీ చెప్పినతరువాత సాహిత్యం శిల్ప ప్రధాన మయినది. ఆపరీక్షను బట్టే ఏరచనయినా సాహిత్యంలో చేరడమో, చేరకపోవడమో జరుగుతుంది.

ఇన్నీ చెప్పినతర్వాత సాహిత్యం వ్యక్తుల అంతరంగాలను ఆశ్రయించినది. రచయిత తన చేతనయినట్టు వ్రాస్తాడు. సాహిత్యంలో ఆ రచనయొక్క స్థానం కొంత నెమ్మదిమీద నిర్ణయించబడుతుంది. ఈ నాడు మనను కలవరపరుస్తున్న సమస్యల ఒత్తిడిలో నిజంగా మనం నిష్పాక్షికంగా విలువలు కట్టలేము. మనకి సాహిత్యం కంటే ముఖ్యావసరాలు కొన్ని కళ్ళకుకట్టినట్లు కనపడుతున్నాయి. ఆ అవసరాలను తీర్చుకోడానికి పెద్ద సంఘర్షణ ప్రారంభమయింది. ఈ యుద్ధమధ్యంలో సాహిత్యం మన పక్షాన్ని నిలబడి హెచ్చరించాలని కోరడం సహజం. రచయితలు ఈనాడు ఆ బాధ్యతను వహించడం న్యాయం, విధీ కూడాను. నిజంగా రచయిత అయినవాడు వ్రాసింది సాహిత్యమూ అవుతుంది, అభ్యుదయ సాహిత్యమూ అవుతుంది. కాని కొన్ని సూత్రాలచుట్టూ సాహిత్యం ఎప్పుడూ సృష్టికాదు. సాహిత్యంయొక్క అందం దాని వైవిధ్యంలో వుంది. రచయిత తనకు సహజంగా వున్న రంగును గనుక పోగొట్టుకుంటే సాహిత్యం చచ్చిపోతుంది. మానవ సమాజంయొక్క అభ్యుదయం ముఖ్యావసరం. దానికి దోహదం చేసిన ప్రతీరచనా అభ్యుదయ సాహిత్యమే. ఈ నాడు నిజమయిన సాహిత్యం ఏది వచ్చినా అది అభ్యుదయ సాహిత్యమే అవుతుంది. అభ్యుదయ నిరోధకమయినది సాహిత్యమే కాదు.



అన్నమాంబ విశ్వదాంపత్యోపనిషత్తు

కొమ్మనదండనాథుని దశాహస్సు*

●

= శ్రీ పున్నవ లక్ష్మీనారాయణ =

●

పాత్రలు

కొమ్మనదండనాథుడు—తిక్కనతండ్రి; నెల్లూరి ప్రభువగు మనుమసిద్ధిపాలనలో గుంటూరికి దండనాథుడు; మహాపండితుడు; అధ్యయనపరుడు; వీరుడు; సారంగునితో మనుమసిద్ధికి ఒంగోలులో జరిగిన యుద్ధములో సేనాపతిగా ఉండి విజయమును గాంచి వీరమరణమును బొందినాడు.

అన్నమాంబ—కొమ్మనదండనాథుని భార్య; తిక్కనతల్లి.

సీతమ్మ—తిక్కనభార్య.

దోహత్తనారాయణ—ఖడ్గతిక్కన తమ్ముడు; కొమ్మన శిష్యుడు.

అన్నయమంత్రి—వరంగల్లునుంచి వచ్చిన రాయబారి.

ఆ వేళ పదోరోజు. బంధువులంతా అన్నమాంబమొగం చూడడంకోసము వస్తున్నారు. సీతమ్మ కాపురానికి వచ్చిన కొత్తలో అన్నమాంబకు పెండ్లీడువచ్చిన ఒక్క ఆడపిల్లా పోయింది. సీతమ్మ "అత్తయ్యా - అత్తయ్యా" అంటూ తలలో నాలుకలాగు వదలకుండా వెంటదిరుగుతూ పుత్రికాశోకాన్ని మరిపించింది. చూచినవాండ్లు తల్లీ, బిడ్డా అనుకుంటారుగాని అత్తా, కోడలూ అని అనుకోరు. తిక్కనకు నెల్లూరిలో ఉద్యోగమయిన కొత్తలో తల్లిని వదిలి అత్తవారింటికి పోయినట్టుగా గుంటూరునుంచి నెల్లూరు పోయింది. సంవత్సరానికి ఒక మాటయినా తల్లిని చూడడానికి పోకపోయినా మర్లుబట్టినట్లు అత్తా, కోడలూ ఒకరినొకరు చూచుకోకుండా ఉండలేకపోయేవారు. సీతమ్మతల్లి "నా బిడ్డకు మందు పెట్టి నాకు గాకుండా చేసిం"దని వియ్యపురాలిని హాస్యమాడేది. ఈసారి వచ్చినప్పటినుంచీ అత్తను నిమిషము వదిలిపెట్టకుండా పక్కలోనే, మీద చేయివేసుకొని పడుకొనేది. ఈరోజు పుదయం నుంచీ పక్కన కూర్చొని, మొగమువంక చూస్తూ, ఏకధారగా కండ్ల నీరు గారుస్తూ కూర్చున్నది.

అన్నమాంబ—అదేమిటే పిచ్చిపిల్లా! ఒక్కమోయిన కండ్ల నీళ్లు పెట్టుకుంటూ కూర్చుంటావు. కండ్లకు అవరోధము గాదూ?

"నీ పునిస్త్రీమొగము ఈ జన్మానికి ఇక మళ్లీ చూడనుగా అత్తయ్యా" అని సీతమ్మ పెద్ద పెట్టున ఏడ్చింది.

అంతలోకే తిక్కనా, దోహత్తనారాయణా గదిలోకివచ్చారు.

అన్నమాంబ—నాయనా వచ్చావుటరా దోహత్తా! వీడు అందరికంటె కట్టింపుపాఠాలు తీసుకొని ఎక్కడా నట్లుపోకుండా వొప్పజెప్పుతూంటే మురుసుకొనేవారు. అనధ్యయనపు రోజుల్లో గూడా ఏవో పాఠా లిస్తుంటే 'విశ్రాంతిలేకపోతే వాడికి జబ్బు చేయదా' అని నేనంటే 'వాడికేమీ జబ్బుచేయదు. అట్లా అనబోకు. నిజంగా జబ్బు చేస్తుంది' అనేవారు. పాఠాలు చెప్పడమంటే అలుపు ఎన్నడూ లేదు. ఇక్కడికి యాభైయేండ్లనుంచి విధీ విరామం లేకుండా ఒక్క తీరాన పాఠాలు చెప్పిన నోరు మూతబడ్డది. ఆ చదువుకొన్న చదువంతా ఏమట్టిపాలయిందో?

కడపటిమాట తిక్కనకు శూలమైతాకింది. దోహత్త తిక్కన మొగం చూచాడు. తండ్రి మరణమువలన సృష్టివిధానమును గూర్చిన ఆయనవిశ్వాసము కెన్నిటికో పాదుకదిలిందని యెరుగడు.

---

* ఇది 'తిక్కన' అను పేర శ్రీ పున్నవ లక్ష్మీనారాయణ గారు వ్రాసియుండు నవలలో ౫, 6 అధ్యాయముల గ్రంథము.

తిక్కన—ఒరే నారాయణా! మతసిద్ధాంతములను గూర్చి నాన్నగారు తరుచుగా వెల్లడిచేస్తూవచ్చిన అభిప్రాయాలు కొన్ని నాకు క్రొత్తగా కనుపడేవి. మీ రిద్దరూ ఏకీభవిస్తుండేవాండ్లు. ఈపది రోజులలో నా అభిప్రాయాలలో నా తలవెంట్రుకలన్ని మార్పులు వచ్చినవి. ఏదో సందేహం కలగడం, నివర్తికావడం దానంతట అదే అవుతున్నది.

దోహర్త—శుద్ధసత్వబుద్ధులకు సందేహాలు భగవంతుడే కలిగిస్తాడు. సమాధానాలూ ఆయనే చెపుతాడు.

తిక్కన—ఇదివర కిట్లా సమాధానాలు రావడంలేదు.

దోహర్త—భగవంతు డీమధ్యనే మీకు సత్వబుద్ధి ప్రసాదించి వుంటాడు.

తిక్కన—ప్రత్యేక పరిస్థితు లేమి వచ్చినవి?

దోహర్త—నిన్న మన దొడ్లో మామిడి యీయేడు పూతకు వస్తుందిరా అంటిరే. మామిడి పూతకువస్తుంది. కోడి కూతకువస్తుంది. లేడి యీతకు వస్తుంది.

తిక్కన—కాలము. పక్వంచేస్తుంది.

దోహర్త—భగవానుడు పక్వంచేస్తాడు.

తిక్కన—కాలస్వరూపిణియై శక్తి చేస్తుంది.

దోహర్త—భగవంతుడు లేకుండానా?

తిక్కన—భగవంతుడు ద్రష్టగా వుంటాడు. చూస్తూవుంటే సృష్టి అయిపోతూవుంటుంది.

దోహర్త—ఆయన చూస్తూవుండకపోతేనో?

తిక్కన—బండి ఆగుతుంది.

దోహర్త—మీరు రోజూ మామిడిచెట్టువంక చూస్తున్నారు. అది పెరుగుతున్నది. పరబ్రహ్మముకూడా చూస్తూవున్నాడు. అది పెరుగుతున్నది. రెండుచూపులూ ఒకటేనా?

తిక్కన—నాది వట్టిచూపు.

దోహర్త—మీరు కండ్లుపెట్టుకొని చూచినా అది పెరగడంలేదు. పరబ్రహ్మ కండ్లులేకుండా చూచినా అది పెరుగుతున్నది.

తిక్కన—ఆయనవిషయములో చూస్తున్నాడనే ధాతువుకు చేస్తున్నాడనే అర్థము.

దోహర్త—చేస్తున్నాడని అనకుండా ద్రష్ట అని ఇంకొక మాట ఉపయోగించినంతమాత్రంచేత చేయనట్లు అర్థం కాదు. నా ఉద్దేశములో గౌడపాదుని అజాతవాదానికి కాళ్లు లేవు. ఒక వస్తువును చేయడమంటే రోట్లో వేసి దంచిచేస్తేనే చేయడంగాదు. ఎట్లా చేసినా చేసినట్లే. ద్రష్టగా వుండి చేయడం చేసేవిధములలో భేదం.

తిక్కన—శక్తి చేస్తుంది.

దోహర్త—ఎవరి శక్తి?

తిక్కన—శక్తి కలహాదిది.

దోహర్త—ఆ శక్తు డెవరు? పరమాత్మ శక్తుడయితే శక్తి చేసిందన్నా, పరమాత్మచేశాడన్నా ఒకటే.

ఇటువంటి వాదములలోకి దిగితే దోహర్త తిక్కన విషయాలు మరచిపోతాడని తిక్కనకు తెలుసును. తానూ ఆదారినే కొంతసేపు పోయినాడు. అక్కడ తిప్పుకొని తల్లివంక తిరిగి 'అమ్మ' అని పిలిచాడు.

అన్న—ఆపా రేమిరా? మీ నాన్నగారి మాటలు వింటూ వున్నట్లున్నది.

తిక్కన—ఈభావాలన్నీ వారివే. వారికి నూతనభావాలు స్థిరపడి వెల్లడించేటప్పటికి నేను నెల్లూరు వెళ్లిపోయినాను. బాగా మున్మురపురోజులలో వీ డాయనదగ్గర భావ్యశుద్ధి చేసుకున్నాడు. వీడు మొదటినుంచీకూడా తిక్కతర్కాలు చేస్తూనేవుండేవాడు. ఇప్పుడు పెద్ద సిద్ధాంతి అయినాడు. మమ్మును వాదములో నెల కట్టనీయడు.

అన్న—వాడిని ఆశీర్వదించు. మంచి ఉద్యోగముకూడ దొరికింది. దేవుడిచ్చిన ఆయువు తిన్నగా వుంటే వాడే ప్రథమ్నడవుతాడు.

దోహర్త—చిన్నమ్మ! ఇదంతా నీచలవేనే.

అన్న—కానియ్యి నాయనా! నాకథ ముగిసిందిగదా. ఇక రోజులు లెక్కపెట్టుకుంటూ కాలంకోసం కనిపెట్టుకొనివుంటా.

దోహర్త—చిన్నమ్మ! నీవు పండిపోయినావే.

అన్న—ఇక ఎండి రాలుతాను.

తిక్కన విభ్రమపడి వింటున్నాడు. పండి, ఎండి, రాలడమనే మాటలు అనేకభావాలు తోపిస్తూ మనస్సును తొలుస్తున్నవి.

తిక్కన—అమ్మ! ఇవ్వాళ పదవ రోజు. జరుగవలసిన పనేమిటి?

అన్న—(కొంతసే పాలోచించి) మీరిద్దరూకూడ ఇక్కడే వున్నారు. నాకు మీ నాన్నగారు పోయినా రనే భావమే లేదు. సహగమనము చేయవలె నని అప్పుడు తోచిందిగాని అంత తీవ్రత ఇప్పుడు లేదు. భగవానుని అర్ధనారీశ్వరత్వం తరుచుగా సృష్టికి వస్తున్నది. భార్యాభర్తలు రెండు వ్యక్తులు గారు. మానవునియొక్క కుడిభాగము పాదరసపదార్థము; ఎడమభాగము గంధకద్రవ్యము. పురుషస్త్రీసమ్మేళనములో ఏద్రవ్యము బలవత్తరమో ఆరూపము సువ్యక్తమవుతుంది. ఏకశక్తి ముఖద్వయములో జన్మించి మార్గద్వయమున ఆత్మోపలబ్ధిని పొంది పూర్ణత్వమును చెందుతుంది. వీటికి పూర్తిగా ఎడబాటు లేదు. ఉభయులును స్థూలశరీరములలోనే ఉండవలసిన అవసరము లేదు. ఆరూపముయొక్క ఛాయే నేను. నే నెల్లప్పుడును సువాసినినే. వైధవ్యమే లేదు నాకు.

తిక్కన—నా కందరేదే తల్లీ నీ వున్నతభావాలు!

అన్న—పురుషునికీ, ప్రకృతికీ సత్యత్వములో భేదా వుండవచ్చునుగాని నిత్యత్వములో లేదుగదా.

తిక్కన—అవును.

అన్న—సదసత్తులకు ఎడబాటు ఎక్కడ వున్నది?

దౌహిత్రి—సాంఖ్యదృష్టిలో చూచినా లేదు. వేదాంత దృష్టితో చూచినా లేదు.

తిక్కన—అంతవరకు అవగాహన అయింది.

అన్న—ప్రకృతికి అనాదత్వ మెప్పటికీ లేదు. ఈ జంట అరూపస్థితినుంచి సరూపస్థితిని పొందుతుంది.

దౌహిత్రి—అద్భుతమయిన రూపమును దాలుస్తుంది.

అన్న—అద్భుతమే. లోపలనున్నదే వ్యక్తమయింది. మరె యొకచోటినుంచి రాదు.

తిక్కన—అది లీలగదా.

అన్న—లీలలో ఆనంద ముండదా?

తిక్కన—ఎవరికి ఆనందం?

అన్న—ఎవరికి లీలో వారికే ఆనందం.

అన్నయమంత్రి—(గదివాకిట్లోనుండి)

"నేను అన్నయ్యను. అమ్మగారి సెలవయితే వారి దర్శనం కొరకు లోపలకు రావలెనని బయట నిలుచున్నాను. మీ యందరి సంభాషణను విన్నాను. ఇక ఆగలేను. సెలవిప్పించండి: లోపలికి వస్తాను. నా అమ్మదగ్గరకు నేనుమాత్ర మెందుకు రాకూడదు?"

తిక్కన తల్లివంక చూచాడు. ఆమెకు ఆక్షేపణ లేనట్లు తోచింది.

తిక్కన—అయ్యో! తమరు రావడాని కేమాక్షేపణున్నది? దయచేయండి లోపలికి.

అన్నయ్య—ధన్యోస్మి.

అని లోపలికి వచ్చి ఉత్తరీయము నడుమునకు జుట్టుకొని అన్నమాంబకు సాష్టాంగనమస్కారము చేసి చెంపలు వేసుకొని కూర్చున్నాడు.

తిక్కన—ఇంతవరకు సంభాషణంతా విన్నారుగనుక ఇక్కడనుంచే సాగింతాం.

అన్నయ్య—లీల ఎవరిదో ఆనందమూ వారిదేనని దౌహిత్రిగారన్నారు.

అన్న—కనిపెంచిన తలిదండ్రుల కానంద ముండదా?

దౌహిత్రి—వుంటుంది. పిల్లలు చస్తే వుండదు.

అన్న—ఒరే నారాయణా!...ఇప్పుడు దౌహిత్రివు గామాతె. బాణాలు రెండుచేతులా విసిరి దౌహిత్రిబిరుదు సంపాదించావు. వాదములోగూడా అంతే నీవు. అయినా నేను మొదటిపేరుతోనే పిలుస్తాను.

సృష్టిలో చావులేదు. లయము లేనేలేదు. ఈ విశ్వమాతాపితలు అంత తెలివితక్కువవాండ్లూ, చేతగానివాండ్లూ కారు. అట్టి తెలివి తక్కువ పని చేయరు. సంపూర్ణదృష్టి లేక సృష్టిస్థితిలయము లని అనుకుంటాము. ఏమనుకున్నా గమ్యస్థానమువంక నడుస్తూనే వుంటాము. మన అభిప్రాయాలనుబట్టి సృష్టిక్రమము మారదు. గమ్యస్థానము వంక నడుస్తూనే వుంటాము మెల్లవరుసన.

దౌహిత్రి—దీనివలన విశ్వపితలకు అనుభవ ముండదా?

అన్న—ఉంటుంది. ఆనందానుభవము. నీవే అంటివిగా!

తిక్కన—సృష్టిలేకుండా వారి కనుభవము రాదా!

అన్న—ఈ అనుభవము రాదు. అనుభవములేకుండా ఏ అనుభవమూ రాదు. అది అసంభవము. స్వవచనవ్యాఘాతము.

తిక్కన—నిష్కామకర్మ అయితేనో?

దౌహిత్రి—నిష్కామకర్మ విషయములో కోరికలేదన్నారు గాని అందువల్ల అనుభవము లేదనలేదు.

అన్న—చాలా శాఖాచంక్రమణ మయింది. అసలు విషయానికి వత్తాము. నలుగురూ ఏమయినా అనుకుంటారేమో నని లోకాచారము జరుపుకుంటే జరుపుకోవచ్చును.

దౌహిత్రి—వపనము కర్మకాండలో భాగము కాదు. వూరి బయటికి పోయి మంగలికి తలయియ్యడం అసహ్యం.

తిక్కన—శ్రీమద్రామానుజాలు వపనము చేయించుకొన్న స్త్రీని చూస్తే సచేలస్నానము చేయవలసిందన్నారు.

అన్నయ్య—బసవేశ్వరులు కూడ అంగీకరించలేదు.

అన్న—ఊరి బయటికి పోకుండా యిక్కడే జరుపుకోవచ్చు. విశేషచర్చ లేకుండా కానియ్యండి. నా భావములో నేను నిత్య సువాసినినే.

ముగ్గురూ బయటికి వస్తారు!


తల్లితో మాట్లాడి యివతలకు వచ్చినతరువాత ఆమె వ్యక్త పరచిన పురుషప్రకృతుల నిత్యదాంపత్య లీలాసిద్ధాంతము తన మనోనేత్రమునకు మఱుగుపడియున్న ఒక నూతన విజ్ఞానప్రపంచమునకు కవాటము బార్లా తెరచి ప్రదర్శించినట్లయింది. ఆ ప్రపంచానికి ఎటుజూచినా అంతు కనపడలేదు. "పాదోస్య విశ్వా భూతాని, త్రిపాదస్యామృతం దివి" అని పురుషసూక్తములో చెప్పినట్లు మూడుభాగములు యథాప్రకారముగా నుండి నాలుగవ భాగము మాత్రము ఈ సమస్తము నైనది. "ఏతావా నస్య మహిమా"—ఇది ఆయన మహిమట. అని తనలో తాను పైకి వినబడేటట్లు అనుకుంటూ వస్తున్నాడు తిక్కన.


దౌహిత్రి—ఏమిటన్నయ్యా యోచిస్తున్నావు? చిన్నమ్మ చెప్పినదానిమీదనేనా యీ ఆలోచన?

అన్నయ్య—సృష్టి యావత్తూ పరమాత్మునియొక్క వ్యక్త అర్ధనారీశ్వరరూపమేనని వ్యక్తపరచారామె.

దౌహిత్రి—ఇది అంతయూ ఆయనయొక్క మహిమ అని ఎందుకన్నారు?

అన్నమాంబ—ఒరే నారాయణా! ఆ మాటలు ఇక్కడే మాట్లాడుకోరాదా? నేను కూడా వింటాను.


రాజకుమారి తనకు
లక్సు టాయిలెట్ సబ్బు
సులభమైన సౌందర్యసాధన
మెట్లయినదో
చెప్పుచున్నది
లక్సు టాయిలెట్ సబ్బు యొక్కనురుగు బాగాతెప్పించి నాచర్మములోనికి నెమ్మదిగా అదుముకొనెదను.
వెచ్చటి నురుగంతయు స్వచ్ఛమైన చన్నీళ్లలో కడుగుకొనెదను...
ఆపిదప మృదువైన తువ్వాలుతో తడిపోవునట్లు నెమ్మదిగా ముఖమును ఒత్తుకొనెదను
LUX TOILET SOAP
సినీమా తారలకు సౌందర్యమునిచ్చు సబ్బు
సౌందర్య వివేకముగల సినీమాతారలందరు తమ ముఖవర్ఛస్సును కళంకరహితముగా చేసి పుష్పదళమువలె సుకుమారముగా నుండునట్లు చేసుకొనుటకై లక్సు టాయిలెట్ సబ్బుపై ఆధారపడవచ్చునని తెలుసుకొన్నారు. దానియొక్క మృదువై వలువంటి చురుకైన నురుగు చర్మ రంధ్రములలో యేవిధమైన మలినము లేకుండా చేయును. రాజకుమారి యొక్క సులభమైన సౌందర్యసాధనను మీరు ముప్పది దినములు ప్రయత్నించుడు.
LTS. 126-710-40 TL.
LEVER BROTHERS (INDIA) LIMITED


కట్టడపు భాగముల అభివృద్ధి
భారతపు యుద్ధానంతర సమస్యలు జారీలో పెట్టుసరికి గొప్ప గొప్ప నూతన భవనములు కట్టబడును. అవి కర్మాగారములు ఆఫీసులు, ఆస్పత్రులు, మరియు బడులు. వెడల్పైన పైకప్పుగల గొప్పభవనము లైనను ఉక్కు లేకుండ కట్టుటకు అసాధ్యము.
TATA STEEL
టాటా ఉక్కు
ది టాటా & ఐరన్ స్టీల్ కంపెని లిమిటెడ్
వారిచే ప్రకటింపబడినది.
హెడ్ సేల్స్ ఆఫీసు:
102-ఎ, క్లైవ్ స్ట్రీట్, కలకత్తా.

అన్నయ్య—అవును. వారి దగ్గరే మాట్లాడితే వారి అభిప్రాయంకూడా కలిసివస్తుంది.

ముగ్గురూ మరల లోపలికి పోయి కూర్చున్నారు.

అన్నయ్య—దోహర్త ప్రశ్నకేమి జవాబు?

తిక్కన—ఏ హద్దులకూ లోబడనట్టియు, అమృతస్వరూపియు నగు సద్వస్తువు ఇరుకులలో ఒదిగి కాలబద్ధమై జరామరణములకు లోనైయుండుటయే. పరమాత్ముడు చేసిన మహాత్యాగము. అందుచేతనే మానవుడు త్యాగముచేయక జీవింపగూడదని ఈశోపనిషత్తు చెప్పుచున్నది. త్యాగమువల్లనే అమృతత్వము పొందుదురని "త్యాగేనైకే" అను శ్రుతివల్ల ప్రకటితమవుతున్నది. ఈత్యాగమే ఆయనమహిమ. మానవుడు దాని ననుకరించవలెను.

దోహర్త—ఒకప్పుడు లోభిగావుండి త్యాగి అయినాడని అర్థమా?

తిక్కన—ఆయన ఎప్పుడూ త్యాగే.

దోహర్త—పరమాత్మునకు సగుణనిర్గుణాలు రెండూ స్వభావ ధర్మములే అన్నమాట.

అన్నయ్య—ఒక వస్తువు సగుణమూ, నిర్గుణమూగాగూడా ఎట్లావుంటుంది? ఏదో ఒకటే సాధ్యమవుతుంది.

తిక్కన—అందువల్లనే పరబ్రహ్మము ఎప్పుడూ నిర్గుణుడే అన్నారు.

దోహర్త—అంటే పరబ్రహ్మమూ ఈ విశ్వమంతా కావడము గాని, సృష్టించడముగాని లేదన్నమాట. సృష్టిస్తున్నాడని అనేక శ్రుతులు చెపుతున్నవే?

తిక్కన—అవునంటే పరబ్రహ్మ మార్పుజెందినట్లు అంగీకరించవలసి వస్తుంది. అందుకని మార్పుచెందినట్లు కనపడును గాని నిజముగా మార్పుచెందడన్నారు.

దోహర్త—ఎవరిని మోసగించడానికి ఈ కనపడడము? సత్యమేదో అదే కనపరచరాదా?

తిక్కన—ఆయన సత్యమునే కనుపరుస్తున్నాడు. మనమే భ్రమపడుతున్నాము.

దోహర్త—లేనిని వున్నట్లు కనుపడి మనలను భ్రమపెడుతున్నాడు.

తిక్కన—ఆయన చేయనట్లే కనుపడుతున్నాడు. మనమే భ్రమపడుతున్నాము.

దోహర్త—శ్రుతులు పరబ్రహ్మము చేస్తున్నాడనిగాని, అవుతున్నాడనిగాని చెప్పకపోతే మన మీదేవుకి గొడవ లేకుండా హాయిగా వుండుముగా. అదిగాక మన నీభ్రమలో ఎందుకు సృష్టించవలె?

తిక్కన—మీరే అయినారు ఈభ్రమతో.

దోహర్త—అయితే నేను ఇదంతా అయినానని సృష్టిస్థితి లయములు నావల్లనే అవుతున్నవని బడాయికోసము ఒకవిధంగా చెప్పుతూ తను మారినానని అనుకుంటారని భయపడి తానేమియు తెలుగనని మరియొకచోట చెపితే అదే మోసమని నేనంటాను. నిజమేదో అదే చెప్పమంటాను. ఆదేవుడూ, ఆయనశ్రుతులూనూ.

అన్నమాంబ—సృష్టిలోనూ, శ్రుతులలోనూ వ్యక్తమవుతున్నయీ అద్వైతభావము భగవంతుని మోసమువల్లనని ఒకరి వాదము వల్లనూ, జీవునియొక్క బుద్ధిలేనితనమువల్లనని మరియొకరి వాదము వల్లనూ తేటపడుతున్నది. ఈ వాదములలో ఏది సత్యమనుకున్నా వేదాంతముయొక్క బుద్ధిలేనితనము ఋజువవుతుంది. ఇప్పటికీవాదము చాలించండి.

దోహర్త—భగవంతుడు వాస్తవమునకు భిన్నముగా కనుపడుతున్నాడని ఆయన అన్నాడుగనుక అది మోసమని నేనన్నానుగాని అది నా విశ్వాసము గాదు.

అన్నమాంబ—విశ్వాసములేని వాదన చేయవద్దు. మీవాదనే దారితొలిగింది. ఈవిషయము మరియొకప్పుడు యోచింతాము. మొదట మీరు ప్రారంభించిన త్యాగముసంగతి మాట్లాడండి.

తిక్కన—ఏవిధమయిన హద్దులకూ లోబడని పరమాత్ముడు హద్దులలో నిముడుటయే త్యాగమనీ, ఈత్యాగమే ఆయనమహిమను వెల్లడించుననీ నా అభిప్రాయము.

దోహర్త—బయటిబలవంతము లేకుండా స్వేచ్ఛగా వొక కార్యముచేసినప్పుడు ఏప్రతిబంధకమూ వుండదు. వ్యక్తముకావడం పరమేశ్వరుని స్వభావము.

తిక్కన—త్యాగమనగా అదే. కష్టములో చేయు త్యాగమునకు విలువ తక్కువ. సృష్టి నిర్హేతుకముగ జరుగుచున్నది. ప్రేమచేత ప్రేరేపింపబడినచో సర్వోత్కృష్టమయినది. ఇట్టిప్రేమ తల్లిపిల్లలలోనూ, నాయకీనాయకులలోనూ, స్నేహితులలోనూ సృష్టియందు వ్యక్తమౌతున్నది.

దోహర్త—అందువల్లనే జ్ఞానస్వరూపుడైన భగవానునికంటె ప్రేమాన్వితుడయిన భగవంతునే నే గోరుకొందును. 'ప్రజ్ఞానం బ్రహ్మ' యను మహావాక్యమునకంటె 'రసోవై సః' అను మహావాక్యమే నన్ను వివశుణ్ణి చేస్తుంది. ఈభావమునే యొక మహాత్ముడు—

"ఉపాసతా మాత్మవిదః పురాణాః
పరం పుమాంసం నిహితం గుహాయాం,
వయం యశోదాశిశుబాలలీలా
కథాసుధాసింధుషు లీలయామః"

అని అన్నాడు.

"పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః
ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుం"

అని గీత చెపుతున్నది.

"ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" అని శ్రుతి కడపటి వాక్యము జెప్పినది.

అన్నమాంబ—భగవానుడు శక్తిస్వరూపుడు. ఇచ్ఛాశక్తి, మంత్రశక్తి, ఉత్సాహశక్తి యని శక్తి మూడువిధములు. మన మింత

పరమ మంత్రిఉత్సాహశక్తులనుగూర్చి యోచించినాము. ఇచ్ఛాశక్తి ఈశ్వరుని మూలశక్తి. ప్రజ్ఞారసశక్తులు సత్తుపై సుప్రతిష్ఠితములై యున్నవి. నిరంతరమును సృష్టిస్థితిలయములను గావించునదే సంకల్పశక్తి. 'ఏకం సత్' అను మహావాక్యము అతని నిజస్వరూపమును తెలుపుచున్నది. పరబ్రహ్మ అచలము గాదు. అది నిత్యచలనము. ఉనికిమనికులు అతని స్వభావములు.

దోహర్త—భగవంతుని ఉండుటలో అనుటగూడ ఇమిడియున్నది. భగవంతునియొక్క యీసృష్టిప్రేరణశక్తియే జంతువులను వివిధకార్యములకు పురికొల్పుచున్నది. వృక్షములలోని కదలికయును, నదుల ప్రవాహశక్తియు, సూదంటురాతి ఆకర్షణశక్తియు భగవానుని సంకల్పశక్తియొక్క వికాసములే.

అన్నమాంబ—దానికి బృహదారణ్యకోపనిషత్తు చెప్పింది కూడ కలపండి. పరబ్రహ్మకు ఒంటరిగా వుంటే తోచదుట. రెండుగా వుంటాడట. విశ్వమంతా పతిపత్నీరూపం దాల్చింది. అర్ధనారీశ్వర పాత్రను ధరించి విశ్వమంతా నాట్యరంగం చేసి నటకావతంసబిరుదమును సంపాదించాడు పరబ్రహ్మ. విష్ణువై లోకమంతా రసమండలము చేసి రాధామాయితో వేణుగానం చేస్తూ నిత్యలీల సల్పుతున్నాడు. బ్రహ్మయై శారదాముఖమున చౌవష్టికళల సంయోగముచే సృష్టికావ్యమును విరచించి మహాకవి యనిపించుకున్నాడు. నదుల వేగమున, అయస్కాంతముల ఆకర్షణమున, అణువుల రసాయనికసమ్మేళనమున ఆ వేగము ప్రకటితమౌతున్నది. తరుగుల్మలతాదులలో దాంపత్యధర్మము సుస్పష్టమౌతున్నది. చిగురుబోంపముల లేతదనమున, విరిగుత్తుల కమ్మతావులయందు, ఆమనివిలసనమున రసములు చిప్పిలుతున్నవి. తాళదంపతుల విప్రలంభము, పొట్లదంపతుల ప్రణయకలహము, చిక్కుడుదంపతుల సంయోగము, లతాభిసారికల గాలిబోజాంగులతోడి సైకూటలు విశ్వజననీజనకుల విలాసములను వ్యక్తపరుస్తున్నవి. శుకపికశారికల వేణుగానసరళులు, శరభసింహశార్దూలముల ఘోరవియోగకల్లోలములు జగత్పితల కామసూత్రములపై టీకలు. బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్యాసములు విశ్వదంపతుల కోకశాస్త్రమునకు వ్యాఖ్యానములు. పథ్యమును, లంఘనమును శుభాభోగములకు దారితీయునుగాని వానిని నశింపజేయనట్లు వానప్రస్థసన్యాసములు దాంపత్యవిరమణమునకుగాక విరమణమునకే తోడ్పడును. వియోగము సంయోగాసక్తిని తీవ్రపరచును. ఆశ్రమధర్మములు దాంపత్యధర్మముయొక్క అవస్థలు.

ఇది సృష్టిరహస్యము. భగవానుడు అణువై, వృక్షమై, జంతువై, మానవుడై విరాడ్రూపమున అన్నమయ, ప్రాణమయ, విజ్ఞానమయ, ఆనందమయకోశముల నలంకరించుకొని ఆత్మోపలబ్ధిని బొందుచున్నాడు. బీజరూపమున అతని యునికిలో నున్న శక్తులన్నియు మనికిలో విస్తరిల్లుతున్నవి. ఇదియే విరాడ్రూపమున మొలచి, పెరిగి, పూచి, కాచి, పండిన అశ్వత్థము. బృంహతీతి బ్రహ్మ—అనంతముగ పెరిగిపోతున్నాడు. ఆకాశమున నిమిషమునకు లక్షల యోజనములవంతున విస్తరించుచు శూన్యమున అన్నివైపుల నాక్రమించుచున్నది. ఇదియంతయు భగవానుని ఏకపాద్విభూతి యన్నారుగాని యది పాతమాట. ఇప్పటికి బహుపాద్విభూతి యైయుంటుంది. ఉనికి పూర్ణమయినచో మనికి అపూర్ణము గాదు. భగవానుని ఉనికిమనికులు రెండూ ఒకటే. వట్టి ఉనికికంటె మనికే మేలయినది. భగవానుని మనికి నిత్యము, సత్యముగూడాను.

ఇందులో మానవుని భాగము అతిస్వల్పము. మన మణువులము, కాని యీ మహాయంత్రములోని ప్రతియణువునుగూడ భగవానునితోపాటు ఆత్మోపలబ్ధిని బొందుచున్నది. విశ్వకళ్యాణము మనకును కళ్యాణమే. ఇది భగవానుని త్యాగమా? ఆయనపప్పు ఏమి చిమిడింది! ఇది స్వామికి నిత్యభోగము. నేను నా నాథునితో చేరి పరమాత్మునితోపాటు నిత్యమును సహభోజనము గావింతును. మాకు వియోగము లేదు. నేను నిత్యసుమంగళిని.

అన్నయ్య—తల్లీ! మాకు విశ్వదాంపత్యోపనిషత్తును వినిపించితివి.

అన్న—తోచినది చెప్పితిని. ప్రస్తుతావస్థవలని ఒరిపిడిలో ఇది నాకు సువ్యక్తమయినది.

అన్నయ్య—తల్లీ!

తిక్కన నిస్తబ్ధుడై కూర్చున్నాడు.

దోహర్త—చిన్నమ్మా! ఎవరో అనుకుంటారని యీ పదవ రోజుతంతు జరపటం నా కేమాత్రం ఇష్టంలేదు.

అన్న—మీయిష్టము.

తిక్కన—అవసరము లేదనుకుంటాను.

అన్నయ్య—నా అభిప్రాయమూ అదే.

తిక్కన—అన్యాయము. రాత్రి నేనూ, చిన్నవాడు, రాజుగారు మాట్లాడుకొనుటలో సారంగపాణివల్ల రావలసిన రెండులక్షల రూప్యములను విద్యకై వినియోగించవలసినదని నిశ్చయించుకున్నాము. గుంటూరిలో నాన్నగారిపేర ఆయుర్వేద, ధనుర్వేద కళాశాలను స్థాపించవలయునని తలంచితిమి. ఇకమీద మన కీవూరిలో పనిలేదు. గనుక మన భవనములను కళాశాలల కిచ్చివేసిన బాగుండునని తోస్తుంది. నీ అభిప్రాయ మేమి?

అన్నమాంబ—నా కిక్క డేమిపని? ఇచ్చివేయవచ్చును.

అన్నయ్య—చాల ఉత్తమమయిన ఏర్పాటు.

దోహర్త—ఈ ఏర్పాటు చిన్నాన్న జీవితాదర్శములకు అనుగుణ్యంగా వున్నది.

తిక్కన—సరే, పొద్దెక్కింది, ధర్మోదకాల పని చాలాసేపు పడుతుందిగూడాను. లేవండి.

అంతా లేచారు.

లోకులు కాకులు

[నాటిక]

✻

శ్రీ సోమంచి యజ్ఞన్నశాస్త్రి

[రాత్రిపదిన్నరకి.

ఒక రైలుస్టేషను. రైలొచ్చి ఆగివుంది. ప్రేక్షకులకి ఒక సెకండ్ క్లాస్ బండీ ఎదురుగా కనిపిస్తూవుంటుంది. స్టేజికి ఒకపక్కన కిల్లీదుకాణం. రెండోపక్కని సెకండ్ క్లాస్ వెయిటింగ్ రూమ్, వెయిటింగ్ రూమ్‌సమీపంలో పైన ఒక పడకకుర్చీ వుంటుంది. ప్లాట్ ఫారమ్‌మీద మనుష్యులు తిరుగుతూవుంటారు.

తెర తీసేసరికి ట్రావెలింగ్ టికెట్ కలెక్టర్ దద్దమ్మరావు టికెట్, టికెట్ అంటూ లోపలి కొస్తాడు. ప్లాట్ ఫారమ్‌మీద వున్న ఒకణ్ణి టిక్కెట్ అడుగుతాడు. అతను టిక్కెట్టు చూపిస్తే, తణిఖీచేసినట్టు దానిమీద గీలుకుతాడు. ముందుకి నడిచి సెకండ్ క్లాస్ పెట్టెదగ్గిర కొస్తాడు. బండిలో దీపంలేదు; అంతా చీకటి. రావు తలుపు తెరుచుకుని, లోపలికెక్కి, దీపం వేస్తాడు. కింద సీట్లు రెండింటిమీదా ఇద్దరు పడుకునివున్నారు. ఒక వ్యక్తి ఎఱ్ఱటి బూనీసు మొహంమీద కూడా ముసుగెట్టేసి పడుకున్నాడు. రావు "టికెట్" అంటాడు. ఎవరూ కదలరు. ఒక్కక్షణం వూరుకుని మళ్లీ కొంచెం గట్టిగా "టిక్కెట్ సార్" అంటాడు. కాని ఎవరూ లేవరు. తరవాత ఉరిమినట్టు "టిక్కెట్" అని అరుస్తాడు. అయినా ఎవరూ లేవరు. ఎఱ్ఱటి బూనీసు కప్పుకున్న వ్యక్తిని తట్టి "ఏయ్ సార్"అంటాడు. అయినప్పటికీ ఆయన లేవడు. మనిషిని అటూ యిటూ కదుపుతాడు. అంతకీ లేవడు. తరవాత రావు మొహంమీద నించి గుడ్డ బలవంతంగా వూడలాగుతాడు.]

వ్యక్తి—ఆఁ...ఊఁ...అయ్యో, నిన్ను తగలెయ్య! నా ప్రాణానికి నువ్వెక్కడివిరా?

రావు—టికెట్...(అని చెయ్యి జాపుతాడు. వ్యక్తి అది గమనించకుండా మళ్లీ ముసుగెట్టేసుకోబోతాడు. రావు గబుక్కున ముసుగు లాగేసి) అప్పుడే ముసుగెట్టెయ్యకండీ సార్, టికెట్ చూపించండీ!

వ్యక్తి—నీ బోడిటిక్కెట్టూ నువ్వూ, నన్ను చంపుతా వెందుకురా!

రావు—మాటలు మర్యాదాగా రానివ్వండి సార్!

వ్యక్తి—నీతో నాకు మాటలెందుకురా అసలు? నన్ను పడుకుని చావనివ్వవేం?

రావు—ఓహో, చెబుతూంటే మళ్లీ 'రా' 'గీ' అంటారు!

వ్యక్తి—యమధర్మరాజా! దయచెయ్యండి. నన్ను కాస్త నిద్రపోనివ్వండి.

రావు—టిక్కెట్ చూపించమంటే ఈ కాలయాపనేమిటి? (అని ఆవలిస్తూ, చిటిక వేస్తాడు)ఊఁ...ఊఁ...

వ్యక్తి—టిక్కెట్టో టిక్కెట్టో అని లబలబమంటా వేమిటయ్యా ఈ అర్ధరాత్రి! అలా ఆవలిస్తూ అఘోరించకపోతే పోయి పడుకోకూడదూ?

రావు—అధికప్రసంగం చాలించండి. టిక్కెట్!

వ్యక్తి—(లేవబోయినట్టు ప్రయత్నించి, అమ్మోయ్, బాబోయ్ అనిమూలుగుతూ వెనక్కి పడిపోతాడు) చచ్చిపోయాన్రా! అమ్మో! మేహవాతం నెప్పులు, మోకాళ్ళట్టుకు పోయాయి! ఎన్నెన్ని మందులుచ్చుకున్నా తగ్గటంలేదు రాత్రిళ్లు ఈబాధ మరీ ఎక్కువయి పోతుంది. నిద్దట్టదు. ఎన్నిరాత్రులు మేలుకోగలను చెప్పు నాయనా? నీకు పుణ్యముంటుంది వెళుదూ! నాకు కాస్త కునుకట్టనిద్దూ!!

రావు—నా కనుమానంగా వుంది. టిక్కెట్ చూపించమంటే జబ్బంటారేమిటి?

వ్యక్తి—అయిదేళ్లనించీ మేహవాతంనెప్పుల్తో బాధపడి చస్తూంటే ఇంకా అనుమానమంటా వేమిటయ్యా! నీకన్నా పట్టుకున్నాయికాదు ఆ నెప్పులు. రాత్రిళ్లు మనుష్యుల్ని పీడించుకు తినకుండా ఎక్కడో స్థావరంగా పడుందువు!

రావు—కమాన్ (Come on) కమాన్ (Come on) టికెట్......

వ్యక్తి—మళ్ళీ అదే దంపుళ్ళపాటా! నే నెక్కడినించి తీసుకొచ్చి చూపించేదిరా నీ కీటిక్కట్టు? కాళ్ళూ, చేతులూ స్వాధీనంలో లేవు. అమ్మాయి టిక్కెట్టెక్కడ దాచిందో...... బాబూ...నామీద దయలేదూ? అయిదేళ్లనించీ మేహవాతం నెప్పుల్తో తీసుకుంటున్నాను. రాత్రిరి నిద్దరలేకపోతే పిచ్చగయిపోతాను. జాలిపుట్టడం లేదూ నాఅవస్థ చూసి! దండం పెడతాను దయచెయ్యి నాయనా!

రావు—టిక్కెట్ చూపించమంటే మీజబ్బుగొడవ నాకెందుకండీ!

వ్యక్తి—మేహవాతంకంటే ఎక్కువగా పట్టుకుపీడిస్తున్నావేమిటిరా నువ్వు! చెబితే అర్థమయి చావదేం? ఆ టిక్కెట్టెక్కడుందో లేచిచూస్తేగాని తేలదు. నే లేవలేను.

రావు—ఈ వేషాలు కట్టిపెట్టి తియ్యండి టిక్కెట్టు. లేకపోతే దిగండి, పదుద్దురుగాని పోలీసుస్టేషనుకి.

వ్యక్తి—(నోరు నొక్కుకొని) అవ్వ! అవ్వ!! (గుండె బాదుకుంటూ) అయిదేళ్లనించీ రోగంతో తీసుకుంటూంటే వేషమనడానికి నీకు నోరెలా వొచ్చిందిరా! నెలకి రెండొందల రూపాయలు మందులమీద తగలేస్తున్నాను! చెన్నపట్నం, కలకత్తా, బొంబాయి, లక్నో, లాహోర్, కరాచీ గిరాచీ అన్నిపట్నాల్లో పెద్ద పెద్ద డాక్టర్లందరికీ చూపించాను. ఇంగ్లీషుమందులు, తెలుగు మందులు, మళయాళంమందులు, డబ్బ, దిరుగుండం అన్నీ వాడాను. బాధ తగ్గక చస్తూంటే, (నోరు నొక్కుకుని) అవ్వ, ఇంకా వేషమంటాడు. నీయిష్టమొచ్చినవాడిచేత పరీక్షచేయించుకో. కావలిస్తే నువ్వే పరీక్షచెయ్యి.

రావు—నాకేం తెలుసు? నేనేం డాక్టర్ని కాను. టికెట్ కలెక్టర్ని.

వ్యక్తి—మరి మహా తెలిసినవాడిలాగ నాకు జబ్బులేదంటావేమిటి?

రావు—మీకు జబ్బు లేదన్లేదు. దాని సంగతి నాకెందుకు, టికెట్ చూపించమంటున్నాను.

వ్యక్తి—అమ్మో లబ బా! ఆ టిక్కెట్టుబాధ నీకెందుకురా! నే మావూళ్లో దిగుతానా? అక్కడ స్టేషన్లో టిక్కెట్లుచ్చుకోడానికి ఓమని షేడుస్తాడా? వాడికి నే టిక్కెట్టు సమర్పించుకుంటానా? లేకపోతే నాచెవులుడేసి వాడు నాదగ్గిర డబ్బు వసూలుచేస్తాడుగా! ఈలోగా నీకెందు కీదురద! పోయి పడుకో...పెద్దవాణ్ణి నామాట విను...నీకూడా ఏదన్నా నిద్దరపట్టని రోగం పట్టుకుందా?......

రావు—నాకు విసుగెత్తించకండి...టికెట్ చూపిస్తారా చూపించరా?

వ్యక్తి—ఇదెక్కడి టికెట్‌కలెక్టరువి దొరికావురా, హిట్లరుమొగుడి వయిపోతూనే...ఇంటిదగ్గర పెళ్లాంబిడ్డలు లేరూ! వాళ్లనీ యిలాగే పీడించుకుతింటావా?

రావు—(విసుగుతో) మీతో మాట్లాడుతూ కూచోడానికి నాకు టైములేదు. ఇంకా చాలాపెట్టె లుండిపోయాయి.

వ్యక్తి—ఈరైల్లో అందర్నీ లేపేస్తేనేగాని నీకు తృప్తిలేదు బాబూ! రాత్రి పెట్టుకున్నావేం, నిశాచరుళ్ళాగ!

రావు—నేను నైట్‌డ్యూటీమీ దున్నాను... (చిటికేస్తూ) తియ్యండి...తియ్యండి.

వ్యక్తి—వెధవదేశం, వెధవదేశమూ అని! ఏంచేసినా తల్లకిందులూ...ఉత్తర హిందూస్థానమంతా అరడజనుమాట్లు తిరిగాను. మెయిల్లో వెళ్లాను. పాసెంజర్లో ఎక్కాను. సెకండ్‌క్లాసులో వెళ్ళాను. థర్డుక్లాసులోనూ వెళ్లాను. ఒక్కమాటయినా రాత్రి పూట టిక్కెట్లడిగారా? టిక్కెట్లు లేనివాళ్లనయినా నిద్దర లేపారా? ఈ దేశమొస్తామా, అడుగడుక్కీ పీడించుకుతింటామే! ఇప్పుడే యిలా మిట్టిపడిపోతున్నారు; ఇహ మన కోరాష్ట్రింకూడా యేడిస్తే, అహగనా! బోడిటిక్కెట్‌కలెక్టరుకూడా అధారిటీ చెలాయించేవాడే...డొక్కచీల్చేవాడు లేక!

రావు—టికెట్ లేకుండా సెకండ్‌క్లాసులో ధణాయించి పడుకుని దాటేద్దామంటే డొక్కలాగా చీలిపోతుంది.

వ్యక్తి—నీ జులుం బంతేకంతకి ముదిరిపోతోందేమిట్రోయ్. ఇందాకా నాకు జబ్బులేదన్నావు; ఇప్పుడు నాదగ్గిర టిక్కెట్ లేదంటున్నావు!

రావు—వుంటే చూపించెయ్యండి.

వ్యక్తి—కాళ్లు స్వాధీనంలేకొచ్చింది. గెంటిపారేద్దును నువ్వన్నమాటకి! అది నీస్థైర్యం తగలడా! పో, ఇక్కణ్ణించి, పోతావా, పోవా? (అని గట్టిగా అరుస్తాడు. ఆ అరుపుతో రెండో ప్రయాణీకుడు లేచిపోతాడు. ఆయన్ని చూసి వ్యక్తి స్వరం మరీ కొంత పెంచుతాడు.) చూశారా బాబూ ఈ తెలగని! నాకేమో మేహవాతం నెప్పులు. నెలకి రెండువందల రూపాయల మందులు మింగుతున్నా కాళ్ళు స్వాధీనంలోకి రావడంలేదు. అవస్థగా వుంది. అమ్మో (అని మూలిగి...) వీడేమో టిక్కెట్టో, టిక్కెట్టో అని పేనుకొరికినట్టు కొరికేస్తాడు. చెబితే అర్థంకాదు. పైగా నాకు జబ్బే లేదని బుకాయిస్తాడు...నాకు...మేహవాతం నెప్పుల్తో చస్తూంటే...అమ్మా!......

రెం. ప్ర—(రావుతో) సెకండ్‌క్లాస్‌బండిలో ఎక్కి డిస్టర్బు చేస్తున్నావేం? ఎవరు నువ్వు?

వ్యక్తి—టిక్కెట్‌కలెక్టర్నంటాడు!

రెం. ప్ర—అయితే నీకు రాత్రి సెకండ్‌క్లాసుబండిలో ఎక్కి అల్లరిచెయ్యకూడదని తెలీదూ? నీవాలకం చూస్తే నాకనుమానంగా వుంది!...

వ్యక్తి—వొచ్చిందగ్గిర్నుంచీ వేషం, వేష మంటున్నాడు. నాకూ అనుమానంగానే వుంది... అమ్మా... రామచంద్రా...వీడి ఘోషతో నెప్పులు మరీ ఎక్కువయిపోయాయిరా బాబూ! ఎలా తెల్లారుతుందో...అమ్మా...(అని మూలుగుతాడు)

టెం. ప్ర—(రావుని) గెటవుట్...పో...ఈపెట్టెలోంచి.

రావు—(తెల్లబోయి) ఎందుకు సార్, అంత కోపగిస్తారు?

టెం. ప్ర—కోపగించాలా కొయ్యాలా? జబ్బుతో బాధ పడుతున్న మనిషిని బాధపెడతావా?

రావు—నే నేం బాధపెట్టానండి వారిని! టిక్కెట్టు చూపించమని అడిగాను. వారే మాటలుమిగిలారు.

టెం. ప్ర—ఇంకా నయం. ఆయన లేవలేనిస్థితిలో వుండబట్టి నిన్ను గెంటెయ్యలేదు. టిక్కెట్టకి గావుట! ఎందుకి టిక్కెట్టడగడం ఈఅర్ధరాత్రేసలు? ఎవరు నువ్వు అడగడానికి...దిగు...ఊ... (ప్రయాణీకుడు లోపలినించి గట్టిగా కేకలేస్తూవుంటే, ఆపెట్టె చుట్టూ ప్రేక్షకులు మూగుతారు. లోప లేం జరుగుతోందో తెలీక పోయినా లోపల ప్రయాణీకుడితోపాటు పైనించి కొందరు "దిగు, దిగు"అని కేకలేస్తారు. రావుకి గాభరాయెత్తిపోతుంది.)

రావు—అలానే పోతాను సార్...ఎందుకు అనవసర ఘర్షణ.

(అని పెట్టెదిగిపోతాడు. వొచ్చిన ప్రేక్షకులుకూడా తలో దారీ పోతారు. ప్రయాణీకుడు దీపమార్పేస్తాడు. వ్యక్తి మళ్లీ ముసుగెట్టుకు పడుకుంటాడు. ప్రయాణీకుడుకూడా పడుకుంటాడు.

రావు మెల్లిగా కిల్లీకొట్టుదగ్గిరకి చేరుకుంటాడు. ఒక అర సెకండు నిశ్శబ్దం. కైలుకూలీ బంగారు చేతిలో ఎఱ్ఱలాంతరు పుచ్చుకుని అటొస్తాడు. రావుని చూసి ఆగి)

బంగారు—ఏంబాబూ, ఇక్కడుండిపోయారు? బళ్లు తిరగడంలే?

రావు—బంగారూ!

బంగారు—బాబూ!

రావు—ఈలోకంలో మంచికెళితే చెడ్డొస్తుందిరా!

బం—నిత్తం బాబూ!

రావు—మనం కంపెనీసొమ్ము తింటున్నామా? మన పని మనం తిన్నగా చెయ్యాలంటావా వొద్దంటావా?

బం—ఎందుకు సెయ్యొద్దు బాబూ!

రావు—నాపనేమిటి? టిక్కెట్లు తణిఖీచేసి, ఎవరన్నా టిక్కెట్ లేకుండా ప్రయాణంచేస్తున్నారేమో కనిపెట్టడమేనా?

బం—నిశం!

రావు—ఈపని చెయ్యడానికేనా కంపెనీవాళ్లు నాకు జీత మిచ్చేది?

బం—అవును బాబూ.

రావు—లేకపోతే టిక్కెట్లు తణిఖీచెయ్యడమంటే నాకే మన్నా సరదానా?

బం—అబ్బే!

రావు—నే చెయ్యవలసిన పని తిన్నగా చెయ్యకపోతే నాకు పైనుంచి మాటొస్తుందా?

బం—ఎందుకు రాదు బాబూ!

రావు—మరి నాకు రాత్రిడ్యూటీ వేసి పనిచెయ్యమంటే, చెయ్యకలసిందేనా, నాకు నిద్దరొస్తోందని పడుకుంటే కుదురుతుందా?

బం—ఎందుకు కుదురుద్ది!

రావు—నాకుమాత్రం ఈ చల్లో కప్పుకు హాయిగా పడుకోడం ఇష్టంకాదూ?

బం—ఎందుక్కాదు బాబూ!

రావు—మరి విధిలేక, పొట్టగడవకేగా ఈ రాత్రిపనికన్నా ఒప్పుకుని ఈవుద్యోగం ఏడుస్తున్నది?

బం—ఏటయిందేటి బాబూ!

రావు—వొరే, టిక్కెట్టడుగుతే నేనేదో కానిపని చేసినట్టు కస్సుమని మీదవిరుచుకుపడ్డార్రా!

బం—అల్లకేమొచ్చింది!

రావు—వొరే బంగారూ, నే నిజంగా టిక్కెట్‌కలెక్టర్ని కాను, అథారిటీ లేకుండా వేళాకోళానికి టిక్కెట్టడుగుతున్నాననుకొన్నారో యేమిటో. అందుకే అయుంటుంది...చెడ్డభిప్రాయం పడిపోయింది వాళ్లకి ...ఎలాగ నైపాళ్ళ ఇది తీసెయ్యడం...బంగారూ, మాస్టరుగార్నడిగొస్తానురా...

(అని లోపలికి వెళిపోతాడు. బంగారుకూడా తన పనిమీద వెళిపోతాడు. ఒక్కక్షణం స్టేజిమీద నిశ్శబ్దం. తరవాత రావూ, స్టేషనుమాస్టరూ మాట్లాడుకుంటూ వొస్తారు.)

రావు—అంచేత మేస్టరుగారూ, మీరేం చెయ్యాలంటే, "నే నిజంగా టిక్కెట్ కలెక్టర్ని, టిక్కెట్లడగడం నావిధి, అంతేగాని నాకేం సరదాగాదు" అని వాళ్లకి నచ్చచెప్పాలి.

స్టేషనుమాస్టరు—ఎందుకండీ అనవసరరభస? అయిందేదో అయిపోయింది. పోనివ్వండి.

రావు—అమ్మమ్మ...అలా అనకండి...నాకేదో తిన్నగా నిద్దరట్టక టిక్కెట్లతణిఖీకి బయలుదేరినట్టు వాళ్లకి అభిప్రాయం పడిపోయింది. అది పోగొట్టేస్తే చాలు. వాళ్లతో దెబ్బలాడాలని నాకేం లేదు. ముక్కుకు సూటిగా నాపని చేసుకుపోతూంటే...

స్టే. మా—వాళ్ళేదో నిద్దరమత్తులో అన్నముక్కలు పట్టుకు మీరు బాధపడకండి. (మాట్లాడుకుంటూ సెకండ్‌క్లాస్ పెట్టె దగ్గిర కొస్తారు)

రావు—ఇదేనండి. వాళ్లతో ఒక్కమాట చెప్పేసి వెళ్ళి పోదురుగాని......

స్టే. మా—సరే కానివ్వండి.

(రావు మళ్ళీ పెట్టెలో ఎక్కి దీపమేస్తాడు. రెండో ప్రయాణీకుడు పక్కకి ఒత్తిగిలి, మళ్ళీ చలనంలేకుండా పడుకుంటాడు)

రావు—సార్ ... ఏమండోయ్ ... (వ్యక్తిని కదుపుతూ) ఇదుగో...సార్...(వ్యక్తి లేవడు. రావు గట్టిగా కదుపుతాడు. చివరికి మొహమ్మీదనించి బట్ట లాగుతాడు.)

వ్యక్తి—ఓరి కొరివిదెయ్యమా! నన్ను చంపుకుతిండానికొచ్చావురా?

రావు—చూడండి...ఇందాకా మిమ్మల్ని టిక్కెట్టడిగిన సందర్భంలో......

వ్యక్తి—నీ టిక్కెట్టురంధి ఇంకా వొదల్లేదురా? బాబూ, రేపు అరసజను టిక్కెట్లు కొనిపెడతాను నీకు. ఈ రాత్రికి నన్నిలా వొదిలిపెట్టు!

రావు—అబ్బే, టిక్కెట్టుకోసం కాదుకాదు. నే టికెట్ కలెక్టర్నవునో కానో, నాకు నైట్‌డ్యూటీ వుందో లేదో అని మీకు సందేహ మొచ్చిందికాదూ?...స్టేషన్‌మాస్టరుగార్ని తీసుకొచ్చాను. అడగండాయన్ని...

వ్యక్తి—నిన్ను పుఠమెయ్యా! నువ్వెవడివయితే నాకేంరా? నిద్దరకోసం ఇంత వల్లమందు మింగాను. తీరా పట్టబోతూవుంటే లేపేశావు. కాళ్ళు విలవిల్లాడి పోతున్నాయి. నన్ను కొరుక్కుతినకుండా పోరా యిక్కడినించి.

రావు—ఏమండీ మాష్టరుగారూ, నే నైట్‌డ్యూటీ మీదున్నానా?

వ్యక్తి—వొచ్చేజన్మలో నీకడుపున పుడతానురా జలగా, పో యిక్కణ్ణించి...ఈరైల్లో టిక్కెట్టులేకుండా చచ్చినంతమంది ప్రయాణంచేస్తూంటే, వాళ్లందర్నీ వొదులుకుని జబ్బుగుండావాణ్ణి నామీదొచ్చి పడ్డావేమిటిరా దెయ్యమా?

రావు—చూశారా మాష్టరుగారూ? మనం ఎంత మర్యాదాగా మాట్లాడుతున్నాం...ఆయనెలా మాటలుమిగులుతున్నారు!

వ్యక్తి—నువ్విలా పీకించుకుతింటే నే నసలు మిగలనురా ఇంక. నా శవాన్ని యింటికి చేర్చాలి! అమ్మా...అయ్యో...ముండా మోపిన టిక్కెట్టు...నీకేదో టిక్కెట్టుదెయ్యం పట్టుకుందిరా...

రావు—(కఠినంగా) జాగ్రత్తగా మాట్లాడండి. నే టిక్కెట్ కలెక్టర్ని. నైట్‌డ్యూటీమీదున్నాను. సందేహముంటే మాష్టరుగార్నడగండి.

వ్యక్తి—అయ్యో, నీ మాష్టరుగారూ, మవ్వూ మండిపోనూ! బతిమాలుకుంటున్నా పోరేమిట్రా! ఇహ నే బతకను...శోష వచ్చేస్తోంది...పొండిరా ఇక్కణ్ణించి యమదూతల్లారా? వాయవోయ్...

(అని పెద్దకేకేస్తాడు. దానితో రెండో ప్రయాణీకుడు లేచికూచుంటాడు)

రెం. ప్ర—మళ్లీ తయారయ్యావేం?...

రావు—టికెట్ కోసం కాదండి. మాష్టరుగార్ని తీసుకొచ్చాను...

రెం. ప్ర—దిగు బండి ముందర...నిన్నూ, నీమాష్టర్నీ తన్ని తగిలేస్తాం...ఊ...(అని గట్టిగా ఉరుముతాడు)

రావు—అనవసరంగా కోప్పడతా రెందుకండి, టిక్కెట్లక్కర్లేదన్నా! మీసందేహాలు తీర్చడానికొచ్చాను.

రెం. ప్ర—అనవసరప్రసంగ మొద్దని చెప్పాను. దిగుతావా, చెయ్యిచేసుకోమంటావా?

స్టే. మా—రావుగారూ, రండి పోదాం.

(అని గట్టిగా చెయ్యిపట్టుకుని బయటికి లాక్కొస్తాడు. లోపల ప్రయాణీకుడు గొణుక్కుంటూ దీపమార్పేసి పడుకుంటాడు. రావూ, మాష్టరూ రెండో వైపుకి నడుస్తారు)

రావు—ఎందుకండీ వాళ్ల కంత కోపమొచ్చింది?

స్టే మా—రథసెంటుకు, పూయకో మని నే చెప్పలేదూ?

రావు—ఏం, మన మేమన్నా తప్పుపని చేశామా? నా కర్థం కాకుండా వుంది. వాళ్ళన్నిమాట లంటూంటే జవాబన్నా చెప్పలేం...నా కేం పాలుపోకుండావుంది.

స్టే. మా—గట్టులకి దూరంగా వుండాలన్నారు కష్టపడ్డారు, మీరుకూడా వెళ్లి పడుకోండి కాస్సేపు. (అని వెళ్లిపోతాడు)

(బండిలోంచి వ్యక్తి "అమ్మో"అని మూలుగుతాడు. రావుకిల్లీ కొట్టుదగ్గిర చేరుకుని, 'ఓసోడాకొట్టు'అని కొట్టువాడితో చెప్పి, కొట్టు నానుకుని వుంటాడు. బంగారు అటునించి మళ్లీ వొస్తాడు.)

బం—ఏంబాబూ, ఈడే వున్నారు?

రావు—బంగారూ, లోకం చాలా చెడ్డదిరా!

బం—సిత్తం.

రావు—మన పని మనం చేసుకుంటే వోతంటా. చెయ్యకపోతే మరోతంటా. ఎలాగ వేగేది?

బం—సిత్తం.

రావు—వొరే నా కర్థంగాదు, నే నేం తప్పుచేశాన్రా? నామాట నమ్మకపోతే పోయారు, మాష్టరుగార్నడగమన్నాను. దానికీ తప్పట్టించుకుంటే ఎలాగ?

బం—బాబూ! ఇయ్యాళ లేచినోళ మంచిదికాదు. యే మొగం చూశారో!

(లోపలినించి వ్యక్తి మళ్లీ మూలుగుతాడు. ప్రయాణీకుడు లేచి, చొక్కా వేసుకుని, రావూ, బంగారూ మాట్లాడుతున్న

దగ్గిర కొస్తాడు. రావూ, బంగారూ అది గమనించకుండా మాట్లాడుకుంటూనే వుంటారు.)

రావు—అదే అయుండాలిరా! నా కేళకువాళ్లో నమ్మక ముండేదికాదుగాని, మరి మనవల్ల తప్పేం లేందే...ఓ సోడా తాగి, పోయి పడిచూసుకుంటూ...(కొట్టువాడు సోడా కొడతాడు. రావు తాగుతూవుంటాడు. రెండో ప్రయాణీకుడు అక్కడికి చేరుకుని రావుని ఎగాదిగా చూస్తాడు.)

రెం. ప్ర—మీరేగాదూ, మా కంపార్టుమెంటులో కొచ్చి ఇప్పుడు న్యూసెన్సు చేసింది?

రావు—నేనేం న్యూసెన్సు చెయ్యలేదే?

రెం. ప్ర—చెయ్యక పోవడమేమిటి? జబ్బుతో వున్నాయన్ని అలా బాధపెట్టి...నా కళ్లారా చూశాను.

రావు—నేనేం బాధపెట్టాను సార్? టిక్కెట్ తణిఖీ చెయ్యడం నావిధికనక అడిగాను. చూపించకుండా వారే నన్ను మాటలన్నారు. సందేహం తీర్చడానికి మాస్టరుగార్ని తీసుకొచ్చాను. దానికే కోపగించుకొన్నారు.

(లోపలినించి అమ్మో అని మూలుగు)

రెం. ప్ర—జబ్బుతో వున్న మనిషిని నువ్వు లేపేసి నానా అల్లరీ చేశావు. వెళ్లి ఆయన్ని క్షమాపణ వేడుకుంటావా, లేదా?

రావు—నేనా? ఆయనెవడికో క్షమాపణ చెప్పుకోవాలా? ఎందుకు?

రెం. ప్ర—ఆయన్ననవసరంగా బాధించి, దూషించినందుకు.

రావు—నా, నా...మాబలేగా వుంది...తిట్టింది ఆయనా, నేనా? ఆయన్నొచ్చి చెప్పమనండి నాకు క్షమాపణ.

రెం. ప్ర—ఆయ నొచ్చే స్థితిలో వుంటే నీరొముకలే విరిగుండును.

రావు—ఇదుగో......నాయూలాన్ని నే యిక్కడుంటే నన్నెందుకండీ కదుపుతారు? తరవాత మళ్ళీ దీనికో తంటా! వెళ్లి పడుకోండి. రైలు కదిలే వేళయింది!

రెం. ప్ర—క్షమాపణ కోరతావా, లేదా?

రావు—మెత్తగా పోనిస్తున్నానని మరీ రెచ్చుతున్నారే? ...కోరను.

రెం. ప్ర—క్షమాపణ చెప్పవు.

రావు—చెప్పను!

రెం. ప్ర—ఆలోచించుకు మాట్లాడు.

రావు—నే ఆలోచించను! మీ అథారిటీ ఏమిటి నాకు?

రెం. ప్ర—విచారిస్తావు సుమా?

రావు—విచారిస్తే విచారించాను. మీరు గాభరాపడకండి!

రెం. ప్ర—నీపిలకెక్కడికిపోతావుండు. నేనెవర్ననుకున్నావో. రైల్వేబోర్డుమెంబరు రాఘవయ్యగారి మేనగోడలు మొగుణ్ణి, తెలుసునా? అయినోనాటికి నీవుద్యోగం వూడపీకించెయ్యకపోతే నా రెండుచెవులూ కదపాయిస్తాను.

రావు—మీకే చెవుల్లేకుండా పోతాయి! ఇలాటి బెదరింపులకేం, లక్ష చూశాం, రైల్వేబోర్డు మెంబరుగారి మేనగోడలు మొగుడుగారూ!!

రెం. ప్ర—కాబోలు! రాఘవయ్యగారి మేనగోడలు మొగుణ్ణి నన్నే ధిక్కరించావు! నీవుద్యోగం వూడపీకేదాకా నే నిద్దరోతానేమో చూడు. చెప్పు నీపేరు!

రావు—నే చెప్పను!

రెం. ప్ర—నువ్వు చెప్పకపోనేమాత్రం దాగుతుందా? వెళ్లి క్షమాపణ కోరుకుంటే కోరుకున్నావు. లేకపోతే అయిదుగో జుల్లో డొక్కపగిలిపోయిందే...(అని రివ్వుమని వెళ్లి పోతాడు)

రావు—చూశావురా, బంగారూ! లోకంలో మెత్తని వాణ్ణి చూస్తే మొత్తబుద్ధి. రాఘవయ్యగారి మేనగోడలు మొగుడూ మన్ని ఝుడిపించడమే! నే ఝుకుస్తానా ఈ అరుపులకి!!

బం—బాబూ, ఇవి గొప్పోళ్లకి రోజులు. పత్తెంగా రాఘవయ్యగోరి మేనగోడలుమొగుడే అయితే మాతంటారయే వొస్తది.

రావు—నీకితాడు పోరా! ఇన్ని పాట్లూ పడి, రాత్రిళ్లు మేలుకుని, కంపెనీకి డబ్బుపోకుండా టిక్కెట్లన్నీ తణిఖీచేస్తూ, వెయ్యికళ్లతో మనం చూస్తాంటే, కంపెనీ మన్ని కనిపెట్టిచూడదురా మరి. నిజం కనిపెట్టరూ? నామాట నమ్ముతారా, ఎవరో రాఘవయ్యగారి మేనగోడలుమొగుడుమాట నమ్ముతారా?

బం—నిజమేంటి బాబూ, డబ్బునోడు సెప్పింది నిజం! డబ్బులేనోడు సెప్పింది అబద్ధం!

రావు—అదీ నిజమేరా, వెనకకలికాలం! అయినా మన్నేం చేస్తారు? తలగొట్టి మొలేస్తారా, తాటిపం డెగరేస్తారా? ఉద్యోగం ఊడపీకేస్తారు, అంతేనా? పోతేపోయింది! మన కీరైలుకంపెనీ వాళ్లే యేం శాశ్వతమాయేమిటి? వీళ్లు కాకపోతే వీళ్లబాబు లింకోళ్లు దొరుకుతారు. యేమంటావు?

బం—యెందుకొచ్చిన తంటా బాబూ. గాలికి పోద్ది మాట. వుద్దోగం వూడులుకుంటే మరి దొరకడం మాకట్టం!

రావు—పోరా, బోడిముండసలహా యిచ్చావు! అనవసరంగా తెచ్చిపెట్టుకున్నాను. పోనీ, మిగతావాళ్లందరూ రాత్రిళ్లు హాయిగా నిద్దరోయి, తిరిగినట్టు డయిరీలు రాసెయ్యడం లేదురా? నేనేదో మరీ కరెక్టుగా పోతే మెడచుట్టుకుంది. ముసుగెట్టెయ్యవలసిందిరా అసలు.

బం—చిత్తం.

రావు—వెళ్లాముక్కడో అనేసే పద్ధతో మంటావు నువ్వు.

బం—అవును బాబూ! రెండో కంటోడికి తెలీకుండా!

రావు—సరే...అలానే కానీ...ఆపత్సమయంలో నను లేవకుండా గాఢంగా క్లట్టుకున్నాట్ట! గాలికి పోయే మాటంటేమాత్రం మన పరువు పోకుండా యేమిటి? పైగా బెదిరించి పుచ్చుకున్న క్షమాపణ తెంతలేసు!

(అని పెట్టెదగ్గిరికి వడుస్తాడు. లోపలి కెళ్లి, దీపమేసి, ఒక్కక్షణం తటపటాయిస్తూ ఆగుతాడు. తరవాత వ్యక్తిని 'సార్' అని లేపుతాడు. వ్యక్తి లేవడు.)

రావు—(చేతులు నలుపుకుంటూ) నేను...క్షమాపణ... అని వ్యక్తిని గట్టిగా కదుపుతాడు. వ్యక్తి 'బాబో'-అంటూ ఉలిక్కిపడిలేచి, ఆతొందరలో కూచోబోతాడు. కాని లేవలేక వెనక్కిపడిపోతాడు. ఉక్కిరిబిక్కిరయి గుటకలేస్తాడు. రెండో ప్రయాణీకుడు లేచి వ్యక్తిమొహంమీద నీళ్లు జల్లుతాడు. కొంచెం తేరుకుని వ్యక్తి...'చంపేశాడు. నారాయణా...నారాయణా...'అంటాడు)

రెం. ప్ర—డాష్ ఫెలో, మళ్లీ వొచ్చావురా!

రావు—నేను...నేను...

రెం. ప్ర—నీమీద కూనీకే పెట్టిస్తాను...ఉరితీయించేస్తాను జాగర్త!

రావు—క్షమాపణ.

రెం. ప్ర—దిగు ముందర...ఊ (అని మీదికి రాబోతాడు.)

(రావు తొందరగా పెట్టెదిగిపోతాడు...స్టేషనుందరిపైపు పరుగెత్తుకొచ్చేస్తాడు. అదేసమయంలో రైలుగంట కొడతారు. రైలు బయలుదేరడానికి ఈల వూదుతారు. "మధ్యతెర" పడిపోతుంది. రైలు కదలిపోయిన చప్పుడు. వెనకనించి ప్రయాణీకుడి ధ్వని వినిపిస్తుంది.)

రెం. ప్ర—దాటిపోయా ననుకోకు. ఉరితీయించేస్తాను... జాగర్త!

(స్టేషనుమీద రావు ఒక్కడూ వున్నాడు)

రావు—ఈ లోకాన్ని తృప్తిపరద్దామని చూసి లాభం లేదు వెధవరైలు...వెధవకంపెనీ...వెధవలోకం...ఛీ...లోకులు పోకికాకులు...

(అని గబగబవెళ్లి పడకకుర్చీలో పడుకుని ముసుగెట్టేసుకుంటాడు)

[దీనికి చెకోవ్ వ్రాసిన Oh the People! అన్న కథ ఆధారం]





నాట్యకళ-దాని పరమార్థము

= శ్రీ విస్సా అప్పారావు =

నాట్యకళ అతిప్రాచీనమైనది. మాట, చేష్ట, భావము మానవ ప్రకృతిలోని భాగములు. వీటియొక్క సమ్మేళనమైన ఈ కళ అతిపురాతనమైనది. ఋగ్వేదములో ఈ నాట్యప్రశంస గలదు. నక్కి అంచులు గల బట్టలు ధరించి పిక్కలవరకు మాత్రము దుస్తు వేసికొని స్త్రీలు నాట్యమాడిరని, యజ్ఞసమయములయందు కన్యలు ఆనందదాయకముగా నాట్యమాడేవారని, చూపులకు అపవర్గసుఖము నిచ్చు అందగత్తెలు చాతుర్యముగా, కదలికతో నాట్యము ప్రదర్శించే వారని, మగవాళ్లు—నటులు—యుద్ధవిషయములను ప్రదర్శించే వారని ఉన్నది. రామాయణములో—అయోధ్యలోను, వాలియొక్క రాజభవనములోను, లంకలోను ఆటపాటలనుగురించి వర్ణించియున్నది. రాణివాస స్త్రీలు మందిరములలో ఆటపాటల వినోదములను సల్పు చుండిరట. ఒక స్త్రీ తన అసమానమగు నాట్యాభినయముచేత రావణుని మనసు చూరగొన్నదట. ఆమె నిద్రచే వివశయైనను, ప్రదర్శనమందలి అంగచేష్ట లన్నీ నిద్రయందుకూడ నిలచియుండెనట. భారతములో విజయుడు పేడియై ఉత్తరకు నాట్యము చెప్పిన సంగతి ప్రసిద్ధమేగదా. వీటినిబట్టి సంగీతము, నాట్యము కన్యలకు, స్త్రీ లకు నేర్పెడివారని తేలుచున్నది. రుద్రకుడను నను నృపతి వీణ వాయించుచుండగా అతని సతి నృత్యము చేసినదట. సింహళరాజు పరాక్రమబాహుడు తన భవనమందు నాట్యశాల నిర్మించెనట. అతని భార్య రూపవతి. నృత్యమున నేర్పుగలదట. ఇట్లే నాటకముల యందు, ప్రబంధములయందు అనేక ఉదాహరణలు చూడవచ్చును.

దీనినిబట్టి ౨౦౦౦ సంవత్సరములకు పూర్వమే నాట్యకళ అభివృద్ధిలో ఉన్నదని స్పష్టము. నేడు లభించే ప్రాచీననాట్య శాస్త్రగ్రంథము భరతుని నాట్యశాస్త్రము. * ఇతడు ౨౦౦౦ సం. క్రిందటివాడు. ఇతడు ఇతర గ్రంథకర్త లున్నట్లు చెప్పియున్నాడు.

* భరతశాస్త్రమును నాట్యవేద మని చెప్పుచున్నారు. అనగా నాట్యశాస్త్రము వేదసారముగా చెప్పబడినది. ఋగ్వేదము నందలి పాఠ్యమును, యజుర్వేదమునుండి అభినయమును, సామవేదము నుండి గీతమును, అథర్వణమునుండి రసమును చేర్చి కల్పింపబడినదని భరతుడు చెప్పియున్నాడు. ఋగ్వేదములో వాదోపవాదములు, సంభాషణలు చాలా కలవు. ౧౦-వ మండలములో యమీ, యముల సంభాషణ, పురూరవసఊర్వశుల సంవాదము చూడవచ్చును. ఇవే నాటకరచనలోని పాఠ్యమునకు-వాచ్యమునకు-మాతృక లవదగును. యజుర్వేదము క్రియాత్మకముగనుక అభినయమునకు మాతృకగా చెప్ప బడినదని తోచుచున్నది. సామగానము సంగీతమునకు మాతృక యని అందరు ఎరిగిన విషయమేగదా. ఉదాత్త, అనుదాత్త, స్వరితముల నాధారముచేసికొని క్రమముగా సామగానమునుండి సప్తస్వరములు పుట్టినవి. అథర్వణవేదమందు మంత్రవిషయ మున్నది. దానినుండి రసము నెట్లు గ్రహించినది తెలియుట లేదు.

భరతాచార్యునికంటె ప్రాచీనులైన పాణిన్యాచార్యుడు శిలాలి, కృశాశ్వ అను ఇద్దరు నటసూత్రకర్తల పేరు చెప్పియున్నాడు. తన కాలమునకు గల నానావిధ నాట్యసూత్రములను క్రోడీకరించి భరతముని ౩౬ అధ్యాయములు గల అమూల్యమగు గ్రంథమును వ్రాసియున్నాడు. తరువాతి అన్ని గ్రంథములకును ఇదే మూలమని, మాతృకయని చెప్పవలెను. ఇందు వివిధవిషయములు గలవు. ముఖ్యముగా నాటక కళను గురించి విపులముగా ఈ గ్రంథమం దున్నట్లు మరి ఏ గ్రంథమందును లేదు. నేను చెప్పే విషయము లన్నిటికిని భరతుని నాట్య శాస్త్రమే ముఖ్యాధారము.

నాట్యప్రయోజనము

లోకములోని పరమార్థమును వెల్లడిచేయుట నాట్యముయొక్క ప్రయోజనము. ఒకరిని దూషించుటకు కాదు; ఒకరిని సంతోషపరచుటకు కాదు. లోకవృత్తులలోని సర్వచైతన్యములనుండి నాట్యము సృష్టింపబడినది. పనులు, ఆటలు, లాభము, శాంతి, నవ్వు, యుద్ధము, కామము, సంహారము మొదలైనవి చైతన్యములు. నాట్యము నీతిమార్గమున పోవువారికి ధర్మఫలముల నిచ్చును. కామమునుబట్టి వారికి సుఖము నిచ్చును. అవిధేయులకు అడ్డములను, విధేయులకు శిక్షను, దుర్బలులకు శక్తియు, శూరుల కుత్సాహమును, తెలివిలేనివారికి వివేకమును, పండితులకు విజ్ఞానమును, రాజులకు వినోదమును, విచారగ్రస్తులకు శాంతియు, లాభముకోరువారికి లాభమును, విపన్నులకు స్థైర్యమును ఇచ్చును. ఈ శాస్త్రము నానావిధ భావములతో నిండియుండును. నానామనోవికారములను వ్యక్తపరచును. ఉత్తమ, మధ్యమ, అధమజనులయొక్క నడవడులకు సంబంధించి గొప్పగొప్ప బోధలు, సలహాలు, వినోదములు, అభ్యుదయములు కలిగించును.

నాట్యము త్రివిధము

వాద్యములతోను, గాత్రముతోను పాడుట, తాళము వేయుట, ఆడుట—ఇవన్ని కలిసినప్పుడు దానిని నాట్యమంటాము. దీనిలో వాచ్యము ముఖ్యము. అనగా మాటాడుట-పాడుట. మాటకు, పాటకు అర్థముండును; భావ ముండును; వీటిని తెలుపుటకుచేయుటకు అభినయ ముండును. అభినయ మనగా వాచ్యముయొక్క అభిప్రాయం చూచేవారికి అందివ్వడం. దాని భావమును వారి మనస్సుకు తట్టేటట్టు చేయడం. అలా జరిగినప్పుడు చూచేవారి మనస్సుకు అభినయించినవారి భావము అందుటచేత రసము పుట్టును. మరియు పాట, ఆట తాళబద్ధములుగా ఉండవలెను. ఆట, పాట, వాద్యము మూడును ఒకదానిలో ఒకటి మిళితమై మాధుర్యము కలిగిస్తే దానిని లయ అంటాము(లయసామ్యమ్).

వాచ్యము లేక, రసభావములు లేక తాళబద్ధముగా ఆడుట నృత్తము. ఇందలి చేష్టలకు, అంగవిన్యాసములకు అర్థము, భావము ఉండవు. ఒక నియతమైన పద్ధతిలో, ఆనందకరమై, ఉత్సాహకరమై, అభ్యుదయసూచకమై కనులపండువుగా ఉండును. నృత్తమందు ముఖ్యముగా rythm balance ప్రదర్శింపబడును. వట్టి మూగఆట. రసభావయుతమయిన అంగవిన్యాసమును నృత్యము అంటాము. ఈనృత్యము రెండువిధములు. ఉద్ధతమైన అంగవిక్షేపములతో, ఆర్భాటముతో శక్తివంతమైన నృత్యము తాండవము. శివప్రసాదము. మృదుమధురమై కోమలములగు అంగవిక్షేపములతో కూడిన సుకుమారనృత్యము లాస్యము. పార్వతీప్రసాదము. ఇందు అభిప్రాయమును మాటలతో పనిలేకుండా వ్యక్తముచేయవచ్చును. నృత్యమునకు అభినయము ముఖ్యమన్నమాట. కేవలము అభినయము మాత్రమే ఉండును కాని, వాచ్యము ఉండదు. మాట ఏలాగునైతే అభిప్రాయమును వెల్లడిచేస్తుందో అలాగునే మాటలేకుండా అభినయముకూడా వెల్లడిచేస్తుంది. అందుచేత వ్యవహారమందు వాచ్య మెట్టిదో నృత్యమందు అభినయ మట్టిదే. ఇదీ ఒక భాషే. నృత్య భాష అభినయము. వాచ్యము వ్యవహారమందలి సాధనము. అదికూడ అభిప్రాయమును తెలుపు మార్గమే. మాట లేకుండా కూడా అభిప్రాయమును వేరేమార్గముల సాధించవచ్చును. కనుక అభినయములో వాచ్యముకూడా ఇమిడిఉంది.

అభినయము నాల్గువిధములు

వాచికము, ఆహార్యము, ఆంగికము, సాత్వికము అని అభినయము నాల్గువిధములు. వాచికము అభిప్రాయమును మాటలతోగాని, వృత్తముతోగాని, పాటతోగాని చెప్పేవది. ఆహార్యము వస్త్రములు, ఆభరణములు మొదలైన వస్తుసహాయముతో అభిప్రాయమును వెల్లడిచేయుట. కాషాయవస్త్రములు, కమండలాదులు సన్యాసిని తెలుపుదుచేయునట్లు. ఆంగికము చేష్టలతో తెలుపుదు చేయుట. అంగవిన్యాసములు కలవి. ఈచేష్టలు శరీరమంతటితోను చేయునవి కొన్ని; ముఖభేదములతో కొన్ని; ఇవిగాక తల, వక్షము, నడుము, కాళ్లు, చేతులు, ప్రక్కలు అను షడంగములతో కొన్ని; కండ్లు, కనుబొమలు, రెప్పలు, చెక్కిళ్లు, అధరము మొదలైన ఉపాంగములతో కొన్నియును అయియుండును. ముఖ్యముగా నేత్రాభినయముతోను, ముఖరాగముతోను కూడియుంటే అన్ని భావములు, అన్ని రసములు స్పష్టమగును. స్తంభన, చెమట, గగుర్పాటు, స్వరభేదము, ఒణుకుట, తెల్లబోవుట, ఏడ్పుట, ప్రళయము (అనగా మనస్సులోని ప్రళయము) అను ఈ ఎనిమిది చేష్టల చేత మనోగతములగు హావభావములను తెలుపుట సాత్వికాభినయ మందురు. సాత్విక మనగా మనసిజము; సత్వము, లేక మనస్సునుండి పుట్టినది.

సర్వాభినయములతో కూడినది, వాచ్యప్రధానమైనది నాట్యము. "వివాహాభ్యుదయాదౌ సర్వరసప్రధానం నాట్యం. అంగవిక్షేప మాత్రం నృత్తం" నాట్యము కావ్యార్థమును, ఇతివృత్తమును, కథను

మువ్యక్తము చేయుటకై కల్పించబడినది. ఇది సంగీతసాహిత్యసహితము. సంగీత మనగా నృత్త, వాద్య, గీతములతో కూడిన దన్నమాట. కేవలనృత్త, వాద్య, గీతములతోడి ఆటను నృత్య మందురు. గీతము, సాహిత్యము నృత్తమున కవసరము లేదు. కాని నృత్తము స్వతస్సిద్ధముగా రంజకమైనది. పాటకు అందము నిచ్చును. పాటను కళ్లకు కట్టిచూపునది నృత్తము. కేవలము వినుటవల్ల కలిగే రసము కంటె అందు ఇంకను దాగియున్న అందమును నృత్తము చూపించి రసస్ఫూర్తిని సంపూర్ణము చేయును.

నాట్యమునకు పైన చెప్పినట్లుగా సంగీతము, సాహిత్యము, అభినయము, నృత్తము అంగములు. భరతనాట్యమని మనము సాధారణముగా చెప్పు మాటలోని నాట్యమున కిదే యర్థము. కాని నృత్తము కాక తక్కిన మూడు చేరినప్పుడు దానిని నాటకకళ యని యందురు. దీనినికూడ నాట్యము అని భరతాచార్యుడు వ్యవహరించి యున్నాడు. అందుచేతనే నాట్యశాస్త్రమందు ఈ రెండువిధములైన నాట్యములననుసరించియు సంపూర్ణముగా చర్చించియున్నాడు. రెండువిధములను నాట్యములును కావ్యార్థమును వ్యక్తముచేయునవే. కాని నాటకమందు ప్రతిపాత్రకు ఒక్కొక్క నటుడో, నటో ఉండును. వివిధపాత్రలేగాక వివిధాహార్యములు, వివిధవాచ్యములు పాత్రౌచిత్యమునుబట్టి ఉండును. నాటకమునందు ఆంగికాభినయము అంత ఉండదు. సాత్త్వికాభినయము హెచ్చుగా ఉండును. లోకములోని ధర్మము హెచ్చుగా నాటకమున జూపబడును. రెండవ నాట్యమందు, నృత్యమందు ఏకపాత్ర, ఏకఆహార్యము ఉండును. ఇతివృత్తమును వివిధాభినయములతో - ముఖ్యముగా హస్తములు, ముఖాభినయములు, / నేత్రాభినయములతో -అనగా ఆంగికాభినయములతో నింపియుండును. ఏడ్చుట అభినయించవలసినచో నాటకమున ఏడ్చుట జరుగును. కాని నృత్యనాట్యమందు ఒక సంజ్ఞతో అది వ్యక్తముచేయబడును. అనగా ఈ నాట్యమందు లోకధర్మమునకు మెరుగుపెట్టి, వ్యంగ్యాత్మకముగా, నానార్థముగా రసమును పుట్టింపదరు. దీనిని నాట్యధర్మ మందురు. అందుచేతనే నాటకమందు లోకధర్మమువలె నృత్యప్రధానమగు నాట్యమందు నాట్యధర్మము ప్రధానము. ఇట్లే సర్వకళలయందు లోకధర్మము, కళాధర్మము మిళితములై సందర్భానుసారముగా, హెచ్చుతగ్గులుగా ఉపయోగింపబడును. నాట్యధర్మము లేనిచో నాట్యము కళ కానేరదు. ఇట్లే అన్నికళలకును అన్వయము.

నాట్యశాస్త్రములో ౨౬-వ అధ్యాయములో (౧౨౭-౧౩౦) ఇట్లున్నది:—

"యాని శాస్త్రాణి యే ధర్మా యాని శిల్పాని యాః క్రియాః,
లోకధర్మప్రవృత్తాని నాట్య మిత్యభిసంజ్ఞితమ్.
నచ శక్యంహి లోకస్య స్థావరస్య చరస్యచ,
శాస్త్రేణ నియతం కర్తుం నానాచేష్టావిధిం ప్రతి.
నానాశీలాః ప్రకృతయః శీలే నాట్యంప్రతిష్ఠితమ్,
తస్మా ల్లోకప్రమాణంహి జ్ఞేయం నాట్యప్రయోక్తృభిః"

నాట్యమునకు పునాది లోకానుభవముగనుక. ప్రతిఅభినయమునకును లోకమే మాతృక. ఆ మాతృకయొక్క ఆకారము, చేష్ట, చిహ్న, లేక స్థితి, జాతి బాగుగ పరిశీలించినచో లోకధర్మమునుండి అభినయములు ఎట్లు సృష్టింపబడినవో తెలియగలము. ప్రతిఅభినయమునకును ఉపపత్తి ఉన్నది. ప్రతిహస్తమునకును కారణమున్నది. వాటి వివిధములగు ఉపయోగములకు, అనగా వినియోగములకుకూడ నుపపత్తి ఉన్నది. వాటి నన్నింటిని పూర్ణముగా ఎరిగినగాని నటీనటులు ప్రజ్ఞావంతులు కాజాలరు. ఇది కష్టించి, సంప్రదాయము నెరిగి, తెలిసికొనవలసినది. అట్టి నటులు ఏరసమునైనను, ఏభావమునయినను ప్రదర్శించగలరు. నేర్చిన విద్యకంటె లోకానుభవమే మేలని, ఆ అనుభవసారమే నాట్యధర్మమని భరతుడు చెప్పియున్నాడు.

న ర్త కి ల క్ష ణ ము

ప్రతిస్త్రీపాత్ర నటించుటకు తగదు. మనోహరరూపిణి, యౌవనవతి, విశాలమైన కన్నులు గలది, మణిమయభూషితయై మనోహరమగు ముఖలక్షణమును, సర్వాంగసౌష్ఠవమును కలది, ఎక్కువైన లావు, సన్నదనము, మిక్కిలి పొడుగు, పొట్టి లేక ఏరాపిడియగు ఆకారము కలదియై, సరసస్వభావము, వాక్యమందలి అర్థసామర్థ్యములు గ్రహించగల నిపుణత్వము, లయయుక్తముగ అడుగువేయుటలో లాఘవము, నేర్పు కలది, రంగభీతి లేనిది, సభాకంపము లేనిది, గీత వాద్య తాళ పరిజ్ఞానము కలది, అభినయనైపుణ్యము కలది యైయున్న స్త్రీయే నర్తకిగా ఉండవలెను.

న టు ని ల క్ష ణ ము

నందికేశ్వరుని అభినయదర్పణమం దిట్లున్నది:—

"రూపవాన్ మధురాభాషీ కృతీ వాగ్మీ పటు స్తథా,
కలాంగనానురతశ్చైవ శాస్త్రజ్ఞో మధురస్వరః.
గీతవాద్యాదినృత్యజ్ఞో సిద్ధకః ప్రతిభానవాన్,
ఏతాదృశగుణై ర్యుక్తో నట ఇత్యుచ్యతే బుధైః."

నా ట్య క్ర మ ము

కంఠముతో గానము చేయవలెను. హస్తాభినయముతో అర్థము చూపవలెను. కళ్లతో భావము వ్యక్తముచేయవలెను. కాళ్లతో తాళము వేయవలెను. ఎచ్చట హస్తమో అచ్చటనే దృష్టి, దృష్టి ఉన్నచోటనే మనస్సు, అచటనే భావము, అచటనే రసము ఉండును. ఇట్టి సామ్మేళనము కలిగినప్పుడే నాట్యము రసాత్మక మగును.

"కంఠేనాలంబయేద్గీతం హస్తేనార్థం ప్రదర్శయేత్,
చక్షుర్భ్యాం దర్శయేద్భావం పాదాభ్యాం తాళమాచరేత్.
యతో హస్తస్తతో దృష్టిర్యతో దృష్టిస్తతో మనః,
యతో మనస్తతో భావో యతో భావస్తతో రసః"

సభాలక్షణము *

పైన ఉదాహరించినట్లుగా నటీనటుల నాట్యక్రమము, ప్రజ్ఞ విశేషములు ఉన్నప్పుడు అట్టివారి విద్యను గ్రహించుటకు ఎట్టివారు సభ్యులైయుండవలె నను విషయము చాలా అవసరము. ప్రతివారికి అచట చోటు లేదు. అభినయశాస్త్రము మొక్కపాటియైనా తెలియని, విద్యాగంధములేని అనాగరకులకు ఆసభలో తావులేదు. పండితులు, రసికులు, సహృదయులు సభ్యులుగా ఉండిన ఉభయతారకముగా ఉండునను టకు సందేహములేదు. భరతుని కాలమందు ఈకళ గొప్పస్థితిలో ఉండియుండవలెను. ఉపన్యాసకుడు తన పటిమచేత, వాక్శక్తిచేత సభ్యులను తన యభిప్రాయమునకు ఎట్లు వశపరచుకొనగలుగునో అట్లే ఆనాడు సౌన్దర్యలావణ్యాతిశయముచేత, అభినయప్రజ్ఞచేత, ప్రౌఢిమచేత నటి తన సందేశమును సహృదయులగు సభ్యుల కందజేయగలుగుచుండెను. అట్టి గొప్ప పరిణామమును నాట్యకళ నాడు పొందియుండెను.

ఇట్టి ఉత్కృష్టమైన కళ క్రమముగా అనేక కారణములచేత, దుష్టులచేత హీనస్థితికి వచ్చినది. ఏమియు రానివారు అభినయించుట, ఏమియు ఎరుగనివారు చూచి మెచ్చుకొనుటలోనికి వచ్చినది. చేతులు, మూతులు, కండ్లు, ఒళ్లు త్రిప్పినంతమాత్రమున, ఇటు అటు గెంతినంతమాత్రమున అభినయము, నాట్యము కాజాలవు. అట్టియెడ రసము పుట్టజాలదు. రసాభాసమే యగును. ఇట్టి దుస్స్థితినుండి నాట్యకళ నుద్ధరించవలెను. దానికి నేటి పరిస్థితులు ఆశానాచకములుగా ఉన్నవి. సంగీతసభలలోని సభ్యులు, ఆసభాపతులు* పూర్వశాస్త్రవిధానమును, సంప్రదాయమును బాగుగా తెలిసికొనవలెను. అప్పుడుగాని నాట్యకళ సరియైన స్థితికి రాజాలదు, నాడుగాని నాట్యకళాశిక్షణ మంచిస్థితికి రాదు. నాట్యశాస్త్రజ్ఞానము, ప్రదర్శనాచాతుర్యమాధుర్యములు హెచ్చవు. పురాణదంపతులైన పార్వతీపరమేశ్వరులు తాండవము, లాస్యము అను నృత్యభేదములను భరతశాస్త్రమునకు ప్రసాదించినారని పైన చెప్పియున్నాను. వీరే నాట్యకళకు ఆధారభూతులు. అట్లే ఎన్నడైనను, ఏనాటికైనను నాట్యకళను భావార్థకర్తలిద్దరు అభ్యసించి, నిరంతర

* సభానాయక లక్షణమ్:—

శ్రీమాన్ ధీమాన్ వివేకీ వితరణనిపుణో గానవిద్యాప్రవీణః
సర్వజ్ఞః కీర్తిశాలీ సరసగుణయుతో హావభావేష్వభిజ్ఞః,
మాత్సర్యాద్యైర్విహీనః ప్రకృతిహితః సదాచారశీలో దయాళుః
ధీరోదాత్తః కలావాన్ నృపసదసి చతురోఽసౌ సభానాయకః స్యాత్.

సాధకులై లోకమునకు ప్రదర్శించి, పవిత్రశీలవంతులై, ఆదర్శచరిత్రులై యున్నగాని కళ గొప్పస్థితికి రాజాలదు. అట్టి సూచనలు భారతదేశమందు—ముఖ్యముగా ఆంధ్రదేశమందు పొడసూపుచున్నందులకు సంతోషము.

ఆధ్యాత్మికము

"జటాటవీగలజ్జలప్రవాహపావితస్థలే
గలేవలంబ్యలంబితాం భుజంగతుంగమాలికామ్,
డమడ్డమడ్డమడ్డమన్నినాదవడ్డమర్వయం
చకార చండతాండవం తనోతు నశ్శివశ్శివమ్."

భారతీయవిజ్ఞానములో అన్నివిద్యలు, కళలుకూడ ధర్మార్థకామమోక్షములను చతుర్విధపురుషార్థసాధనకొరకే నిశ్చయము. పరమార్థమును మోక్షసాధన మెన్నిమార్గములచే పొందవచ్చునో చెప్పబడినది. అన్నిమార్గములకును గమ్యస్థానము మోక్షమే, ఆత్మానందమే, శాశ్వతశాంతియే. సర్వవిషయములు, సర్వశక్తులు, విద్యలు, కళలు పరస్పరవిరుద్ధములు కాక, సర్వసామరస్యముతో ఒప్పి, సర్వేశజ్ఞానమునకే తోడ్పడునని భారతీయసంస్కృతి బోధించుచున్నది. నాట్యకళయొక్క అంతరార్థము, ఆధ్యాత్మికభావము ఎట్టిదో కొంత సూచించెదను. ఆనందకుమారస్వామిగారు ఈవిషయమై విపులముగాను, ప్రమాణవంతముగాను 'శివనృత్య'మను (Dance of Siva) గ్రంథములో చర్చించినారు.

ఆదిదేవుడైన పరమశివుడు ఆదినటుడు, మహానటుడు, నటేశుడు, నటరాజు, నటనాథుడున్నూ. ఈ నటనాథమూర్తినే వైష్ణవులు రంగనాథునిగా మార్చి ఆరాధించినారు. నటరాజునకు సర్వజగత్తు నాట్యరంగము.

"ఆంగికం భువనం యస్య వాచికం సర్వవాఙ్మయం,
ఆహార్యం చంద్రతారాది తం నుమః సాత్త్వికం శివం."

ఆయనశక్తివల్లనే జీవులందరు చైతన్యము కలిగి బొమ్మలవలె ఆడుచున్నారు. ఈచైతన్యమే ఆత్మశక్తి - ఈశ్వరశక్తియున్ను.

జీవిత మొక అరణ్యమువంటిది. దేహమును అట్టిదే. అందు అనేకశక్తులు అడవిలోని చెట్లవలె, మార్గములవలె ఉన్నవి. వీటి నన్నిటిని సమీకరణము చేయు టెట్లు? వీటినన్నిటిని ఏకీభావము పొందించు టెట్లు? అను నీ తీవ్రసమస్యకు సమాధానముగా కళారూపమును శివనృత్య మేర్పడినది. సుఖదుఃఖములు మొదలైన ద్వంద్వములచే చిందరవందరైన మన జీవితములు విషాదహేతువులు కాకుండ ద్వంద్వములను సమానమైన పాళ్లతో సమ్మేళనచేసినచో సుఖప్రదమగు జీవితపరమార్థమును పొందవచ్చునని పూర్వుల సిద్ధాంతము. ఆదికారణమును, నియతమైన గతితో కూడినట్టియు, స్పందనాత్మకమును అగు ఈశ్వరశక్తియొక్క వ్యక్తీకరణమే శివనృత్యము (Manifestation of primal rythmic energy). భూభ్రమణము, దానివలన

ఆంధ్ర నాట్యదంపతుల నాట్యభంగిమలు

[శ్రీ రమణరావు, శ్రీమతి సామ్రాజ్యం]



రాధాకృష్ణ నాట్యము



శివ-పార్వతీ నాట్యము



జతిస్వరము



అలరిమ్పు

తోచు నక్షత్రముల, రాసుల భ్రమణము, గ్రహములయొక్క సంచారములు, చంద్రునియొక్క సంచారము—ఇవన్నియును నియామకమైన గతి గలిగి అన్యోన్యము సంబంధము గలిగి ప్రవేశనిష్క్రమణములు కలిగి గతులలో భేదములేక అనాదినుండి జరుగుచున్నవి. ఇది అంతయు ఒక బృందనృత్యముగా భావింపబడినది.

నృత్యము చైతన్యశక్తి విజృంభణము. అన్నిటికిని ప్రారంభము నృత్యమే. సృష్ట్యాదియందు మనుష్యుడు సృష్టివైచిత్ర్యమునకు చకితుడై సృష్టికర్త నుద్దేశించి తన ఆనందమును వెల్లడించుటకై ఒడలెరుగని నృత్యము చేసియుండును. పర్వతశిఖరాగ్రమున మంచుకొండపై నివసించు ఆదిదేవుడైన శంకరునికి ఆర్యులు తమ కృతజ్ఞతను నృత్యరూపమున తెలిపియుందురు. నేటికిని చిన్నపిల్లలకు సంతోష కారణము కలిగినప్పుడు మాటలచేత కాకుండ ఎక్కువగా గంతులు వేయుచు వారు దానిని వెల్లడిచేయుదురు. ఇట్టిది మానవులకే కాదు, జంతుజాలమునకును ప్రకృతియే. మానవహృదయమును ఆకర్షించిన ఈశ్వరసృష్టివైచిత్ర్యము, ఈశ్వరశక్తి క్రమముగా ఆరాధనీయమై, పూజార్హమై ఒక ఆకారమును పొందియుండును. ప్రథమమున మానవుడు ప్రదోషకాలములయందు నాట్యరూపమున ఆరాధించియుండును. స్తోత్రరూపముగా అందరు కలసి ఆడియుందురు. ఈ ప్రదోషనృత్యమును క్రమముగా ఇలా భావించియున్నారు. ఇదే ప్రథమశివనృత్యము. ముజ్జగముల తల్లియగు జగన్మాతను నవరత్నాలంకృతమగు బంగారుపీఠమున కూర్చుండబెట్టి కైలాసశిఖరమున దేవశ్రేష్ఠులందరు తనచుట్టు నుండగా శూలపాణి నృత్యము చేసెను. సరస్వతి వీణవాయించును. ఇంద్రుడు వేణుగానము చేయును; బ్రహ్మ తాళములు వాయించును; లక్ష్మి పాడును; విష్ణువు మద్దెల వాయించును; తక్కినవారు ఇరుగడల నిలచియుందురు.

"కైలాసశైలభువనే త్రిజగజ్జనిత్రీమ్
గౌరీం నివేశ్య కనకాంచితరత్నపీఠే
నృత్యం విధాతు మభివాంఛతి శూలపాణౌ
దేవాః ప్రదోషసమయేను భజంతి సర్వే.
వాగ్దేవీ ధృతవల్లకీ శతమఖో వేణుం దధ త్పద్మజ
స్తాలోన్నిద్రకరీ రమా భగవతీ గేయప్రయోగాన్వితా,
విష్ణు స్సాంద్రమృదంగవాదనపటుః దేవా స్సమన్తాః స్థితాః
సేవంతే తమను ప్రదోషసమయే దేవం మృడానీపతిమ్."

తరువాత శివనృత్యమునకు గొప్ప అంతరార్థము కల్పింపబడినది. అట్టి అర్థమును మూర్తివంతముగా శిల్పులు సృష్టించినారు. ఈ నృత్యమును నటరాజనృత్య మందురు. నాదాంతనృత్యము. దీని భావమును వ్యక్తపరచునదే నటరాజమూర్తి. ఇది నాదాంతనృత్యస్వరూపము. ఈ మూర్తియొక్క వివరములు ఇవి.

నటరాజస్వరూపము

చేతులు నాలుగు (నాల్గుదిక్కులు), జటాజూటము (పర్వతపంక్తి, పర్వతాగ్రమును సూచించును. యతియని చెప్పును), అందు చుట్టుకొని నల్లత్రాచు (ఇది సహజమే పర్వతములలో), ఒక పుర్రె, గంగ, పైన చంద్రవంక (ఇవి శివునిచిహ్నాలు. బ్రహ్మకపాలము-పుర్రె; స్వచ్ఛమై నిర్మలమైన చిచ్ఛక్తి-గంగ, లేక పర్వతములపైని మంచుగా గడ్డకట్టిన గంగ; చంద్రవంక-ఆనందమయమగు చల్లని ఆకాశతత్త్వమునకు గుర్తు, లేదా ప్రదోషకాలమున పర్వతాగ్రములపైతోచు ఆకాశతిలక మనదగు చంద్రవంక). కుడిచెవికి పురుషులు ధరించునట్టి, ఎడమచెవికి స్త్రీలు ధరించునట్టి చుట్లు (అర్ధనారీశ్వరుడని సూచన). ఒకచేతిలో (కుడి) ఢమరు కను వాద్యము, రెండవ కుడిచేతితో అభయప్రదానమును చూపుచున్నట్లు ఉన్నది; ఎత్తిన ఎడమచేతిలో అగ్నిజాల. కుడికాలిక్రింద ములయకు డను పొట్టి రాక్షసుడు. అతని చేతిలో పామున్నది. ఎడమకాలు ఎత్తబడియున్నది. దీనినే కుంచితపాద మందురు. రెండవ ఎడమచేయి ఈ కుంచితపాదమును చూపుచున్నది. ఈ మూర్తి ప్రకాశమానమగు పద్మపీఠమున నుండును.

అంతరార్థము

ఈ నృత్యము పరమేశ్వరుని పంచకృత్యములను సూచించును. సృష్టి, స్థితి, సంహారము, తిరోభావము (మాయ), అనుగ్రహము (మోక్షము) అని. ఇవి వరుసగా బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర, సదాశివుల క్రియలు. ఇవే విశ్వమందలి సర్వచైతన్యమునకును మూలాధారములు. వీటినే నటరాజమూర్తిస్వరూపము తెలుపుచేయుచున్నది. చేతిలోని ఢమరము జగత్కారణమైన (సృష్టికి) శబ్దమును సూచించుచున్నది (శబ్దనిష్ఠం జగత్). అభయహస్తము స్థితి (పోషణ)ని సూచించుచున్నది. దీనివలన మానవుడు శాంతి, సుఖము, జ్ఞానములను పొందగలడని అభయము ఇచ్చుట గోచరించును. అగ్నిజ్వాల సంహారసూచకము. సంసార మను సర్పమును ధరించి మాయాస్వరూపమైన అహంకారమును ములకుడను రక్కసి సూచించుచున్నాడు. అట్టి అహంకారమును పరమేశ్వరుడు త్రొక్కిపెట్టియుంచినాడు. ఎత్తిన పాదము మోక్షసూచకము. ప్రకృతి, మాయ, ప్రపంచము అను వీటిని దాటి పైకి గంతువేయుటయేగదా మోక్షము? అందుచేత ఈ పైకెత్తబడిన కాలు భవబంధవిమోచనాసూచకము. ఇట్టి నటరాజమూర్తి తాండవించు జ్యోతిర్మయమగు పద్మపీఠము నిర్మలమగు హృత్పుండరీకమును తెలుపుచేయుచున్నది. శక్తి ఆనందస్వరూపిణి. శక్తి పురుషునితో కలసినప్పుడే, ఏకమైనప్పుడే ఈ నిత్యమైన జ్ఞానముదయించును. అట్టి శివశక్త్యాత్మకమగు అర్ధనారీశ్వరస్వరూపమే నటరాజమూర్తి.

చిదంబర రహస్యము

ఈ నటరాజు తాండవముచేయు స్థలము తిల్లవనము. అడవివంటి దేహము, ప్రపంచముకూడ అని గ్రహించవలెను. ఈ అంతనృత్యము ప్రతిదేహియందు సాగుచున్నది. మరియు ఈస్థలము చిదంబరమని చెప్పబడినది. చిదంబర/మను పుణ్యక్షేత్రము. చిత్ అను అంబరమే చిదంబ

రము. అంబర మనగా ఆకాశము, శూన్యము. అనగా శ్మశానము. సర్వ మనోవికారములు, ప్రవృత్తులు, ప్రపంచవ్యామోహములు, ఇంద్రియ వ్యాపారములు నశించిన, కాల్చబడిన, స్వచ్ఛమైన చిత్తు అను అంబరము చిదాకాశము. అట్టి పవిత్రమైన స్థానమునకాని, అట్టి నిర్మల మగు అవస్థలోగాని దేహికి జ్ఞానము తాండవించదు. నటరాజ మూర్తి జ్ఞానస్వరూపుడైన పరమేశ్వరుని స్ఫురింపజేయునట్టి మూర్తి. ఈ నటరాజవిగ్రహముయొక్క నృత్యముయొక్క అంతరార్థము మహోన్నతమైనది.

నటరాజ నృత్యముయొక్క భావము శాస్త్రవేత్తలకు, మతకర్తలకు, కళారాధకులకు కూడ సమానముగా ఉత్కృష్టమగు సందేశమును ఇచ్చుననుటలో సందేహములేదు. బహుక్లిష్టమగు జీవిత సమస్యకు సమాధానముగాను, వివిధజాతులవారికి సమ్మతముగాను, ఏదో ఒక శతాబ్దమునకే చెందిన మేధావులకు మాత్రమే కాక, సర్వకాలములయందలి బుద్ధిమంతులకును, రాజులకును, రోగులకును కూడ తృప్తిని కలిగింపగల సర్వభావములను ప్రత్యక్షముచేయగల నటరాజ నృత్యమును కళాపుంగవులగు ఋషిశ్రేష్ఠులు సృష్టించినారంటే ఎవరికి ఆశ్చర్యము, ఆనందము కలుగకుండును? ఈ నటరాజమూర్తియొక్క శక్తిసౌందర్యములు ఎంత దివ్యములు! ఆర్యు లెంతటి ప్రతిభాశాలులు! సర్వదృశ్యములవెనుక తాండవించు శక్తియొక్క స్వరూపమును ఇంతకంటె ఎక్కువగా, మేలుగా సృష్టించవీలగునా? ఢమరుమువలన ద్యోతకమగునది స్పందనము. దానివలన పుట్టు అనంతములగు శక్తితరంగములలోని ఆటుపోటులను, అనంతవిశ్వమందు కలుగుచున్న ఎడతెగని మార్పులను, బ్రహ్మకల్పములలో విశ్వశిల్పమందు జరుగుచున్న సృష్టి,స్థితి, సంహారపరంపరలను ఎరిగి చూచెడు వారికి నటరాజనృత్యము* కరతలామలకముగా చూపించుచున్నది.

వర్తమానయుగ సమన్వయము

పాశ్చాత్య నాగరకత కొన్ని శతాబ్దములుగా సర్వతోముఖముగా విజృంభించినది. ప్రవృత్తిమార్గము ననుసరించినది. వాణిజ్యమును వ్యాపింపజేసి, విజయకాంక్షతో దేశదేశముల నాక్రమించినది. బలవంతులలో రాజ్యకాంక్షలు పెచ్చుపెరిగి ప్రపంచక్షోభకారణమైనది. ఒకతరములోనే రెండు ప్రపంచసంగ్రామము లుత్పన్నమైనవి. యంత్రతంత్రశక్తుల తాండవము చెలరేగినది. దేశదేశములలో లక్షలక్షల ప్రజలను బొగ్గు, బూడిద, మన్ను, మసి, ధూళి, గాలిగా ఒక్కత్రుటికాలములో చేసివేయగల మహాశక్తులు సృష్టింపబడినవి. కాని ఎట్టి శాంతియు లేక ప్రపంచమంతయు అల్లాడుచున్నది.

పాశ్చాత్యులలోని మహామహులందరు వారి నాగరకతలో ఏదో ఒక గొప్పలోపము కలదని గుర్తించియున్నారు. రోమేన్ రోలెండు మొదలగువారు ఈవిషయమును చాలకాలముక్రిందటనే సూచించియున్నారు. ప్రపంచనాగరకతకు పుట్టినిల్లయినట్టిన్ని, ఆధ్యాత్మతత్వమునకు మూలకందమైనట్టిన్ని, సర్వవిజ్ఞానమునకు జీవగఱ్ఱయైనట్టిన్ని ఏషియాఖండమువైపు దృష్టిని త్రిప్పి, చైనా, భారత దేశీయుల సంస్కృతిని స్మరించి, గుర్తించి, కడుపార గ్రోలినగాని ఈ సంక్షోభము, ఈ అశాంతి తీరదని నొక్కి చెప్పియున్నారు. నశ్వరములగు ధన,ధాన్యాదులకై భారత,చైనా దేశములను దండెత్తి కొల్లగొనుటవలన ఏమియును లాభించలేదు. శాశ్వతములగు క్షేమ, లాభములు పొందవలెనన్న భారతాదిదేశీయుల ఆధ్యాత్మికధనమును స్వాధీనముచేసికొనినగాని శాంతి నెలకొనదు. నాలుగైదువేలేండ్లక్రిందటనుండి స్థిరపడి పరమపూజ్యమైన పరమవిజ్ఞానమును కడుపార భుజించినగాని, జీర్ణించుకొనినగాని, దాని శక్తి ప్రపంచమందంతటను పరివ్యాప్తిచెందినగాని నేడు వ్యాపించియున్న అజ్ఞానరూపమననున్న తమము తీరజాలదు. భారతీయుల సంస్కృతి, విజ్ఞానము, వైదగ్ధ్యము ఒకనాడు నిండువెన్నెలవలె ప్రకాశించియుండెను కాని, నేడు అది అణగిమణగి మూలమూలలలో అంతరాళములలో చేరియున్నది. దానిని ఉద్ధరించి తెలిసికొనినగాని తరణోపాయము లేదు. భారతదేశసంస్కృతియొక్క దివ్యాలాపమును పెడచెవినిపెట్టక ఆత్రతతో విని వీనులార గ్రోలవలసిన సమయ మిది. బాహుబలమదాంధకారముచేత విర్రవీగి శాంతినిధానమగు ప్రాచ్యసందేశమును ధిక్కరించినచో పాశ్చాత్యదేశములకేగాక ప్రాచ్యదేశములకుకూడ సర్వనాశనము తప్పదు. తరువాత అంతయు శూన్యమైపోగలదు. సృష్టికర్తచే నిర్మితమైన, అనన్యసామాన్యమైన ప్రకృతిసౌందర్యము, మానవనిర్మితమైన సర్వసంపదలు మాయమైపోవునట్టి భయంకరస్థితి నేడు లోకమున కాపాదించియున్నది. అందుచేత ప్రాచ్యసంస్కృతియొక్క దివ్యబోధనలను గ్రహించి, ఆచరింప తీవ్రప్రయత్నములు చేయవలసియున్నది. ఆత్మశక్తియొక్క స్వరూపమును, సామర్థ్యమును తెలిసికొని అదియే సర్వక్షేమములకు ఆధారభూతమని గ్రహించవలసియున్నది. ఆధ్యాత్మవిద్యయే సర్వశ్రేయస్సుల నియ్యగలదు. అట్టిమార్గమును ప్రపంచము అతిశీఘ్రకాలములోనే అనుసరించి దివ్యవైభవముతో, సర్వమానవసౌభ్రాతృత్వముతో భూలోకస్వర్గమై వర్ధిల్లుగాక! సత్యము, శాంతి, అహింస నిత్యములై నిలుచుగాక! పాశ్చాత్యుల కార్యశక్తి, భారతీయుల ఆధ్యాత్మశక్తి ఏకమై లోకకళ్యాణ మగుగాక!

---

* ఈ నటరాజనృత్యమే సప్తతాండవములుగా కూడ పరిగణింపబడినది. ఆనందతాండవము, సంధ్యాతాండవము, కాళికాతాండవము, త్రిపురతాండవము, సంహారతాండవము, శివాగౌరీతాండవము, అర్ధనారీశ్వర తాండవము అని. ఇవన్నియును పాపమును, అజ్ఞానమును తొలగించుటకు ఏర్పడినవి. ఈ శివతాండవమే శాక్తేయుల మతమందు కాళీనృత్యముగా గ్రహింపబడినది.

బెంగాల్ నేషనల్ టెక్స్టయిల్ మిల్సు లిమిటెడ్.

87, ధరంతొలా వీధి, కలకత్తా.

అధికారముపొందిన మూలధనం — రు. **15,00,000**

చందావేయుబడిన మూలధనం — రు. **10,00,000**

బెంగాలులో ఉన్న టెక్స్టయిలు మిల్లులకు మార్గదర్శిని.

నేతాజీ వ్రాసినది :—

"కేతవస్త్ర పరిశ్రమకు బెంగాలీవారి ప్రతిభ చాల ఉపయోగకరమైనది. యూరపుఖండానికి చేతిగుడ్డల ఉపయోగాలేమిటో తెలియని రోజులలో బెంగాలు మిక్కిలి అందమైన చేతగుడ్డలు తయారుచేస్తూండేది. బెంగాలులో చాల ఎక్కువమిల్లులు దినదినంను హెచ్చుగా పంచిపెట్టుచున్నవి. ఈ తరుణంలో బెంగాల్ నేషనల్ టెక్స్టయిల్ మిల్సు లిమిటెడ్ భవిష్య దభివృద్ధికి పూర్తిగా అవకాశములు కలిగియున్నవి. ప్రజలు ఈ సంస్థ వ్యాపారమునకు సానుభూతితో హృదయపూర్వకముగ తోడ్పడదరని నేను మనసా ఆశిస్తున్నాను."





డాక్టర్ సాహా తెల్పినది :—

ప్రపంచ మంతకూ కావలసిన చేతిగుడ్డలు పంపకం చేస్తుండిన బెంగాలు, అదృష్టదేవత బలవలతంగా తొలగతో యుబడటంతో విదేశీయుల మీద ఆధారపడవలసి వచ్చింది. కారణాలేమంటే ఆధునిక పద్ధతులపైన ఉత్పత్తి చేసేందుకు ఇతరులకన్న బెంగాలు యంత్రసామగ్రిలో వెనకపడింది.

"ఇటీవల దేశంలో జరిగిన విప్లవాత్మకమైన మార్పులతో బెంగాలీవారిలో ఒక నూతనోత్సాహం, నూతనప్రబోధంకలిగి తత్ఫలితంగా బెంగాల్ లో నేతపరిశ్రమ పునరుద్ధరించటానికి బెంగాల్ నేషనల్ టెక్స్టయిలు మిల్సు లిమిటెడ్ ఏర్పడింది.

నిర్వాహకులూ డైరెక్టరులూ ఈ మిల్లులను ఆధునిక పద్ధతులపైన చక్కగా ఆలోచించి ప్లాను వేసుకు కట్టుదిట్టంగా నడుపుతారననీ, ప్రజలుకూడ ఈసంస్థకు పూర్తిగ తోడ్పడతారననీ నే ఆశించుచున్నాను"

నేటి నిర్వాహకవర్గము :

1. శ్రీ మురళీధర ఛటర్జీ,
   ప్రొప్రైటరు, రైటెన్ అండ్ కో., యం. పి. ప్రొడక్షన్, డైరెక్టరు, కల్యాణ్ స్పిన్నింగ్ అండ్ వీవింగ్ మిల్సు లిమిటెడ్.
2. శ్రీ బి. యన్. సర్కార్,
   మానేజింగ్ డైరెక్టర్, న్యూథియేటర్సు లిమిటెడ్, డైరెక్టరు, కల్యాణ్ స్పిన్నింగ్ అండ్ వీవింగ్ మిల్సు లిమిటెడ్.
3. ఖాన్ బహదూర్ సయ్యద్ మహమ్మద్ జాన్,
   యం.యల్.ఏ., పార్టనరు, దివాన్ బక్ష్ మహమ్మద్ జాన్, డైరెక్టరు,, కల్యాణ్ స్పిన్నింగ్ అండ్ వీవింగ్ మిల్సు లిమిటెడ్.
4. శ్రీ డి. సి. కంకేరియా,
   మర్చంట్ అండ్ బ్యాంకర్, డైరెక్టర్, మెసర్సు మెషినరీస్ అండ్ ఎలక్ట్రికల్సు లి. కల్యాణ్ స్పిన్నింగ్ అండ్ వీవింగ్ మిల్సు లి.
5. శ్రీ సి. సి. సాహా,
   ప్రధానోద్యోగి, మెసర్సు ఎం. ఎల్. షా, సి. సి. షా లిమిటెడ్. డైరెక్టర్. మెసర్సు హిందూస్థాన్ ప్యూటికల్ ప్రొడక్ట్సు లిమిటెడ్, కల్యాణ్ స్పిన్నింగ్ అండ్ వీవింగ్ మిల్సు లిమిటెడ్.
6. శ్రీ ఎ. కె. చౌదరి (ఎక్స్-అఫిషియో)
   ప్రొప్రయిటరు, ఉమామహేశ్వరి మిల్సు, డైరెక్టర్ మెషినరీస్ అండ్ ఎలెక్ట్రికల్సు లి., కల్యాణ్ స్పిన్నింగ్ అండ్ వీవింగ్ మిల్సు లి.

మానేజింగు ఏజంట్లు:— ఎ. కె. చౌదరి అండ్ కంపెనీ, లిమిటెడ్.

ఆర్థిక సలహాదారు:— డాక్టర్ ఎస్. బి. దత్తు, ఎం. ఏ., పిహెచ్. డి. (లండన్), బారిస్టర్-ఎట్-లా, మానేజింగ డైరెక్టరు, కొమిల్లాయూనియన్ బ్యాంక్, లిమిటెడ్.

మిల్లుల ప్రదేశము:— బిరాటి, డం డం.

వర్ స్టెడ్ ఉన్ని, నూలు, గుడ్డమొదలైనవి తయారుచేయుటకు యంత్రసామగ్రి ఆర్డరివ్వబడియున్నది.

ఇతర వివరములకు మానేజింగు ఏజంట్లకు వ్రాయగోరెదము.

ఒక్క దణ్ణం

[కథ]

= శ్రీ జలసూత్రం రుక్మిణీనాథ్ =

"ఏమే, రామసీతా—"

దొడ్లో గాడిపొయ్యిదగ్గర నుంచుని కనకమ్మ అంది. యీపిలుపు గదిలోవున్న రామసీతకు వినబళ్లేదు. "ఊహూఁ. తింపరంగా అంటూ ఏం చేస్తోందో" అనుకుంది. "యిదీ మంచిదే. అది చూడకుండా వుంటేనే మంచిది. నరుడికంట నల్లరాయైనా పగులుతుందిట. ఎవరి కళ్లు ఎలాంటివో" అని అనుకుంది. కళాయిలో పులుసు తెర్లుతోంది. కరేపాకూ, కొత్తిమీరీ ఎప్పుడేసినా వెయ్యవచ్చు. సువాసనకేగా. ఆకాశానికేసి మెడ ఎత్తింది. చేతులు జోడించింది. నమస్కరించింది. "నారాయణమూర్తీ, తండ్రీ! నీవు చల్లగా చూచి అబ్బాయికి పేరు వొస్తే—" అంది. యింతలో అలికిడి అయింది. కోడలు వొస్తోందల్లే వుంది అనుకుని చేతులు దించింది. రామసీత వొచ్చి నుంచుంది— శాంతంగా, బంగారు బొమ్మలాగా.

"అప్పుడనగా పిలిస్తే యిప్పుడా అమ్మా రావడం?"

"వినబళ్లేదు అత్తయ్యా!"

"బాగానే ఉంది. కరేపాకూ అదీ తీసుకురా"

"కత్తీ కఠారీనా?"—నవ్వింది.

పులుసులో కొత్తిమీరీ, కరేపాకూ వెయ్యడం అంటే ఆంజనేయులుకు కిట్టదు. వాటికతను కత్తీ కఠారీ అని పేరుపెట్టాడు. మొగుడిమాటలు విని రామసీతకూడా వాటిని కత్తీ, కఠారీ అంటోంది.

"ఊఁ" అంది కనకమ్మ. ఎప్పుడూ ఇది ఇంతే. భగవంతుడికి దణ్ణం పెట్టుకోటానికికూడా వీల్లేకపోతోంది. ఎల్లాగూ ఆలస్యం చేసే మరీ వొచ్చిందిగదా, దేముడికి దండం పెట్టుకున్నాకే రాగూడదూ? కాస్త ఏమన్నా నోరు తెరిచి అంటో...'అత్తగారు ముండమ్మ' అంటారు. సరేలే. అనేవాళ్లకు నోరూ వాయీ ఉందీ? ఇంతకూ దేముడికి దండం పెట్టుకోటం పూర్తికానేలేదు. మాయదారితల్లి వొచ్చి మొదటికి తెచ్చింది.

"నారాయణమూర్తీ, తండ్రీ! నువ్వు చల్లగా చూచి ఇవాళన్నా అబ్బాయికి పేరూ అదీ కలిసివొస్తే—సత్తెన్నారాయణవ్రతం చేయిస్తాను." అనంది. ఆకాశం కేసి చూచింది. నమస్కరించింది. మృదువుగా చెంపలు వేసుకుంది.

రామసీత కరివేపాకూ, కొత్తిమీరీ తెచ్చింది. పణమటింట్లో సంసైతే లే అక్కరలేదు. అక్కడే ఉంటై. స్నేహితులు పది మంది వొస్తారని ఆంజనేయులు చెప్పాడు. దొడ్లో గాడిపొయ్యి దగ్గిర వంట చేస్తోంది కనకమ్మ.

అత్తగారు చెంపలు వేసుకోడం రామసీత చూచింది. ఎందుకు చెంపలు వేసుకుంటోందో తెలీలేదు. వోవేళ తను పిలిస్తే వెంటనే రాక, కొత్తిమీరీ కరేపాకూ అవీ తెమ్మని చెబితేగాని తేలేదని కోపమేమో అనుకుంది.

"ఏం అత్తయ్యా, అల్లా ఉన్నారూ" అంది.

కనకమ్మ మాట్లాడలేదు.

సరే, కోపమే అయివుంటుం దనుకుంది రామసీత. ఏం చేస్తుంద్రి తను? ఆవిడ పిలిచిందికాబోలు. వినబడలేదు. వినబడితే రాదూ? వొచ్చింది. చెప్పిన పని చేసింది. ఇంతలోనే కోపం ఐతే ఎల్లాగమ్మా వేగడం? అయినా తనకెందుకు? చూస్తూ ఊరుకుంటే సరి.

యివాళ నాటకం. ఆంజనేయులుముఠావాళ్లు ఆడుతున్నారు. రామసీతకు యీనాటకాలంటే గిట్టదు. తరతరాలా శిష్టాచారసంపన్నులయినవారి యింటో పుట్టింది ఆమె. ఆమెకు తన మొగుడు నాటకంలో వేషం వేస్తాడంటే ఏమిటోగా ఉంది. శుభ్రంగా తిని కూచోక లేనిపోని యీవేషాలు ఎందుకు? అయినా అయినయింటి వాళ్లు నాటకాల్లో వేషాలు వేస్తారూ? "ఆయన లేడూ, నాటకాల్లో వేషాలు వేస్తాడే, ఆయనపెళ్లాం" అంటే ఎంత అప్రదిష్ట? అయినా తన కెందుకు? నోరుమూసుకుని ఊరుకుంటే సరి అనుకుంది.

ఆయనన్నా సగం యీవిడే చెడగొట్టింది. "నీనాటకాలేమిటో నీగోలేమిటో - బైట యేమన్నా చెయ్ - యింటిమీదికి మాత్రం తీసుకురాకు" అని యీవిడేమన్నా అంటుందా? ఊహూఁ. అబ్బాయిస్నేహితులంతా దేముళ్లే. వాళ్లొచ్చేదీ, కొంపమీద పడి నానాగత్తరా చేసిపోయేదీనూ. పెద్దదిగదా తను, 'యిదేమిటి—'

అన్నదా ఏమన్నా? నవ్వుతూ చూస్తూ ఊరుకుంది. వొచ్చినవాళ్లల్లో కోపంకొ—

"అంజీ! మీా ఆవిడ చీరలూ, నగలూ తేరామా" అనం టాడూ? తన చీరలూ, నగలూమాట వాడనవచ్చా? ఊఁ. తన కెందుకు? చూస్తూ ఊరుకుంటే సరి.

"అత్తా! అత్తా!!"

పక్కయింటివాళ్ల పిల్లవాడు. తనకోసమే.

"రా!"

రామసీత ఆపిల్లాడికి ఎదురువెళ్లింది. సరాసరి మాలిమిగా వొచ్చాడు ఆ అబ్బాయి.

వొస్తూనే–"అత్తా! నే నొకటడుగుతా చెప్తావూ?" అన్నాడు. రామసీత తల ఊపింది.

"తెలూసితే కాదు. లేదు అనగూడదు."

—తలూపింది మళ్లీ ఆమె.

"కాదు" అనగూడదు.

—నవ్వింది.

"నవ్వుతా వేమమ్మా. ఊఁ—"

అనలేమిటో తెలీకపోయె. ఊరికే, ఏమిటో చెప్పకుండా వుంటే – మరింత నవ్వొస్తోంది ఆమెకు.

"నిజంగానేనమ్మా!"

"చెప్పూ మరి."

"ఇవాళ మన ఊళ్లో ఏమిటో చెప్పకో."

రామసీతకు అర్థంకాలేదు. 'తెలీ'దంది.

"ఛీ. ఇంతేనా? నే చెప్పనా?"

"ఊఁ."

"నాటకం."

మనస్సుకు కాస్త హుషారు కావాలనప్పుడు పిల్లలదగ్గ రుంటే చాలు; నవ్విస్తారు. కాని, వాళ్లే ఓఅప్పుడు తమకు తెలీ కుండానే సూటిగా సుచ్చినట్టు మాట్లాడి గిలగిలలాడిస్తారు.

"సరేలే—" అంది.

తనలాగానే అందరూ అనుకోవడం మానవస్వభావం. ఇది అమాయికత్వపుచిహ్నం. అమాయికత్వం యింకా ఎంత ప్రబలమైన కాదో అంత సూటిదనం ఉంటుంది. పసిపిల్లల్లో ఈ ఇది మరీనూ. పసివాడు నాటకంపేరెత్తకపోతే హాయిగా ఉండేది. పసివాడికి లాలన జరిగేది. తనే నాటకం ప్రస్తావన తెచ్చిఉండేదేమోగూడాను. హృదయశాంతికోసం. పిల్లాడే ముందు నాటకంమాట తెచ్చేసరికి రామసీతకు మన సొకలాగయింది. తన యిది వాడిదగ్గిర వెళ్లబుచ్చటం దేనికి, దీనిమీాద చిటికిచిటికి గాలివానకావడం దేనికి అనుకుంది ఆమె. ఏమయినా తను యీ నాలుగ్గుడియలూ చూస్తూ ఊరుకుండ దలుచుకుంది.

"ఊఁ"

"అదేమిటత్తా, ప్రశ్నానికి 'ఊఊఁ' అంటావ్? నవ్వుతూ మాట్లాడవేం?"

రామసీత నవ్వింది.

"అమ్మయ్య! నాటకానికి తీసికెళ్తావన్నమాటే—"

పసివాడి ధోరణి బోధపడింది. వాడు నాటకం చూట్టానికి ఇదవుతున్నాడు. తనేం చెప్తుందీ? చూస్తూ ఊరుకుంది.

"ఏమత్తా, తీసుకెళ్లవుటమ్మ అత్తా!"

"అల్లాగే."

"నిజంగానా?

పసివాడు రాముడు నమ్మలేకపోయాడు. కష్టసాధ్యం విన వరం తేలిగ్గా వొస్తే ఎవరైనాసరే, తొందరగా నమ్మలేరు.

రామసీత తలూపింది.

రామసీతకు తన బాల్యం గుర్తుకొచ్చింది. సముద్రస్నానాలకూ, వాటికీ తను యింతే చేసేది. తన పరికిణీ, చొక్కా అవీ ముందే సర్దిఉంచుకునేది. వెళ్లాలన్న ఉత్సాహంకొద్దీ వొచ్చిన చుట్టాలను యిలాగే అడిగేది. వెహోయినై ఆరోజులు.

ఇంతలో గబగబా ఆంజనేయులు ఇంటికి వొచ్చాడు. కొంపలు మిందకొట్టివస్తూన్నట్టు వొచ్చాడు. సావిట్లో అతనికి రామ సీత కనిపించింది. పక్కని రాముడూ ఉన్నాడు.

"మాఅమ్మేదీ—?" అన్నాడు ఆంజనేయులు.

"దొడ్లో వున్నారు" అంది ఆమె.

ఆంజనేయులు సరాసరి దొడ్లోకి వెళ్లాడు. కనకమ్మ వంటంతా పూర్తిచేసుకుంది. స్నానం చెయ్యాలనుకొన్నది.

"అమ్మా, వంటైందా?"

"అహ"

"వంటమాట కేంగానీ, చిక్కొటి వొచ్చిపడ్డదే"

కనకమ్మ తలెత్తింది.

"చీరెలు రెండు కావాలమ్మా. కాసిని నగలూ కావాలి"

"నాన్నడుగు. నన్నడుగుతా వేం"

"సరేలే. అది ఇవాళ చెప్తే వినేట్టుండి—"

రామసీతకు యీమాటలు వినబడ్డయి. సరాసరి వొచ్చింది.

"అల్లాగే—ఏం కావాలో తీసుకోండి"

ఆంజనేయులు తెల్లబోయాడు. ఇవ్వనంటుందనీ, తగవు జరుగుతుందనీ ఆలోచిస్తూ వొచ్చాడతను. ఏమాటమీాద ఏమాట విసరాలో, అసలు తగవు ఎలా జరుగుతుందో అదంతా అతను

తనలో తాను ఊహించాడు. ఒక రిహార్సల్ గూడా చేసుకువొచ్చాడు. అదంతా మబ్బులు తేలిపోయినట్టు తేలిపోయింది.

'పద' అన్నాడు.

రామసీత తన కావిడిపెట్టె తీసింది. పక్కకు తప్పుకుంది. కొర్నాటిచీరా, ఉప్పాడచీరా, మరోపట్టుచీరా తీసుకున్నాడు. పెట్టెఅంతా కెలికాడు. పెట్టె మూతపెట్టి వొచ్చాడు.

"పెళ్లోవిగూడా యిస్తావా?" అన్నాడు.

"నాందేముందీ, తీసుకోండి"

కేచీ వొస్తుందనుకున్నచోట కేచీ రాకపోవడం ఎంతో నిరాశను కలిగిస్తుంది. ఎంతో ప్రేమైనా ఉండాలి, కావలిసినంత అసహ్యంఅన్నా ఉండాలి కేచీ రాకపోటానికి. అసహ్యంతో భార్య యిస్తే తను తీసుకుంటాడా?

"మరైతే నువ్వుకూడా పెంకరాకే తెములు" అన్నాడు భార్యతో అతను.

రామసీత మాట్లాడలేదు.

"నిన్నే—"

ఆమె తలెత్తింది.

"నాటకానికి నువ్వు రావా?"

"అత్తయ్యగూడా వొస్తున్నారా?"

"ఏమో—"

"నేనూ, అత్తయ్య యింట్లో వుంటాం లెండి"

"నువ్వు రావాలి"

తను చేసే పనిని భార్య చూడాలి, సంతోషించాలి, తన్ను మెచ్చుకోవాలి, తనకు ఆమె ప్రోత్సాహం ఇవ్వాలని కోరుకోని మనిషి ఉంటాడా? ఆంజనేయులూ ఆ ఉద్దేశంతోనే అన్నాడు.

రామసీత మాట్లాడలేదు.

"నిన్నే—"

ఈసారి అతని గొంతుకలో ప్రేమ మోగింది. భర్తగనక దబాయించినట్టు అన్నాడుగానీ.

"నేను రాను"

"ఏం"

"రాను"

"ఊఁ"

"ఏం మాటలండీ ఇవి? మొగుడు వేషాలు వేస్తుంటే పెళ్లాం వొచ్చి చూస్తుందీ? చూడొచ్చా?"

"నిక్షేపంగా చూడొచ్చు"

"దానికేం గానీండి. అందరూ పోతే-యిల్లు—"

"మాఅమ్మ వుంటుందిగా? యీమాటలకేంగానీ—నాన్నక, చెంపరాకే తెములు"

"ఆవిణ్ణి ఒక్కత్తెనూ వుండమని పోవడం బాగుండదుగానీ, నామాట వినండి"

"పోరాదుటే—వాడు అంత ఇదిగా రమ్మంటుంటే—" అని అందుకుంది కనకమ్మ.

"నేను వెళ్లనండీ అత్తయ్యా"

రామసీతగొంతిక మారుతోంది. ఏడుపుకు దగ్గర్లోకి వస్తోంది.

"బాగానే ఉంది" అన్నాడు అతను.

"ఇంతేనమ్మా. ఆగమొండలు ఎప్పుడూ ఇంతే. అన్నయ్యను వొదిన కాల్చుకుతినలా? ఎక్కడికిపోతై బుద్ధులూ" అంది కనకమ్మ. ఈ సంబంధం మేనరికం.

"మాఅమ్మేం సుకుమేటిదీ, పదుకేటిదీ కాదు - అలుద్దులు వొచ్చి నేను చెడిపోటానికి. ఆవిడేం వేలుపెట్టి వొంపించుకోలేదు. పరువుగానే ఉంది. ఇంతకూ ఆవిడేం నీకు పరాయిది కాదు. సాక్షాత్తూ అన్నపెళ్లాం" అంది రామసీత.

"ఆ. అన్నపెళ్లామే—మేనరికానికి వొప్పట్టాన వొప్పుకుందా మాతల్లి! అయినా ఇప్పుడవన్నీ ఎందుకు—?"

"అన్నీ అనేదిన్నీ, ఎవరో అంటున్నట్టుండేదిన్నీ. ఇప్పుడవేం నే తీసుకురాలేదు—"

రామసీత యీమాటలు ఇంచుమించుగా ఏడుస్తూనే అంది.

"నాకెందుకు, దానిష్టం, దాని మొగుడిష్టం" అని కనకమ్మ చక్కా పోయింది.

రామసీత అక్కడే నంచునుంది. దానిష్టం, దాని మొగుడిష్టం, నాకెందుకు అనుకున్నది తను రాకపోతేనేం? వొచ్చి సప్త పితాళ్లకూ పెట్టకపోతేనేం? కడుపు భగ్గున మండింది. ఆసది మండి మాత్రం ఏంచేస్తుంది? తనవాళ్లెవరూ లేనిచోట తాను నిలబడి వుండాలి, బతకాలి. తనవాళ్లెవరూ లేకేం? అవటానికి మేనత్తా, మేనత్త కొడుకూనూ. అంతా తనవాళ్ళే. కోడలయింది గనుకా, పెళ్లామయింది గనకానూ యీమాటలన్నీనూ. మేనత్తగదా అని ఏమన్నా వెనకేసుకొచ్చిందా? పెట్టవలసిన మంగళహారతులన్నీ పెట్టివిడిచింది కాని.

ఆంజనేయులుకు ఏమీ తోచలేదు. 'సరే' అన్నాడు బరువుగా. బైటికి వెళ్లాడు. తీసిన చీరలూ, అవీ మంచమ్మీదే ఉన్నవి.

ఆంజనేయులూ, స్నేహితులూ వొచ్చారు. నాటకాలమాటలే చెప్పుకుంటూ భోంచేశారు. భోజనాలు కాంగానే ఆంజనేయులు గదిలోకి వెళ్లాడు. మంచంమీద రామసీత పడుకునిఉంది. లోపల్లోపల ఏడుస్తోంది.

"నిన్నే—"

తలెత్తలేదు ఆమె. బయట విధిగా చూపించే వినయం గదిలో చూపబడదు.

"నామాట వినవూ"

"నే విన్నాండీ!"

"నిజం?"

"............"

"రావూ నాటకానికి?"

"................"

"నీఖర్మ—"

ఆంజనేయులు వెళ్లి పోబోతున్నట్లు నటించాడు.

"ఖర్మే మరి—"

ఆంజనేయులు ఇక ఆగలేకపోయాడు. బైట స్నేహితులు కాచుకున్నారు. వాళ్లేమనుకుంటారు?

"లే. అన్నం తిను. లే"

రామసీత అల్లాగే పడుకునుంది. ఆంజనేయులు నుంచునే ఉన్నాడు. గదిలో నుంచోటం చిరాకుగా ఉంది. భార్య పడుకుని మాట్లాడుతుంటే తాను నుంచుని మాట్లాడ్డం పురుషుడికి సరదా. ఎప్పుడు? తను కోరుకున్నప్పుడు. విశాలమానవత్వం చిలకల్లే వొచ్చి వాలుతుంటే, అప్పుడు. కోపంవచ్చినప్పుడో—ఎందుకూ ఆమాట?

రామసీత కాలిపట్టాగొలుసు మెరుస్తోంది. చీలమండలకు పైగా ఆమెకాలు పట్టుకుని కాలు ఎత్తి వొదిలేశాడు. తన్నుకుంది. మంచం పట్టెకు కొట్టుకుంది. రామసీత ఏడుపు దిగమింగలేకపోతోంది.

"లే—అన్నం తిను"

రామసీత మాట్లాడలేదు.

"ఆంజనేలూ!"

—వాకిట్లో స్నేహితులు. ఆంజనేయులు చీరెలూ, అవీ తీసుకున్నాడు. వెక్కి వెక్కి ఏడుస్తూ మొహంచాటుచేసుకున్న భార్యకేసి చూడకుండానే వెళ్లి పోయాడు.

రామసీత ఆరాత్రి అన్నం తినలేదు. అలిగి పస్తుపడుకుంది. "ఇంతమంది తినగా లేంది నీవు రావేమే" అని అత్తగారు అనిపోయింది. "స్థానబలిమికాని తన బల్మికాదయా" అన్న చిన్నప్పుడు చదువుకొన్న పద్యం గుర్తుకొచ్చింది తెల్లారి రామసీతకు.

ఆరాత్రి నాటకం అభాసు అయింది. గొడ్లపాకను హాలు చేశారు. ఆడారు. ఆంజనేయులు బలవంతంమీద ఆడిస్తున్నాడు ఈ నాటకాలు. అతనికి నాటకాలు ఆడించడం సరదా. రంగేసుకుని తనుండటం, మాట్లాట్టం, పోజులు పెట్టటం ఇవన్నీ అతన్ని ఉత్సాహపరుస్తవి. ఎప్పటికయినా స్థానం నరసింహారావంత కావాలని అతని ఉద్దేశం. ఆపల్లెటూళ్లోనే నలుగుర్నీ పోగుచేసి, నలుగుర్నీ రప్పించి నాటకాలు ఆడుతున్నాడు. మొదట్లోనే హంసపాదు. మొదటి నాటకమే పట్టికొట్టుకుపోయింది.

ఆపాత నాటకాలే కావడం, వాటినైనా చక్కగా ఆడలేకపోవటం, రోజా ప్రత్యక్షమయ్యేవాళ్లే కావటం, అన్నింటికన్నా పీటమీద అసహ్యం పెరగటం—ఇలాంటి కారణాలవల్ల అవి ఎక్కరావడంలేదు. అతను చిన్నప్పుడు బస్తీలో చదువుకున్నాడు. ఇతని చదువుల కోసం కాపరం బస్తీకెక్కింది. కొడుకు చదివి ప్రయోజకుడౌతాడన్న ఉబలాటం ఏతల్లి కుండదు? కనకమ్మకూ ఉంది. "వాడికేమే మహారాజు. తను సుబ్భరంగా ఇంత తింటాడు, నలుగురికీ పెట్టాడు. చాప చెడ్డా చదరకు లోటుండదు" అన్న ధీమా ఉండేది ఆవిడకు. ఇది కాస్తా దాచుకునేదికూడా కాదు. నలుగురిలోనూ అనేసేది. నలుగురూ విని ఏమనుకుంటారోనని ఆమె అనుకునేది కాదు. భోంచేసి, టక్కున వక్కపలుకు కొరుకుతూ, కిరీటం సవరించుకుంటూ ఆవిడ ఈమాట అంటుంటే—ఆమెకు మహేంద్రపదవి వొరిగినట్టుండేది.

ఆంజనేయులుకూ ఉండేది ఇది. పైగా తల్లికూడా అంటోంది. వొళ్లు వంచి చదవకపోతేనేం—తను షైన్ కాగలడు. అయినా, వెధవచదువు. ఎప్పుడూ పుస్తకాలు రుబ్బటంమాత్రం-ఛీ! అతనికి చాతకాదు. ఒరిజినల్ గా థింక్ చెయ్యాలి. అంతేగాని, రుబ్బి పరీక్షలు ప్యాసుకావడం అంటే అతనికి నామర్దా. గేమ్స్‌ఫీ కట్టినందుకుగాను, అతను దాన్ని సార్థకపరచేవాడు. రోజా ఫుట్‌బాలు ఆడో, మరేమన్నా చేసో దెబ్బతగిలించుకురావడమూ, ఐడోఫారం పట్టించుకోడమూ పరిపాటి అయింది. మూడునాలుగేళ్లు చదువు సంటపూలు పూసింది. 'చాపచెడ్డా చదరు' అన్న ధీమా పెరిగింది. చివరికి పేకాటలో మునిగి తేలి, ధూమయజ్ఞంలో నిష్ణాతుడై, రోగాలు తగలడంతేరువాయిగా మళ్లీ స్వగ్రామం చేరాడు. సైకిలు విప్పగలడు. మళ్లీ అతకగలడు. పేకాటలో మాంచి ఫామేదా. సప్తప్రహరి చేసినట్లు ధూమయజ్ఞం చెయ్యగలడు.

స్వగ్రామం వొచ్చాకే ఆంజనేయులుకౌపాసన కార్యం జరిగింది. రామసీత కాపరానికి వొచ్చింది. మొదట్లో మేనమామ ఏమంటాడో అని అతను అనుకునేవాడు. కాని, పిల్లనిచ్చుకున్న తరువాత మేనమామ మామగారైనాడు. భూమ్మీద అల్లుళ్లు మామగార్లను గౌరవించటం అపురూపం. గనుక, అతనూ మామగారిని సమానఫాయాలో జమకట్టి భయభక్తుల్ని విడిచేసేవాడు. ఖుషీగా తిని తిరుగుతూండేవాడు. పొద్దుపోటానికి కుదేలుచేస్తులూ, సాయంత్రం వేళ కొంచెం బాట్‌మింటనూలో సరిపోయేది.

ఈపరిస్థితుల్లో రామసీత కాపరానికొచ్చింది.

తన అన్న తన మొగుణ్ణి తేలిగ్గా మాట్లాడుతూంటే రామసీతకు కొత్తలో గమత్తుగా ఉండేది. తరువాత్తరువాత అన్న అబద్ధాలాడుతున్నాడనుకునేది. చివరికి ఇంతఘోరకలి ఉండదనుకునేది. సహజంగా మొగుడి పక్షమే అయింది. తను మొగుడిపక్షం మాట్లాడ్డం బావుండదు గనుకా, సిగ్గు సహజంగా అలుముకుని ఉండేదిగనుకా

ఆమె పెదిమవిప్పి మాట్లాడేది కాదు. కాని, మనస్సు మాత్రం మెంగుపెడుతూనే ఉండేది.

తీరా కాపరానికి వొచ్చాకచూస్తే ఇది. చీట్లపేక ఆడటంలో తన మొగుడు మునిగి తేలిఉంటే ఆమెకు కష్టం వేసింది. ఇంట్లో పదిమంది తుమ్మాయిజగ్గాయిగాళ్లను చేర్చి వాళ్లతో అంతూ పొంతూ లేకుండా పడిఉంటే ఆమెమనస్సు ఒకలాగయింది. సొంత మేనత్త అయినాకూడా, అత్తగారు అల్లా ఉంటే ఇంకా కొట్టినట్టు అయింది. చివరికి నాటకాల్లో వేషం వేస్తానని మొగుడు అన్న రోజున తల తీసేసినట్టు అయింది. అన్నగారు అన్న మాటల్లో ఒక్కటీ అబద్ధంలేదు. తెలీక తను అన్నను నానామాటలూ అంది.

నాటకం పూర్తయినమర్నాడు ఆంజనేయులు తనలో తాను లేడు. ఓడిపోయిన ఒక్క కోపం అతనికి వొచ్చింది. అంతుచూద్దామని నిశ్చయించుకున్నాడు. ఏమయినా సరే-యిందులోనే తను పైకి రావాలి. యిదేం తక్కువదా? తెలీక తన భార్య వొద్దంటుంది కాని. పెనుమంకుపట్టు పట్టుక్కూచుని నాటకానికి రాలేదుగాని, వొచ్చివుంటే అదీ తనతో కలిసేదే.

ఓ నిద్ర తీసి లేచాక, రామసీత దగ్గిరికి వొచ్చింది. నల్లని చీర కట్టుకుంది. తెల్లని మల్లురవిక తొడుక్కుంది. పచ్చని మనిషేమో-ఎంతో అందంగా ఉంది. రాత్రి తిండి మాన్పుకుని ఏడ్చేడ్చి ఉందేమో — నిద్రలేకుండా ఉందేమో — మొహం బరువుగా ఉంది. వొచ్చి మొగుడిమంచందగ్గర కింద కూచుంది. ఆంజనేయులు కళ్లతో తనివితీరా చూస్తున్నాడు భార్యను. కాస్త నలిగిన పువ్వులా వుంది ఆమె.

"తింటానికి ఏమన్నా తేనా?"

రామసీత ఎంతో ముద్దుగా అడిగింది. ఆంజనేయులు ఈ ముద్దును అర్థంచేసుకున్నాడు. సంతోషంతో అతని కళ్లు సగం మూతలుపడ్డై.

"ఏమున్నై?" అన్నాడు.

"అటుకులు పాలల్లో వేశా"

ఆంజనేయులు కళ్లు ఎగరేశాడు. 'తే' అన్నాడు.

హంసనడిచినట్టు నెమ్మదిగా నడిచివెళ్లింది రామసీత. తీసుకొచ్చింది. మంచానికి ఆనుకుని కింద కూచుంది.

"దా" అన్నాడు ఆంజనేయులు.

రామసీత నవ్వింది. నెమ్మదిగా అటుకుల్ని కాస్తకాస్త తీసి అతని నోట్లో పెట్టింది. ఆంజనేయులు ఉద్ధుకుడుచుకున్నాడు. అటుకుల గిన్నె తను తీసుకున్నాడు. నిశ్శబ్దంగా, నెమ్మదిగా తిన్నాడు. ముద్దుకైనా కాస్త తనకు పెట్టాడనుకుంది రామసీత. ఒక్కసారి చురుగ్గా చూచింది. ఆంజనేయులు అదేవీ గమనించనే లేదు. నెమ్మదిగా సిగిరెట్టు తీసి అంటించాడు.

"ఇవి మానకూడదుటండీ!"

ఆంజనేయులు నవ్వాడు. 'పిచ్చిబొండా, నీమాట నేను వింటానులే' అన్నట్టు అర్థమయింది ఆమెకు. నెమ్మదిగా ఖాళీగిన్నె తీసుకుని లోపలికి వెళ్లింది.

౨

"నేను వినయపూర్వకంగా రొట్టెకోసం వేడుకున్నా. నాకు రాయి లభించింది. ఆంగ్లజాతి బలప్రయోగానికిమాత్రమే లొంగుతుంది. భారతజాతికి తెలిసిన ప్రజాశాంతి ఒక్కటే. అది పెద్దపైరు. భారతదేశం ఒక పెద్దకారాగృహం. నేనీ బ్రిటిషుశాసనాన్ని ధిక్కరిస్తాను. వైస్రాయి కోరే శాంతి విసుగుపుట్టించే శాంతి. ఆ నిర్బంధ శాంతిమూలంగా భారతజాతి కూపిరాడుట లేదు" అని గాంధీజీ వ్రాశారు.

దండీయాత్ర తప్పనిసరి అయింది. తనవెంట వచ్చే పాదచారులతో దండియాత్ర సాగింది.

దండిప్రస్థానానికి ప్రజాసముద్రం తరంగితమైంది. కథలు కథలుగా, గాథలుగా, బోధలుగా ఉప్పుసత్యాగ్రహం ప్రజల్ని ఉద్వేత్తకెత్తింది. మట్టిలోంచి మనుషులు లేచారు. ఆసేతుశీతాచలం గాంధీగారికేసి చూచింది.

ఊరూరా సభలు జరిగై. స్త్రీలు, పురుషులు, పసిబిడ్డలాదీ కదిలారు. తఖిలీలు వడుకుతూనే సభలకు వొచ్చేవారు. లాఠీ దెబ్బలు తిన్నారు. "స్వరాజ్యం కావాలా? ఐతే ఇదుగో లాఠీ" అని పోలీసులు ప్రజల్ని పలకరించేవారు. స్త్రీలు, పురుషులు ఉద్యమంలో కల్లారు. ఉప్పుతెచ్చారు. తాట్లుకొట్టారు. పికెటింగ్ చేశారు. అరెస్టయ్యారు. జైళ్లకెళ్లారు. భారతభూమిలో దాదాపు డెబ్భయ్యయిదువేలమంది శ్రీకృష్ణజన్మస్థానాన్ని అలంకరించారు. తిరిగి వొచ్చారు. ఉప్పుసత్యాగ్రహంతో దేశజీవనంలోనే మార్పు వొచ్చింది.

గాంధీజీ హరిజనులకోసం ఉద్యమించాడు. అవీరోజులు.

రామసీతకు గర్భం వొచ్చింది. కడుపుతో ఉంటే కాకైనా అందంగా వుంటుందంటారు. రామసీత అసలే అందకత్తె ఏమో మరింత అందంగా ఉంది. ఉన్న కాసినినగలూ తగ్గించింది. ముక్కులూ, చెవులూ, మెడా మరీ బోసిపోకుండా అత్యవసరమైన వొస్తువులు మాత్రం ఉంచుకుంది.

ఆంజనేయులులోనూ మార్పు వొచ్చింది. అతను రాటమొకటి ఇంటికి తెచ్చాడు. రోజూ తెలుగుపేపరు తెప్పిస్తున్నాడు. క్రాపింగు తీయించాడు. పేటకుపోయి ఖద్దరుబట్టలూ, చీరలూ, గుడ్డలూ తెచ్చాడు. పొద్దున్నే చద్దన్నం తిని రాటంముందు కూచుంటాడు. మధ్యాన్నం నిద్రపోయి లేచి మళ్లీ దానిముందే కూచుంటాడు.

"ఈబండచీరలు నేను కట్టుకోలేనంది రామసీత. వీల్లేదన్నాడు ఆంజనేయులు. "కడుపుతో ఉన్న పిల్ల ఎల్లా కట్టుందనుకున్నావురా అవి" అని కనకమ్మ అంది. అతను అక్కడితో ఆ ప్రయత్నం వొదులుకున్నాడు. రామసీత ఖద్దరు చీరల్ని దుప్పట్లుగా చేసింది.

ఇంట్లో శాంతివాతావరణం వొస్తోంది. అప్పుడప్పుడు పేపర్లో జరిగిన విషయాలు ఆమెకు చెప్తూండేవాడు. రామసీత అంతా విని ఊరుకునేది. నమ్మేదికాదు. కాని మొగుడి గొంతికలో నిబ్బరం, నిశ్చలత్వం చూచి నిజమే కాబోలు అనుకునేది.

ఆంజనేయులు రాటం వొడుకుతాడు. మాలమాదిగల్ని చూచి దూరంగా తప్పుకోడు. వాళ్లను ఊరతిట్లు తిట్టడు. మనిషి మారుతున్నాడు. చాటుగా వోనాడు "వాళ్లను అల్లా పూసుకుతిర గొద్దు" అనడిగింది మొగుణ్ణి రామసీత.

"ఏం, వాళ్లుమాత్రం మనుషులు కారూ?"

"మనుషులు కాదన్నానా, వాళ్లను ముట్టుకోగూడదుగా"

"అవన్నీ అబద్ధాలు. గాంధీగారు ఏం చెప్పారు?"

"ఆపటంలోఉన్న ఆయనేనా" అంది. దరిద్రనారాయణుని పటందగ్గిరికి వెళ్లింది. విచారంగా చూచింది. అత్తగారి దగ్గిరికి వెళ్లింది.

"ఏమత్తయ్యా" అన్నది.

"నాకేం తెలుస్తుందే" అన్నది ఆమె. ఆమెకూ కొడుకు ఇల్లా కావడం ఇష్టంలేదు. కాని, ఎవరేమన్నా వినేస్థితిలో లేడు. పైగా ఆమెది కొడుకు ఏంచేస్తే అదే పదివేలు అనే మతం.

రామసీత చాలాసేపు నిదానంగా ఆలోచించింది. అప్పటినుంచీ పాలేరుకుర్రాళ్లను, చాకలిదాన్ని ఎవర్నీ కోప్పట్టం, కసరటం మానుకుంది. రామసీత ముభావంగా వుండటం ఎక్కువయింది. బహు కొద్దిగా మాట్లాడుతుంది.

ఆంజనేయులు హరిజనుల్ని గుళ్లల్లోకి రానివ్వాలని నలుగురితో అనడం ప్రారంభించాడు. నలుగురూ తలోమాటా అన్నారు. నలుగురైదుగురు "చేశావులే నిర్వాకం, కాస్త కట్టిపెట్టు" అని సలహా ఇచ్చి చక్కాపోయారు. యాదవముసలం పుట్టున్నదన్నాడు శాస్త్రుల్లుగారు. ఆంజనేయులు విడిచిపెట్టలేదు. భగవద్గీత తెచ్చాడు. చూపించాడు. శాస్త్రుల్లుగారేమన్నారంటే—"ఇదంతా నిజమే. కాని ఈ యుగంలో మాట కాదిది" అన్నారు. బహునెమ్మదిగానే అన్నారు. "ఐతే ఎందుకిది" అని చేన్నెట్టికొట్టాడు పుస్తకాన్ని ఆంజనేయులు. దాంతో శాస్త్రుల్లుగారు చక్కాపోయారు.

"పెద్దవాడితో నీకెందుకురా" అంటూ కనకమ్మ వొచ్చింది.

"పెద్దతనం దక్కించుకొంటేనే పెద్దతనం నిలుస్తుంది" అన్నాడు ఆంజనేయులు.

"బిడ్డా, పాపా కలవాళ్లం. భగవద్గీతలు చెన్నెట్టికొట్టొచ్చట్రా" అన్నది ముసలావిడ.

రామసీత కడుపుతోన్నప్పటినుంచీ యింట్లోతొట్టిముంచం చేసినట్టుగానే అనుకుంటోంది ఆవిడ. ఆవిడ ఈమాట అన్నప్పుడు రామసీతకు మామూలుగా వొచ్చే సంతోషపు నవ్వు రాలేదు. ఏమవుతుందో అనుకుంది. ఆంజనేయులు శాంతించి మళ్లీ రాటందగ్గిరికి వెళ్లాడు. పది పోసులన్నా తియ్యలేకపోయాడు. ఆను తీసుకొచ్చాడు. ఎనభైపోసులూ పోసి ముడివేస్తూకూచున్నాడు. కనకమ్మ పక్కయింటికి పెత్తనానికి వెళ్లింది. రామసీత వొచ్చి పక్కనే కూచుంది. ఆంజనేయులు తలెత్తి చూచాడు.

"వాళ్లను గుళ్లల్లోకి రానీవాలా?" అంది.

"వాళ్లకుమాత్రం దేముడు కాడూ"

"రానిస్తే విగ్రహం మైలపడిపోదూ"

"మనిషి వొస్తే విగ్రహం మైలపడుతుందంటే పిచ్చిదానా! యివన్నీ మనం పెట్టుకున్న అడ్డంకులు. మనుషులందరూ వొకటే, అందరికీ అన్నీవీల్లూ ఉండాలి." అన్నాడు.

రామసీత నెమ్మదిగా కూచుంది. ఆలోచిస్తూ కూచుంది. నిజమే. కష్టం, సుఖం అందరికీ ఒకటే.

"ఐతే అందరూ గుళ్లోకి పోవచ్చా"

"ఆ."

చిలప పూర్తిఅయింది. నెమ్మదిగా ఆసునుంచి చిలపతీశాడు. బరువుగా నిట్టూర్పు విడిచాడు. "నేనోటి చెప్తా వినవే—మనం పోవొచ్చుగదా గుళ్లల్లోకి? రోజూ పోతున్నాముటే? మనం పోం; పోతావన్నవాళ్లే పోనీం" అన్నా డతను.

"పోకేం, పోతున్నాంగా ముక్కోటికి"

"ముక్కోటీ శివరాత్రీనా! మిగతారోజుల్లో...?" నవ్వా డతను. లేచాడు.

రామసీతా లేచింది. బుడ్లల్లో చమురు పొయ్యాలి. సంద కసువు వూడ్వాలి. ఇప్పటినుంచీ ఆవిడే అన్నిపనులూ చేస్తే బాగుండదు. ఆమె నెమ్మదిగా కిరసనాయిల్ డబ్బాదగ్గిర కూచుని బుడ్లల్లో చమురు పోస్తూ ఆలోచించుకుంటోంది. "మనం వెళ్లచ్చుగదా గుళ్లల్లోకి? రోజూ వెళుతున్నాముటే—" అన్నమాట రామసీత చెవుల్లో మోగుతోంది. మనం ఎందుకు వెళ్లం అనుకుంది. బద్ధకం. ఒకరికైతే బద్ధకం, ఇద్దరికైతే బద్ధకంగాని, అందరికీ బద్ధకమేనా? బుడ్లల్లో చమురు పోయడం అయింది. నెమ్మదిగా సందకసవు వూడ్చింది. ముగ్గుకర్ర ఆడించింది. పొద్దుటిముగ్గులు అన్నీ చెరగవు. యింట్లో పిల్లలు ఉంటే చెరుగుతై! పాపాయి వొస్తే ముగ్గులు చెరుగుతై అనుకుంది. పాపాయి అనగానే వొళ్లు ఝల్లుమంది. నవ్వుకుంది.

ఇకనుంచీ శుక్రవారం శుక్రవారం అమ్మవారి గుళ్లోకి వెళ్లాలి. అమ్మవారికి పసుపూ, కుంకుం ఇచ్చిరావాలి అనుకుంది. వెళితే ఇది వరకునించే వెళ్లాలిసింది. పాపాయి పుట్టేకాక యింకేం వీలవుతుంది? అప్పుడు పొద్దస్తమానమూ వాడి పనితోటే సరిపోతుంది.

కనకమ్మ వొచ్చింది. సంపెంగ నవ్వు పూసి ముగ్గులు వేసివుంది. తను వేస్తుందిగా. నెలలు వొస్తూన్నయిగదా, ఏం అంత తను వెయ్యకపోతే?"అంత తొందరేమొచ్చిందమ్మా. రానా, వెయ్యనా?" అంది. రామసీత తలెత్తిచూచింది.

"శుక్రవారం శుక్రవారం గుళ్లో కెళదామా అత్తయ్యా" అంది.

"వెళ్లినట్టే ఉంది. అంతమాత్రం గీతకూడానా? మన బోటి వాళ్లకు కొంపే కైలాసం." రామసీత యీమాటా శ్రద్ధగా వింది. సున్నిపిండీ, తువ్వాలూ తీసుకుని నూతిదగ్గిరికి వెళ్లింది. మొహం కడుక్కుందామని నూతిదగ్గిరికి వెళ్లగానే వొంటిమీద నీళ్లోసుకో బుద్ధిపుట్టింది. చిన్నప్పుడు తను నీళ్లంటేచాలు, ఎగబడేది. "తో జాతెల్లారా స్నానం చేటే" అని తల్లి ఎప్పుడూ కోప్పడేది. అయినా తను ఆగేదికాదు. నవ్వు వొచ్చింది. ఇంట్లోకి వొచ్చింది. పాతచీర కట్టుకుని నూతిదగ్గిరికి పోయింది. నీళ్లు పోసుకుంటూంటే అత్తగారు అన్నమాట నెమరుకొచ్చింది. "అంతమాత్రం గీతకూడానా? మన బోటివాళ్లకు కొంపే కైలాసం" రెక్కలు విరుచుకు నేవాళ్లు,దరిద్రులు గుళ్లల్లోకి ఎక్కడ పోతూకూచుంటారూ? వాళ్లకు ఇల్లే కైలాసం. వాళ్లు, పాపం, లేకపోతే మన్ని ప్రసాదానికీ మారాజులని ఎందు కంటారు? చాకల్ది మన గుడ్డలు వుతుకుతుంది. మనం దాని గుడ్డలు ఉతుకుతామా? మన గుడ్డలు మనం ఉతుక్కుంటాం. తను చేనుతో చాలకేగా, వాళ్లన్న కృష్ణమూర్తి యింకోళ్ల పొలంగూడా కవులు కుచ్చుకుంది. చాలితే పుచ్చుకుంటాడా? అవును. అన్నయ్య ఇదే అన్నాడు. "గుడీ గిడీ మీరు పొండి. నేను చేలోకి పోతా. నాకు చేనే దేముడు" అంటాడు అన్నయ్య.

స్నానం చేసి వొళ్లు తుడుచుకుంటూంటే మరొకటి తట్టింది. "అసలు గుళ్లోకి వెళ్లకపోతేనేం? జరగదా? ఇప్పుడుమాత్రం అందరూ వెళుతున్నారా? దేముడు ఏమన్నా చేస్తే—? ఏమిటోనమ్మా. నా కెందుకొచ్చింది?" అనుకుంది మళ్లీ. ఉతికిన చీరా, రవికాతో వచ్చి మిఠాయిపొట్లంలాగ కూచుంది. తోచలేదు. లేచి గదిలోకి వెళ్లింది. దీపం వెలిగించింది. మళ్లీ వొచ్చి కూచుంది. అత్తగారు అన్నంగిన్నె పొయిమీద వేసింది. వెలుగురూ, చీకటీ పోట్లాడు కుంటూన్నై. జొద్దింకలు తప్పుకు తప్పుకు పారిపోతున్నయి. పొయిలో మంటలు గమ్మత్తుగా లేస్తున్నై. అగ్నిహోత్రుడికీ, ఆలోచనలకూ సయోద్యగల్లే ఉంది. జ్వాలలు ఆడుతూన్న కొద్దీ ఆలోచనలూ ఆడుతై. తను, తన యిల్లు, తన వంశం, తన రక్తం పవిత్రంగా చూచే దేవాలయం మైలపడుతూందన్న ఆలోచన వొచ్చి, ఆమెను అతలాకుతలం చేస్తోంది. కకరకాలుగా ఆలోచన పోతోంది. ఎవరెవరికి పెళ్లాడినట్టు మనస్సుకళ పెళలాడుతోంది. వాళ్లకుకీ అసహ్యంగా ఉంటారు. మురికిబోడుతూ ఉంటారు. ఖదిచీరలు లేకపోతే తనూ మురికిబోడుతూనే ఉంటుంది. ఈ మాట తోచగానే ఆమెమనస్సు జలదరించింది. యిహ ఇది ఆలోచింమకోగూడ దనుకుంది.

అప్పుడప్పుడు పక్కయింటివాళ్ల పిల్లాడు రాముడొచ్చాడు. పిచ్చివాడు! నాటకానికి తీసి కెళ్లమని అడిగినవాడు మళ్లీ అమాటే లేదు. ఇంట్లో పెద్దవాళ్లు కోప్పడ్డారో ఏమో. ఎప్పుడన్నా వొస్తాడు. రాటుం ఛర్రుమని తిప్పిపోతాడు.

"ఏరో రాముడూ, రా"

రాముడు వొచ్చాడు. కాస్సేపన్నా కూచోలేదు. తుర్రుమని లేచిపోయాడు. ఎందు కొచ్చినట్లు, ఎందుకు పోయినట్లు? పిల్లలంతే. వాళ్ల ఇష్టం. పిచ్చికలల్లే వాలి, పోతారు. కాస్త అల్లరి చేస్తారు సరదాగా ఉంటే.

అన్నం ఉమ్మగిలింది. ఆంజనేయులు వొచ్చాడు. భార్యా భర్త లిద్దరూ ఏకపంక్తిన భోంచేశారు. గర్భిణి ఐనప్పటినుంచీ రామసీత మొగుడితోపాటే అన్నానికి కూచుంటోంది. అన్నం తిని గది లోకి వెళ్లింది. నిద్రపట్టలేదు. సాయంత్రం వొచ్చిన పేపరు చదువు కుంటున్నాడు ఆంజనేయులు.

"ఏమండీ, గుళ్లల్లోకి వెళ్లకపోతే నేమండీ!"

"ఏం వెళ్లకపోతే—" అన్నాడు పరధ్యానంగా.

"ఐతే మాల—కాదు, హరిజనులకు గుళ్లు తెరవకపోతేనేం?"

"అమ్మబాబోయ్, అది చేసితీరాలి"

"దరిద్రులకు అన్నం,బట్టా తృప్తిగావొచ్చేట్టుచేస్తే చాలదూ?"

ఆంజనేయులు ఇది ఆలోచించలేదు. భార్య కొత్తగా మాట్లాడుతూం దనిపించింది. అతనేమీ సమాధానం చెప్పలేదు. ప్రోత్సాహకరంగా మాట్లాడకపోబట్టి, కాస్సేపు చూచి రామసీత అటు తిరిగి పడుకుంది.

రాత్రి అంతా నిద్రపట్టలేదు. తెల్లారింది. అన్నా, వొదినా వొచ్చారు. చలిమిడీ అవీ తెచ్చారు. పురిటికి తనను తీసుకెళ్లటానికి వొచ్చారు. అన్ననూ, వొదినన్నీ చూడగానే రామసీత మొహంచాటంతయింది. విచ్చిన పెద్దచామంతిపూవులాగుంది ఆమె.

వొదినగారూ, పక్కయింటిఆవిడా నూడిదలు నలుగురికీ పంచారు. ప్రయాణం. తల్లి "నాదేముంది నాయనా, మీయిష్టం, మీ బావయిష్టం" అంది. కొడుకు "నాదేముంది, మీ చెల్లెలిష్టం, మీ మేనత్తయిష్టం" అన్నాడు. వొచ్చుందాలతో ఆరోజుకి ప్రయాణం చెడింది.

"ఏమండీ."

ఆంజనేయులు తలెత్తిచూచాడు.

"మిమ్మల్నే—"

"ఏం"

"మిమ్మల్ని విడిచి వెళ్లటమంటే ఏమిటోగా ఉందండీ!" అంది రామసీత.

ఆంజనేయులు నవ్వాడు. ఆనవ్వు గమత్తుగా ఉంది.

"ఏం నవ్వుతారు" అంది.

"లోపల వెళ్లాలనేమో తొందరనూ, పైకి పైపై ప్రేమలూనూ"

రామసీతమనస్సు చివుక్కుమంది. తను ఎంత ప్రేమగా అడిగిందో అంత ప్రేమగా అతను ఉంటే—? అదెవ్వరాత! స్త్రీ పురుషులు కోరుకునేది ఇదే. సామాన్యంగా లభ్యంకానిదీ ఇదే. వెళుతూ వెళుతూ కూడా నొప్పితోటే వెళ్లాలని రాసుందికాబోలు అనుకుంది. వొచ్చిన ఊహను ఆమె మింగింది.

"ఈమాటలకేంగానీండి—"

"అంత పచ్చిఅబద్ధాలా?"

రామసీత ఏమీ అనలేదు. నూరీతే దమ్మతా లేదన్నట్టు ఊరుకుంది. ప్రేమ ఉంటే ఏమన్నా అనవొచ్చు, పడవొచ్చుగాని, ప్రేమ కరువైనచోట 'ఆఁ' అంటం అన్యాయం; 'నారాయణా' బూతుమాటే.

"ఏమండీ ఊరుబైటైనప్పుడు నన్ను చూట్టానికి రారూ!" అంది మళ్లీ.

"ఎప్పుడూ నాకు ఊరుబడేగా!"

లాభం లేదు. ఎత్తు ముదురుతోంది. రామసీత కట్టిపెట్టింది. ఆరాత్రి తాను ఎంతో మాట్లాడుదామనుకుంది. ఎన్నెన్నో సంగతులు చెబ్దామనుకుంది. లేవబోయిన అల అక్కడే అణగారినట్టు అయింది. తెల్లారగట్ట రామసీత ప్రయాణం అయింది. వెళుతూ వెళుతూ గాంధీజీబొమ్మదగ్గిర ఆగింది. ఆబొమ్మను చూస్తుంటే ఆమెకు ఏదో శాంతంగా ఉంటుంది. దరిద్రనారాయణుండి బొమ్మను తీసుకెళ్దామనుకుంది. తరువాత వేరేకొనుక్కోనూవచ్చా అనీ అనుకుంది. నిద్రపోతోన్న మొగుణ్ణి లేపి చెప్పింది. అతను నిద్రమత్తులోనే తల ఊపాడు. అత్తగారితో చెప్పింది. "సుఖంగా వెళ్లి లాభంగా రాఅమ్మా" అంది. మళ్లీ గదిలోకి వొచ్చింది. మొగుడు లేస్తాడని, కొంతదూరం వొస్తాడని అనుకున్నది రాత్రే పోయింది. మళ్లీ చెప్పిరావటానికి వెళ్లింది. లేపింది.

"వెళుతున్నా" అంది ముద్దుగా.

అతను తలెత్తి 'సరే' అన్నాడు. ఆమె చిన్నబుచ్చుకుంది. నవ్వుతూ సంతోషంగా పుట్టింటికి వెళ్లేఇది తనకు లేదు అనుకుంది.

"గాంధీగారి పటం తీసికెళ్లనా?" అంది. లేచి "వొద్దు. నాకు ఉండాలి" అంటూ దనుకుంది.

"ఊఁ" అన్నాడు మొగుడు.

పటందగ్గిరికి వెళ్లింది. "ఇక్కడే ఉండనీ, వేరేకొనుక్కుంటాలే" అనుకుంది. బండీ ఎక్కింది. బండి కదిలింది.

"అత్త వెళుతోంది, అత్త వెళుతోంది." అంటూ రాముడు, పక్కయింటివారి అబ్బాయి బండివెంట నాలుగడుగులు వొచ్చాడు.

3

రామసీత చురుకైన పిల్ల. కిలకిలా నవ్వుతుంది. అన్యాయం అని తోస్తే ఎంత వాళ్లనయినా ఉన్నమాట అనేస్తుంది. ఎంత ఆకాశం విరిగి మీదపడుతూన్నా లెక్కచెయ్యదు. కలుపుగోట్టుతనంగా ఉంటుంది. అలాంటిది బండి కదిలాకకూడా స్తబ్ధుగా ఉండేప్పటికి వొదినగారు ఆశ్చర్యపడింది.

"అత్తారింట్లో చాలా మారావమ్మా!" అన్నదామె రామసీతను.

రామసీత నవ్వింది.

"నేను గ్నాపకం ఉన్నానంటమ్మా!" అన్నాడు బండీ తోల్తోంచి నాంచారి.

"ఎందుకు జ్ఞాపకం ఉండవ్రా" అంది. నాలిక్కొరుక్కుంది. "అందరూ జ్ఞాపకంఉంటారు." అంది. నాంచారయ్య చిన్నప్పుడు రామసీతను ఎత్తుకుమోశాడు. కోరోజున వాడిమీద తనకు కోపం వొచ్చింది. వాణ్ణి తిట్టింది. కొట్టింది. గిల్లింది. నెత్తురొచ్చింది. "అమ్మగారితో చెప్పనా" అన్నాడు వాడు. రామసీత తెల్లపోయింది తల్లితో చెప్తాననగానే. నెత్తురు కళ్లచూచేసరికి భయం వేసింది. చప్పున ఏడ్చింది. దెబ్బతిన్నవాడే సముదాయించాడు.

"కోడెదూడ పెద్దదయిందా?" అంది.

"ఆ"

"ఏరా అన్నయ్య—" అంది. అన్న సద్దేశించి. మళ్లీ ఆగింది.

"ఏమిటే—" అన్నాడు అన్న.

"అబ్బే. ఏంలేదు" అంది.

అన్నా, వొదినా మొహాలుమొహాలు చూచుకున్నారు.

పుట్టింటికి చేరింది. "రామసీ తొచ్చింది, రామసీ తొచ్చింది" అని నలుగు రమ్మలక్కలూ చేరారు.

"అల్లా ఉన్నావేమే నాతల్లీ—" అన్నారు. "ప్రయాణం కాదుటే" అని వాళ్లకువాళ్లే జవాబుచెప్పుకున్నారు. వెళ్లిపోయారు.

రామసీత వొచ్చినప్పటినుంచీ ముభావంగా ఉండబోతుంది. కట్టతెగినట్టు గబగబా మాట్లాడుతుంది. అణచుకోబోతోంది తనను. అణుచుకుంటోంది కూడాను. పనిపాటలవాళ్లను ఏమన్నా మాట అనదు. అననీదు.

చాకలిది రోజూవారి ఉతుకు వొచ్చింది. "ఏమే—" అని వొదిన పిలిచింది. వెంటనే వెళ్లింది రామసీత. "వాళ్లా మనలాంటి


Phoenix
FANS
Phoenix
EWI
LTD.
SYMBOL OF PERFECTION
ఫొయెనిక్సు ఫ్యాన్లు
ఏ. సి. & డి.సి.
ది ఇంజనీరింగ్ వర్క్సు ఆఫ్ ఇండియా లిమిటెడ్.
46.
THE ENGINEERING WORKS OF INDIA LTD
(A BEHARILAL RAMCHARAN CONCERN)
Phone: B. B. 5632. Gram: "ENGWORKCAL."


GOP. 8.
For SPARKLING HEALTH
MADRAS GOVERNMENT BRAND
SHARK LIVER OIL
and
Adamin.
Manufacturers:—
GOVERNMENT OIL FACTORY CALICUT.
MADRAS GOVERNMENT BRAND
MGB
మద్రాసు ప్రెసిడెన్సీ, పరిసర సంస్థానములకు రేజెంట్లు:
మెసర్సు ప్యారీ అండ్ కో., లిమిటెడ్., మద్రాసు.

వాళ్లే వొదినా. ఎందు కలా అంటావ్—" అంది. వొదినా, చాకలిదీ ఇద్దరూ వెళ్లిపోయారు.

చాకలిది బట్టలు తీసుకువెళ్లిపోయాక వొదినగారు దొడ్లోపడి రుంజుకుంటోంది.

"ఏమన్నావే ఏమిటే?" అని తల్లి అంది.

"ఏమీ అనలేదే—"

"ఏమో మరి-దొడ్లో పడి పణుక్కుంటోంది" అంది ఆమె.

రామసీత జేరుగా దొడ్లోకి వెళ్లింది.

"ఏమమ్మా, నేనేమన్నాననీ—" అంది.

"నేనుమాత్రం ఏమన్నానమ్మా."

"వాళ్లూ మనలాంటివాళ్లు అన్నందుకేనా ఇంత ఇదీనూ" అంది రామసీత.

"దాంబుంప తెగిరి! దాన్ని ముందుపెట్టుకుని అంటేగాని తోచలేదుటమ్మా"

"........................"

"ఇక మళ్లీ అనగలమా, అలుసుకామటమ్మా, నువ్వు చెప్పూ"

"మాట అనగా లేంది, అలుసౌతామనేనా అమ్మా" అంది రామసీత.

"పురెక్కించు తల్లీ. ఇప్పటికే వాళ్ల క్కాళ్లు నెత్తిమీది కొచ్చై. నీలోటివాళ్లుగూడా కలిస్తే—" అందామె.

"మడికట్టుకుని మంచినీళ్లు తెచ్చుకుంటున్నానరే—కొస్త దూరంగా పొండర్రా అంటే-అమ్మో, వాళ్లు వింటారా? ఎదురు నవ్వుతారు. నీ దారిన నీవు పో అమ్మా అంటారు." అంది వొదిన, వాళ్ల పల్లదనం చూచావా అన్నట్టు.

"పాపం" అంది రామసీత.

ఈ ఇది సాయంత్రందాకా నలుగుతుపడింది. పెద్దలు నలుగురూ అల్లా అనగూడదని రామసీతనే కోప్పడ్డారు. అందరికీ తలో మాటా అప్పచెప్పాలని అనుకోకపోలేదుగాని, నాలోజులుండిపోయే దాన్ని నా కెందుకని ఊరుకుంది రామసీత.

తానుమాత్రం అందర్నీ గౌరవంగా పిలుస్తుంది. చేతిలో ఏమున్నా, వాళ్లుంటే, వాళ్లక్కూడా పెట్టి తింటుంది. దీని కేదో పిచ్చి అని పుట్టింటివా రూరుకోలేదు. మాతులూ ముక్కులూ విరుచుకుంటూనే ఉండేవారు.

పాలేళ్లు, చాకలిది మొదలయినవాళ్లు ఆమెతో కష్టాలూ సుఖాలూ చెప్పుకుచ్చుకునేవాళ్లు. చిరుగులచీరతో పాలేరుసాంచారి కూతురు వొస్తే తన చీరల్లో కొస్త గట్టిది చూచి ఇచ్చింది. నల్లరాయిలాంటి చీర వాళ్ల ఎదాన కొట్టిందని ఆరోజు మాటపడింది ఆమె. "ఇస్తే ఇచ్చావులే. మీరు గూడా ఇవ్వరాదూ" అంది.

క్రమక్రమంగా నెలలు నిండుతూన్నై. "నీ కెందుకు, నువ్వు కూచోవే" అన్నా, పనిలో కొచ్చేది. "కూరలు తరగడమైనా పనే చేస్తాను. ఊరికే కూచుని తింటం తప్పుకాదూ" అనేది. ఇంకా కాపరానికి పోని పిల్లలకు పూసలుకుట్టు నేర్పింది. పూలుతో పదాలు అల్లడం నేర్పింది. ముఖ్యంగా ప్రజ లందరూ మనలాంటివాళ్లే అంటుండి. చిన్నపిల్లలు మొదట్లో నవ్వారుగాని-తరువాత్తరువాత చెపొగ్గారు. "వాళ్లు ఏడిస్తే మనం బాగుపడం" అనేది.

మొగుడు చూట్టానికి రాలేదు. ఉత్తరమన్నా రాయలేదు.

వోసారి రమ్మని రాయిద్దామని ఆమె చాలా అనుకుంది. ఎటుపోయి ఎటు వొచ్చి వికటిస్తుందో అనీ అనుకుని ఊరుకుంది.

మొగుడు వొక్కసారన్నా వొచ్చి మనసారా మాట్లాడితే చాలా సంతోషించేది. నిజమే. కొన్ని ప్రాణులు సంతోషించటానికీ, సుఖపడటానికీ పుట్టవు. సుఖానికై వెంపరలాడుతై గాని, సుఖం అనేది దక్కదు. ఆరాటమే మిగులుతుంది.

అత్తారింటి కెళ్లక చదువుకోడం మూలపడింది. ఎప్పుడూ ఏదో ఇది మనస్సు నిండిఉండేది. దాంతో ఆమె కిందామీదా అవుతూండేది. ఇప్పుడామె మళ్లీ కొస్త చదువుధోరణిలోకి పడింది. నెమ్మదినెమ్మదిగా కూడపలుక్కుంటూ చదవడం మొదలెట్టింది.

మొగుడు ఉత్తరమ్మక్క రాయడని లేల్చుకుంది.

తాను రాద్దామని నిశ్చయించుకుంది. తప్పేం లేదుగదా. మొగుడికి పెళ్లాం రాయడం తప్పా? ఉత్తరం ఎల్లా రాయాలో తోచలేదు. ఎలా ప్రారంభించాలో ఎంతసేపటికీ అంతుపట్టనేలేదు. ఎల్లాగో అల్లా నాలుగుబంతులు రాసింది. పాలేరుచేత పోస్టులో వేయించింది. ఎన్నాళ్లకూ సమాధానం రాలేదు. లాభంలే దనుకుంది.

రామసీత ప్రసవించింది. మొగపిల్లాడు. తల్లిపోలికే అంటే తల్లిపోలికే అన్నా రందరూ. తనకూ అల్లాగే ఉంది. ఐనా పెద్ద నెలలో గుడ్డును చూచి ఎలా పోలికలు చెప్పటం? పిల్లాణ్ణి చూస్తున్నకొద్దీ చూడబుద్ధిపుడుతోంది. ఆ చిట్టిముండ గుప్పిళ్లు బిగపడతాడు. వొళ్లు సాగదీసుకుంటాడు. బుల్లినోరుతో కళ్లునూసుకుని ఏముటో ఇరుకుతాడు. మొగపిల్లాడు పుట్టాడని ఆంజనేయులుకు కబురుచేశారు. అతను రాలేదు. గాని వెళ్లినవాళ్లు అతను మళ్లీ నాటకాల్లో పడ్డాడనీ, యీ మధ్యనే వాడికెకరాలు అమ్మాడనీ వార్త మోసుకొచ్చారు. పెద్దపురిటి బాలింతరాలు రామసీత ఇది విని బెచ్చపడింది. తనలో తాను మల్లాగుల్లాలుపడింది. వితర్కించుకుంది. ఉన్నది కాస్తా తుపరంపోతోందని మథనపడింది.

"పోతే పోయింది. ఆయన కుదురుగా ఉంటే"-అనుకుంది.

గడిసమ్మావ కట్టిన చెప్పూ,కలబందా కనబడ్డవి. చప్పన గుర్తు కొచ్చింది. పిల్లాణ్ణి చూచింది. "బ్రాహ్మడి కూతురు మాదిగాడి పెళ్లాం" అని రెండుమూడుసార్లు అంది. అస తికాక్షేమిటో? ఆ

బ్రాహ్మణ్ణి కూతురు కిచ్చారో. అమాదిగాదూ, ఆ బ్రాహ్మడికి కూతురూ ఎలా కాపరంచేశారో...కలిసిమెలిసున్నారో, కొట్లాడుకుచచ్చారో ...ఆ అమ్మాయి. జన్మంతా ఎంత కుళ్లి కుళ్లి ఏడ్చిందో...ఎన్నె మ్మకు ఈ పాట పాడితేసరి, రాదుట. ఆ పురుక్కీ, ఈ పాటకీ ఏమిటో సమ్మంధం?

పథ్యం పెట్టారు. పురుడు సుఖంగానే వెళ్లింది. నూతులో చేద తీసేవాడు పేరుచెప్పిరావడం అంటే సిగ్గువేసింది. ఫలానావారి బిడ్డేను సుమా అని చెప్పడమా అనుకుంది. చీదరించుకుంది. నేను చెప్పనుపొమ్మంది. "ఇది ఆచారమే, జరగాలే" అని తల్లి నెత్తి నోరు పెట్టుకుని చెప్పింది. రామసీత ఎదురుతిరిగింది. "నన్ను నమ్మితే నమ్మండి" అంది. ఆమాట అంటూంటే ఆమెకళ్లల్లో జ్వాల భగ్గుమంది. తల్లి నోరు మెదపలేకపోయింది. "నలుగురూ—" అంది తల్లి.

"గంగలో కలవమను—పాటిమనుషుల్ని లేకిగా మాట్లాడే వాళ్లుట, చెప్పొచ్చారుట" అని రామసీత విరుచుకుపడింది. కాళీ అవతారం చూచి అందరూ నోరునొక్కుకుని చక్కాపోయారు.

"చిన్నప్పటినుంచీ అదంతే—" అందో కావిడ. అది రామ సీతకు తెలిసింది. "ఏతే అయ్యిలే" అంది. అంతే.

నెలపురుడు వెళ్లింది. ముత్తవతల్లి బిడ్డనికి చేతికి వొత్తులా అవి చేయించిపెట్టింది. తంత్రితో తతపోరి రామసీత కొడుకుకు మొలకు గజ్జెలు చేయించింది. గుడ్డటోపీ, చొక్కా తొడుక్కుని పసివాడు తొట్లో గిలక్కాయలు చూచి సంబరపడుతున్నాడు. ఓరోజు మధ్యాహ్నం భోజనాలు చేసి ఆడవాళ్లందరూ సావిట్లో కూచు న్నారు. లోకాభిరామాయణం విడిపడ్డది. ప్రవాహం వెళ్లి వెళ్లి ఆంజనేయులువీదికి వెళ్లింది.

"ఇప్పటికైనా వొచ్చాడేమో చూచావా?" అంది రామసీత తల్లి. ఆవిడా పెద్దదయింది. పచ్చగా, పార్వతీదేవిలా నుంటుంది. పొద్దున్నే ఆమెమొఖం చూచినా చాలు, పాపాలు పటిసిపోతయ్యం టారు అందరూ. ఆవిడ కెప్పుడూ ఇదే దిగులు. ఒక్క కొడుకూ, వొక్కత్తే కూతురూనూ. దేముడి దయవల్ల కలిగిన యింట్లో పుట్టి కలిగిన ఇంట్లోకే వొచ్చింది. పుట్టింటివారు ఆమెకు పసుపుకుంకం కింద నాల్గెకరాలుకూడా ఇచ్చారు. కొడుకు నలుగురితోపాటు సంసారం చేస్తున్నాడు. మొగుడు ఏమీ తక్కువవాడు కాడు. నాలుగక్షరాలు నలుగురికి చెప్పి అవుననిపించుకున్నవాడే. ఒక్క కూతురు రంటే—అది ఇల్లా తయారైంది.

దాని కడుపునకూడా ఓ కాయ కాచిందిగదా అని సంతో షించింది ముసలమ్మ. అల్లుడు తడిసిన వులక్కొక్కిలాగా ఎప్పుడూ బిగబిగసేఉంటాడు. అదో వినపనకొయ్య. రామసీత అక్కడే కూచుని పిల్లాడికి ఊలుటోపీ కుడుతోంది.

తెమ్మటిగా "అమ్మా!" అంది.

తల్లి తలెత్తి చూచింది. ఎంతసేపటినుంచో మాట్లానని రామ సీత నోరువిప్పేసరికి తల్లీ, వొదినా ఆమెకేసే చూచారు.

"నాపెళ్లప్పుడు ఏమయిందే?" అంది. ముసలమ్మకు అర్థం కాలేదు. ఆవిడ శూన్యంలోకి చూస్తోంది. ఆమెముఖాన పెద్ద కుంకుమబొట్టు మెరిసింది. తల్లికి తాను అడిగేది అర్థంకాలేదనుకుంది రామసీత. ఇంకా విప్పి అడగటానికి పక్కయింటావిడ ఉంది.

పక్కయింటావిడా యిది గమనించింది. "వెళ్లొస్తానమ్మ పార్వతమ్మత్తా"అని వెళ్లిపోయింది. రామసీతతల్లిని పార్వతమ్మ అంటారు. అసలావిడపేరు సుబ్బమ్మ. నలుగురూ పార్వతమ్మఅనే అంటారు. వరసతో కలిపి.

"మేనరికం నీవు కొద్దన్నావా?" అనడిగింది రామసీత.

పార్వతమ్మకు చిత్రంవేసింది. తన కూతురు తనను నిగ్గ తీస్తోంది. మంచో చెడో, జరిగిపోయిన సంగతిని అసలువాళ్లు, అందులో తమ బిడ్డలు వొచ్చి నిలవేసిఅడిగితే జవాబుచెప్పడం కష్టం.

"ఎందుకే ఇప్పుడవన్నీనూ" అంది. ఆవిడకు పాతకథ కళ్ల ముందు తిరుగుతోంది. తాంబూలాలు ఆరోజున పుచ్చుకుంటారు. తనకు సుతరామూ ఈ మేనరికం ఇష్టంలేదు. "మా అక్కయ్య"- అన్నాడు తన భర్త. అప్పావుధాన్లుగారంటే ఆ ప్రాంతాల్లో పేరె న్నికగన్న మనిషి. చిన్నప్పుడు ఆయన కనకమ్మ అక్కగారింట్లో వుండి తింటూ వేదం చదువుకున్నాడు.

"మా అక్కయ్య వునూరుమంటుంది" అన్నా డాయన.

"పిల్ల ఉసూరుమనదూ" అంది తను.

కాబోయే అల్లుడు వీథిఅరుగుమీద ఎవరినో యిద్దరుముగ్గుర్ని చేర్చాడు. తువ్వాలా తలకు చుట్టాడు. బీడీ అంటించాడు. నాట కాల్లో పద్యాలు పాడుతున్నాడు అప్పుడు. వేలమునాకే వారగోచీ, వలబనీనూ, బనీను కనబడేట్టు సన్నని చొక్కా, నుదురుమీద పడే క్రాపింగూ, లుంగచుట్టి ఉత్తరీయ్యం మెడను వేసుకోడమూ, ఎంతెంతవాళ్లనూ ఉపెక్కరించి మాట్లాడ్డమూనూ అయ్యవని. అప్పావుధాన్లుగారు కాస్సేపు మాట్లాడలేదు.

"చదువుసంధ్యలు లేకపోతే పోయింది. కుదురైనా లేదు గదా" అంది తను.

ముసిలాయన ఆలోచనల్లో పడ్డాడు.

అరుగుమీంచి ఝామ్మని పద్యం మోగుతోంది.

"ఈ, కుండలి నన్నెదా గరిచె

క్ష్వారతనింక మనంగజాల నో

అంజనేయాన!"

"వీథిలోకి వెళ్లి అల్లుణ్ణి దర్శనంచేసుకురండి, తలు కాళ్లు కడిగి నెత్తిన చల్లుకుందురుగాని!" అంది.

అవధాన్లుగారు ఉక్కిరిబిక్కిరైనారు.

"ఎప్పుడో మా అక్కయ్య ముక్కల్లో చీమకుట్టిపోయిందని— కడుపున పుట్టిన బిడ్డ గొంతుక పిసుకుతారుటండీ!" అంది.

ఇంతలో రామసీత అక్కడికి వొచ్చింది. "రా అమ్మా!" అని తండ్రి కూతుర్ని వొళ్లోకి తీసుకున్నాడు. తల నిమిరాడు.

కళ్లల్లోకి చురచురా చూచి పార్వతమ్మగారు అక్కడినుంచి వంటింట్లోకి వెళ్లింది, యింట్లో అలికిడైతే.

"ఏరా అన్నయ్యా" అంటూ కనకమ్మ వొచ్చింది. తాంబూలాలు పుచ్చుకున్నారు అనాడు. ఇదంతా ఆమెకు కళ్లకు కట్టినట్టు కనిపించింది. ఫలితంగూడా చూస్తున్నదేమో, కళ్లంబడి నీళ్లు వొచ్చై. కొంగుతో తుడుచుకుంది. మా సీతాయన యింతలో ఎందుకో పిల్చాడు. దొడ్డివసారాలోకి ఆమె వెళ్లిపోయింది.

"ఏమే అమ్మా!" అంది రామసీత.

"నిజమేనే అమ్మా. ఓడ్డనాను" అని వెళ్లింది పార్వతమ్మ. ఆమె గొంతుకలో ఏదో ఉండనిండి మాట పెగిలిరాలేదు.

రామసీత అత్తారింటికి ప్రయాణం అయింది. తను కట్టిన ఉయ్యాలు తోపి కొడుక్కు తొడిగింది. వల్లని చొక్కా తొడిగింది. మొలకు గజ్జెలు కట్టింది. చేతిని పోత్తులు మెరుస్తున్నై. సెమ్మది సెమ్మదిగా చావిడి గిరి పసుపుకంగు తేలుతున్నాడు పాపాయి.

కొడుకు నెత్తుకుని తండ్రిదగ్గిరికెళ్లింది.

"మాహం బ్రహ్మ నిరాకుర్యాం, మామా బ్రహ్మ నిరాకరోత్— అనిరాకరణమస్తు. అనిరాకరణం మేఽస్తు" అని మంచంలో పడుకుని అప్పావధాన్లుగారు గొణుక్కుంటున్నారు.

"నాన్నా, వెళ్లొస్తా" నంది రామసీత.

ఆయన ఏదో చెప్పబోయారు. లేచికూచున్నారు. మాట తడబడ్డది. పిల్లవాణ్ణి తండ్రిచేతికి ఇచ్చింది. మనమణ్ణి ఎత్తుకున్నారు. ఆమె తండ్రికాళ్లకు నమస్కరించింది. తండ్రి వొరిగిపోయాడు. పూర్వకాలంమనిషిగనుక ఇంకా ఉన్నాడుగానీ. తండ్రి కూతుర్ని దీవించాడు. మనమడు తాతగారి ధోతీ తడిపాడు. 'అరివెధవా' అంది రామసీత. తాత ఆనందంతో నవ్వాడు.

"అమ్మా, నేను సన్యసిద్దామనుకుంటున్నాను" అన్నాడు.

"ఈవయస్సులో వొద్దు నాన్నా" అంది.

"ఇదేనమ్మా వయస్సు. నాతండ్రి యజ్ఞం చేశాడు. నాతాత బ్రహ్మీభూతుడు. నామాతామహుడు ఆధానం చేశాడు. నేను వైశ్వదేవంఅయినా చెయ్యలేకపోయాను. సన్యసిద్దామని ఉందమ్మా" అన్నాడు.

రామసీత గంభీరురాలయింది. రక్తమాలిన్యం లేని కాలం. ఆ ప్రతిష్ఠ యివాల్టికీ ప్రజ్వరిల్లుతోంది. ఆమెకు దరిద్ర నారాయణమూర్తి గాంధీగారు గుర్తుకొచ్చారు.

"నాన్నా, వొక్కమాట చెప్పనా!" అంది.

"చెప్పమ్మా" అన్నాడు తండ్రి.

"మనిషికంటె దేముడెవరు నాన్నా" అంది.

తండ్రి ఆశ్చర్యంతో, ఆనందంతో కన్నులరమోడ్చాడు.

"సాటిమనిషిని హింసించి హింసించి చంపి, ఎన్ని యజ్ఞాలుచేస్తే ఏం నాన్నా" అంది.

అప్పావధాన్లుగారు తెల్లబోయారు.

"నీ వొళ్లుమాత్రం ఏంబావుంది నాన్నా. సన్యసించకు నాన్నా" అంది.

అప్పావధాన్లుగారు మాట్లాడలేదు.

"నాప్రాణాలు నీమీదా, అమ్మమీదా ఉంటై. ఇప్పుడు ఈ మహారాజు(కొడుకు)మీదానూ. నీఆరోగ్యం వారానికోమాటన్నా రాయించు నాన్నా. మేం జవాబన్నా రాయమనుకో. నాకోసం మీఆరోగ్యం రాయించాలి నాన్నా" అంది.

"అలాగే అమ్మా" అన్నాడు తండ్రి. మాట్లాడలేకపోయాడు.

"సన్యసించవొద్దు నాన్నా" అంది.

అవధాన్లుగారు తల ఊపారు. మళ్లీ తండ్రికాళ్లకు నమస్కరించింది. ఆయన వేదోక్తాశీర్వచనం చేశారు. పిల్లవాణ్ణి చేతికిచ్చారు.

"బయలుదేరవేమే—" అంటూ అన్నగారు వొచ్చారు. "వెళ్లొస్తానే అమ్మా" అని చెప్పింది. పిల్లాణ్ణి తల్లిచేతికిచ్చింది. తల్లికీ, వొదినగారికీ పాదాభివందనం చేసింది. తల్లి దీవించింది. వొదినగారు కుంకంబొట్టు పెట్టింది. బండీ ఎక్కింది. దాట్లో అన్న—

"రామసీతా!" అన్నాడు.

తలెత్తింది.

"నీవు ధైర్యంగా ఉండు. నీకేమే, మొగకిడ్డకూడా పుట్టాకు" అన్నాడు. మొగపిల్లాణ్ణి కంటే అక్కడితో పెట్టుకొన్నట్టు. కోర్టుకెళ్లినా ధోకాలేదు అన్నమాట.

"నీవు ధైర్యంగా ఉండు. ఆ పసువు, వాడెప్పుడూ అంతే. పిల్లాణ్ణి చూట్టానికైనా తల్లీ, కొడుకూ యిద్దర్లో ఒక్కరన్నా రాలేదు. వాళ్ల వరస తెలుస్తూనే ఉంది."

రామసీతకు ఏమనాలో తోచలేదు. అన్నకేసి చూస్తోంది.

"నీకేం భరవాలేదు. నీవు ఏమీ చెయ్యవు. ఏం చేసినా చేసున్నంతకాలం మరేమీ ఇదిలేదు" అన్నాడు.

"నాన్నా అమ్మా కులాసా రాయవుట్రా" అంది ఆమె.

అత్తారింటికొచ్చింది. ఆంజనేయులు ఊళ్లో లేడు. ఎక్కడికో నాటకాల కని వెళ్లాడు. కనకమ్మ ఉంది. అదిచ దృష్టితీసింది. ఎర్రనీళ్లు తీసిపోసింది. ఉయ్యాలతొట్టి వేశారు.

బారసాల జరిగింది. అందరూ వొచ్చారు. ఎల్లాగో అల్లా వోపికచేసుకుని అప్పావుధాన్లుగారుకూడా వొచ్చారు. బారసాలపీటల మీద ముత్తవ పాపాయికి రెండెకరాలు చదివించింది. తాతగారు అల్లుడికి ఏరికోరి ఖద్దరుపంచెలు తెప్పించి మరీ పెట్టారు. అల్లుడు మారాడని ఆయనకు ఏం తెలుసు? ఎప్పుడో కూతురు చెప్పిన మాట గుర్తుంది ఆయనకు-అంతే.

౪

ఆంజనేయులుకు కొత్తపిచ్చి పట్టుకుంది. నాటకాలు, రాటం, పీకలు, అను, చిలపలూ మూలపడ్డాయి. పాకెట్లో ఓ పాతతుక్కు మోటారు ఒకటి చెలిపింది. దాన్ని అతను అన్ని అడ్డగోలుడొంకల్లోంచీ నడిపించుకువచ్చాడు. ఇప్పుడతను కారు తోలగలడు. చిన్న సర్వీసు ఒకటి పెట్టాట్ట. మరో నాలుగెకరాలు అమ్మాడు— పిల్లాడు రేపో మాపో పుట్టాడనగా.

కాపరం బస్తీకి తర్లింది. ఆంజనేయులు మూడురోజులకూ నాలుగురోజులకూ ఓసారి యింటికి వొస్తాడు. ఓపూట్లో అరపూట్లో వుంటాడు. ఎవళ్లో వొచ్చి పిలుస్తారు. వెళ్లిపోతాడు.

రామసీతకు పసివాడితో పొద్దు కాస్తన్నా తెమిలేదు కాదు. తెమిలిన కాస్తా చదవడమూ, రాటం తిప్పడమూ చేస్తోంది.

రామసీత పిపుగట్టితనాన్ని కూడా పరిశీలించుకోవలసిన రోజులొచ్చై. ఆంజనేయులు వోపట్టాన ఇంటికిరాడు. వొస్తే వొకటి రెండురోజులు కదలడు. ఎప్పుడూ చిరచిరలాడుతూ ఉంటాడు.

రామ్మూర్తి (కొడుకు) అల్లరిచేస్తుంటే అతనికి ముద్దురాదు. కోపం వొస్తుంది. రామసీతకు కోపంరాదు. ముద్దువొస్తుంది.

"పిడిగజ్జెలతాడు ఏంచేశా?" అన్నాడొరోజున భార్యతో.

"జాగర్తగానే ఉంది. ఏం?" అంది రామసీత.

"కావాలి".

"ఎందుకు?"

"డబ్బులు పుట్టించుకురావాలి."

"తాకట్టు పెట్టారా, మంచిమాటే, ముందే చెప్పారునయం."

ఆంజనేయులు 'ఊ' అన్నాడు. గొంతికలో శకం తొణికిసలాడుతోంది.

"నే నివ్వను."

"ఇస్తావా, ఇవ్వవా?"

"చంపినా సరే ఇవ్వను."

ఆంజనేయులు బలవంతాన ఆమెపెట్టె తీయబోయాడు. రామసీత అడ్డంవెళ్లింది. ఆమె నొక్కతోపు తోశాడు. మళ్లీ అడ్డంవెళ్లింది. ఆంజనేయులుకు కోపం వొచ్చింది. కొట్టాడు.

దెబ్బతిన్న రామసీత తాచుపాం అయింది. కాని, వెంటనే తలవొంచుకుంది.

"ఏమైనాసరే-వాడివి నే నివ్వనండీ!" అంది ఏడుస్తూనే.

"నీ అబ్బసొమ్మా?"

నోరుజారింది ఆంజనేయులుకు. అనేశాడు.

"ఆ. నా అబ్బసొమ్మే" అంది రామసీత నిప్పులుకక్కుతూ.

చేసేది లేక ఆంజనేయులు వెనకడుగు వేశాడు. తన మెళ్లో గొలుసు తీసి యిచ్చింది రామసీత మొగుడికి. ఆంజనేయులు నిర్విణ్ణుడైనాడు. పుచ్చుకోడమా, వొద్దా అనుకున్నాడు. వొద్దనుకున్నాడు. తీసికెళ్లి భార్యకిద్దామని లేచాడు. అవసరం నెత్తికెక్కి తొక్కుతోంది. కారుకు టైరు కొనాలి. దర్జాగా తీసుకున్నాడు. చొక్కా తొడుక్కుని వెళ్లిపోయాడు. అత్తగారు కిమిన్నాస్తి. కళ్లప్పచెప్పి చూస్తూ ఊరుకుంది.

రామ్మూర్తికి రెండేళ్లు నిండై. ప్రతివాళ్లనూ తిడతాడు. కొడతానంటాడు. కర్రముక్క పుచ్చుకుని బయలుదేరుతాడు. ఎప్పుడూ దుమ్ములో ఆడుకుంటాడు. చొక్కా తొడగడం అంటే భయం వేస్తోంది. నిమిషంలో మన్ను చేసుకు వస్తాడు. ఎప్పుడూ దిసమొలగానే ఉంటాడు.

"ఓ రామయ్యతండ్రీ, నే వేగలేకున్నానురా నీతో" అంటుంది రామసీత.

"అమ్మా అమ్మా, వాళ్ల బ్బాయిని కొట్టిరానా?"

"తప్పు" అని కళ్లు పెద్దవిచేస్తుంది రామసీత. ముక్కుమీద వేలు వేసుకుంటుంది.

"తప్పా?"

"ఊఁ"

"తప్పంటే?"

తెల్లబోతుంది. రామసీత తన కొడుకు కొడతానని కర్రముక్క పుచ్చుకున్నప్పుడల్లా ఆమెప్రాణాలు కుప్పకుప్పమనేవి.

వొరోజున ఆంజనేయులు కూచుని ఉన్నాడు. రామ్మూర్తి "నాన్నా, నాన్నా" అంటూ దగ్గిరికెళ్లాడు. ఆంజనేయులు ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"నాన్నా, వాళ్లబ్బాయిని కొట్టిరానా?"

"ఊ!"

రామ్మూర్తి లేచాడు. కర్రముక్క తీసుకున్నాడు. రామసీత ఇదంతా చూచింది. దబదబా వొచ్చింది.

"ఎక్కడికిరా?"

"అల్లింటికి"

"ఏడిశావు. దా. నీకు జెండా చేసిపెట్టనా..."

"జెండా. జెండా. చేదిపెట్టు"

చీరముక్క తుంచింది. మంచంలోంచి కొత్త నులక తోసి తెచ్చింది. ఎల్లాగో అల్లా జెండా చేసిఇచ్చింది. రామ్మూర్తి నవ్వు

తున్నాడు. జెండా చేతికి రాంగానే కిలకిలా నవ్వాడు. ఎగిరి గంతేశాడు. 'జై' అంది తల్లి. రెట్టింపు అల్లరితో 'జై' అని అరిచాడు కొడుకు.

"ఎవర్నీ కొట్టకూడదు" అంది.

"జెండాతో కూడానా?"

"ఆ. కొడితే జెండా కోప్పడుతుంది."

"కొట్టనులే" అన్నాడు రామ్మూర్తి.

"నాన్నా, జెండా...ఎవర్నీ కొట్టకూడదు. జెండా కోప్పడుతుంది" అన్నాడు వాడు.

ఆంజనేయులు 'బాగానేఉంది' అన్నాడు. గొంతికలో ఏరసమూ ప్రస్ఫుటంకాలేదు. మాట్లాడకుండా రామసీత వెళ్లిపోయింది.

సైనరు ఉన్నాడుగనక ప్రామిసరీనోట్లకు డబ్బులు రాలడం లేదు. పగడాల తావళమూ, పుస్తెలతాడూ, ముసిలమ్మ రుద్రాక్షల తావళమూ హారతికర్పూరం అయింది. రైతుదగ్గిర శిల్లి పైసంవత్సరంపంటకూడా తెచ్చుకుతగలేయడంకూడా అయింది. ఆ మోటారుకారు "తే తే!" అంటుందేగాని 'తీసుకో' అని ఒక్కనాడూ అనదు. కారుకిందే కర్పుతోందో, మరేమవుతోందోగాని, బూడిదలో పన్నీరు చాలా పోశారు.

"జెండాకూ జై!"-రామ్మూర్తి ఆగొస్తూ అనుకుంటున్నాడు.

అప్పావుధాన్లుగారికి సుస్తీగా ఉందని ఉత్తరం వొచ్చింది. ఆంజనేయులు ఊళ్లో లేడు. రామసీత కుప్పకూలినట్లు కూలింది. కనకమ్మ కాలుకాలిన పిల్లిలాగా తిరిగింది. నంచో లేదు. కూచో లేదు.

"జెండాకూ జై!"

"రాముడూ, దా" అంది రామసీత.

వొచ్చాడు.

"అరవకూడదు"

"నువ్వే చెప్పావుగా"

"ఇప్పుడు అరవకూడదు. తాతయ్యకు సుస్తీగా ఉందిట."

"అమ్మా, అరిస్తేనే పోతుంది. ఇందాకా మేకపిల్ల భయపడి పోలా?"

రామసీతకు నవ్వురాలేదు. 'అరవకూడదమ్మా' అంది. గదిలోకి వెళ్లి రెండుమూడు చీరలూ, పిల్లాడికి బట్టలూ తీసుకుని మూట కట్టింది. కనకమ్మ వొచ్చి సావిట్లో కూచుంది. ఆవిడమొహాన కత్తి వేస్తే నెత్తురుచుక్క లేదు. ఎంత ఇదైనా రక్తసంబంధం. తల్లితోడు. పేగు తోడుతుంది. అన్నది ఆవయస్సులో సుస్తీ అంటే ఏమిటి? కళ్లనీళ్లను ఆపుకుంటోంది కనకమ్మ.

"బయలుదేరవూ అత్తయ్యా" అంది రామసీత.

"వాడు లేడే అమ్మా!" అంది అత్తగారు.

"నేనుండలేను. పోతున్నాను" అంది రామసీత.

"వెళ్లగానే కార్డుముక్క రాయి! వాడు రాంగానే నేనూ వొస్తా" నంది కనకమ్మ.

"వొక్కత్తెవూ ఎలా వెళ్తా" వంది మళ్లీ.

ఈవంకను ప్రయాణం ఆగుతుందికాబోలు ననుకుంది రామసీత.

"నోరుందిగదా. అడుగుతాను, వెళ్తాను."

"బస్సుమీదే వెళ్తావా?"

"ఆ"

"...—..."

"నాపెట్టెఅడుగున అయిదురూపాయలు దాచా నిన్నాళ్లూ. అది తీసుకువెళ్తున్నాను. మీఅబ్బాయితో చెప్పండి. వారినిగూడా ఓసారి రమ్మని చెప్పండి. కూతురు నిచ్చుకున్నా, మేనమామే. వొస్తే ఎవ్వరూ నవ్వరు" అంది. పిల్లాణ్ణి చంకనేసుకుని మూటపుచ్చుకుని బయలుదేరింది. సందుచివరిదాకా అత్తగారూ వొచ్చింది. కోడలు అన్న చివరిమాటకు ఆమెకు భగ్గుమంది. ఐనా, ఇప్పుడు కాదని తమాయించుకుంది. "పిల్లాడు పుట్టినప్పుడు రాలేదని చెప్పడం. ఎంత ముసలిదానైనా అర్థంకాకపోదు" అనుకుం దామె.

తను యింటికి చేరేప్పటికి వీధివాకిట్లో పెట్టుకుని ఏడుస్తూంటారేమో అని ఆమె బహు బాధపడింది. చూపులన్నా అందుతాయో అందవో అని మథనపడింది. 'ఈవయస్సులో తల్లి—' యిది గుర్తొచ్చి మరీమరీ ఇదయింది. ఒక్క మొహం పడ్డది.

రామసీత వొచ్చిందంటే రామసీతవొచ్చిం దన్నారు. తల్లి బావురుమంది. అప్పావుధాన్లుగారు, ఆసన్నమృత్యువు, మంచాన్ని అంటిపెట్టుకుని వున్నారు. స్పృహ ఏమీ చెడలేదు. విరేచనాలు ప్రారంభం అయినవి. పోసిన మందులు వొంటపట్టటంలేదు.

"అమ్మాయి వొచ్చిందా?" అన్నారు.

"ఆ. వొచ్చా నాన్నా"

"వొచ్చావా అమ్మా. దా"

వివస్త్రుడు. నులకమంచంమీద గోనెపట్టాలో పడుకుని ఉన్నాడు. వేసే పాత్తిళ్లగుడ్డ వేస్తున్నారు. తీసేది తీస్తున్నారు.

"నీపిల్లా డేడీ?"

"ఇడుగో"

"తాతయ్య!" అని కొడుకుకు చూపించింది రామసీత.

"తాతయ్యా" అన్నాడు రామ్మూర్తి.

తాతగారు కళ్లెత్తిచూచారు. "నాన్నా, తాతయ్యకు సుస్తీ" అంది రామసీత. ఏడుస్తోంది.

"జెండాకు జై"—అరిచాడు రామ్మూర్తి.

"తాతయ్యా!"

"ఊఁ"

"ఏపోలా?"

అందరూ నవ్వారు. తాతగారూ నవ్వారు. రామసీత 'జై' అని అరిస్తే పోవటం ఏమిటో విప్పిచెప్పింది. "వోరి భడవా" అని అందరూ అంగలార్చారు. అప్పావధాన్లుగారు నవ్వారు. చెలిసి పోయిన గుడ్డలాగుంది ఆ నవ్వు.

వైద్యుడు శేషాచార్లు వచ్చాడు. నాడి చూశాడు. పూర్ణిమ దాటదని చెప్పాడు. ముసిలమ్మ గొల్లుమంది.

మర్నాడు తండ్రిదగ్గర రామసీత కూచుంది. మిగతా అందరూ భోజనాలు చేస్తున్నారు. రోగిదగ్గర వొకరు ఉండడం, మిగతావాళ్లు గబగబా అన్నాలు కానివ్వడం రివాజు అయింది.

"అమ్మా"

"ఏం నాన్నా"

"ఇవాళ దాహం ఒకటి తీర్తమ్మా"

"అల్లాగా" అంది రామసీత. ఉద్ధరిణతో కాసిన్నీళ్లు గొంతుకలో పోసింది.

"అమ్మా"

"ఓయ్"

"ఇహ నే సన్యసించవొచ్చా అమ్మా"

రామసీత తెల్లపోయింది. తాను వొద్దన్నది గుర్తుకొచ్చింది. అందువల్లనే ఆగాడుకాబోలు తండ్రి అనుకుంది. పెద్ద నిట్టూర్పు వొచ్చింది. మొహం గమత్తుగా మారింది.

"సన్యసించాలని వుందా నాన్నా" అంది. ఆమాట అనటం అనవసరం. అయినా ఆగలేక అంది.

"ఆరోజున—"

"అర్థమయింది నాన్నా"

"కొట్టివసారాలో పడుకునిఉన్నాను. నువ్వు వెళ్తూ వెళ్తూ వొద్దన్నావు. అప్పుడు ఎదురుచెబితే ఎక్కడ ఏడుస్తావో అనిపించిందమ్మా" అన్నాడు.

రామసీతకు కళ్లంబడి నీళ్లు వొచ్చై. చెరుగుతో తుడుచుకుంది.

"నీవుసురు నాకు తగలగూడదు. తగలనీకు—"

"అవేంమాటలు నాన్నా"

"కాదమ్మా. నీ సుఖం నే చేతులారా చిచ్చెట్టా" అన్నాడు. ఆప్రాణికి ఆ అంతిమఘడియల్లో కళ్లనీళ్లు వొచ్చాయి. బడబాగ్నిని ఎంతకాలం దాచుకున్నారో ఆయన. రామసీతకూ కళ్లనీళ్లు వొచ్చై.

"ఇప్పుడెందుకు నాన్నా—" అంది రామసీత. తండ్రి వినిపించుకోలేదు. ఆయన చెప్పదలుచుకుంది చెప్పేస్తున్నాడు. ఇక ఆగదు ఆ ప్రాణి.

"మీఅమ్మపేర నున్నది నీపేర పెట్టించా. శే శే అని శేషు వాడెక్కడ నిన్ను చంపుతాడో అని నీవు అమ్మటానికి వీల్లేకుండానూ, నీపిల్లాడికి చెందేట్టూ రాయించా..." అన్నాడు.

రామసీత కొత్తలోకంలో ఉంది. తనను తలుచుకుని తండ్రి ఎంత కుళ్లికుళ్లి ఏడ్చాడో...తండ్రి మొఖంకేసి పరీక్షగా చూచింది. తపశ్శక్తిసంపన్నాలయిన కళ్లు, మాటతీవ్రతను ఎరగని ఆకళ్లు యిటికరాయి ముక్కల్లాగా ఉన్నై.

"అమ్మా!"

"ఆఁ"

"నన్నేమీ శపించకు." అని ఏడ్చాడు అప్పావధాన్లుగారు. అన్నగారు భోంచేసివొచ్చి చూచాడు. తప్పిద్దామని అనుకుని కూడా ఏమీ చెయ్యలేకా, ఆ దృశ్యం చూడలేకా తలవొంచుకొని బరువుగా వెళ్లిపోయాడు.

"జెండాకు జై—" రామ్మూర్తి అరుస్తూవొచ్చాడు. తల్లి తాతమంచందగ్గిర ఉంది.

"తాతయ్యకు ఇంకా తగ్గలా" అన్నాడు.

"వోరి భడవా" అన్నారు తాతగారు. అది వారి ఆశీర్వచనం.

అప్పావధాన్లుగారు సన్యసించారు. బ్రహ్మీభూతులూ అయారు. వారి చావు పెళ్లితో సమానం. ముసిలమ్మమూలేగాని, పచ్చని పండుముత్తయిదువు పార్వతీదేవికి చేటువొచ్చిందిగానీ, ఆయన కేం మహరాజా అన్నారు అందరూ.

ఆంజనేయులూ, కనకమ్మా వొచ్చారు. వెళ్లారు. రామసీత మొగుడితోపాటు వెళ్లలేదు. తల్లికోసం అని ఉండిపోయింది. ఆంజనేయులుకు ఆస్తి వొచ్చినసంగతి తెలిసింది. అతని కేమీ సంతోషం రాలేదు. మనిషి చిక్కిపోయాడు. మొకటి నేవళం లేదు. తోస్తే పడేట్టున్నాడు. ఇంటికి అల్లుడు వొచ్చినట్టు రాలేదు. ఏకో, ఎవరో వొచ్చినట్టు వొచ్చాడు. మేనమామ పోయాడని అతను ఏడ్చాడు. కాని, ఏడ్చానని చెప్పినా ఎవరూ నమ్మేట్టులేదు. ఢకమారింది.

"వొస్తావా?" అనడిగాడు ఆంజనేయులు భార్యను.

"ఎల్లా రాను చెప్పండి" అంది రామసీత.

రామసీత మొహాన నవ్వూ, నిండూ లేదు. ఎండి వాడిపోయిఉంది.

"కోడలుందిగా అమ్మా. అయినా ఆనవాకుల్లు ఎన్నాళ్లుంటారేం? ఆస్తిఇచ్చిన తల్లయితే ఉంటారేమో" అంది కనకమ్మ అక్కడా అక్కడా. నోరుందిగదా అని అన్నట్టున్నై ఆమాటలు. ఎవరూ పట్టించుకోలేదు వాటిని.

తల్లీ, కొడుకూ వెళ్లిపోయారు.

రామసీత పుట్టింట్లోనే ఉండిపోయింది.

రెండుమూడు నెలలు గడిచై. ముసిలమ్మ మరి మంచం దిగలేదు. ఆవిడా రోజులు వెళ్లదీస్తోంది.

చిన్నప్పుడు తల్లి చేసినదానికి తిరిగి చేసి ఋణం తీర్చుకుం టోంది రామసీత.

మనోహరమైన ప్రవాదలు గాలిలో తేలివొస్తున్నవి.

రామసీతకు అక్కడ ఎవడో ఉన్నాడుట. వాణ్ణి విడిచి రాలేదుట. దీనికి యింట్లో అందరూ హర్షించారుట. అందుకే అల్లా ఆస్తి రాసి ఇచ్చారుట. లేకపోతే కాపరానికి రాదా అనట.

రంకుకట్టడం తేలిక. మరొకరికి రంకుకట్టుతూంటే చెవులు దోరపెట్టుకుని వినేవా ళ్లుంటారు. ఇకిలిస్తారు. పోతారు. నమ్మితే నమ్మినా నమ్ముతారు. ఆలోచించరు. ఆలోచిస్తే ఆ వేళీతృప్తి పోతుందేమో నని భయం.

కట్టుబశిన మనిషి!

రామసీత చెవులనూ పడ్డవి ఈమాటలు. ఆమె ఏమనుకుంటో ఏమో, పెదిమ విప్పలేదు.

తల్లి కొత్త నయంగా ఉంది. "జీనిపో ఇంలేవమ్మా. కాపరం చెడగొట్టుకోకు" అందావిడ. "వెళ్తా లేమ్మా" అంది రామ సీత. "వెళ్లకపోతే ఏమ"న్నాడు అన్నగారు. వొదినగారు ఎటూ అనలేక పోయింది. "అవిణ్ణి అన్నవాళ్లు పురుగులుపడిపోతా"రని కసిలీరా అంది ఆమె. ఆడబిడ్డను వెనకేసుకొచ్చి అన్నదంటే నిజమైఉంటుం దనైనా అనుకోదుకాబోలు ప్రపంచం.

తల్లే బలవంతాన కూతుర్ని ప్రయాణం చేయించింది. తల్లిని విడిచి కూతురు వెళ్లలేకపోయింది. ఎదురుగాలిలో ముందుకెళుతూన్న జెండాలాగా ఆమె అత్తింటికి వెళ్లింది.

పాత్రసామగ్రికూడా సర్వమంగళం అయింది. ఓపంచ నంటు న్నారు. మరో పైపంటుగూడా ముందే తెచ్చి అప్పులు కొన్ని తీర్చారు. వొకటో రెండో పతాలున్నై. రామసీతను చూచి అత్త గాని, మొగుడుగాని ఆదరించలేదు. సత్రంలోకి ఎవరో వొచ్చి వెళు తూంటే చూస్తున్నట్టు చూచారు.

"యిల్లా ఉన్నారే" మంది రామసీత మొగుణ్ణి. అంజ నేయులు ఉలకలేదు, పలకలేదు. ఆరాత్రి ఎల్లాగో అల్లా మూర్తు డుచుకున్నారు. ఉప్పు ఉంటే పప్పు లేదు. పులుసుంటే కారం లేదు. ఆరాత్రి భార్యాభర్తలు ఎడమొహం పెడమొహంగానే ఉన్నారు. భర్తగదా అని దగ్గిరికి పోబుద్ధిపుట్టలే దామెకు. చేసుకున్న భార్యగదా అని అతనూ పిలవలేదు. చాప పరుచుకుని, కొడుకుని దగ్గిరెట్టుకు పడుకుంది. పసివెధవ జెండాను పట్టుకునే పడుకున్నాడు.

తెల్లారింది. దుద్దులూ, ముక్కుపుడకలూ తీసింది. అత్తగారి చేతి కిచ్చింది.

"ఎందుకు?"

"కావలసినవి కొనుక్కుందాం" అంది రామసీత.

"నాకు తెలీదు. మీ ఆయనకు ఇవ్వు. అయినా ఇవేం చాలుతై?"

"మంగళసూత్రం ఉందిగా" అంది.

"అదిగూడా తీయాలనుకోకు తల్లీ. వాడింకా నన్ను దాటె య్యాలి. నీకు పుణ్యముంటుంది." అంది అత్తగారు ఏడుస్తూన్న గొంతుకతో.

రామసీత నొచ్చుకుందో, ఏమయిందో తెలీదు. ఆమె ఏ ఉద్దేశంతో ఆమాట అందో అది దుమ్ముఅయింది.

భర్తకు ఆ రెండూ ఇచ్చింది. 'అక్కర్లేదు' అన్నా డతను. అంజనేయులు గొంతుక పొడిఆరిపోయింది. అల్లా మాటలు వొస్తున్నై. రాత్రి తను పరకాయించి చూడలేదు. బాడిన గుమ్మడికాయరంగు వొస్తోంది. మనిషి ఎండిపోతూన్నాడు.

"మీయిష్టం" అని వాటిని అక్కడే పెట్టింది. ఇవతలికి రాబోతూంది.

"వాడు వెళ్లమంటేనే వచ్చావా?" అన్నాడు. దగ్గుతెర వచ్చింది. కళ్లె ఉమ్మేశాడు. ఆయాసపడుతున్నాడు.

"వాడెవడు?" అంది రామసీత.

"ఆడే - నీ కొత్త మొగుడు."

రామసీత భరించలేకపోయింది. వెనక్కు తిరిగింది. అంజ నేయులు మళ్లీ దగ్గి కళ్లె ఉమ్మేశాడు.

ఇంట్లోకి వొచ్చింది. గాంధీగారి బొమ్మా, రాముడిబొమ్మా ఇంకా బజారు కెళ్లలేదు. వోమూల మేకుకు అంటిపెట్టుకున్నవి. ఆమె కొడుకు నెత్తుకుని సరాసరి అక్కడికి వొచ్చింది. పటాలకు దణ్ణం పెట్టింది. తల్లితోపాటు కొడుకూ దణ్ణంపెట్టాడు.

"పరాత్పరా! చాలు ఈమాటలు" అంది. గొంతిక వొణికింది. "వైధవ్యం వొచ్చినా సంతోషిస్తాను. ఈకాపరానికి ఒక దణ్ణం" అనుకుంది. లెంపలు వేసుకుంది. కొడుకూ తల్లిని చూచి లెంప లేసు కున్నాడు.

"ప్రభూ, ఒక్క దణ్ణం" అని నిట్టూర్చింది రామసీత.



త్రివర్ణపతాకము

★

— శ్రీ కన్నెకంటి వీరభద్రాచార్యులు —

౧

నీ నీడన్ గొనసాగుచున్న దదిగో నిర్మాణకార్యక్రమం
బేనాఁడైన నహో పతాకజనయిత్రీ! భారతీయప్రభల్
నానాదేశము లాక్రమించుట కనంతంబైన నీమూర్తి వి
జ్ఞానంబేకద మూలకారణము విశ్వస్థాయి జేకూర్చుమా!

౨

నలుబదికోట్ల భారతజనమ్ముల కేన ప్రధానచిహ్నమున్
దెలియు డటంచు దిక్కులు ప్రతిధ్వనులీయ గభీరవాక్కులన్
బలుకుచునుంటివా గగనభాగము నంటగ లేచి నీమృదూ
క్తులకు నమశ్శతంబు లివిగో గొనుమమ్మ పతాకదేవతా!

౩


చెవికింపున్ గలిగించు పాట వినవచ్చెన్ రాట్నలక్ష్మీగళా
రవమా! యేమది? ఆజగజ్జనని ధారాళక్రియల్ విశ్వమా
నవకళ్యాణము లంచు జాటుటకు మేనన్ దాల్చి జాతీయపా
టవమున్ గూర్చు పతాకమా భవదఖండజ్యోతి కాత్మార్పణల్.

౪


స్వాతంత్ర్యోద్యమదీక్ష శాంతిసమరోత్సాహప్రధానక్రియా
చాతుర్యంబు నఖండభారత మహీచక్రానుమోదంబు భా
వాతీతప్రతిభావిభూతి సతతం బావాసమై వెల్గు నీ
జాతీయత్వము నంటియుండెడి నహింసాసత్యసిద్ధాంతముల్.


౫

మతముల్ మూఁడగుగాక అందఱకు సమ్యగ్దీక్ష సూచింప నై
క్యత బోధింప పవిత్రతన్ దెలుప, మాతా! యేకజాతీయతా
యుతవస్త్రాంగమునన్ ద్రివర్ణముల నాహ్లాదంబుగా దాల్చి శా
శ్వతమైత్రిన్ నెలకొల్పు నీ కివె నమస్సందోహపూజాబ్జముల్.



BARLEY
FOR INFANTS & INVALIDS
Phew! Hot
Satiating!
"లిల్లీ" బ్రాండ్ బార్లీ మిక్కిలి విలువగలిగిన ఆహారం. అనేక విధాల ఉపయోగపడునది. జబ్బుపడి లేచినవారును కాయ కష్టం చేసే కూలీజనమున్ను ద్రవాహారంగా దీనిని చాలా ఎక్కువగా వాడుతున్నారు. ఇంకా రేషన్‌గానే ఉన్నది గాని పౌరప్రయోగానికి సప్లయిలు మితంగా లభిస్తున్నవి.
Always Ask for
LILY BRAND BARLEY
THE LILY BISCUIT CO. CALCUTTA


STAR of INDIA
an outstanding name in the pencil world...
పెన్సిలు సరిగా రాయకపోయినా, ముక్కు విరిగినా చాలా చిరాకేస్తుంది. ఆలోచన సాగదు. మంచి పెన్సిలు దొరికినప్పుడు ఆలోచనలు ధారాళంగా వస్తాయనటంలో విచిత్రమేమీ లేదు. చక్కగా రాయటానికీ రాసేవారికి ఆలోచనలు ధారాళంగా దొర్లటానికీ అనుకూలంగా తయారుచేసినవి స్టార్ ఆఫ్ ఇండియా పెన్సళ్లు.
స్టార్ ఆఫ్ ఇండియా పెన్సళ్లు
అత్యుత్తమమైనవి
(తయారించువారు)
ALWAYS -BUY- INDIAN
.. MADRAS PENCIL FACTORY Madras.
ADS. MPL.



పశ్చిమగోదావరి జిల్లాలోని 'ర్యాలి' అను ఊరిలో వేంచేసియున్న

శ్రీ జగన్మోహినీ కేశవస్వామి

'రాలి'గా మారిన రమణీయచరిత్ర

❀

విష్ణుమాయకు మోసపోయిన రుద్రుని వృత్తాంతము

క్రీ. శ. 10-వ శతాబ్దాంతమున చాళుక్యసింహుడగు రాజరాజనరేంద్రచక్రవర్తి ఆంధ్రసామ్రాజ్యలక్ష్మిని అంకపీఠమున నుంచుకొని, రాజమహేంద్రవరము రాజధానిగా వేంగీమండలమును ప్రజాసమ్మతిగా పాలించెను.

క్రీ. శ. 1063-వ సంవత్సరమున ఆ సార్వభౌముడు గతించినంత, ఆయనసుతుడు కులోత్తుంగుడు బాలుడగుటచే, పినతండ్రి విజయాదిత్యుడు ప్రభుత్వమును తానే వశపరచుకొని, కులోత్తుంగుని దేశభ్రష్టునిచేసెను.

విజయాదిత్యుని ఈ దుశ్చేష్టితమునకు ఆగ్రహముచెందినవారై దేశములోని ప్రముఖులు కొందరు కులోత్తుంగుని మేనమామయును, చోళసామ్రాజ్యప్రభువును అగు రాజరాజచోళుని రాజధానియగు వర్ధమానమునకు వెళ్లి, ఆయనతో అప్పటి ఆంధ్రదేశ స్థితిగతులను పూసగ్రుచ్చినట్లు వెల్లడించిరి.

చాళుక్య సామ్రాట్టగు తనబావ గతించుటకును, మేనల్లుని విదేశగమనమునకును, విజయాదిత్యుని రాజ్యకాంక్షకును రాజరాజచోళుడు మిక్కిలి విచారించి, క్రోధోద్రేకముతో, ససైన్యుడై ఆంధ్రదేశమునకు పయనమై వచ్చుచుండెను.

అదేవేళకే, తూర్పుచాళుక్యరాజ్యమును హరింపవలెనని పశ్చిమచాళుక్యుడైన ఆరవ విక్రమాదిత్యుడు తన రాజధానియైన కల్యాణపురమునుండి రాజమహేంద్రవరమును ముట్టడించుటకు గొప్పసైన్యముతో వచ్చుచు తారసిల్లెను.

ఉభయులకును మార్గమధ్యముననే మహాపోరాటము జరిగెను. కాని, అంతలోనే ఇద్దరును ఒకవిధమయిన సంధికి ఒడంబడిరి. పశ్చిమ చాళుక్యుడు తన సైన్యముతో స్వదేశమునకు తిరిగిపోవుట, చోళచక్రవర్తితనయను విక్రమాదిత్యుడు పెండ్లియాడుట అను నీ రెండు కోరికలును నెరవేర్పబడెను.

చోళచక్రవర్తి తన అశేషపరివారముతో, ప్రచండవిక్రమమున, ఆంధ్రదేశమును జయించుటకు రాజమహేంద్రవరమును ముట్టడింప వచ్చుచున్నాడనియు, మహారాజకుమార కులోత్తుంగుని తాను విదేశములపాలు గావించినందుకు క్రోధపరవశుడై తనను సమయింప వచ్చుచుండెననియు గ్రహించి, విజయాదిత్యుడు కతిపయపరివారముతో కోటవిడిచి అడవులనుబట్టి పోయెను.

శ్రీ ర్యాలి రామచంద్రరావు

విజయాదిత్యు డిట్లు తన్నెదిరింపకయే పారిపోవుటచేత బావగారి చాళుక్య సింహాసనము చోళచక్రవర్తికి అనాయాసముగా వశమైపోయెను. వెంటనే యతడు మేనల్లుని వెదకుటకై చారులను నలుదిశలకును బంపించెను.

అజ్ఞాతవాసమున విదేశములందుండిన కులోత్తుంగుడు తనకై చారులపయనమును పసికట్టి, చోళుని అభిప్రాయ మిదమిత్థమని తెలియనివాడై, దుష్టులగు చోళుల బారిబడుట కిది యదనుగాదని యెంచి, వారిదృష్టిని బడక, దినదిన ప్రవర్ధమానుడగుచు సమయము కొరకు నిరీక్షించుచుండెను.

ఎంతకును ఎరుకబడని కులోత్తుంగునికై విచారించివిచారించి, ఇక లాభములేదని తీర్మానించుకొని, చోళచక్రవర్తి తన కిష్టులయిన దాక్షిణాత్యభూసురులతో పండితగోష్ఠి నెరపుచు సుమారు ముప్పదియేండ్లు చోళసామ్రాజ్యముతో బాటు ఆంధ్రసామ్రాజ్యమును గూడ, రాజమహేంద్రవరము రాజధానిగా, తానే పాలింపగడగెను.

ఆకాలమునందే తంజావూరు మండలమునందలి కుంభకోణము, వెలంగమాను మొదలైన ప్రాంతములందలి ద్రావిడబ్రాహ్మణులు చోళచక్రవర్తితోగూడ ఆంధ్రదేశమున నివసింపదలచి, చక్రవర్తియనుమతి గైకొని, తమతమ కుటుంబములతో వచ్చి, ఇప్పటి గోదావరీమండలమందలి గౌతమీ, వసిష్ఠానదుల మధ్యభాగమున వెలయుచున్న ర్యాలీ యనెడి పట్టణములో కాపురములు పెట్టిరి. అట్లు వచ్చునప్పుడు వారు తమతోగూడ ప్రాచీన శిల్పకళావిశేషములను వేనోళ్ల జాటెడు ఒక సుందరతమ సాలిగ్రామ శిలావిగ్రహమును - జగన్మోహినీకేశవస్వామి యనుపేరిటిదానిని – దర్శనమాత్రముననే పామండులకు సైతము భక్త్యావేశము గలుగజేయగల విగ్రహమును దెచ్చి, దాని నొక రథములో నుంచి, మంగళతూర్యరావములతో మహారథయాత్ర జరిపించుచుండగా, ఇప్పుడు దేవాలయమున్న చోట నదరు రథముయొక్క సీల విరిగి రాలిపోవుటయు, తిరిగి క్రొత్తసీల వేసినను రథము ననేమిరా కదలకుండుటయు చూచి, అదికూడ భగవత్సంకల్పమేనేమో యనుకొని,అక్కడనే ఒక గొప్ప దేవళమును నిర్మించి, స్వామివారిని అందులో ప్రతిష్ఠించిరి. రథసీల రాలుట కారణముగా వెలసిన ఆయూరికి అప్పటినుండి 'రాలి' అను పేరు ప్రసిద్ధమై వాడుకకు వచ్చెను. అంతకుముందు ఆయూరు రత్నాపురము అనుపేరుతో పిలువబడెడిదని పెద్దలు చెప్పగా వినికిడి. ఆనాడు అక్కడి వైశ్యశ్రేష్ఠులు నౌకాయానమున సముద్రములను దాటి, ఇతరఖండములతో రత్నవర్తకము జేయుచు మహారాజపూజితులైయుండినకతమున దాని కాపేరు వచ్చినట్లు చెప్పుదురు.


ఈ కేశవస్వామిఆలయమున కెదురుగా, రమారమి రెండుఫర్లాంగులదూరములో, అదే రాజవీథిలో, దీని కెదురుముఖమై శ్రీమ దుమాకమండలేశ్వరస్వామి ఆలయమను మరియొక దేవళ మున్నది. కేశవస్వామిఆలయము తూరుపుముఖముగాను, ఉమాకమండలేశ్వరస్వామిఆలయము పడుమరముఖముగాను ఉన్నవి. ఈ రెంటిని సమన్వయపరచునట్టి కథ యొకటి ఆప్రాంతములందు ప్రచారములో నున్నది.

యుగములకువెనుక, క్షీరసాగర మథనకాలమందు, సముద్రమథనానంతరము అందులో ఉద్భవించిన అమృతమును దేవాసురులకు పంచిపెట్టుటకు మహావిష్ణువు మోహినీ

రూపము ధరించి, అసురులను మోసపుచ్చి, సురల కమృతమిచ్చిన వర్తమానము విని, ఆ మోహినీరూప మెట్టిదో చూడ ముచ్చటపడి శివుడు ఆ మోహినీరూపమును తన కొకసారి చూపింపుమని విష్ణుదేవుని కోరెనట. అతడును చిరునవ్వులు నవ్వుచు, వల్లెయని, తన వైష్ణవమాయను ప్రయోగించి, తానై జగన్మోహినీరూపమున శివునకు దివ్యదర్శన మిచ్చెనట. ఈశ్వరుడు ఆ అతిలోకసుందరాకారమును గాంచి, మోహితుడై, అవుగాముల నాలోచింపక ఆమెను బట్ట నుద్యమించెనట. మోహినియు మరింత హావభావవిలాసములను ప్రదర్శించుచు, ఆయన కందీఅందనట్లు ఆడుచు పాడుచు పరుగెత్తజొచ్చినదట. మోహినీమోహవాగురలలో దగుల్కొన్న శివుడు ఆమెను వెన్నంటి పారజొచ్చెనట. ఇట్లు ఒకరివెంట నొకరు పరుగుపందెమువేసుకొని, చివరకు ఈ 'రాలి' పట్టణ మున్నచోటికి చేరుకొన్నారట. అక్కడ విష్ణువు వెనుదిరిగి శివుని పారజూచి, అతడు అలసిసొలసియున్నట్లు గుర్తించి, ఇంక ఉపేక్షించుట పాడిగాదని నిజస్వరూపమును గనబరచెనట. సదాశివు డది చూచి, మహావిష్ణుని మాయకు తాను మోసపోయినట్లు తెలిసికొని, సంభ్రమాశ్చర్యములతో స్థాణువై నిలబడిపోయెనట.

శివకేశవులు ఒకరికొకరెదురుగా వెలసియుండుట కిదియే కారణ మని స్థలపురాణము.





India's rapid Industrialization requires

WELL EQUIPPED CONTROL LABORATORIES

and **STANDARD SCIENTIFIC EQUIPMENT**



ఆధునిక పరిశ్రమలన్నిటిలోనూ కావలసిన పనిముట్లు అతి సున్నితమైనవి. వీటిని సరిగా తయారుచెయ్యటం అతి కష్టమైనపని. ఇందులో 20 ఏండ్లపైబడి గడించిన అనుభవంతో మేము తయారుచేస్తున్న సైంటిఫిక్ పనిముట్లు నిర్దుష్టమైనవి. ఎట్టి కఠిన ప్రమాణములనైనను పూర్తిగా సంతృప్తిపరచునవి. మీకు కావలసిన వాటికి మాకు వ్రాయగోరెదము.

THE ANDHRA SCIENTIFIC CO., LTD.

ఆంధ్రా సైంటిఫిక్ కంపెనీ, లిమిటెడ్.

4, బ్లాకర్సురోడ్డు, మౌంట్‌రోడ్డు, మద్రాసు.

హెడ్డాఫీసు, కర్మాగారములు: మచిలీపట్నము.

బ్రాంచీలు: అలహాబాదు, బొంబాయి, కటక్.

అడుపాజ్ఞలు

[కథానిక]

= శ్రీ 'జమదగ్ని' =

వాకిట్లో చెప్పుల చప్పుడయింది.

వస్తున్నది నాన్నే!

మధ్యసావిడి పక్కగదిలో గీర్వాణ అనకుని చదువుకుంటున్న గోపాలం ఉలిక్కిపడి వెన్ను నిక్కబొడిచి గట్టిగా చదవడం మొదలుపెట్టాడు. అంతకుముందు లోపల్లోపల శ్రద్ధగానే చదువుకుంటున్నాడు పాపం. అదిరిపోయి ఆకస్మాత్తుగా పైకి చదవడంలో వర్ణలోప, వర్ణాగమ, వర్ణవ్యత్యయాలు వరుస తప్పకుండా ఒక్కుమ్మడిగా దొర్లడం మొదలుపెట్టాయి.

వెంకట్రామయ్యమనసులో అబ్బాయి అశ్రద్ధకు కోపం పొంగడం మొదలుపెట్టింది.

తండ్రి తన్ను సమీపించినకొద్దీ గోపాలం చదువు జోరుగా సాగించాడు. జోరెక్కువైన కొద్దీ తప్పులూ ఎక్కువవుతున్నాయి. అంతకంతకు మాటలే మింగుడుపడిపోతున్నాయి. అప్పుడప్పుడు తండ్రివంక చూడడానికి చేసే ప్రయత్నంలో పంక్తులుగూడా లోపిస్తున్నాయి.

ఇక సహించలేకపోయాడు వెంకట్రామయ్య. విసుగుతో ఉత్తరీయం దండెన పారేసి, చొక్కా అయినా విప్పుకోకుండా అమాంతం వచ్చి అబ్బాయిముందు కూర్చున్నాడు. అంతే. గోపాలం నోరు బంద్ అయిపోయింది. కళ్లు మాత్రం పుస్తకంవంకే చూస్తున్నాయి.

కళ్లు పెద్దవిచేసి "ఆపేశావేం?" అన్నాడు తండ్రి.

గోపాలం బిక్కముఖం పెట్టాడు.

ఇల్లంతా అతినిశ్శబ్దంగా ఉంది.

చెయ్యి చెవిదగ్గరకు పోనిస్తూ "చదవ్వేమిరా" అన్నాడు తండ్రి.

అతని మాట అతని నోట్లోనుంచి బయటికి పూర్తిగా రాకముందే గోపాలంముఖం ఏడుపుముఖం అయిపోయింది.

అంతదాకా వెళ్లిన ఆయనచెయ్యి ఊరుకోలేదు. లోపల్లోపల కాగిన పాలు అమాంతం పొంగినట్లు, నిశ్శబ్దతను చీల్చుకుని గోపాలందుఃఖం బయటికి వచ్చింది. ఒక చేతిలో పుస్తకం వణుకుతూ ఉండగా రెండోచేతి మణికట్టుతో కళ్లు నులుముకుంటూ, చెవిపట్టుకున్న తండ్రిచేతి నప్పుడప్పుడు తోస్తూ వెక్కివెక్కి ఏడవడం మొదలుపెట్టాడు.

"ఇదీ తతంగం! రోజూ నీ కిది ఒక ఆటగా ఉంది. నే వచ్చి చదవమనేటప్పటికి దొంగ ఏడుపు ఏడుస్తావ్. వెధవా!" అని అంటూ చెంప పగలగొట్టాడు తండ్రి.

గోపాలం పుస్తకం కిందపడేసి రెండుచేతులతో పనిచెప్పి కాళ్లాడిస్తూ 'అమ్మా' అంటూ గిలగిలలాడిపోయాడు. దిబ్బపండు చాయ గోపాలం చెంప కాబూల్ దానిమ్మపండుచాయకు రావడం కిరసనాయిల్ దీపపు వెలుగులో ఆతండ్రి గమనించనేలేదు.



"చెయ్యి చెవిదగ్గరకు పోనిస్తూ 'చదవ్వేమిరా' అన్నాడు తండ్రి."

"అన్నకొద్దీ మళ్ళీఏడుస్తావ్! ముందు ఏడుపు మానెయ్యి" అని పళ్లు బిగించి అంటూ మళ్లీ చెయ్యి ఎత్తాడు తండ్రి.

మళ్లీ దెబ్బపడుతుందన్న భయంతో స్వరం తగ్గించడానికి గోపాలం ప్రయత్నం మొదలుపెట్టాడు.

"ఇంకా వినపడుతోంది. ముందు ఏడుపు మానెయ్యి" అని వెంకట్రామయ్య కొంచెం ముందుకు జరిగాడు.

గోపాలం అప్పటికి వావాతిప్పలూ పడి ఏడుపును బైటికి రానివ్వకుండా పట్టుకోగలిగాడు. కాని లోపల కుమిలిపోతూనే ఉన్నాడు.

"ఇంకా చూస్తావేం? తియ్యి పుస్తకం."

గోపాలం చెయ్యి పుస్తకం తీసుకుంది.

"బొట్టుపెట్టి చెప్పాలా ఏమిటి చదవమని"

గోపాలంనోరు చదవడం మొదలుపెట్టింది. మధ్యమధ్య వస్తున్న ఏడుపుతో మాటలు బైటికి వస్తున్నాయి.

"ఆపని మొదట్లోనే చేస్తే ఇంత ఏడు పెందుకూ?" అని అన్నాడు వెంకట్రామయ్య—ఎట్లాగైతేనేం కొడుకుచేత చదివించ గలిగా నన్న సంతృప్తితో.

"చాలా కష్టపడ్డారుగాని భోజనానికి లేవండి" అని ఇంతా కటినుంచీ కాచుకుకూర్చున్న రుక్మిణమ్మ భర్త నుద్దేశించి అన్నది.

"నోరుముయ్యి! ఏమి టాతొందరపు! నీ మూలానే ఆ వెధవ ఇట్లా తయారవుతున్నాడు. నీ కొడుకు చదువుకోవడం ఇష్టంలేక పోతే పనిమనిషిని మానిపించి అంట్లుతోమించు." అని అంటూ వెంకట్రామయ్య దూకుడుగా దొడ్లోకి స్నానానికి వెళ్లాడు.

రుక్మిణమ్మ మాఱుమాటాడలేదు. తండ్రి వెళ్లాడన్న ధైర్యంతో తన వంకకు చూస్తున్న కుమారునివైపు జాలిగా చూచి భర్త కోసం లోపలికి వెళ్లిం దాయిల్లాలు.

తండ్రి భోజనం చేసి వచ్చేటప్పటికి గోపాలం పుస్తకం ఒళ్లో పడేసుకుని బీర్వాకు జేర్లబడి ఏడ్చిఏడ్చి నిద్రపోయాడు.

2.

రాత్రి జరిగిందంతా మరిచిపోయి గోపాలం తెల్లవారుజామునే రోజూమాదిరిగా తండ్రికంటెముందే నిద్రలేచాడు. అనర్గళ ధారతో పాఠాలు చదువుకున్నాడు.

తండ్రి నిద్రలేచేటప్పటికి గోపాలంస్నానం పూర్తిఅయింది.

తండ్రిస్నానం కాకముందే కుమారుడు భోజనం చేసేశాడు.

ప్రైవేటుమాష్టారిముందు గోపాలం కూర్చున్న అరగంటకి కాని వెంకట్రామయ్యగారి కాఫీ పూర్తికాలేదు.

తీరా ఆయన కాఫీకానిచ్చి బయటికి వచ్చేసరికి ఎవరో పెద్ద మనుష్యులు మాట్లాడడానికి వచ్చారు. వారిని సాగనంపడం గంటకు గాని తెములలేదు. ఆలోగా ప్రైవేటుమాష్టరు వెళ్లనే వెళ్లాడు.

అప్పటికి ఆఫీసువేళకూడా అయింది. అందుచేత కొడుకు చదువువిషయం మళ్లీ పరామర్శ చెయ్యడానికి ఆయనకు తీరుబడి కాలేదు.

మాష్టరు వెళ్లిపోయినా గోపాలంమాత్రం కూర్చున్న చోటనే ఉండి పుస్తకం చేతిలోనే ఉంచుకుని ఊర్ధ్వదృగ్గోళాలు తప్ప తక్కిన అన్నిటికేలకూ బొంగరంమాదిరి తిరుగుతున్నాడు. తండ్రి ఆఫీసుకు వెళ్లితేగాని అతను అక్కడనుంచి కదలడానికి వీల్లేదు.

అన్నయ్య కూర్చున్న గదిలోకి చెల్లాయి వెళ్లి అతని చేతిలో నుంచి పుస్తకం లాక్కున్నది. మొదట్లో గోపాలానికి చాలా సంతోషం వేసింది పుస్తకంవదిలిందిగదా అని. కాని వెంటనే తండ్రి జ్ఞాపకంవచ్చాడు. హడలిపోతూ, నెమ్మదిగా, పుస్తక మిమ్మని చెల్లాయిని బతిమాలుకున్నాడు. ఇత నెంత నెమ్మదిగా అడిగాడో అంత గట్టిగా నే 'నివ్వనంటూ' సనిసింది చెల్లాయి. తాను గనక ఇంకొంచెం బలవంతం చేశాడా అమ్మాయి రాగం తీస్తుంది. దాంతో తండ్రి వస్తాడు. చెల్లాయిని ఏడిపించినందుకు వీపు చిట్ల గొడతాడు. గోపాలం ఆలోచించాడు. చెల్లాయిచెవిలో చిన్న రహస్యం చెప్పి పుస్తకం తీసుకుని దాచాడు.

తండ్రి భోజనంచేసి చెయ్యి కడుక్కొనేందుకు దొడ్లోకి వచ్చేటప్పటికి అమ్మాయి చెట్టుకిందా, అబ్బాయి చెట్టుమీదా ఉన్నారు.

నీళ్లు పుక్కిలించి ఉమ్మేస్తూ "ఇప్పుడు జామకాయ లెందు కర్రా భడవల్లారా!" అని గద్దించాడు తండ్రి.

చెయ్యిపట్టు తప్పి గోపాలం కింద పడిపోయాడు. మోకాలు కీసకుమేర కొట్టుకుపోయి నెత్తురుకారింది.

గోపాలం తనంతట తానే లేచి నుంచోగానే ఎదురుగుండా తండ్రిని చూచాడు.

ఏ మాత్రం వ్యవధి లేనేలేదు.

"ఇంకెప్పుడైనా చెట్టు ఎక్కుతావా? మాట్లాడవేం? ఎక్కవుగదా!" అని అంటూ తలమీదా, వీపుమీదా దెబ్బలు వేస్తూ, చెవిపట్టుకుని ఇంట్లోకిఈడ్చుకువచ్చాడు. "అమ్మో, అమ్మో" అని ఏడుస్తూ, మధ్యమధ్య "ఎక్కను ఎక్కను" అని సమాధానం చెప్పుతూ గోపాలం గోలపెట్టేశాడు.

తల్లి ఇస్తున్న చనువుతో అబ్బాయిచదువంతా తగలడి పోతోందని పెద్ద ఆవేశంతో ఉపన్యాసం చెప్పి ఆనాడు వెంకట్రామయ్య అరగంట ఆలస్యంగా ఆఫీసుకు వెళ్లాడు.

తండ్రి బయటికి వెళ్లాక తల్లి వచ్చి ఎంత బతిమాలుకున్నా వినక గోపాలం మూలకూర్చుని ముక్కుతూనే ఉన్నాడు.

3

ఒంటిగంట కొట్టారు.

కొత్తగా వచ్చిన చుట్టాన్ని చూడడంతోటే అంతకు ముందు అణగారిన గోపాలందుఃఖం ఒక్కమాటు ఉప్పెనగా పైకి వచ్చింది.

రామకృష్ణయ్య వీళ్లింటికి వచ్చి మూడేళ్లు కావస్తోంది. తాను వచ్చీరావడంతోనే మేనల్లుడు ఇంతగా గోలపెట్టి ఏడవడం అతని కెంతో కష్టాన్ని కలిగించింది. ఎంతకూ తరగకుండా దేవుకుదేవుకు వస్తున్న వాడి దుఃఖం చూచి మామయ్యగుండె మంచినీళ్లమూట అయింది.

"ఏంరా గోపీ! ఎందుకురా అట్లా ఏడుస్తావు?" అంటూ దగ్గఱకువెళ్లి, ముఖాన్ని కప్పిన చేతులు తీస్తూ గోపాలాన్ని బుజ్జగించబోయాడు రామకృష్ణయ్య.

ఈమాట వింటూనే రుక్మిణమ్మ "నువ్వు ఎప్పుడువచ్చావు అన్నయ్యా! ఇంటిదగ్గఱనుంచేనా?" అని అంటూ సావిట్లోకి వచ్చింది.

గోపాలం తన చేతులు లాక్కుని మరింత విజృంభించి ఏడవడం మొదలుపెట్టాడు.

"అవునుగాని, వీడెందుకిట్లా ఏడుస్తాడు?"

"ఎందుకేమిటి? వాడి కర్మం, నాకర్మం! ఏళ్లు వచ్చిన కొద్దీ మీబావకు మతిపోతోంది. చూడు, వాడి మొహం చూడు. నిన్నరాత్రినుంచీ ఈవరసన ఏడుస్తున్నాడు" అంటూ రుక్మిణమ్మ విసుక్కుని "నువ్వు లేచి స్నానంచెయ్యి! భోజనం చేద్దువుగాని. ఇదెప్పుడూ ఉన్న దేలే! నీవెంబడన్నా వాడూ లేస్తాడు!" అన్నది.

పదేళ్ల మేనల్లుణ్ని రామకృష్ణయ్య అమాంతం లేవదీసి ఎత్తుకుని కితకితలు పెడుతూ "నువ్వు కష్టించు, మేమిద్దఱమూ వస్తున్నాము." అన్నాడు. మామయ్యచేసిన ఆ ఒక్క చేష్టతో, అన్న ఆ ఒక్కమాటతో గోపాలం పుట్టెడు దుఃఖమూ ఇందుపగింజగీసినట్లు విరిగిపోయింది.

గోపాలం మామయ్యపక్కన కూర్చుని భోజనం చేశాడు. మామయ్యకు మడతమంచంమీద పక్క వేసి తానుగూడా ఆయన పక్కన పడుకున్నాడు. మామయ్య చెప్పుతున్న కథ వింటూ, స్వర్గంలో ఉన్నట్లు భావిస్తూ గోపాలం ఒళ్లు తెలియకుండా నిద్రపోయాడు.

రామకృష్ణయ్యకు నిద్రపట్టలేదు. మేనల్లుణ్నిగూర్చి ఆలోచిస్తున్నాడు. అంతలో రుక్మిణమ్మ పనిముగించుకుని గడపదగ్గఱ కూర్చుని కదిలించింది.

"గోపి నిద్రపోయాడా అన్నయ్యా?"

"అవునమ్మా! ఏడ్చిఏడ్చి ఉన్నాడాయె! ఇందాకనే నిద్రపోయాడు పాపం!"

"ఏంపాపమోగాని, అన్నయ్యా! నా కీసంసారమంటే విసిగెత్తిపోతోంది. వీళ్ళు పెద్దవుతున్నా లేకపోయె! ఈయనకేమో రోజురోజుకూ ఇట్లా అయిపోతున్నారు."

"నేనూ ఆయనమాటే అనుకుంటున్నాను. నాకేమీ అర్థం కావడం లేదు. గోపి ఏమైనా అల్లరివాడా అంటే కానేకాదు. పోనీ, మొద్దుఅందామా అంటే వీడికున్న తెలివితేటలు ఆయనకు గూడా ఉన్నట్లు తోచదు!"

"నేను మథనపడుతున్నదీ ఇందుకే అన్నయ్యా! తండ్రి అంటే పిల్లలకు భయము ఉండనక్కర్లేదని ఎవ్వరూ అనరు. చిన్నవాళ్లకు పెద్దవాళ్లంటే భయమూ, భక్తి ఉండవలసిందే. కాని ఇదెక్కడి భయం బాబోయి! ఆయన కంటబడ్డారంటే పెద్దపులిని చూసినట్టే వాడు!"

"మరి అందఱికీ ఇట్లాగైతే ఇక వాళ్లచేత పనం ఏం చేయించగలం?"

"ఇప్పుడు జరుగుతున్నదే అది. వాడంతటవాడు చక్కగా చదువుకుంటాడు. ఒక్క తప్పు లేకుండా ఏరోజుపాఠం ఆరోజు మాష్టరుకు అప్పచెప్పుతాడు. కాని ఈయన వచ్చి కూర్చుంటే సరి, నోట్లోనుంచి మాటరాదు పాపం. వచ్చినా తప్పులు. దాంతో వాణ్ణి చావబాదడం. ఇదీ పరిస్థితి. ఏరోజూ వాడేడవకుండా గడవనేగడవదాయె ఈకొంపలో!" అంటూ కళ్లనీళ్లు పెట్టుకుందిపాపం రుక్మిణమ్మ.

రామకృష్ణయ్య చెల్లెలికళ్లు చూచి నిర్ఘాంతపోయాడు. వెంకట్రామయ్య ఎందు కింత కఠోరుడవుతున్నాడో అతని కేమీ అర్థంకాలేదు.

రుక్మిణమ్మ కళ్లనీళ్లు తుడుచుకుని మళ్లీ అందుకుంది:

"నువ్వు చెప్పు అన్నయ్యా! ఎవరైనా పుట్టగానే తమంతవాళ్లు కాగలరా? పొద్దస్తమానమూ పుస్తకాలుపట్టుకు కూర్చోమంటే పసివాడు ఏం కూర్చుంటాడు? కన్నబిడ్డగదా అని చేరదీసి ఒకమాట అనడం, ఒక ఆటవస్తువు కొనిఇవ్వడం, వెంబడి ఎక్కడికైనా తీసుకువెళ్లడం ఇట్లాంటి ముద్దూ ముచ్చటా రవ్వంతైనా లేదాయె. ఏమో బాబూ! ఈ కొంపలో పిల్లలు పుట్టడంకంటే నరకంలో పడడం మేలనిపిస్తోంది."

"అవును మరి అంతే! పిల్లలంటూ ఉన్నాక చనువు చూపకపోతే ఎట్లా? ఒకపక్క చనువూ ఇస్తుండాలి; మఱొకపక్క భయమూ పెట్టుతుండాలి. అంతేగాని ఏదొక్కటయినా కష్టమే!"

"ఎక్కువా మరీ ఎక్కువా? వాళ్ళి కొట్టే కొట్టడానికి హాయిండే ఎదిరిపోతున్నాయి. పక్క ఇంటికి పోగూడదు. ఇంట్లో తిరగగూడదు. పగలల్లా ఆ గదిలో కూర్చుని అట్లా పుస్తకాలు చేతుల కంటుకుపోయేటట్లు చదువుకోవాలి. ఇంత చిన్నతనంలో ఏ మహానుభావు లిట్లా చదివారో ఏమో!"

"అదేమిటి చెల్లీ, గోపిని బడికిగూడా పంపించడా ఏమిటి?"

"బడీ లేదు, బండలూ లేదు. అడ్డమైనవాళ్ల స్నేహాలూ చేసి చెడిపోతా డంటారు. ఆమాటా నిజమే. ఈరోజుల్లో ఈబళ్లు కాదుగాని, వేలెడుకే చెడువాళ్ల దగ్గఱనుంచీ చెనవఅలవాట్లతో పాడై పోతున్నారు. అందుకు నేనేమీ అనను. మన కట్లాంటి అభిప్రాయా లున్నప్పుడు వాడి పసితనాన్ని గమనించి ఏదో ఇంత ఆటాపాటా, తోడూ దొంగాటా వీటి కేమైనా అవకాశం ఇవ్వాలంటావా అక్కర్లేదంటావా?"

"అదేమ్మాట! అక్కర్లేకపోవడమేం? అవేమీ లేకపోబట్టే మరీ ఇంత దిగులుపడి, నాన్నభయంతో వట్టి పిరికివా డయిపోయాడు, పిచ్చివెధవ!" అని మేనల్లుడి వీపుమీద చేత్తో రాస్తూ అన్నాడు రామకృష్ణయ్య.

గోపాలం 'మామయ్యా' అంటూ ఉలిక్కిపడి లేచికూర్చుని కళ్లు తుడుచుకోవడం మొదలుపెట్టాడు.

"అదేమిటిరా నాన్నా! అట్లా కంగారుగా లేచావ్!" అంటూ మామయ్య మేనల్లుణ్ని తన పొట్టమీదికి లాక్కున్నాడు.

కాఫీప్రయత్నానికి రుక్మిణమ్మ లోపలికి వెళ్లింది.

౪

మామయ్యఎడంచెయ్యి చిటికెనవేలు పట్టుకుని గోపాలం నడుస్తున్నాడు. లేదు, నడవడంలేదు, గాలిలో తేలిపోతున్నాడు.

ఎదురింటివాళ్ల అబ్బాయి పెట్టుకున్న బెల్టూ, పక్కింటి రాముడి బాటూ, వాళ్లమ్మాయిమోటారూ, వీళ్లబ్బాయిబూరా అన్నీ అతనికి కనబడుతున్నాయి. గోపాలం తానేదో గొప్ప ప్రపంచంలో ఉన్నట్లు అనుకుంటున్నాడు. అందరికీ అన్నీ ఉన్నాయి. తనకే ఒక్కటీ లేదు. తనకూ అన్నీ కావాలి.

"మామయ్యా! మామయ్యా! ఈబంతి కొనిపెట్టవూ? ఆబాటు కొనవూ?" అని అడిగి, ఎన్ని అడిగినా విసుక్కోని మామయ్య చేత అన్నీ కొనిపించుకున్నాడు. మోయలేని సంతోషంతో ఆ వస్తువులన్నీ తనే మోస్తూ మామయ్యవెంబడి గోపాలం ఎంత నడిచాడో అతనికే తెలియలేదు.

దారిలో నడుస్తూ "చూడు చూడు మామయ్యా! ఈబంతి ఎట్లా ఎగురుతోందో" అని అంటూ బంతి పడేసేటప్పటికి చంకలో వస్తువులుగూడా కింద పడిపోయాయి.

అవి తీసుకుంటున్న గోపాలానికి సహాయంచేసి, కొన్ని తాను తీసుకుని "వీధిలో జనంలో ఇట్లా ఆడకూడదు నాన్నా! బళ్లూగిళ్లూ వస్తాయి" అని రామకృష్ణయ్య మేనల్లుణ్ణి పక్కకు తీసుకు వచ్చాడు.

ఇంతలో నాలుగువీధులూ కలిసిన చోటుకు వచ్చారు. అక్కడ నుంచున్న పోలీసు 'ఊంయి'మని ఈల ఊదాడు. గోపాలం తన ఈల అంతకంటే గట్టిగా ఊదాడు.

"గోపీ! బజారులో నువ్వు ఈల వేసేటట్లయితే ఆ పోలీసు ఎందుకురా అక్కడ?"

"ఎందుకేమిటి? సరదాకి ఊదుకుంటున్నాడు కాదూ మామయ్యా!"



"మోయలేని సంతోషంతో ఆ వస్తువులన్నీ తనే మోస్తూ మామయ్యవెంబడి గోపాలం ఎంత నడిచాడో అతనికే తెలియలేదు."

"సరదాకు గాదు నాన్నా! అటునుంచి వస్తున్న కారుకు దారిఇవ్వడంకోసం ఇటు వస్తున్న బండిని ఈలవేసి ఆపుచేశాడు. కారు వెళ్లడంతోటే దీన్ని పోనిస్తాడు. ఆ పోలీసు చేసే పని అది."

"అందుచేత బజార్లో మనం ఈల వెయ్యకూడదు. అవునా మామయ్యా?"

'అవును' అంటూ మేనల్లుడి బుద్ధిమంతతనానికి సంతోషించి, వీపుమీద మెల్లగా తట్టుతూ, మీదికి వస్తున్న సైకిల్ని తప్పించి గోపాలాన్ని పక్కకి లాగాడు మేనమామ.

అప్పటికి అరున్నర అయింది.

గోపాలానికి వాళ్ల మామయ్య కొనిపెట్టిన బిళ్లలతో ఆకలే తెలియనేలేదు.

అయినా ఎందుకైనా మంచిదని అరడజను అరటిపళ్లూ, నాలుగు బత్తాయికాయలూ కొనిఇచ్చి మేనల్లుణ్ణి సినిమాకు తీసుకు వెళ్లాడు రామకృష్ణయ్య.

"ఇందులో ఏముంటుంది మామయ్యా!"

"బొమ్మలు చూపిస్తారురా? మాటలూ, పాటలూ, పద్యాలూ వీటితో మనకి కథ తెలుస్తుంది"

"బొమ్మ లెక్కడైనా మాట్లాడుతాయా".

"మాట్లాడవురా పిచ్చివాడా! మనం మాట్లాడినది తిరిగి మళ్లీ మనం అన్నట్లే వినిపించేందుకు వీలయే యంత్రం ఉంటుంది. దాన్ని గ్రామఫోనంటారు. ఫోటోలు తీసి బొమ్మలు చూపిస్తూ, అటువంటి యంత్రంసహాయంతో ఆ బొమ్మల నోటిలోనుంచి ఆ మాటలు వచ్చేటట్లు చేస్తారు. చూద్దుగానిగా!"

పాటలు వింటున్నకొద్దీ గోపాలంతన్మయత్వం ఎక్కువై పోతోంది. కుర్చీలో సరిగా కూర్చోలేకపోతున్నాడు.

ఇంతలో తెరమీద బొమ్మలు కనపడ్డాయి. గోపాలం నుంచునేవున్నాడు. అప్పుడప్పుడు ఎగరడంకూడా మొదలుపెట్టాడు. రామకృష్ణయ్య వాడి సంతోషం చూసి కళ్లు పత్తికాయలు చేసుకుని ఆనందిస్తున్నాడు. గోపాలం ఏప్రశ్నా తోచనంత తన్మయత్వంతో చూస్తున్నాడు.

సినిమాలో అల్లరికృష్ణుడి దగ్గఱకు వెళ్లాడని తన కొడుకును ఒక గొల్లఆయన కొడుతున్నాడు. వెంటనే గోపాలం "ఎందుకు మామయ్యా! అట్లా కొడతాడు? కొట్టవద్దని చెప్పవూ!" అన్నాడు.

"అవి బొమ్మలురా" అన్నాడు మేనమామ మేనల్లుడి కళ్లల్లోకి చూస్తూ.

"బొమ్మలైతేమాత్రం అట్లా కొట్టుకోవచ్చా మామయ్యా!"

రామకృష్ణయ్య పసివాని అమాయికత్వానికి జాలిగా చూచి "తప్పే నాన్నా! నువ్వు కూర్చుని చూడు. వెనకవాళ్లకు అడ్డు అవుతుంది!" అన్నాడు.

గోపాలానికి ఎందుకో మనసు కలుక్కుమంది. దిగాలుపడి కుర్చీలో కూర్చుని చూస్తున్నాడు.

అరగంట కాకుండానే అలా ముందుకు జారి కుర్చీలోనే నిద్రపోయాడు.

*

ఆఱుగంటలకు ఆఫీసునుంచి వచ్చిన వెంకట్రామయ్య ఆలు నాఅయినా అబ్బాయి నట్లా వీధిలోకి పంపడం తప్పని రుక్మిణమ్మను కోప్పడుతూ ఒంటికాలిమీద లేస్తూనేవున్నాడు.

ఈసారి అతనన్నే మాటలకు అంత ఓర్పు గల ఆఇల్లాలూ సహించలేకపోయింది.

"మూడేళ్ల కొకమాటు వచ్చే పెద్దమనిషి గాబట్టి ఇవాళ వెంటబెట్టుకువెళ్లాను. ఈ చెడుతిరుగుడు అలవాటయి రోజూ మారాంచేస్తే ఈయనతాత ఎవడు తీసుకువెళ్తాడో పిల్లణ్ణి. కొత్త ముందూ వెనకా ఆలోచనఉండక్కరలేదూ?"

చిరాకుతో పదినిమిషాలు అపనీ ఈపనీ చూచాక—

"ఏదో చూడ్డానికి వచ్చినవాడు తిండి తిని పడిఉండక పిల్లెందుకంట వెంటబెట్టుకు తిరగడం?"

మళ్లీ నాలుగునిమిషాలు కాకుండానే —

"వాణ్ణని ప్రయోజనం ఏముంది? ఎన్నిసార్లు చెప్పినా బుద్ధిగడ్డి తినే నిన్నననాలిగాని. అసలు నువ్వు ఎందుకు పంపించావంట పిల్లణ్ణి?"

"నే పంపించిందేముంది? 'రారా గోపీ' అని అన్నయ్యే పిల్చుకువెళ్లాడు!"

"వాడు పిలిస్తే పిచ్చిగ వెంబడిపడ్డాడే అనుకో! నువ్వు ఎక్కడ చచ్చావంట?"

"ఎక్కడా చావలేదు! చావక బ్రతికిఉంటబట్టే 'పోనీ వెళ్లి వస్తారులే' అని ఊరుకున్నాను."

"ఊరుకుంటావు! ఊరుకుంటావు! నేను మర్యాదగా ఊరుకున్నకొద్దీ నీ పొగరుబోతుతనం ఎక్కువౌతోంది. అసలవ అట్లా తయారుఅవుతున్నాడు."

"నామాట ఎట్లా ఉన్నా మీకోపంమాత్రం మహాఎక్కువవుతోంది. ఏమన్నా అంటే అమాంతం మీదికి లేస్తారుగాని వాడేం చెడిపోయాడు చెప్పండి?"

"ఇంకా చెప్పేదేముంది? ఇంత పొద్దుపోయింది, ఇంతవఱకూ ఇంటిమొహం పట్టలేదు. ఇది చాలదూ" అని అంటూ ఉండగానే వాకిట్లో జట్కా చప్పుడయింది.

అనుకుంటుండగా వచ్చారుగదా అని రుక్మిణమ్మ అమాయికంగా మనసులోనే వెయ్యేళ్ల ఆయుస్సు ఆశించింది.

వెంకట్రామయ్య మొహం ఇంతచేసుకుని బొమలుముడిచి ఎక్కడలేని గాంభీర్యమూ తెచ్చుకుని కుర్చీలో కూర్చున్నాడు.

గోపాలానికి బండి సగందూరం వచ్చేవఱకూ మెలకువే రాలేదు. బండికుదుపుకు అమాంతం మేలుకుని కళ్లు నులుముకుంటూ "దీంట్లో ఎక్కడికి మామయ్యా?" అని అడిగాడు.

"ఇంటికి నాన్నా!" అన్నాడు మేనమామ.

గోపాలంగుండెల్లో రాయిపడింది.

ఇంటికి, అంటే నాన్నదగ్గఱికి, అందులో ఈరాత్రివేళ, పైగా ఇన్ని తనకోసం కొన్న వస్తువులతో—వరసవరసగా డిగ్రీల

తరబడి భయం హెచ్చిపోయింది. ఒదిగిఒదిగి మామయ్యడొక్కలో దూరాడు. ఉండిఉండి ఉలిక్కిపడుతున్నాడు పాపం!

మేనమామ చెయ్యివేసి మేనల్లుణ్ణి మరీదగ్గరకు తీసుకున్నాడు.

"మామయ్యా!"

"ఏం నాన్నా!"

గోపాలం ఏమీ మాట్లాడలేకపోయాడు. గుడ్లు అప్పచెప్పి మామయ్యవంక చూచాడు.

"ఎందుకు నాన్నా! అట్లా చూస్తావు? నీ కేం భయం లేదులే" అంటూ వీపుమీద చెయ్యివేసి రాస్తూ బుజ్జగించాడు మామయ్య.

గోపాలం అట్లాగే చూసిచూసి "నే నడిగానని చెప్పకేం మామయ్యా! నాన్నతో" అని అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

రామకృష్ణయ్యగుండె తరుక్కుపోయింది.

ఉత్తరీయంకొంగుతో కళ్లు తుడుస్తూ "పిచ్చినాన్నా! చెప్పనులే. అయినా నేనున్నానుగా. మీ నాన్న నిన్నేమీ అనడు నువ్వు అట్లా ఏడవకు. నవ్వుతూ కూర్చో" అన్నాడు రామకృష్ణయ్య.

బండి ఇంటిదగ్గరకు రావడంతోటే సామాన్లన్నీ తన చేసంచిలో పెట్టుకుని తాను ముందు దిగి ఇంట్లోకి వెళ్లాడు.

వెనకాలే గోపాలం నక్కినక్కి వస్తున్నాడు.

బావమఱదిని చూసిందే తడవుగా—

"వాడేడీ?" అన్నాడు వెంకట్రామయ్య.

"ఇదుగో! వస్తూనేఉన్నాడు."

గోపాలం మామయ్యపక్కనే నుంచున్నాడు. పంచీ వంకకి తగిలించి మామయ్య లోపలికి వెళ్లగానే తానూ వెళ్లాడు.

వెంకట్రామయ్య కుర్చీలో కూర్చోలేకపోతున్నాడు. గోపాలం ఇంట్లో తిరగలేకపోతున్నాడు.

అన్న వంటిపెట్టుకు తిరుగుతున్న కొడుకును చూచి రుక్మిణమ్మ భయపడుతూనే ఉంది.

"ఒరేయి గోపీ!"

తండ్రిగొంతు విని గోపాలం స్నానాలగదిలో నుంచుని వణికిపోతున్నాడు.

రుక్మిణమ్మ అసాలని కొంచెం బిగ్గరగా "మీ ఇద్దరూ మడి గట్టుకోండన్నయ్యా" అన్నది.

వస్తున్నామని రామకృష్ణయ్య అనకముందే "ఇటు రావేంరా గోపీ!" అంటూ మళ్లీ కేక రానేవచ్చింది.

"పద నాన్నా, నేనూ వస్తున్నా" అని రామకృష్ణయ్య గోపీని వెంటబెట్టుకు లోపలికి వచ్చాడు.

మామయ్య పావిసిగదిలోకి వెళ్తున్నాడు. నాన్న హాల్లో కుర్చీలో ఉన్నాడు. గోపాలం [illegible] కరుక్కుపోయాడు.

వెంకట్రామయ్య లేచిమీదకి దూకే పులిలా లేచాడు.

"రమ్మంటే రావేం? రావేమంటా? వినపడడంలేదూ" అంటూ చెయ్యి పుచ్చుకుని గోపాలాన్ని తన కుర్చీదగ్గరకు లాక్కువచ్చాడు.

గజగజలాడిపోతూ గొల్లుమన్నాడు గోపాలం.

పట్టుబట్ట కట్టుకుంటున్న రామకృష్ణయ్య అదరబాదరగా పరుగెత్తుకువచ్చి గోపాలాన్ని పొదివితీసుకుని "చాల్లేవయ్యా! మరీ ఎక్కువవుతున్నాయి వెలితిచేటలు. ఎట్లాగైతేనేం నువ్వే కన్నావులే కొడుకుని. మహచక్కగా అరుపాజ్యల్లో పెడుతున్నావు! పసిప్రాణం ఇట్లా తల్లడిల్లిపోతుంటే మరీ హడలగొడతావేమిటి?"

"ఒరేయి రాముడూ! నువ్వు దూరంగా ఉండు. నాకు కోపం వచ్చిందంటే నేను మనిషిని కాను." అంటూ గోపాలాన్ని ఇవతలకు లాగాడు వెంకట్రామయ్య.

ఆ ఊపుకు మరీ ఏడవడం మొదలుపెట్టాడు గోపాలం.

రామకృష్ణయ్య నిర్ఘాంతపోయాడు.

"ఇప్పుడు నిన్ను ఏం చేశా'నని రా అంత ఏడుస్తావు? ముందు ఏడుపు మానెయ్యి! మానావా మానవా?" అంటూ ఒక దెబ్బ వేశాడు వెంకట్రామయ్య—'బావా' అని కేక వేస్తున్న రామకృష్ణయ్యమాట వినిపించుకోకుండానే.

మామయ్యచేతిలోనుంచి తండ్రి తన్ను ఇవతలకు లాగడంతో ఎంత అస్థైర్యపడిపోయాడో ఏమో గోపాలం ఆదెబ్బతో వెన్ను వంచి జలజలలాడిపోయి కిందపడబోయాడు. రామకృష్ణయ్య చటుక్కున వాణ్ణి రెండు చేతుల్తోనూ పట్టుకుని ఎత్తుకున్నాడు.

వాడికి వణుకు ఆగలేదు.

అల్లుణ్ణి గట్టిగా కౌగిలించుకున్నాడు మేనమామ. గోపాలం ఇంకా వణుకుతూనేఉన్నాడు.

రామకృష్ణయ్య వాణ్ణి పక్కమీద పడుకోబెట్టి బాగా దుప్పట్లు కప్పి తాను పక్కనే కూర్చున్నాడు. కంటికి మేలకా ఏకధారగా ఏడుస్తూ రుక్మిణమ్మ మైలపడి మంచంపక్కనే కూర్చున్నది. ఆ వణుకువణుకు అట్లా పావుగంటసేపుండి నూటమూడు డిగ్రీల జ్వరాన్ని విడిచిపెట్టి మరీ వెళ్లింది.

వెంకట్రామయ్యకు దిక్కుతోచలేదు. దిగాలుపడి అట్లా కుర్చీలో కూర్చుండిపోయాడు.

భోజనానికి కట్టుకున్న పట్టుబట్టతోనే రామకృష్ణయ్య మేనల్లుడికి పరిచర్య చేస్తున్నాడు.

ఒకగంట అయ్యాక తెములుకుని వెంకట్రామయ్య పక్కింటి శాస్త్రులుగారిని నిద్రలేపి విభూతి పెట్టించుకువచ్చాడు. గోపాలం వంటినిండా తానుగా విభూతి రాశాడు.


జ్వరమైతే తగ్గలేదుగాని మేనమామ చేసిన పరిచర్యలవల్ల గోపాలానికి కొంచెంగా నిద్రపట్టింది. అదైనా కలతనిద్ర.

రాత్రి తెల్లవార్లూ ముగ్గురూ గోపాలంమంచందగ్గరే కూర్చున్నారు.

౬

తెల్లవారింది. గోపాలంజ్వరం ఒకడిగ్రీ ఎక్కువయినట్టుందిగాని ఏమాత్రమూ తగ్గలేదు. వెంకట్రామయ్యకు నిజంగా భయమే వేసింది. ఒక్క నిమిషం ఆగకుండా వెళ్ళి డాక్టరును పిలుచుకు వచ్చాడు.

కళ్ళు మూసుకునిఉన్నా రాత్రల్లా అప్పుడప్పుడు ఉలిక్కిపడుతూనే ఉన్నాడు గోపాలం. డాక్టరు



"రామకృష్ణయ్య వాణ్ణి పక్కమీద పడుకోబెట్టి తానూ పక్కనే కూర్చున్నాడు. రుక్మిణమ్మ కంటికీ నేలకూ ఏకధారగాపడుస్తూ మంచం పక్కనే కూర్చున్నది. వెంకట్రామయ్య దిగాలుపడి అట్లాగే కుర్చీలో కూర్చుండి పోయాడు."

రాబోయేముందే పావు గంటనుంచీ కొంచెం కదలకుండా నిద్ర పోతున్నాడు.

డాక్టరు వచ్చి చెయ్యిపట్టుకు చూస్తున్నాడు. నాడి అతి వేగంగా కొట్టుకుంటోంది. ఒళ్ళుకాలిపోయే నిప్పులో చెయ్యిపెట్టి నట్లుంది. అరనిమిషంసేపు నుదుటిమీద చెయ్యిపెట్టి ఉంచాడు డాక్టరు. రామకృష్ణయ్య 'గోపీ! గోపీ!' అని మెల్లగా చెవిదగ్గర నోరుపెట్టి అన్నాడు. గోపాలం ఉలిక్కిపడి "మామయ్యా! నాన్న. అవన్నీ అవతలపారెయ్యి!" అంటూ కలవరించాడు.

రామకృష్ణయ్య కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

రుక్మిణమ్మ భర్తకళ్ళలోకి చూచింది. వెంకట్రామయ్య తల వంచుకున్నాడు.

డాక్టరుకేదీ అర్థంకాలేదు.

కన్నీళ్ళు తుడుచుకుంటూ రామకృష్ణయ్య సంగతంతా చెప్పాడు.

డాక్టరు ఆశ్చర్యపోయాడు.

వెంకట్రామయ్యను తీసుకువెళ్ళి డాక్టరు మందిచ్చి పంపించాడు.

ఆ మందు తాగి గోపాలం హాయిగా నిద్రపోయాడు.

ఆపూట ఇంటిల్లిపాదీ ఏమాత్రమూ సయించకుండానే నాలుగుమెతుకులు ఎంగిలిపడ్డారు.

వెంకట్రామయ్య కొడుకుదురవస్థ చూసి లోపల్లోపల కుమిలి పోయాడు. గోపాలం కలవరించిన నాలుగుమాటలూ అతని మనస్సును మథించేస్తున్నాయి. చేతుల్తో తలపట్టుకుని మంచంపక్కనే చతికిలబడ్డాడు.

జ్వరం తగ్గుముఖం పట్టిందిగదా అని రాత్రి నిద్రలేని కారణాన రామకృష్ణయ్య నేలమీదనే నడుంవాల్చాడు.

వెంకట్రామయ్య కిల్లా వాకిలీ, తన జీవితమూ అంతా శూన్యంగా కనిపించింది మంచంమీద పడిఉన్న తన కొడుకును చూస్తుంటే.

రెండుగంటలవేళ గోపాలం కళ్ళు తెరిచి 'మామయ్యా!' అన్నాడు. వెంకట్రామయ్య కడుపులో చెయ్యిపెట్టి కెలికినట్లయింది.

గోపాలంమీదికి వాలి "ఏం నాన్నా!" అన్నాడు.

'ఆకలి' అని గోపాలం కళ్ళు మూసుకున్నాడు.

దగ్గర కూర్చుని నాలుగు బత్తాయితొనలు తినిపించాడు. గోపాలం కళ్ళు మూసుకునే తిన్నాడు. వెంకట్రామయ్య కొడుకుమీదపడి "నాన్నా, ఇటు చూడు" అని కళ్ళవెంబడి నీళ్ళు పెట్టుకున్నాడు.

గోపాలం అతికష్టంమీద తెరిచాడు. కాని తండ్రికళ్ళలో నుంచి నీళ్ళుపడి వెంటనే మూసుకున్నాడు.

నుదుటిమీద చెయ్యివేసి రాస్తూ "గోపీ! జ్వరం పోయింది. లే నాన్నా! ఆకుకుంకువుగాని" అంటూ వెంకట్రామయ్య మంచం కింద తాను పెట్టిన సంచిలోని బంతి తీసి గోపాలంచేతులో పెట్టాడు.

తనమీదికి వాలిన తండ్రిని మంచంమీద పడుకున్న గోపాలం ఒక చేతిలో బంతి ఉండగా 'నాన్నా!' అంటూ కౌగిలించుకున్నాడు.

వేఁ డి కో ళ్లు

*

— శ్రీ కొత్త సత్యనారాయణచౌదరి —

౧

గౌనములె ప్రాజ్యభావములకుం గుదురై కులగోత్రభేదముల్
మనమునఁ జేరనీక పదిమందిని 'మంచిగఁ' జేసికొంచు, వ
ర్తనమున దోషముం దెలుపఁగువానిని ద్రోసియుఁ సంచరించు నా
రని కిఁక జాతియేల? మతధర్మ మిఁక కేందులకయ్య! యీశ్వరా !!

౨

అతేఁడు సమస్తవిద్యలు సమగ్రముగా గడియింపనోఁచినాఁ
డితనికి దాస్య మెక్కటియె యున్నక చెందిన తెన్నటంచు, ని
క్కటిలు విచిత్రరీతిఁ గలకాలమునుండియు నేర్పునూపి క
ల్పితములుగా నొనర్చినఁ జలింపదె లోకము నేఁడు సర్వమున్.

౩

చాతుర్వర్ణ్యపుఁ గట్టుపాటులు సదా పారస్యముం గూర్చి, దే
జాతిన్ గ్రిందునుమీఁదుచేయక జగచ్ఛాంతిన్ బ్రసాదించుచో
నాతంకం బది యేరికుండును ప్రభూ! అయ్యాయి ఘట్టంబులన్
స్వాతంత్ర్యం బిఁక వేకె కావలయునా? స్వారాజ్యమే దక్కెడిన్.

౪

ఈసంసారము ప్రాణగోష్ఠమయి తా మెంతో విచారంబుతో
గాసిం జెంది తరింపుగానక పురాకర్మం బిదే యంచు నే
యాశాలేశము నమ్మి జీవితము నాయాసమ్ముగాఁ బుచ్చు స
న్న్యాసుల్ నీదరిఁ జేర పాఖ్యపసరా! న్యాయంబు కావింపవా ?

౫

మత మిది దైవ నిర్ణీతఁమని మాటలు కోటలుదాఁట సూన్నృతి
వ్రతము లుపన్యసించుచు నవాకువవాకులు కొన్ని కూయుచున్
మతకరిచేష్టలన్ మెలఁగు మానుసులే యొకవంక స్వామి, నీ
హితమును రూపుమాపెద రహీనకృపామతిఁ జక్కఁజేయవా !

౬

యుగధర్మమ్ములు నేఁడు రక్షణములే కుఱ్ఱాఁతలాఁగంగఁజో
చ్చెఁ గటా! వర్ణముమాట లెత్తరు సుమీ! ఛీ! సర్వమేకంబె! కా
వఁగ దెవ్వారలు లేరె! చూచుచును నీవా క్లిట్లు సైరింతువో!
వగ దెవ్వారలు తీర్తురో! యకటా దౌర్భాగ్యంబు పోనాడుమీ!!

౭

అగయఁ బురాణమంతయును మహామహిమంబు, నవీనమన్న నె
వ్వరికిని మోజుపోవుటయు భావ్యము కాదని కొంద రందు రా
తెరువున నాకు వచ్చు మదిం బరికించినఁ జెక్కుదోసముల్
పోరయుచు దానిమూలమున; బుద్ధిని శేష మనుగ్రహింపుమా !!

౮

నీసేవన్ దరియింపఁగోరినను గానీ లేక నీ సత్తయే
దో, సోదాహరణంబుగాఁ దెలిసికోనుత్సాహమే కల్గినన్
గ్రాసం బయ్యది 'విద్య'యన్న దొకటే గాదా ప్రభూ, కావునన్
హీసం బేని యనుగ్రహించి, ప్రజ కావిజ్ఞానమున్ గూర్చవా !

౯

జపములు సేయఁగాఁ దగరు; శాస్త్రవిచారము నీతిమార్గమే
తపములుకొండె వైదికవిధానము లొండె సమాచరింపఁ బా
పపుఁ బనులౌను 'పంచమకు పాంచ్రకు' లంచు వచించునారి నీ
కృపయె సముద్ధరించెడిని-కిల్బిషభంజక, లోకరంజకా !!

౧౦

ఘన వేషంబున భేషజంబు-మదిలోఁ గాపట్యమున్-జాలఁగా
గనవాంఛల్ పరదారకాంతకనకద్ధ్యానంబుపై మోజు నే
మని వర్ణింతుము కొంద రీధరణిపై నాయాయి వేషంబులా
వనిచూపెట్టుదు రట్టి తాంత్రికుల నయ్యా దూరముంచుంపవా !!

భారతదేశపు పారిశ్రామిక సౌభాగ్యం

*

– శ్రీ వీరభద్రరావు, చిత్రా –

మానవునకు గల అత్యావశ్యకములయిన వస్తువులలో అన్న వస్త్రములు ముఖ్యములు. అందు వస్త్రములనుగూర్చి కొంత తెలిసికొందము.

వస్త్రపరిశ్రమలో ప్రపంచమునకే ఆదిగురువు

ప్రపంచమున కంతకు మొట్టమొదట వస్త్రపరిశ్రమవిధానము నకు దారిచూపి ఆదర్శప్రాయమైనది మన భారతదేశమే అని నొక్కి వక్కాణించడంలో అతిశయోక్తి యెంతమాత్రమూ లేదు.

అతిప్రాచీనకాలమునుంచీ ప్రపంచమందలి అన్ని ప్రాంతముల నుండి జనులు మనదేశపు వస్త్రములను కొనుటకై వచ్చుచుండెడివారని అనేకచరిత్రనిదర్శనములు గలవు. ఆధునికకాలంలోగూడా వస్త్రపరిశ్రమాభివృద్ధికై భారతదేశము యెక్కువగా కృషిచేసింది. పదిహేనవ శతాబ్దము మొదలు పదునెనిమిదవ శతాబ్దము వరకు ప్రపంచ వ్యాపారమునకు భారతదేశమే కేంద్రస్థానముగా నుండెను. భారత దేశమునందు వచ్చువారు, పోర్చుగీసువారును వస్త్రవ్యాపారమున ప్రధాన భాగదారులుగా నుండిరి. చక్రవర్తులు వారలకు గావలసిన వస్త్రములను భారతదేశమునుంచే తీసుకొనివచ్చుటకు తమతమ ప్రతినిధులను పంపించెడివారు.

పాశ్చాత్యులను ముగ్ధపరచిన కాశ్మీరశాలువలు

భారతదేశములో కాశ్మీరదేశపు ఉన్నిశాలువలు విరివిగా వాడుతున్న కాలంలో పాశ్చాత్యదేశాల్లో ఆశాలువలు అరుదుగా దొరుకుతూవుండేవి. వాటిని ఎంతో అపురూపంగా చూచుకునేవారు. యంత్రపరిజ్ఞానం విశేషముగా అభివృద్ధిపొందిన యీ రోజుల్లోకూడా కాశ్మీరశాలువల వస్త్రపరిశ్రమ జయప్రదంగా జరుగుతూనేవుంది. ఇందుకై మన వస్త్రపారిశ్రామికుల ప్రావీణ్యమునుగూర్చి గర్వించవలసివుంటుంది. ఉదాహరణకు పాష్మీనా (Pashmina) అను గొర్రె అంగుళముల వెడల్పుగల శాలువను ఒక వ్రేలి వుంగరంలోనుంచి సులభముగా దూరునంత నిపుణతతో తయారుచేశారని నేటికిని సగర్వంగా చెప్పుకుంటున్నాము గదా!

౧౭-వ శతాబ్దికే విదేశాలకు వెళ్లుచుండిన బ్రోకేడ్సు

భారతీయులకు పవిత్రయాత్రాస్థలమగు కాశి సిల్కు బంగారు జరీ పనులు గలిగిన పలువిధములగు బ్రోకేడ్సు (Brocades) తయారుచేయుటకు ప్రసిద్ధికెక్కినది. ఈ బ్రోకేడ్సు కొద్దిగా చైనావారి ఎంబ్రోయిడరీ (Embroidary) కి చెందియున్నను ప్రత్యేకత భారతదేశమునకే చెందియున్నది. ఈ బ్రోకేడ్సు ౧౭ వ శతాబ్దము నుండి విదేశములకు ఎగుమతిచేయబడుచున్నాయి. ఉత్తర హిందూస్థానమందలి ఔధ్ రాజ్యమునకు చిరకాలము ముఖ్యపట్టణము గావున్న లక్నోనగరమున చికెన్ (Chickken work) అని పేరుపొందిన ఒక క్రొత్తమాదిరి ఎంబ్రోయిడరీ పెంపొందింపబడినది. అది తెల్లమస్లినుపై తెల్లదారముతో కుట్టబడిన ఎంబ్రోయిడరీ. ఈపని ఇంగ్లీషువారి లేసును పోలియుండి చేతితో తయారగుచున్నది.

అద్దకపు పనులలోకూడ అగ్రస్థానము మనదే

నగిషీపనులు గల కొయ్య దిమ్మల సహాయమున బట్టలమీద పచ్చి రంగుల అద్దకములు వేయుట మొట్టమొదట భారతదేశమునందే ప్రారంభమయ్యెను. ఆ పనితనమును పలువిధముల చాటు చిహ్నములు బాటిక్ (Batic) పని నేర్చుకొనిన జావా, బాలీ ద్వీపముల



కంచుతో పోతపోసిన నటరాజ విగ్రహము




మురాదాబాదులోని లోహశిల్పి

లో కనబడుచున్నవి. భారతదేశమునందే పుట్టిన 'బాందిని'(Bandini) పనిని జపానువారు అతినేర్పుగా అవలంబించినారు.

భారతదేశమందలి ప్రతిరాష్ట్రమునకు ప్రత్యేక రీతులు గల పలురకములు ఈ వస్త్రపరిశ్రమయందు గలవు. కొన్ని నమూనాలైనను చూచినగాని యీ వస్త్రములయొక్క ప్రత్యేక ప్రాముఖ్యమును గ్రహించుట కష్టము. సుమారు నూరు సంవత్సరములనాటి వస్త్రమొకటి—చాలభాగము చినిగిపోయినా, రంగులు మాత్రము అంత పాతకాలపువని పరులు నమ్మజాలనంతటి—స్వచ్ఛముగను, నూతనముగను చూపట్టునది యిప్పటికిని నావద్ద నున్నది.

భారతదేశమున తయారగు పచ్చిరంగుల విషయమై నేటికిని గూడ విదేశీయులకు అగమ్య గోచరముగ నున్నది. ప్రకాశవంతమైన నీలము, ఆకుపచ్చ, పసుపు, నలుపు మొదలైన రంగు లన్నియు వృక్షముల వేళ్లనుండియు, బెరడునుండియు తయారు చేయబడి, నేటికికూడ పట్టు, నూలు, నూలు మొదలగు బట్టల అద్దకమునకు ఉపయోగింపబడుచున్నవి.



లక్క సామానులమీద అలంకారాలు దిద్దుతున్న ఒక శిల్పి—ముల్తాను (పంజాబు)

చేతితో తయారైన విలువగు వలువలు

౧౭, ౧౮ వ శతాబ్దములలో బంగాళా రాజధాని యందలి ఢక్కా జిల్లాలో 'ఢక్కా మస్లిన్' అనుపేర ప్రసిద్ధి గాంచిన ౫౦౦ నెంబరుకుపైబడ్డ చక్కని, సన్నని బట్టలు తయారుచేసేవారు. ౨౦ గజాల మస్లిన్ బట్ట ఒకచేతిక్రిందు ఇమిడ్చికొని తీసుకువెళ్లేటంత సన్నగా తయారుచేసేవారు. వారి కళానైపుణ్యాని కెంతటి నాగరికులైనా విభ్రాంతి పొందకతప్పదు. ఢక్కా నవాబులు, కొంత మంది హైందవ రాజులు మాత్రము తాము కొన్ని ప్రత్యేక సమయాల్లో—కేవలమూ దర్బారులో—ఉపయోగించుకొనుటకు ఒకటి రెండు తలగుడ్డలను సంపాదించుకొన గలిగేవారు. అట్టి మస్లినుకు కావలసిన దారము మామూలు చరఖామీద గాక చేతి బొటనవ్రేలి గోరునందు చిన్నచిల్లును చేసి దానిగుండా చేతితోనే వడికేవారు.

భారతదేశపు నాగరికాగ్రగణ్యుల కళానైపుణ్యాన్ని చూచి ఓర్వలేక, ఆ దారమును తీయు బొటనవ్రేలును కిరాతులు తెగగొట్టించినారు. వారు ఎంత అసూయాపరులో ఊహించండి!!

కాని భారతజాతీయోద్యమము ప్రారంభింపబడినప్పటినుండి గాంధీమహాత్ముడు చేయుచున్న ప్రయత్నములవలన తిరిగి యీవస్త్రపరిశ్రమ దేశమంతటను తల యెత్తింది. త్వరలోనే యీ చేనేతవస్త్రపరిశ్రమ మూలమూలలా వ్యాప్తిపొందుననుటకు సందేహము లేదు.

శిల్పాచార్యుల చిత్తముల నాకర్షించిన చిత్రవిచిత్ర లోహపరిశ్రమలు

భారతదేశము వస్త్రపరిశ్రమలతోపాటు లోహపరిశ్రమలకు గూడ అగ్రస్థానం అలంకరించింది. కంచుతో స్త్రీ, పురుష, దేవతా విగ్రహములను పోతపోయుటయందును, పాత్ర సామానులను తయారు చేయుటయందును దక్షిణభారతదేశము ప్రఖ్యాతివహించింది.

ప్రపంచవిఖ్యాత శిల్పాచార్యుడును, ఫ్రాన్సుదేశస్థుడును అగు రోడిన్ (Rodin) మహాశయుడు మన నటరాజ మూర్తిని, తాండవశివుని గూర్చి ప్రశంసిస్తూ, పాశ్చాత్యదేశపు ప్రసిద్ధవిగ్రహము లేవీకూడా నటరాజవిగ్రహమునకు సరిరావనీ, భావప్రదర్శనమునందుగాని, సౌందర్యమునగాని, గాంభీర్య

మునగాని, సున్నితమగు పనితనములోగాని దానికి ఢోల్ప దగినది లేదనీ — పరమానందభరితుడై, కళోపాసనా నిమగ్నుడై చెప్పినాడు.

చిత్రవిచిత్రములగు పళ్లెములు, గిన్నెలు మొదలగునవి ప్రసిద్ధిచెందిన కాశీ, మురాదాబాదులందు తయారవు తున్నాయి.

వెదురుతో వివిధవస్తువులు

భారతదేశము వస్త్రలోహపరిశ్రమలకు తోడు వెదురు పనికి గూడ ప్రసిద్ధి చెందింది. వంగదేశంలో సున్నితములగు చాపలను తయారుచేయు స్థలములు గలవు. ౬ అడుగుల పొడవు, ౫ అడుగుల వెడల్పుగల పెద్ద చాపను ఒక చిన్న చేతిపెట్టిలో మడతపెట్టి తీసుకు వెళ్లవచ్చు. అవి అతిమృదువుగా వుంటాయి. దక్షిణదేశంలో కొన్ని చాపలు పట్టుకంటెను మెత్తగా ఉండి వేసవికాలంలో ప్రక్క దుప్పట్లుగా వుపయోగింప బడుతూవుంటాయి.

కాశ్మీరరాష్ట్రమున **Papier mache** అను పరిశ్రమ గలదు. అది గుజ్జుతో తయారుచేయబడి రంగులతోనూ, లక్కలోనూ పూయ బడుతుంది. ఇది జపానుదేశస్థుల ఉరూషీ (**Urushi**) ని పోలివుంటుంది. చిన్న పెట్టెలు, సిగరెట్టుకేసులు మొదలగు చిన్నచిన్న వస్తువులను చేస్తారు. ఆకర్షణీయమైన శిల్పరీతులు (**designs**) పలురంగులతో చిత్రింపబడుతున్నాయి. అట్టి శిల్పరీతులందు వెండిబంగారములు విరివిగా ఉపయోగింపబడి, ప్రకాశమునిచ్చుటకును, రంగులు వివర్ణముగాకుండుటకును వాటిపైన పోలీసు (Shelac) తో ఒక పూత పూయబడుతుంది. అమెరికా, యూరపులకు నైతము ఎగుమతి కాబడుచున్న యీవస్తువులను కాశ్మీరములోని ప్రతియింటను స్త్రీపురుషులు చేస్తూవుండడము మనకు కనబడుతుంది.

కటికకత్రపై క్రమమైన కల్పనలు

భారతదేశమున కఱ్ఱపైన చెక్కడపుపనులుగూడ అతి నైపుణ్యముతో చేయబడును. భారతదేశమున మంచిరకపు పనితనము గల లోహపుసామానులను రిపోసీ (**Reposse work**) అలంకారములైన తాపటపుపనులు, చెక్కడపుపని, రత్నములు పొదుగుట, పింగాణీపూతే గల బంగారువస్తువులు మొదలగునవి జాతీయకళాప్రతిభను వేనోళ్ల చాటుతున్నాయి.

అసలైన భారతదేశశోభ పల్లెలయందే ఉన్నది. సంపన్నుడగు వ్యవసాయదారుడు ఫలవృక్షసమృద్ధమైన పెరటిలో చిన్నకుటీరము వేసుకొనివుంటాడు. అతని సంపద పశుసంపద. అతని యింటి ముఖద్వారము సుందరతమమగు శిల్పచాతుర్యమును చాటు చెక్కడపు పని కలిగివుంటుంది.



లక్నోలోని ఒక లోహశిల్పి

లోన లక్కరంగులతో అలంకరింపబడి ఆకర్షణీయమయిన సామానులు వుంటాయి.

జగత్ప్రఖ్యాతిగాంచిన ఆంధ్రపరిశ్రమలు

ఆంధ్రసంస్కృతిని, ప్రాచీనసాంప్రదాయమును, కళానైపుణిని, ఆంధ్రప్రతిభను చూడాలంటే అసలైన పల్లెలలోనే చూడాలి.

జగత్ప్రఖ్యాతి గాంచిన "కలంకారీ" అద్దకములు బందరులో తయారగుచుండెడివి. బందరులో తయారై ౬, ౭, ౮ రంగులతో గూడ అద్దిన అద్దకపుదుప్పట్లు ఫ్రాన్సుముఖ్యపట్టణమగు పారిసులో చేరుబడినవి.



నూలుగుడ్డలమీద దిమ్మెలతో అచ్చువేయుట—
అహమ్మదాబాదు

ఉప్పాడచీరెలు, పంచెలును రకరకాల రంగులలో వాయిల్సు (Violes) మాదిరిగా నూలుతో తయారవుతాయి.

విశాఖపట్టణంజిల్లా ఏటికొప్పాకలో తయారైన లక్కపిడతలు యాత్రాస్థలాల్లోనూ, తీర్థాలలోనూ విరివిగా కనబడతాయి.

జయపూరుసంస్థానంలోని 'సారంగపురం' అనే గ్రామంలో లక్కతో హారములు, చామరములు తయారుచేస్తారు. దంతపరిశ్రమ యందుకూడా బ్రిటిషురాజధానివస్తుప్రదర్శనమునందు ప్రథమ తాంబూలము అందుకొన్నది విశాఖపట్టణంజిల్లా.

ఇల్లాంటి మహోత్కృష్టమైన పరిశ్రమలన్నీ ఈనాడు అడుగంటిపోయి అక్కడక్కడ శీర్ణశీర్ణావస్థలో పడివున్నాయి.

౧౯౦౫ మొదలు ౧౯౨౧ వఱకు 'స్వదేశీఉద్యమ'మని నడిచింది. ఆరోజుల్లో ఆ ఉద్యమప్రభావంచేత ఈ పరిశ్రమలంటే ప్రజల్లో కొంత ప్రేమ అంకురించింది. స్వదేశీవస్తువులు స్వదేశీ వస్తువులు అంటూ ప్రజలు కొంత ఉత్సాహం కనబరిచేవారు. ఇప్పుడు దేశపరిస్థితులన్నీ రాజనీతిజ్ఞుల త్రోకల్లో నడవటంచేత చేతి పరిశ్రమలు చేతిపరిశ్రమలు అంటూ గంభీరోపన్యాసాల్లోనే కనిపిస్తూ వచ్చాయి గాని వాటికోసం కావలసిన యత్నం మాత్రం జరగలేదు. ఈ ప్రాచీన ప్రసిద్ధ పరిశ్రమలన్నీ నిజంగా ఉద్ధరింపబడాలంటే రాజనీతిజ్ఞుల చేతుల్లోగాక, సంఘ సంస్కర్తల చేతుల్లో దేశసౌభాగ్య నిర్ణయసూత్రం పడితే ఎప్పటికైనా శుభోదయం కలుగుతుందని ఆశిస్తున్నాను.

ఆ మహోదయవేళ ఎన్నడు వస్తుందా, స్వాతంత్ర్య సముద్ర తీరాన ఎన్నడు మనమంతా పొంగుతూ సమావేశమవుతామా అని ఆ పరాత్పరునిముంగమై చేతులు జోడిస్తున్నాను.

దేశసౌభాగ్యంకోసం ఆత్మార్పణం చేసే కర్మవీరులకూ, సాధకులకూ నా నమోవాకములు.



ఇంకొకరి వస్తువు

[కథానిక]

●

= శ్రీ 'రామచంద్ర కాశ్యప' =

"చిరంజీవి వరిపూడి నారాయణరావుకు—

మీమామగారు జగన్నాథం ఆశీర్వదించి వ్రాయునది ఏమనగా —ఉభయకుశలోపరి. మీఅత్తగారు చైత్రశుద్ధ నవమినాడు ప్రసవించినది. ఆడశిసువు. పిల్లా, తల్లీ కులాసాగానే వున్నారు. బహుళ పంచమినాడు బారసాల. కనుక మీరు యావన్మందీ రాగోరెదను. తప్పకుండా రావలసినది. అమ్మాయీపిల్లల క్షేమం తెలియపర్చవలయును. ఇంతే సంగతులు. —ము. జగన్నాథం."

"ఏమేవ్?"

"ఆఁ, ఏమిటో?"

"మీ నాన్నదగ్గరనుంచి ఉత్తరం వచ్చింది."

"ఏమని?"

"మీ అమ్మ నీళ్లాడిందట."

వంటింటిలోనుంచి సత్యవతి పరిగెత్తుకుంటూ సావిట్లోకి వచ్చి—

"మగపిల్లాడేనా?"

"ఆఁ, మగపిల్లడే"

"నిజం? ఏదీ ఉత్తరం?"

ఉత్తరం సత్యవతికి అందిచ్చాను. చదువుకుంటూ "ఆడపిల్ల" అన్నమాటదగ్గర ఆగి, "అయ్యో!" అని దిగాలుముఖం వేసి నవ్వింది.

"సుఖంగా బారసాలకు రమ్మని ఉత్తరం రాస్తే 'అయ్యో' అంటా వేమిటి?"

"అదిగాదండీ. యీ ఆడపిల్లలవరుసకు అంతూ పంతూ లేదా ఏమిటి?"

నేను నవ్వుతూ—"ఆఁ, ఇప్పటి కెంతమంది? మాణిక్యం, సత్యవతి, విమల, విశాలాక్షి, ఊఁ, తర్వాత?"

"ఊఁ, మరీ సోద్యాలూ!"

"మరిచిపోయాను. సరోజ. ఆఁ"

"భువనేశ్వరి"

"ఊఁ! అవును. భువనేశ్వరి, శాంతా. అంతేనా?"

"చాల్లేద్దురూ, మీ వేళాకోళాలకు వేళా పాళా లేదు."

"సరేగాని యీ అమ్మాయికి మనం ఏం పేరు పెడదాం?"

"మనయిష్టమా ఏమిటి?"

"మనం చెపితే వద్దంటారా మీ నాన్న?"

"ఏమో బాబూ నాకేం తెలియదు."

"నే చెప్పేదీ?"

"చెప్పండి."

"సత్యాగ్రహి. ఎలా వుంది పేరు?"

"బాగానే వుంది. జైలుకు పంపిస్తారా ఏం?"

"వెళ్లవలసివస్తే తప్పుతుందా ఏమిటి?"

"సరేగాని, ఎప్పుడూ ప్రయాణం?"

"ఓహో, అదా హుషారు! మొన్న నేగా వచ్చింది?"

"బాగానే వుంది. తప్పకుండా రమ్మని రాస్తే......"

"సరే. నీయిష్టం. వెళ్లిరా."

"మరి మీరో?"

"నే నారోజుకు వస్తాలే."

"ఏం? కోర్టుపనులన్నీ మునిగిపోతున్నాయా?"

"ఇప్పటినుంచీ వచ్చి కూచోమంటా వేమిటి?

"మీయిష్టం బాబూ. మీకు సమాధానం చెప్పలేను."

ఇది పదహారేళ్ల క్రిందటి మాట!

* * * *

నేడు: వసంతపురంజిల్లాకోర్టు జనంతో కిటకిటలాడుతోంది. ఒక పెద్ద క్రిమినల్ కేసువిచారణ. నేరస్థుడు మంచి ఆస్తిపరుడు. గొప్ప పలుకుబడి కలవాడు. ఇతరులకు ఎన్నడూ హానిచేసి ఎరుగని

జగన్నాథంగారు. ఆయన చేసిన నేరం వయసులోవున్న ఒక ఆడ పడుచును నిలువునా, నడిరోడ్డుమీద హత్యచేశాడని.

జగన్నాథంగారేమిటి, ఒక స్త్రీని హత్యచేయడమేమిటి? ఆ కేసులో విశేషమేమిటంటే, జగన్నాథంగారు నేరాన్ని ఒప్పుకున్నారు. సరాసరి పోలీసుస్టేషనుకు వెళ్ళి ఫలానా స్త్రీని, ఫలానా చోట నేనే హత్యచేశానని తానే రిపోర్టుయిచ్చాడు. వంటినిండా రక్తపుమరకలతో, చేతిలో ఒక గొడ్డలి పెట్టుకొని నేను ఫలానా మనిషిని చంపాను అంటే పోలీసులు ఆయన్ను—ఎంత ఘరానా మనిషయినా—అరెస్టుచేయక ఎలా వుంటారు? ఆయనమీద హత్యానేరంక్రింద కేసు పెట్టారు. జిల్లాకోర్టులో కేసు విచారణకు వచ్చింది. ప్రాసిక్యూషన్ తరఫున గవర్నమెంటుప్లీడరు లేచి, జగన్నాథంగారు ఎలా హత్యచేసిందీ, ఎవరెవరు చూసిందీ, సాక్ష్యంతోసహా కట్టుదిట్టం చేసి కోర్టువారిని నమ్మించాడు. అప్పుడు జిల్లాజడ్జిగారు జగన్నాథం గారివంక తిరిగి "మీరు చెప్పదలచింది ఏమైనా వుందా?" అని అడిగారు.

అప్పటివరకూ విచారణ అంతా తలవంచుకొని వింటున్న జగన్నాథంగారు తలయెత్తి, జడ్జీగారివంకా, జ్యూరీవంకా, ప్లీడర్లవంకా, అక్కడ క్రిక్కిరిసివున్న ప్రేక్షకులవంకా నిదానంగా చూసి, కోర్టువారికి నమస్కారం చేసి యిలా ప్రారంభించాడు—

"మొదటినుంచీ నేను చెప్తూనేవున్నాను—ఈ హత్య నేను చేశానని. అందుచేత గవర్నమెంటుప్లీడరుగారు హత్య నామీద నిరూపణచేయడానికి పడ్డ శ్రమ అనవసరం. కాని వారు తమ వాదనలో యీహత్య చేయడానికి నా కేదో విపరీతపు అభిప్రాయాలున్నవనీ, మతిచెడినైనా యీపని నేను చేసివుండవచ్చుననీ, అలా కోర్టువారు తలిస్తే నాకిచ్చే శిక్షలో కొంతవరకు తగ్గించినా తమ కభ్యంతరం లేదనీ నామీద చాలా దయతలచి మాట్లాడారు. వారికి నా నమస్కృతులు. కాని ఈహత్య చేయడానికి కారణం నాకు మతి చలించడంవల్ల కాదని యీకోర్టువారికి నేను మనవిచేసుకుంటున్నాను. దానికి బలవత్తరమైన కారణాలు లేకపోలేదు. ఆకారణాలు ఏమిటో తమకు చెప్పాలంటే పదిహేనేళ్ల గాథ—నా జీవితగాథే చెప్పవలసిన అవసరం వుంది. కోర్టువారు నాయందు దయవుంచి తీరికగా, శ్రద్ధతో వినేటట్లయితే ఆవిషయాన్ని చెప్పడానికి ప్రయత్నంచేస్తాను. అనవసరంగా మీకాలాన్ని వృథాచేస్తున్నందుకు తమరు నన్ను క్షమించాలి.

నేను గౌరవమైన కుటుంబంలో పుట్టి, గౌరవమైన పద్ధతులలో పెరిగాను. భగవంతుడు నాకు తగినంత సంతానాన్ని కలగజేశాడు. నాకు ఎనమండుగురు సంతానం. అందరూ ఆడపిల్లలే..."

(ఇక్కడ కోర్టులో వున్న జనం పకాలున నవ్వారు.)

"అవును. ఇది మీకు నవ్వులాటవిషయం కావచ్చు. కాని, యీ ఆడపిల్లలే నాజీవితానికి ఆధారం. వాళ్ల సుఖదుఃఖాలే నా సుఖదుఃఖాలు. వాళ్ల జీవితాలలో యీ అభాగ్యజీవితాన్ని మిళితం చేశాను. వాళ్లకోసం నా సర్వస్వం ధారపోశాను.

భగవంతుని దయవల్ల అందరి పెళ్లిళ్లూ అయినయి. ఒక్కొక్క వివాహం ఒక్కొక్క గండంలాగా గడిచింది. పెళ్లి అయ్యేదాకా సరియైన సంబంధం తీసుకురాలేమోనని భయం. వరుడు వచ్చితే కట్నం భరించలేక ఆ సంబంధాన్ని వదిలివేయవలసివచ్చేది. కట్నం మోయగలిగితే వరుడు నచ్చడం కష్టమయ్యేది. కాని నా పూర్వజన్మసుకృతంవల్ల అందరికీ మంచి సంబంధాలే చేశాను. అన్నీకూడా తాము తిని ఒకరి కింత పెట్టగల్గిన సత్తావున్నవాళ్లే.

మా ఆఖరి అమ్మాయిపేరు సత్యాగ్రహి. మా రెండో అల్లుడు మాటమీద ఆపేరు పెట్టాం. అదేమి ఖర్మమో ఆ పిల్ల పుట్టడం మాలో ఎవ్వరికీ సంతోషాన్ని యివ్వలేదు. అప్పటికి మాకు ఏడుగురు ఆడపిల్లలు. మేమూ పెద్దవాళ్లమయాం. ఈసారయినా మగపిల్లవాడు కలిగితే...యీ ఆశతో వున్నాం. కాని—మళ్లీ ఆడపిల్ల! ఈమాట చెప్పేసరికి నా కేం తోచిందికాదు. కాసేపు ఊరి అవతల కెళ్లి, నాయులదొడ్డిలో కూచొని మనస్సు కుదుటపరుచుకున్నాను. పిల్లతల్లి మనస్సులో ఏమనుకున్నదోకాని, బయటకు ఏం మాట్లాడేదికాదు. కాని తన పిల్లలను చూసుకునే యోగం దానికి ఎక్కువకాలం లేదు. సత్యాగ్రహికి అయిదవయేట దాని తల్లి గతించింది.

అప్పటికి ఆరుగురు పిల్లల పెళ్లిళ్లు అయినయి. యిక కాంతా, సత్యాగ్రహీ మిగిలారు. కాంత కొంచెం అందమైన పిల్ల. చలాకీగా వుంటుంది. పెద్దదానిలాగా మాట్లాడుతుంది. దాని కప్పుడు ఎనిమిదోసంవత్సరం. ఇంట్లో నేనూ, మా యిద్దరుపిల్లలూ, ఒక విధవ చెల్లెలూ వున్నాం. నాకు నలభయి నిండినయి. మావూళ్లోవాళ్లు కొంతమంది నన్ను మళ్లీ పెళ్లిచేసుకోమనేవాళ్లుకాని నా కలాంటి ఆలోచన కలలోకూడా లేదు.

కాని, యీ యిద్దరుపిల్లల్ని పెంచే భారం నానెత్తిమీద పడ్డది. అందులో ముఖ్యంగా ఆడపిల్లల్ని పెంచడం మరీ కష్టం. పూలతోట పెంచినట్లుగా అతిమెళకువతో వేయికళ్లు పెట్టుకొని పోషించాలి. మీరు ఎక్కడైనా చూడండి. తలిదండ్రులు తమ ఆడపిల్లల్ని చూసినంత జాగ్రత్తగా మగపిల్లల్ని చూడరు. ఇంకొకరి వస్తువు మన యింట్లో వుంటే ఎంతో జాగ్రత్తగా చూస్తాం. 'మనది కూడా కాదు, జాగ్రత్త' అంటాం. యుగయుగాల్నించీ వస్తున్న పద్ధతికాబట్టి దాన్ని మనం తెలియకుండానే చేస్తాం. ఆడపిల్లలకు పరికిణీలు, గౌనులు, సబ్బులు, ఫేసుపౌడర్లు, కొద్దో గొప్పో నగలు—ఒకటేమిటి, అనేకం. దీనికంతటికీ కారణం? 'ఇది మన వస్తువు కాదు. ఇంకొకరిది. దీన్ని జాగ్రత్తగా చూడకపోతే తరువాత మనకు మాటవస్తుంది' నాలుగేళ్ల పిల్ల కానివ్వండి. ఏదయినా తప్పుచేస్తే

'అమ్మా! యిది పెళ్లయితే ఎలా నెట్టుకుంటుందోకాని, ఒక్క పనికూడ చేతకాదుగదా!' అంటారు.

తల్లి లేకపోయినా వాళ్లకేలోటు లేకుండా పోషించాను. అవి శారదాబిల్లుకు ముందరరోజులు. శాంతకు పెళ్లియీడు దగ్గరకు వచ్చింది. వాళ్ల తల్లి లేని లోపం అప్పుడు తెలిసివచ్చింది. ఏదయినా సంబంధం వస్తే వాళ్ల తల్లితో చెప్పకుండా, దాంతో ఆలోచించకుండా ఏపనీ చేసేవాణ్ణి కాదు. ఇప్పుడు నాకు సలహాచెప్పేవాళ్లెవరూ లేరు. అంటే వాళ్ల సలహా నాకు నచ్చిందికాదు. నాలో నేనే మథనపడటం. 'ఈడు సరిపోయిందా? ఆస్తి మనకు నచ్చినట్టేనా? కట్నం ఎంత యివ్వగలం? సాంప్రదాయం మంచిదేనా? పిల్ల సుఖపడుతుందా?'—అన్నీ నేను ఆలోచించవలసిందే.

చివరకు శాంతకు ఒక నచ్చిన సంబంధం చూసి పెళ్లిచేశాను. మా అల్లుడు కనిగిరిలో స్కూలుమాష్టరుగారి కొడుకు. వాళ్లకు దగ్గరదగ్గర నలభయి ఎకరాల మాగాణీ వుంది. ఇద్దరే మగపిల్లలు. పిల్లవాడు ఫిఫ్త్‌ఫారం చదువుతున్నాడు. రెండువేల కట్నం. మొత్తం అయిదు వేలదాకా అయినయి. వాళ్లుకూడా లాంఛనాలు బాగా జరిపారు. ఆ అయిదురోజులూ తల్లిలేని లోటు ప్రతిక్షణం కనబడేది. గుండెనిబ్బరంతో పనిచేశానన్నమాటేకాని మనస్సంతా కలవరపెట్టేది.

ఇక మిగిలింది సత్యాగ్రహి. రెండూ కలిపి చెయ్యమన్నారు గాని సరియైన సంబంధం ఒకటి దొరికేవరకే తలప్రాణం తోకకు వచ్చింది. అందులోనూ శాంతకు పెళ్లియీడు మించిపోతోంది. 'అయినంతవరకే మహాదేవ!' అని శాంతపెళ్లితో సంతృప్తిపడ్డాను.

కాని ఎన్నాళ్లు యీసంతృప్తి? సత్యాగ్రహికి పదోయేడు వచ్చింది. మళ్లీ మొదలు. ఆఖరిపిల్ల! ఏమయినాసరే, దివ్యమయిన సంబంధం తీసుకురావాలి. నిజం చెప్పవద్దూ! సత్యాగ్రహి అంత అందమైన పిల్ల కాదు. అంటే కురూపి అనుకోకండి. చామనచాయ రంగు. మంచి కన్నులు. నిడుపాటి జడ. కాని చలాకీగా వుండే పిల్లకాదు. చాలా నిదానం. చదువులోకూడా చాలా నిదానమే! అప్పటికే కష్టపడి తెలుగులో మంచిచదువు చెప్పించాను. పాటకూడా మంచి పండితుణ్ణి పెట్టి నేర్పించాను. సరే మా పాతహార్మోనియం వుండనేవుందికదా!

వేమూరిలో ముప్ఫయిరెకరాల ఆసామీకి ఒక్కడే కొడుకట. కాని వాళ్ల అబ్బాయి ఫోర్త్‌ఫారందాకా చదివి మానేశాడు. లాభం లేదనుకున్నాను. వీరవరంలో యాభయి ఎకరాల ఆసామీ. ఇద్దరే కొడుకులు. రెండోవాడికి సంబంధం. కాని ఏం లాభం? పిల్లడు అంత అందంగా లేడు. పైగా స్ఫోటకంమచ్చలు. మొరటుగా వున్నాడు. ఆసంబంధంకూడా మానుకున్నాను. ఇలా కాలుగాలిన పిల్లిలాగా యిటూ అటూ తిరుగుతూనే వున్నాను.

చివరకు—నందవల్లిలో అన్నివిధాలా నచ్చిన సంబంధం. ఆవూరు కరణంగారు రామనాథంగారు మంచి ఆస్తిపరుడు. ఆయనకు ఏడెనిమిది మంది సంతానం కలిగి, పోయినవారు పోగా మిగిలినదల్లా ఒక కొడుకూ, కూతురూ. కూతుర్ని ఆవూళ్ళోనే చెల్లెలుకొడుక్కు యిచ్చి వివాహం చేశాడు. కూతురూ, అల్లుడూ చాలాభాగం వీళ్ల యింట్లోనే వుంటారట. ఇహ యీయన కున్న ఆస్తి నలభైఅయిదెకరాల మాగాణీ, ముప్ఫయి ఎకరాల మెట్టా, ఒక పెద్ద మామిడితోటా వున్నయి. పిల్లవాడు ఫిఫ్త్‌ఫారం ప్యాసయి ఆఏడే స్కూలుఫైనలులో ప్రవేశించాడు.

ఇవన్నీ ఆలోచిస్తే యింతకన్నా మంచి సంబంధం తేవటం మనచేత కాదనుకున్నాను. దసరాముందు వాళ్లవూరు వెళ్లి కదిలించి చూచాను. ఫలానారోజుకు వచ్చి చూస్తామన్నారు. వాళ్లు వచ్చేటప్పటికి అంతా తయారుచేసివుంచాను. కరణంగారూ, కూతురూ, అల్లుడూ దిగారు.

అమ్మాయిని వాళ్లముందు తీసుకువెళ్లి కూచోపెట్టాను. సిగ్గుతో కుంగిపోయింది నాతల్లి. కరణంగారి కూతురు రామానుజమ్మ మా అమ్మాయిదగ్గరకు వచ్చి లాలనతో 'ఏం భయం లేదమ్మా, యిటు చూడు' అంది. సత్యాగ్రహి బెదిరే కళ్లతో కరణంగారివంకా, వారి అల్లుడువైపూ చూసి చివరకు నావంక దీనంగా చూస్తోంది.

'ఏమండీ, మీ అమ్మాయికి సంగీతమేమన్నా వచ్చా?' అని కరణంగారి అల్లుడు అన్నాడు.

'ఏదో, అదేలెండి. రెండేళ్లమట్టి నేర్చుకుంటోంది.'

'ఏదీ పాడమ్మా' అంది రామానుజమ్మ.

మాట్లాడకుండా తల వంచుకొని కూర్చుంది సత్యాగ్రహి. మళ్లీ, రామానుజమ్మ అందుకొని 'పాడమ్మా, పాడు. ఏపాటయినా సరే.' అంది. నావంక తిరిగి 'హార్మోనీ వుందా?'

నేను గబగబా లోపలికి వెళ్లి హార్మోనియం తీసుకువచ్చి సత్యాగ్రహిముందు పెట్టాను. సత్యాగ్రహి కదలలేదు, మెదలలేదు. మళ్లీ రామానుజమ్మ: 'ఇదుగో, వీళ్లంతా పరాయివాళ్లనుకున్నావా? ఎందు కాభయం?'

సత్యాగ్రహి మాట్లాడలేదు.

నాకు విసుగుపుట్టి 'ఎందుకమ్మా అంతసేపు బతిమాలించుకోవటం' అనగానే సత్యాగ్రహి తలయెత్తి చాలా దీనంగా నావంక చూసి పాట ప్రారంభించింది.

ఆపాట వినేటప్పటికి నాకు నవ్వూ, ఏడుపూ రెండూ వచ్చినయి. ఎంత కటువుగా వుండాలో అంత కటువుగానూ వుంది పాట. బడిపంతులుముందు నిలబడి పాఠం వప్పజెప్పే పిల్లడుకూడా అంత భయపడేవాడు కాదేమో! కరణంగారూ, ఆయనకూతురూ, అల్లుడూ మూతులు బిగించుకొని కూర్చున్నారు. 'ఇహ చాలమ్మ

అమ్మా' అన్నాడు కరణంగారి అల్లుడు. 'కొత్తవాళ్లదగ్గర పాడటం మాపిల్లకు అలవాటులేదండీ. లేకపోతే బాగానే పాడుతుంది' అని నేను నీళ్లునమిలాను.

కొంతసేపు ఆగి కరణంగారు 'సరే, మాకు సెలవిప్పించాలి' అన్నాడు.

'మరి మీ అభిప్రాయ మేమిటో చెపితే...'

'మేము యింటికి వెళ్లి ఉత్తరం రాస్తాం లెండి.'

'తొందరలో......'

'అలాగే, వస్తాం...సెలవు.'

ఒక నెలరోజులపాటు ఉత్తరంకోసం ఎదురుచూశాను. ఉపయోగం లేకపోయింది. ఈలోపల నాకెక్కడా అంతకన్నా మంచి సంబంధం తగలలేదు. అందుచేత నేనే సరాసరి ప్రయాణమై వందవల్లి వెళ్లాను. అల్లుడుగారు వూళ్లోలేరట. వారంపదిరోజులలో గాని తిరిగిరారట. పదిరోజులాగి రమ్మన్నారు. పదిరోజులు ఆగి మళ్లీ వెళ్లాను. సావిట్లో కరణంగారూ, అల్లుడూ కూర్చొని వున్నారు. 'రండి, రండి' అని కాళ్లు కడుక్కోడానికి నీళ్లు యిచ్చి చాప వేసి కూర్చోపెట్టారు.

'ఇవాళో రేపో ఉత్తరం రాద్దామనుకుంటూవుంటే, మీరే వచ్చారు. పనితొందరలో మీమాటే మరిచిపోయాం' అని కరణంగారన్నాడు.

'దానికేంలెండి? మీ ఉద్దేశ్య మేమిటో చెపితే...'

నామాట పూర్తికాకుండానే కరణంగారి అల్లుడు అందుకొని—'ఉద్దేశ్యా లేమున్నయ్యండీ! మావాడికి పిల్లనిస్తామనీ, గొప్పకట్నా లిస్తామనీ తిరిగినవాళ్లు తిరుగుతూనేవున్నారు. ఏదో వున్నవాడు మాకు ఒక్కడేకదా అని తటపటాయిస్తున్నాం.'

అప్పుడు నే నన్నాను: 'మీయిష్ట మెలా వుంటో అలాగే కానీయండి.'

ఇక్కడ అందరూ రెండునిమిషాలు మాట్లాడకుండా ఊరుకున్నారు. కరణంగారి అల్లుడు యింట్లోకి వెళ్లాడు. ఆయనవెళ్లిన ఒక అయిదునిమిషాలకు కరణంగారుకూడా లోపలికి పోయి ఒక పావుగంటసేపు గుసగుసలాడారు. ఇంతలోకే కరణంగారి అల్లుడు సావిట్లోకి వచ్చి, నాముందు కూచొని, తలవంచి, పంచెఅంచు సర్దుకుంటూ—

'మరి, కట్నంమాట ఏమంటారు?'

అమ్మయ్య! పిల్ల వచ్చిందికదా అని సంతృప్తిపడ్డాను.

'ఇంతవరకూ పదిహేనువందలూ, రెండువేలూ యిస్తూ వచ్చాను. ఇది నాకు ఆఖరుపిల్ల అవడంచేత నాలుగువేలదాకా పెడదా మనుకున్నాను.'

'అలాగా' అని ఒక్కనిమిషం ఆలోచించి 'మీకు ఉత్తరం రాస్తాంలెండి' అన్నాడు. 'ఉత్తరం రాస్తాం లెండి' అంటే, ఆ భాషలో 'మీకట్నం మాకు నచ్చలేదు!' అన్నమాట.

'పోనీ, మీ అభిప్రాయ మేమిటో చెపితే...'

'మా అబ్బాయికి ఏసంబంధం వచ్చినా పదివేలకు తక్కువగా ఎవ్వరూ అడగలేదు. మరి మీరు నాలుగువేలంటే నేను ఏం మాట్లాడేది చెప్పండి.'

ఎంత వ్యాపారసరళిలో మాట్లాడుతున్నాడో చూడండి!

'ఇంతవరకూ ఏడుగురు ఆడపిల్లల పెళ్లిళ్లు చేశాను. ఒక్క కట్నమే ముఖ్యమైన విషయం కాదు. సాంప్రదాయం, పిల్లమంచితనం ఎన్నో ఆలోచించాలి. అయినా నాకు మగపిల్లలు లేరు. వాళ్లే నాకు మగపిల్లలు. ఒక్క కట్నమేమిటి, నా ఆస్తి అంతా వాళ్లది కాదూ?'

నేను యిలా మాట్లాడేటప్పటికి ఆయనకు కోపం వచ్చింది. 'అయితే యీవిషయాలేమీ మాకు తెలియవంటారా ఏం?'

ఆయనమనస్సు చివుక్కుమందని గ్రహించాను.

'నాయనా, ఏదో పిల్లలుగలవాణ్ణికనుక తొందరలో అన్నాను. మీకు తెలియని దేముంది బాబూ! నా మాటకూడా కొంచెం మన్నిస్తిరా నన్ను ఉద్ధరించినవాళ్లవుతారు.'

'సరే, మావాళ్లతో ఆలోచించి ఉత్తరం రాస్తాం లెండి' అని చెప్పి లేచాడు.

నేనూ లేవకతప్పింది కాదు.

'ఏదో తొందరలో తేలిస్తే—'

'అలాగే.'

మళ్లీ ఉత్తరం రాలేదు. పదిహేనురోజులు లాగి వందవల్లి వెళ్లాను. బేరం తొమ్మిదివేలవరకూ దిగింది. నాది అయిదువేలదాకా పెరిగింది. చివరకు ఆరువేలకూడా అన్నాను.

పిల్లకు పదకొండవయేడుకూడా వెళ్లిపోయింది. శాంతకు కార్యంచేయడంతొందరలో రెండునెల్లు వృథాగా గడిచిపోయినయి. మళ్లీ వెళ్లాను. ఏమయినా సరే, యీదఫా అటో యిటో తేల్చి వద్దామని. చివరకు ఏడువేలా అయిదువందల రూపాయల కట్నం, లాంఛనాలు వగైరాలకు ఫైసలయింది. ముహూర్తం యిక మూడు నెలలకు.

సంతృప్తితో యింటికి తిరిగివచ్చాను. వచ్చి ఒక్కసారి సత్యగ్రహిని కావలించుకొని ఏడ్చాను. 'అమ్మా, నువ్వుకూడా ఇంకొకరి వస్తువై పోతున్నావు. ఇక యీయింటిలో మిగిలేది యీజీవం ఒక్కటే' సత్యగ్రహి నామాటలు అర్థమయ్యో, కాకో నన్ను కావలించుకొని అలాగే నిర్ఘాంతపోయి చూస్తోంది.

పెళ్లికి బ్రహ్మాండమైన ప్రయత్నం చేశాను. ఇది నేను చేసే ఆఖరుపెళ్లి. ఎంత దివ్యంగా వుంటే అంత మంచిది. పెద్దపెద్ద పందిళ్లు వేయించాను. ఎనిమిదిమంది వంటవాళ్లను పెట్టాను. ఒక యాభై గ్యాసులైట్లు. రిమకుపైన రంగుకాగితాలతో అలంకరణాలు. రెండువందలరూపాయల మందుగుండుసామాను — ఒక టేమిటి, అనేకం!

పెళ్లిరోజు వచ్చింది. రాత్రికి ముహూర్తం. ఉదయాన్నే పెళ్లివారు దిగారు. ఘోరమైన వర్షం. అందరినీ సాగదీసి కాళ్లు బురద కాకుండా, పైబట్ట తడవకుండా విడిదిలోకి చేర్చేటప్పటికి నామచ్చ కాసింది.

పెళ్లి! అత్తగారు ఒక అమాయకురాలు. అంతా ఆడపిల్ల పెత్తనమే. ఆవిడ ఏదయినా బాగుండలేదంటే అందరూ అదే వరస. రామానుజమ్మకు కోపంవస్తే భూనభోంతరాళాలు దద్దరిల్లేవి. ఆమె మాటల ధాటిలో కరణంగారూ, ఆమెభర్తా, నేనూ—అందరం చెత్తా చెదారంలాగ కొట్టుకొనిపోయేవాళ్లం. రామానుజమ్మను సంతృప్తి పరచడానికి అప్పటికప్పుడు బజారునుంచి రెండువందల రూపాయల మంచి బెనారసుచీర తెప్పించాను. ఆడపిల్లకట్నంక్రింద అయిదు వందలరూపాయలు చదివించాను. పోలేరమ్మకు ఎంతసుగ్గిలం చేస్తే యేం? ఏవో లోపాలు వుండకమానవు. ఆమెకు వంగివంగి సలాములు చెయ్యలేక నా ప్రాణం విసిగిపోయింది.

నాలుగోరోజు తెల్లవారుఝామున అంపకాలు. ఆ నాలుగు రోజులనుండీ సత్యాగ్రహికి నిద్రలేదు. కళ్లంతా ఎర్రబారినయి. తూలుతూనే కూచుంది. ఇహ నాకు అంతూ పంతూ లేని దుఃఖం వచ్చింది. నాపిల్లలంతా వచ్చి నన్ను ఓదార్చజూచారు. కాని, నాయనా, పిల్లల్ని కన్నవాళ్లకే తెలుస్తుంది ఆబాధ. ఎనమండుగురు పిల్లలు. ఒకరివెంట ఒకర్ని యితరులకు వప్పగించాను. ఇదుగో యిది ఆఖరుపిల్ల. పువ్వులలో పెంచాను. బాధ అంటే ఏమిటో యెరుగని అమాయకురాలు. ఎలా చూసుకుంటారో?

* * * *

శాంతకూడా కాపరానికి వెళ్లిపోయింది. సత్యాగ్రహీ, నేనూ మిగిలాం. సత్యాగ్రహికి పదమూడుఏళ్లు నిండినయి. కార్యం చేయమంటూ ఉత్తరాలమీద ఉత్తరాలు వ్రాస్తున్నారు. ఉత్తరాలకు ఆమాటా యీమాటా సమాధానం రాసి కాలం వెళ్లబుచ్చుతూవుండే వాణ్ణి. కాని ఎంతకాలం తప్పించుకుతిరగగలను? చివరకు బలవంతం మీద లగ్నం నిశ్చయించాం.

ఆ శుభకార్యంకూడా అయిపోయింది. మరి నాలుగునెలలకే పిల్లను కాపరానికి పంపించమని తొందరచేయడం మొదలుపెట్టారు. 'నాయనా, నిన్నకాక మొన్న కళ్లు తెరిచింది. అప్పుడే కాపుర మేమిటి?' అని నేను బతిమిలాడేవాణ్ణి.

'ఆఁ! తల్లికూడా లేకపోయె. మీయింటిదగ్గర పోషణ బాగా జరగదు. కనుక వెంటనే పిల్లను తీసుకొని రావలసిందని' ఉత్తరాలు. నే నప్పటికీ మొండిగా వూరుకున్నాను. కరణంగారి అల్లుడు ఒక సారి మా ఊరు వచ్చి, మామీద నాలుగుకేకలు వేసి సత్యాగ్రహిని ప్రయాణం కట్టించాడు. అన్నాళ్లూ నిబ్బరంగా వున్న నాతల్లి ఆ నాడు నన్ను కావలించుకొని బావురుమని ఏడ్చింది. బండితోపాటు చాలాదూరం సాగనంపివచ్చాను. వెనుదిరిగివస్తూవుంటే నాహృదయం బరువెక్కింది. నేను నడవలేకపోయాను. ఇల్లంతా వెలవెలపోతోంది. నా చిట్టితల్లిని, నా జీవజ్యోతిని ఎవరో దొంగిలించినట్లూ, లాక్కు పోయినట్లూ అనిపించింది. రాత్రిళ్లు నిద్రపట్టదు. ఒంటరిపాటును సహించలేక కన్నీటితో తలదిండ్లు తడిసేవి.

కాలం గడిచిపోతున్నది. వారంరోజు లయినతర్వాత నందవల్లి వెళ్లాను. 'వచ్చావా నాన్నా' అని అపరిమితమైన ఆనందంతో నన్ను కావలించుకుంది సత్యాగ్రహి. నే నేమని చెప్పేది? ఎన్నిసార్లు నాకు ఏడుపు వచ్చిందని చెప్పేది? మీకు విసుగుకూడా పుడుతుందేమో.

సత్యాగ్రహే నాకు కాళ్లు కడుక్కోడానికి నీళ్లు తెచ్చింది. ఇంతలోకే కరణంగారు చుట్ట వెలిగించుకుంటూ సావిట్లోకి వచ్చారు. మా అమ్మాయి యింట్లోకి వెళ్లిపోయింది. మళ్లీ నాకు కనబడలేదు. సాయంత్రం కరణంగారూ, నేనూ ఊరి అవతలకు వెళ్లి, కుప్పలు వేసిన పొలాలన్నీ ఒక్కసారి చూచివచ్చాం. స్నానానికి నీళ్లు మా సత్యాగ్రహే తోడింది. స్నానం చేసి మడిబట్టలు కట్టుకుని భోంచేశాం. వాకిట్లో కూచొని కరణంగారితో మాట్లాడుతుంటే వారి అల్లుడు కూడా వచ్చాడు. ఆవూరి వ్యవహారాలూ, పార్టీలనుగురించి చాలాసేపు మాట్లాడాం. ఆ మరునాటి మధ్యాహ్నంవరకూ నాకు సత్యాగ్రహితో మాట్లాడే అవకాశం దొరకనేలేదు.

సత్యాగ్రహికి చాలా దిగులుగా వున్నది. నాకోసం బెంగపడి పోయింది. 'ఇంట్లో నిన్ను ప్రేమగా చూస్తున్నారా' అంటే అవు నన్నది. 'ఏమయినా పనులు చేయిస్తున్నారా' అంటే 'ఎక్కువలేదు నాన్నా' అంది.

'మరి నిన్ను తీసుకువెళ్లడానికి వచ్చానమ్మా' అన్నాను.

'పంపిస్తారో, లేదో?'

'ఎందుకు పంపించరు?'

'ఏమో, నా కేం తెలుసు?'

ఆ సాయంకాలం కరణంగారితో చెప్పాను. వీలులేదన్నారు. 'వచ్చి వారంరోజులుకూడా కాలేదుగదండీ. ఇదేమన్నా మీఅమ్మాయికి పరాయియిల్లా? అయినా కుప్పలుకొట్టే రోజులు, ఇంటినిండా బండెడంత చాకిరీ! ఇప్పుడు పిల్లను తీసుకువెళ్తానంటే ఎలా చెప్పండి?'

ఏదో మాఅమ్మాయికోసమే యీ పనిఒత్తిడంతా వచ్చినట్టు! నన్నసలు మారుమాట చెప్పనివ్వలేదు. సంక్రాంతిపండగకుతర్వాత కాని యీలోపల వీలుపడదన్నారు.

ఇంటికి తిరిగివచ్చినతర్వాత ఆదుర్దాగా, మాఅమ్మాయి —

'ఏంనాన్నా ఏమన్నారు?'

'ఇప్పుడు వీల్లేదన్నారు.'

'మరి...'

'సంక్రాంతిపండగ దాటింతర్వాతట.'

'అమ్మ నాయనో, నెలరోజులే!'

'ఏమిటమ్మా? నెలరోజులకే అంత ఖంగారుపడతావ్! ఇహ ముందుముందు సంవత్సరాలపర్యంతం వుండొద్దూ?'

'ఏమో నాన్నా, మరి నువ్వు గట్టిగా అడగలా?'

'ఎందుకు అడగలా! చివరకు వాళ్లయిష్టం కాని నాయిష్టమా?'

'మరి నువ్వు పండగ వెళ్లగానే వస్తావా?'

'అలాగేనమ్మా'

'తప్పకుండా రావాలి.'

'తప్పకుండా'

'ఎన్నిపను లున్నా సరే.'

'పిచ్చిదానా! నాకుమట్టుకు నువ్వు రావాలని వుండదూ?'

'ఏమో నాన్నా, నా కేం తోచడంలేదు.'

'ఏం? యిక్కడ నిన్ను సరిగ్గా చూడటంలా?'

'అదిగాదు.'

'మరేమిటి?'

'ఇక్కడ నా కేం తోచదు. చాలా కొత్తగా వుంటుంది. వాళ్లచూపులే నాకు నచ్చవు. మరీ...'

'మరీ?'

'మరీ, మా ఆడబిడ్డ. ఆవిణ్ణి చూస్తే నాప్రాణాలు నిలువునా కుంగిపోతాయి'.

'అదేమిటమ్మా అలా అంటావ్? అలాంటివాళ్లనే మంచి తనంచేసుకోవాలి. తప్పకుండా? మరి నీ ఆయనో?'

'ఏమో, వారికి అక్కగారిమాట అంటే వేదవాక్యం.'

'అంచేత నువ్వు మరీ జాగ్రత్తగా వుండాలి. అత్తగారింట్లో ఎంత అణుకువగావుంటే అంత మంచిది.'

ఇలా బోధించి ఆ మరునాటిఉదయాన్నే మావూరు వెళ్లాను.

ఇంటికి రాంగానే సత్యాగ్రహిమాట పూర్తిగా మరిచిపోయాను. కుప్పలుకొట్టించడం, గల్లాను యింటికి చేర్పించడం —వీటితో నాకు యిరవైరోజులు క్షణం తీరుబడికూడా లేకపోయింది.

ఇంతలోనే మా మాడో అల్లుడుదగ్గర్నుంచి, మాఅమ్మాయికి చాలా సుస్తీగా వుందనీ, వెంటనే బయలుదేరిరావలసిందనీ టెలిగ్రాం వచ్చింది. దానికి సందేజబ్బు. ఏడాదికొకసారి క్రిందమీదుపెట్టు చేస్తుంది. ఉన్నవాణ్ణి ఉన్నట్టుగా బయలుదేరివెళ్లాను. మాపిల్లలలో ఎవరికి జబ్బుచేసినా సరే, వాళ్లతల్లో దగ్గరవుంటే వాళ్లకు సగం రోగం తగ్గినట్లు వుండేది. అందుచేత అలాంటి వుత్తరం ఎప్పుడు వచ్చినా మాలో ఒకరం వెళ్లకతప్పదు. వాళ్లతల్లి పోయిననాటినుంచీ ఆబాధ్యతకూడా నానెత్తిమీద పడ్డది.

మా మాడోపిల్ల కోలుకునేటప్పటికి రెండునెలలు గడిచిపోయినయి. ఈలోపల ఒక్కసారికొముల్లు మాఊరు వెళ్లివచ్చాను. నిజంగా అది పునర్జన్మే! మూడురోజులు, అహోరాత్రులు మృత్యువుతో పోరాడింది. ఏనాడో మేం చేసుకున్న సుకృతంవల్ల బయట పడ్డది.

ఈలోగా నందపల్లికి రెండుమూడు ఉత్తరాలు రాశాను. సత్యాగ్రహి దిగులులేకుండా వుందనీ, తొందరలో మీరు నందపల్లి రాకపోయినా ఫరవాలేదనీ కరణంగారు ఉత్తరంరాశారు. దాంతో నామనస్సు కొంతకుదుటపడ్డది. ఇంటికి రాంగానే ఉత్తరం రాశాను. ఫలానరోజున వచ్చి అమ్మాయిని తీసుకువెళ్తానని. దానికి కరణంగారు జవాబురాస్తూ, కొద్దిరోజుల్లోనే సావిత్రినోములు వస్తున్నాయనీ, అవి అయినతర్వాత కోడల్ని తీసుకువెళ్లవచ్చుననీ ఉత్తరం రాశారు. దాంతో నాప్రయాణం మళ్లీ ఒకనెలరోజుల దాకా వాయిదాపడింది. సావిత్రినోములు వెళ్లింతర్వాత నేనే మంచిరోజు చూసుకుని నందపల్లి చేరాను.

ఉదయం పదిగంటలయింది. వేసవికాలం దగ్గరకురావడంతో ఎండ కొంచెం తీవ్రంగానే వుంది. ఆ ఎండలో, తడిబట్టలతో, తనకు మించిన బిందె భుజాన పెట్టుకుని సత్యాగ్రహి దగ్గిరవున్న మంచినీటిభావినుండి మడినీళ్లు తీసుకువస్తోంది. దూరంలో నేను సత్యాగ్రహిని గుర్తించలేదు. దగ్గిరకురాగానే నాకళ్లను నేను నమ్మలేకపోయాను. అసలే నాజూకుగా వున్న పిల్ల పూర్తిగా పల్చబడింది. ముఖం వెలతెలబారింది. చాలా చిక్కిపోయింది. కళ్లు లోతుకుపోయినయి. మూడునెలల్లో పదిపదిహేనేళ్లు పైబడినట్లున్నాయి. నావంక చూసి ఆశ్చర్యంతో, సంతోషంతో, దుఃఖంతో ఒక్కనిమిషం అలా నిశ్చేష్టురాలుగా నిలబడిపోయింది.

'ఏమిటమ్మా, ఇలా ఉన్నావ్?' అన్నాను.

నామాటకు సమాధానం చెప్పకుండా 'అక్కయ్యకు ఎలా వుంది నాన్నా?' అని అడిగింది.

'ఇప్పుడు కులాసాగానేనమ్మా. మరి నువ్వు...'

నామాట వినిపించుకోకుండా తలవంచుకొని యింట్లోకి వెళ్లిపోయింది. నాకేమీ తోచక కరణంగారి వాకిలిఅరుగుమీద కూలబడ్డాను. రెండునిమిషా లయింతర్వాత కరణంగారి అల్లుడు ఆవైపే



భేదము—

ఏ యితర తలనూనె గూడ తలవెండ్రుక
లను యింత ఆకర్షణీయంగా చేయదు.

SRIVIS-AMLA
Hair Oil

శ్రీ విస్ అమ్లా తలనూనె

వాడి ఆభేదమును కనుగొనుడు. అది మీ
శిరోజములకు యెక్కువ కాంతిని చేకూ
ర్చును. చిక్కు లేకుండ దువ్వుకోవచ్చును.



వెండ్రుకల పెరుగుదలకు
కూడ యీ నూనె
తోడ్పడును.

యస్. విశ్వనాధం అండ్ కంపెనీ,
44, బందరు వీధి, మద్రాసు.

హెచ్చుచున్న అంకెలు

1943	1,01,74,000
1944	**1,50,00,000**
1945	**2,25,00,000**

జీవితభీమావ్యాపారము మాత్రమే

రూబీ

జనరల్ యిన్స్యూరెన్సు కంపెనీ, లి.,

జీవితం, అగ్ని, నౌక, ప్రమాదముల
భీమావ్యాపారము నిర్వహింపబడును

చైర్మన్: బి. ఎం. బిర్లా.

హెడ్డాఫీసు: 8, రాయల్ ఎక్స్చేంజి ప్లేస్,
కలకత్తా.

మద్రాసు ఆఫీసు:
337, తంబుచెట్టివీధి,
జి. టి.

కోయంబత్తూరు ఆఫీసు:
టవర్ బిల్డింగు,
వెరైటీ హాలరోడ్.

సిలోనుకు ఛీఫ్ఏజంట్లు : చిమన్‌లాల్ దేశాయ్ అండ్ కో.,
మస్కూర్ బిల్డింగు, మెయిన్‌రోడ్డు, కొలంబో.

ఖండేరాయని కైకలూరి శిలాశాసనము

— శ్రీ భావరాజు వెంకటకృష్ణరావు —

మూడేండ్లక్రిందట మిత్రులు శ్రీ చేకుమళ్ల అచ్యుతరావుపంతులుగారు నన్ను "ఖండేరాయ డనువానినిగురించి తెలుపు ఏమయినా శాసనము లున్నవా, వెదకిచూడండి" అని అడిగినారు. అప్పటినుంచి ఖండేరాయని శాసనములను గురించి శ్రద్ధతో వెదకుచునేయున్నాను. శ్రీ అచ్యుతరావు పంతులుగారి ఆంధ్రవాఙ్మయ చరిత్రరచనకు ఈ ఖండేరాయని ప్రశంస ఎందుకు అవసరము కలిగినదో, వారు తెలిపిన విషయములు జ్ఞాపకములేకపోవుటవలన తెలుపజాలను.

ఇట్లుండగా ఈమధ్య నేను కైకలూరు వెళ్లుట తటస్థించెను. అచ్చట శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయములో ఒకమూలనున్న శిలాశాసనము (౫ అడుగుల పొడుగు, ౧౬ అంగుళముల మందము గలది) నాదృష్టి నాకర్షించెను. వెంటనే ఆ శాసనము చదివితిని. దానిని అచ్యుతరావు పంతులుగారికిని, వారివలె పరిశోధన చేయుచున్న మిత్రులకును ఉపయోగకరముగా నుండ గలదని తలంపుతో ప్రకటించుచున్నాను.

ఈ శాసనమువలన తెలియవచ్చు విషయములను వివరింతును :

శాసనకాలము శకము ౧౫౫౦ విభవ సంవత్సర జ్యేష్ఠ శుద్ధ పంచమీ శుక్రవారము. క్రీ. శ. ౧౬౨౮.

ఈ ౧౬౨౮ వ సంవత్సరము గోల్కొండ రాజధానిగా సకలాంధ్రభూమిని ఏకచ్ఛత్రాధిపత్యముగా పరిపాలించిన ఖుతుబ్ షాహిసుల్తానులలో అయిదవవాడగు అబ్దుల్లాఖుతుబ్ షాయొక్క విజయరాజ్యవర్షము ౮ వది యగుచున్నది. సుల్తాను అబ్దుల్లా క్రీ. శ. ౧౬౧౧ మొదలుకొని ౧౬౭౨ వఱకు పరిపాలించెను. కావున ఖండేరాయడు సుల్తానుఅబ్దుల్లావారి రాజ్యమందు ఒక సుబేదారు (గవర్నరు) గా నుండిన ట్లూహింపవచ్చును.

ఖండేరాయడు కర్ణాట మాధ్వబ్రాహ్మణుడు. ఆత్రేయగోత్రజుడు. లింగోజిమంత్రిప్రపౌత్రుడు. రామాజీ మంత్రిపౌత్రుడు. గోపుజీ మంత్రికుమారుడు. తల్లి పేరు బన్‌దాయీ. ఇతడు కాణ్వశాఖీయుడు. అందువలన ఋగ్వేదియో, శుక్లయజుర్వేదియో కావలయును. కూడలిగ రామాజీపండితుని పెద్దకూతురు లక్ష్మాంబను పెండ్లియాడెను.

ఖండేరాయడు ఏలూరుపరగణాకు సుబేదారుగా నుండనోపు. ఛిత్తరఝిల్లిసీమలో కైంకలూ రనుపేరట కైంకర్యపురిని కట్టించెను. నేటి కైకలూరు అది. ఊరు కట్టించి శివకేశవులకు, ఆంజనేయునకు దేవాలయములను ప్రతిష్ఠించెను. వాటికి క్షేత్రముల నిచ్చెను. శాశ్వతముగ అచ్చట కైంకర్యములు జరుగుటకు అనేక వృత్తులను ఏర్పరిచెను.

ముఖ్యమైన విషయ మింకొకటి కలదు. కొల్లేటి సరస్సుకు దేవపుష్కరిణి అని పేరుండెనట. అందొకప్పుడు కృష్ణాగోదావరీనదులు సంగమించుచుండెనట. అనగా ఒకానొక కాలమున కృష్ణాగోదావరీనదులు రెండువేల యేండ్లనుండి ప్రవహించుచుండినట్లు ప్రవహించుచుండలేదని తేలుచున్నది. ఇది యపూర్వవృత్తాంతము. కృష్ణాగోదావరులు సంగమించిన కాలమున ఈ పల్లపుప్రదేశము కొల్లేరు అయ్యెను. పూర్వము గుడివాడకు విదర్భపురి యని పేరుండెనని యీ శాసనము వలన తెలియుచున్నది.

ఈశాసనమును సంస్కరింపకుండ యథాస్థితిని ప్రతివ్రాసుకొని ప్రకటించుచున్నాను.

— శ్రీ వెంకటపతి —

రాజా విజయీభవ

3 స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివా
4 హన శకవర్షంబులు ౧౫౫౦ అగు
5 నేటి శత్రు వర్తమాన విభవసం
6 వత్సర జ్యేష్ఠ శు ౫ శుక్రవారమున
7 యీ శుభ దివసమందు శ్రీ మహా
8 శ్రేయసోత్రాయోర్గా లింగోజిమం
9 త్రిశేఖరః నప్తా రామాజీ సత్పౌత్రో
10 గోపుజీవరనందనః। బస్ దాయీ
11 గర్భసంభూతః కౌణ్యశాఖాప్ర
12 వర్తకః। విష్ణుభక్తిరతః శ్రీమాన్ మ
13 ధ్వాచార్య మతోత్తమః। కూడస్థైవం
14 శజశ్రేష్ఠో రామాజి పండితాగ్రజ ల
15 క్ష్మణాంబా మనోహరః। ఖండేరాయ
16 ప్రతాపవాన్॥ పద్యాలు। ధరణింబొ
17 గడొండ్డి రేయలూరి దండపా
18 టికింద్ది భిత్తర ఝుల్లిలో నం
19 ద్దమైన కైంకలూరను పేరి కైంక
20 ర్యపురిని శాశ్వతంబ్బుగ శ్రీ
21 వెంకటేశ్వరలను। రాఘవేశ్వ
22 రునాశ్వేరి రామలింగ। మాంజ
23 నేయుల నిల్పి దేవాలయములు
24 మట్టుపల్లెలుం గోపుర ప్ర (ప్రా)కారములు
25 తెలుగాం గట్టించి పేరు పేరా ॥౨॥ ౹
26 రుప్రతిష్ఠచేసి తిరునాల సాగించ్చి
27 యువసరములుం బడితరాజినిత్య। వార
28 రపక్షమాసపర్వోత్సవానేక। వైభవములుం
29 చ్చాత వైభవములు ॥౩॥ రేంటేంట సా
30 గునట్లుగ। పింటికిం *బులివట్లు విడిచె వ్రి
31 త్తులుం బడింగొల్లెంటిదరి గైంకలూర
32 ను। వాంటికి ముక్కాటంబందు వ
33 రువలమచ్చూచు ॥౪॥ స్థానము జియ్య
34 శ్వరిని। స్థానము సమయంబ్బు వారి
35 స్థానము వారిన్। స్థానాచార్యుల శ్రీ
36 వైఘానసులను నిల్పె స్వామి కైంకర్యార్థము

2 వ వైపు

37 ర్థమూ ॥౫॥ యీమా
38 న్యాలిల్ల గృహారామ క్షే
39 త్రంబ్బు లేపగారచి లగని
40 ల్పెక్। వామనముద్రలు
41 వెలయం। గ్గా మాన్య క్షే
42 త్రములకుం గరకుం
43 భ్యాదులు ॥౬॥ స్వామి
44 కెప్పుడు రాజోపచా
45 రములుకు। మంచ్చి న
46 ధికాలగం బౌరాణికో
47 త్తములను కవుల జో
48 స్యుల యోగ్యులం గా
49 యకులను వందిజ
50 నముల గాపిల వా
51 ద్యకాంగ్రా ॥౭॥ పిరికిం
52 ద్దరికిని వ్రిత్తులు నిక్కైం
53 కలూర మణుగుమా
54 ర మాజీతము గ। సా
55 గునట్లుగాను శాసనం
56 బ్బులునిల్పె। వ్రి త్తిమంత్తు
57 లకును పేరుపేరా ॥౮॥
58 యెవ్వరైన నేమి యిం
59 ద్దులకును విఘ్నమాచ
60 రించ్చుం దలచినంతలోన
61 కాశిలోన మాతృగమ
62 నంబ్బు చేసిన। వారిగతికిం
63 బోవువారు వారు ॥౯॥
64 వేంకట పేట్గిరి రాయని। కం
65 కితముగ వేయుం జెప్పె య
66 ప్పిగాంచ్చి మహాసంక్రాంతవ
67 ములు వాచా కైంకర్యము
68 సంఘటించ్చుం గన్న దభా
69 వనూ ॥౧౦॥ శ్రీ వీరరా
70 ఘవేశ్వరు। శ్రీ వేంకటపతిం
71 బ్రతిష్ఠచేసి నిలింప్పుల్। నే
72 వింవ్చ దివ్యతిరుపతి। గా
73 వింవ్చెన్ గైంకలూరు ఖం
74 డెరాయడూ ॥౧౧॥ శ్రీ
75 శ్రీ శ్రీం జేయునూ ॥శ్రీ॥

3 వ వైపు

76 వ్రిత్తుల రేంపొటాటు
77 శ్రీ వేంకటేశ్వరుల కు ౨

---

* 'జ' అని చదువవలయునేమో.

78 శ్రీ వీరరాఘు వేశ్వరులకు క. ౧
79 శ్రీ హనుమానులకు ౧౭
80 శ్రీ రామలింగానకు ౧త్తి
81 స్థానాచార్యులకు ౧.౪.౦
82 స్థానంవారికి క ౧త్తి
83 సమయంవారికి క ౧౪౧
84 పౌరాణికులకు ౧త్తి
85 కవీశ్వరులకు కత్తులు ౨౪౦
86 జోస్యులకు క ౫
87 పాఠకులకు క త్తిం॥
88 భట్లకు క త్తి ౧౭—
89 కాశిలకు అరక త్తిం ౧౧
90 సన్నాయి భజంత్రీలకు క ౧త్తి
91 గుడిపాత్రలకు తాళగా
92 దుందరి మద్దెలగానికిని ౩౪౦
93 కూడా వెరసి వ్రిత్తులు ౨౫
94 అక్షరాల యిరు
95 వై అయిదు వ్రిత్తులు ॥శ్రీ॥
96 శ్లోకాలు॥ స్వద
97 త్తాద్విగుణం పుణ్య
98 పరదత్తాను పాలనం
99 పరదత్తాప హారేణ
100 స్వదత్తం నిష్ఫలం భ
101 వేత్ ॥౧౫॥ స్వదత్తాంవా
102 పరదత్తాంవా యోహ
103 రేత వసుంధరాం, షష్టి
104 వర్ష సహస్రాణి వి
105 ష్టాయాం జాయతే
106 క్రిమిః ॥౨౦॥ దాన
107 పాలనయో ర్మధ్యే దా
108 నాచ్ఛ్రేయోనుపాలనం
109 దానా త్స్వర్గ మవాప్నో
110 తిపాలనా దచ్యుతం
111 పదం। స్వామివారికి నిక్తైం
112 కలూరను సాగినట్టి పుట్టుబ
113 డినోనికాసులుం పుట్టియు
114 డ్డలెవ్వ రివ్వకున్న వారికి నిహ
115 ముం బరము। దూరమై
116 యుండు గ్రామంబు తూర్పుది
117 క్కు చెరువు నీళ్లాంజనేయుల
118 కుం దక్కు నితరులెవ్వరుం దోడిపా
119 నిదిరయుంగాక [చేలుచేసి] భవా
120 సమ్మ చెరువు నీళ్లు తోడంబూ
121 నినవారికి దోష మెందవు॥
122 ఈ గ్రామానకు కా
123 పై మిరాశీదారుడైన మా
124 నెకొంద పెనుమాకకుక త్తి ౧ ౨
125 క్షురాలను వొఖ క త్తిపాలను
126 వచనాలు చదివినవారికి పాతిక।

4 వ పలక (వైపు)

క్షేత్రమహాత్మ్యం
శ్రీమదంతర్వేది క్షే
త్రస్య వాయువ్యభా
గే కలినాశవపుర
స్యోత్తరదిగ్భాగే
శ్రీకాకుళక్షేత్రస్య
యీశాన్యభాగే
విదర్భ నగరస్య
పూర్వ దిగ్భాగే శ్రీ
శోభనాచలస్య
ఆగ్నేయభాగే
హేలావతిపు
రస్య దక్షిణది
గ్భాగే శ్రీ కోకొం
డాచలస్య నైఋ
త్యభాగే అకాళ
నగరస్య (అకువీడు)పశ్చిమ
దిగ్భాగే శ్రీకృష్ణా
గోదావరి సంగమ
దేవపుష్కరిణీ తటే
కైంకర్యనగరే సంవా
పితో శ్రీ వేంకటేశో
విజయతే। దేవ
పుష్కరిణీతీరే
కైంకర్య పురవా
సినం శ్రీ వేంకటే
శ్వరం దృష్ట్వాపున
ర్జన్మ నవిద్యతే ॥౨॥
మంగళము
మహాశ్రీశ్రీ
శేయుడు

5 వ పైపు

రాజాగారికి
పుణ్యముగాను
మసీదు గట్టించి
ముల్లాలు ముద
లైన వారి శితా
లకు కత్తి గన్ని డీ
పానకున్న అసూరుకు
న్న సుబరా
ఖుకున్న క
త్తి గన్ని కూడా
రెండు కత్తు
లపోలము
యిచ్చెనా
యీశాసన

మలోను
వ్రాసిన శ్మేశ్రి
విహాహా
కులకు విఘ్నం
చేయను దయె
వ్యరు దలచి
నాగాని కా
శిలోను బ్ర
హ్మ హత్య
చేసిన పాపా
నమున్న మ
క్కాలోను
జినహోదేశి
నపాపానను
పోవువారు
శ్రీ శ్రీ శ్రీ



Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad.